సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15
సంచిక: 328

శుక్రవారం 11-8-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



సింధుకు క్లిష్టమైన 'డ్రా'

ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాజీ విశ్వ విజేతను 'ఢీ'కొనే అవకాశం - 13లో



మూడోసారీ మార్పు లేదు

కీలక రెపో రేటు 6.5 శాతంగా యథాతథం.. ఆర్బీఐ నిర్ణయం - 13లో



'భోలో'శంకరా..

నిబంధనల ప్రకారం భోళాశంకర్ టికెట్ రేట్ల పెంపునకు ఆధారాలు కోరిన ప్రభుత్వంపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు.

వివరాలు 3లో ▸



సీజేఐకు ఆ అధికారం లేనట్టే!

కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి, కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐను తొలగిస్తూ కేంద్రం రాజ్యసభలో బిల్లు ప్రవేశపెట్టింది.

వివరాలు 5లో ▸



యుద్ధానికి సిద్ధం కండి: కిమ్

అమెరికా, దక్షిణ కొరియా మిలటరీ విన్యాసాల నేపథ్యంలో యుద్ధానికి సిద్ధం కావాలని తన సైన్యాన్ని కిమ్ ఆదేశించారు.

వివరాలు 5లో ▸



హవాయి ద్వీపంలో కార్చిచ్చు

అమెరికాలోని హవాయి దీవుల్లో మొదలైన కార్చిచ్చు మాయి పట్టణానికి విస్తరించడంతో 36 మంది సజీవ దహనమయ్యారు.

వివరాలు 5లో ▸

ఏది నిజం?

చట్టం మీ బాబు చుట్టమా రామోజీ?

- చంద్రబాబు దాడులు చేయిస్తే నేరం కాదా.. కేసు పెట్టొద్దా..!?
- 47 మంది పోలీసులపై దాడి చేస్తే హత్యాయత్నం కాదా?
- ఒక పోలీసు కానిస్టేబుల్ కన్ను పోగొట్టడం హేయం కాదా?

4 లో

ఫ్యాక్ట్ చెక్

అభూతకల్పనతో ఈనాడు ఒప్పందం

- వర్సిటీల్లో బోధన పోస్టుల భర్తీని జీర్ణించుకోలేని రామోజీ
- ఒప్పంద ఉద్యోగులకు ఎసరంటూ అసత్య రాతలు
- సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ప్రోగ్రామ్‌ల్లో ఎక్కువమంది ఒప్పంద అధ్యాపకులు
- వీరికి వెయిటేజీతో భరోసా
- ప్రభుత్వం భర్తీ చేసే పోస్టులన్నీ రెగ్యులర్‌లోనే..

5 లో

అవిశ్వాసం..శుభప్రదం

ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడల్లా మాకు శుభాలే కలుగుతున్నాయి

వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఘన విజయం సాధిస్తాం.. వరుసగా మూడోసారీ మా ప్రభుత్వమే



2028లో అవిశ్వాసం పెడితే నాలుగోసారి కూడా గెలుస్తాం

- లోక్‌సభలో ప్రధాని మోదీ సుదీర్ఘ ప్రసంగం.. అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానం
- మణిపూర్‌లో శాంతి కోసం కృషి చేస్తున్నాం.. త్వరలోనే మళ్లీ అభివృద్ధి పథంలో మణిపూర్
- కాంగ్రెస్ నీచ రాజకీయాల వల్లే రాష్ట్రానికి ఈ దుస్థితి
- అహంకారుల కూటమి 'ఇండియా'.. త్వరలో ఆ దుకాణం బంద్

సభలో మూజువాణి ఓటుతో వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు తమపై అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టినప్పుడల్లా శుభాలే కలుగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆనందం వ్యక్తం చేశారు. అవిశ్వాసం అంటే శుభప్రదం, శుభసూచకమేనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లోనూ ఘన విజయం సాధిస్తామని, వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారు. 2028లో కూడా తమపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. పేదల బిడ్డను ప్రజలు కచ్చితంగా ఆశీర్వదిస్తారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు గురువారం ఆయన సమాధానమిచ్చారు. ప్రతిపక్షాలపై, ముఖ్యంగా కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఇండియా' కూటమి అహంకారులతో నిండిపోయిందని మండిపడ్డారు. అందులో అందరూ పెళ్లికొడుకులేనని ఎద్దేవా చేశారు. మోదీ లోక్‌సభలో 2.10 గంటలపాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. మణిపూర్ అంశాన్ని మోదీ ప్రస్తావించినప్పుడు కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అసలు విషయం మోదీ మాట్లాడడం లేదని వారు ఆరోపించారు. మణిపూర్‌లో త్వరలోనే శాంతి నెలకొంటుందని ప్రధాని చెప్పారు. ప్రజలపై అరాచకాలకు పాల్పడ్డ దుండగులను శిక్షిస్తామని హామీ ఇచ్చారు. దేశ ప్రజలంతా

మిగతా 6వ పేజీలో ▶

మోదీకి కాంగ్రెస్ ఫోబియా

రావణుడిలా అహంకారి: కాంగ్రెస్

వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదని జోస్యం

లోక్‌సభ నుంచి విపక్షాల వాకౌట్

'మణిపూర్ అంశంపై మాట్లాడాలని ప్రధానిని కోరాము. సుదీర్ఘ ప్రసంగం ముగిసినా మణిపూర్ పేరును ఆయన ప్రస్తావించనేలేదు. ఆయన మొత్తం రాజకీయాలపైనే మాట్లాడారు. మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయడంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ ఆపసోపాలు పడుతోంది'. అని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు.

6 లో

నిండు సభలో జయలలిత చీర లాగారు..

తమిళనాడు అసెంబ్లీలో జరిగిన ఘటనను ప్రస్తావించిన నిర్మలా సీతారామన్

6 లో

కాషాయీకరణ 'క్విట్ ఇండియా'

- పాలకుడు ధృతరాష్ట్రుడిలా అంధుడైతే మహిళలను రక్షించేదెవరు?: అధిర్ రంజన్
- సభ నుంచి కాంగ్రెస్ నేత అధిర్ సస్పెండ్

'సహకారం' మరింత బలోపేతం

ఆప్కాబ్, డీసీసీబీ, పీఏసీఎస్‌లతో ఆర్బీకేలను అనుసంధానం చేయాలి



- వీటి నెట్‌వర్క్‌ను విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది
- సహకార శాఖ సమీక్షలో సీఎం జగన్.. ఇతర బ్యాంకులకు లేని అవకాశం రాష్ట్రంలో సహకార బ్యాంకులకు ఉంది
- ఆర్బీకేలకు ప్రాంతీయ కార్యాలయాలుగా పీఏసీఎస్‌లు
- గణనీయమైన పురోగతి దిశగా ఆప్కాబ్ అడుగులు వేస్తోంది
- డీసీసీబీలు, పీఏసీఎస్‌లను లాభాల బాట పట్టించాలి
- డీసీఎంఎస్‌ల పనితీరుపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలి
- సహకార బ్యాంకుల కార్యకలాపాలు పెంచాలి.. కమర్షియల్ బ్యాంకుల కన్నా తక్కువ వడ్డీకే రైతులు, మహిళలకు రుణాలివ్వాలి

2 లో

కాకినాడ జిల్లా వాకతిప్ప ప్రభుత్వ స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు



సర్కారు బడి.. తల్లిదండ్రుల మమేకంతో సరికొత్త ఒరవడి

2 లో

- పిల్లల మేలు కోసం పేరెంట్స్–టీచర్స్ సమావేశం
- 45,219 ప్రభుత్వ స్కూళ్లలో పిల్లల చదువులపై తల్లిదండ్రుల ఆరా.. వివరించిన టీచర్లు



ఈ–బస్... వస్తోంది బాస్!

'సీఈఎస్ఎల్' నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాం అమలుకు రాష్ట్రం ఎంపిక

ఎలక్ట్రిక్ వాహనాలతో మారనున్న ప్రజా రవాణా వ్యవస్థ

డీజిల్ కంటే 31శాతం, సీఎన్‌జీ కంటే 18శాతం తగ్గనున్న ఖర్చు

ఏపీలో 255 చార్జింగ్ స్టేషన్లు.. మరో 90 ఏర్పాటుకు ప్రణాళికలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నగరాల్లో త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు రాష్ట్రంలో నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాం (ఎన్ఈబీపీ)ను ప్రారంభించేందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) అనుబంధ సంస్థ కన్వర్జెన్స్ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (సీఈఎస్ఎల్) ముందుకువచ్చింది. ఎలక్ట్రిక్ వాహనాల వ్యయం డీజిల్ వాహనాల కంటే 31 శాతం, సీఎన్‌జీ వాహనాల కంటే 18 శాతం తక్కువ. ఇవి పర్యావరణ హితంగా కర్బన ఉద్గారాలను తగ్గించేవిగా ఉంటాయి. దీంతో ఫాస్టర్ అడాప్షన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఎఫ్ఏఎంఈ)–2 పథకం కింద నగరాల్లో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని సీఈఎస్ఎల్ నిర్ణయించింది. దేశవ్యాప్తంగా 2030 నాటికి 50వేల ఎలక్ట్రిక్ బస్సులను రోడ్లపై నడపాలనే లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ముందుగా ఆంధ్రప్రదేశ్ సహా ఆరు రాష్ట్రాలను ఎంపిక చేసింది. ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసేందుకు సీఈఎస్ఎల్ సహకరిస్తుంది. బ్యాంకర్లతో మాట్లాడి రాష్ట్రాలకు రుణాలు సమకూరేలా చేస్తుంది. తద్వారా ప్రజా రవాణా వ్యవస్థలో గొప్ప మార్పు రానుంది.

రాష్ట్రం ముందడుగు...

విద్యుత్ వాహనాల (ఈవీ) చార్జింగ్ స్టేషన్లలో పగటిపూట, ముందుగా డబ్బు(ప్రీపెయిడ్) చెల్లించే వాహనదారులకు చార్జింగ్ ధరల్లో రాయితీ ఇవ్వాలని కేంద్ర విద్యుత్‌శాఖ అన్ని రాష్ట్రాలకు సూచించింది. కేంద్ర విద్యుత్ మండలి (సీఈఏ) ఏర్పాటుచేసే జాతీయస్థాయి కమిటీ ఈవీ చార్జింగ్ స్టేషన్లలో వసూలు చేయాల్సిన చార్జీలపై ఆదేశాలిస్తుందని తెలిపింది. జాతీయ రహదారులపై ప్రతి 25 కిలో మీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని చెప్పింది. అపార్టుమెంట్లు, కాలనీల్లో పబ్లిక్ స్టేషన్లు పెట్టుకోవచ్చని, వీటిలోనూ రాయితీలు అమలు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇంట్లో చార్జింగ్ పెట్టుకుంటే గృహ విద్యుత్ వినియోగం కిందే లెక్కించాలని తెలిపింది. ఈ నిబంధనలను 2025 వరకు డిస్కంలు పాటించాలని స్పష్టంచేసింది. కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీ చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై రాష్ట్రం దృష్టి సారించింది. ఇప్పటికే 255 స్టేషన్లు ప్రారంభించింది. వాటికి అదనంగా మరో 90 స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో మరిన్ని చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం దాదాపు 4 వేలకు పైగా ప్రాంతాలను గుర్తించింది.

ఆంధ్రాకే అగ్రభాగం

'నేషనల్ ఎలక్ట్రిక్ బస్ ప్రోగ్రాం అమలు కోసం ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలను ఎంపిక చేశాం. రానున్న రెండేళ్లలో 5,450 ఎలక్ట్రిక్ బస్సులకు డిమాండ్ ఏర్పడుతుందని అంచనా వేస్తున్నాం. వీటిలో ఎక్కువగా ఏపీకి కేటాయించే అవకాశాలను పరిశీలిస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది.'
– విశాల్ కపూర్, సీఈఓ, సీఈఎస్ఎల్.

బాల్యంలో స్మార్ట్ ఫోన్‌తో

యవ్వనంలో మతి చెడుతోంది

చిన్న వయసు నుంచి స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న వారిలో మానసిక సమస్యలు

యువకుల కన్నా యువతుల్లోనే ఎక్కువ మానసిక రుగ్మతలు

వయసు పెరిగాకే స్మార్ట్ ఫోన్ వాడకం మంచిది

వాషింగ్టన్‌కు చెందిన సపియన్ ల్యాబ్స్ అధ్యయనం వెల్లడి



సాక్షి, అమరావతి: చిన్నతనంలోనే స్మార్ట్ ఫోన్‌ను వినియోగించడం మొదలుపెట్టిన వారికి యవ్వనంలో మానసిక సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని ఓ అధ్యయనం వెల్లడించింది. స్మార్ట్‌ఫోన్ ఎంత ఆలస్యంగా అలవాటు చేసుకుంటే అంత మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆ అధ్యయనం హెచ్చరించింది. వాషింగ్టన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ సపియన్ ల్యాబ్స్ 'గ్లోబల్ మైండ్ ప్రాజెక్టు'లో భాగంగా 41 దేశాల్లో 18–24 ఏళ్ల మధ్య వయసున్న 27,969 మందిపై అధ్యయనం చేసింది. వీరిలో చిన్న వయసులోనే స్మార్ట్ ఫోన్ వినియోగించడం మొదలుపెట్టిన వారి మానసిక స్థితి బలహీనంగా ఉందని పేర్కొంది. యువకుల కంటే యువతుల్లోనే ఎక్కువ మానసిక రుగ్మతల ప్రభావాన్ని గుర్తించింది. ఉత్తర అమెరికా, యూరప్, లాటిన్ అమెరికా, ఓషియానియా, దక్షిణాసియా, ఆఫ్రికా ప్రాంతాల్లోని యువత మానసిక స్థితిగతులను 47 అంశాల ఆధారంగా లెక్కించారు.

వయసు పెరిగితే దుష్ప్రభావం తక్కువ

యువకులు 6 ఏళ్ల వయసు నుంచి ఫోన్ వాడకం మొదలు పెట్టిన వారు 42%, 18 ఏళ్ల వయసుల్లో ఫోన్ వాడకం మొదలు పెట్టిన వారిలో 36% మానసిక అనారోగ్య సవాళ్లను ఎదుర్కొంటున్నట్టు గుర్తించారు. అయితే మహిళల్లో ఆరేళ్ల వయసు నుంచి ఫోన్ వాడుతున్న వారిలో 74 శాతం, వయోజనులైన తర్వాత 46 శాతం వివిధ మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. వయసు పెరిగిన తర్వాత స్మార్ట్‌ఫోన్ వినియోగం మొదలైతే దాని దుష్ప్రభావం కొంత వరకు తక్కువగా ఉన్నట్టు అధ్యయనంలో తేలింది. అలాగే పురుషుల్లో ఆత్మవిశ్వాసం, సామాజిక దృక్పథం, ఇతరులతో సానుకూల సంబంధాలు కలిగి ఉండే సామర్థ్యాలు పెరిగినట్టు, మహిళల్లో మానసిక స్థితి, స్థితప్రజ్ఞత మెరుగ్గా ఉన్నట్టు అధ్యయనం పేర్కొంది. ముఖ్యంగా ఆత్మహత్య ఆలోచనలు, దుందుడుకు భావాలు, వాస్తవికత నుంచి వేరుగా ఉన్నారనే భావనలు గణనీయంగా తగ్గాయి.

వారంలో ఒక రాత్రి నిద్ర కోల్పోతున్నారు

స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న 10 ఏళ్ల వయస్కుల్లో 12.5 శాతం మంది నోటిఫికేషన్లు చూసుకోవడానికి అర్ధరాత్రి మేల్కొంటున్నారు. దీంతో సగటున వారానికి ఒక రాత్రి నిద్ర కోల్పోతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. వాస్తవానికి సామాజిక మాధ్యమాల్లో రోజుకు మూడు గంటలు గడిపే కౌమారదశ పిల్లల్లో డిప్రెషన్, ఆందోళన లక్షణాలు ఎక్కువగా ఉండటంతో పాటు రెట్టింపు మానసిక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల్లోని 13–17 ఏళ్ల మధ్య వయస్కుల్లో దాదాపు 95 శాతం మంది సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలోనే భారతదేశంలో సుమారు 200 మిలియన్ల మంది చిన్నారులు, తల్లిదండ్రులు స్మార్ట్ ఫోన్ల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

గ్రిడ్‌కు ప్రమాదం వస్తే థర్మల్ షట్‌డౌన్

అకస్మాత్తుగా డిమాండ్ పడిపోయినా ఉత్పత్తి తగ్గించొచ్చు.. థర్మల్ విద్యుత్ స్టేషన్ల రిజర్వ్ షట్‌డౌన్‌పై విధివిధానాలు ప్రకటించిన ఏపీఈఆర్సీ

సాక్షి, అమరావతి: విద్యుత్ కొనుగోలు ఖర్చులను తగ్గించుకోవడం రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల మనుగడకు అనివార్యంగా మారింది. అదే విధంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం, అవసరం లేనప్పుడు ఉత్పత్తి కేంద్రాల నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవాల్సిన అవసరం ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీజెన్‌కో)కు ఉంది. పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచుకుని, థర్మల్ విద్యుత్ తగ్గించాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ చెబుతోంది. 2070 నాటికి దేశంలో కర్బన ఉద్గారాలను జీరో స్థాయికి తేవాలన్న లక్ష్యానికి ఇది కీలకం. ఈ నేపథ్యంలో థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో రిజర్వ్ షట్‌డౌన్ (ఉత్పత్తి తగ్గింపు)పై విధివిధానాలను రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ప్రకటించింది. రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ) రూపొందించిన డ్రాఫ్టును, కేంద్ర విద్యుత్తు సంస్థల విషయంలో అనుసరిస్తున్న విధానాలను పరిశీలించిన కమిషన్.. ఈ ఉత్పత్తి తగ్గింపు విధివిధానాలను ఖరారు చేసింది. గ్రిడ్‌కు ప్రమాదం వాటిల్లే పరిస్థితి వస్తే థర్మల్ యూనిట్లు షట్‌డౌన్ చేయవచ్చని తెలిపింది. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా అకస్మాత్తుగా విద్యుత్ డిమాండ్ పడిపోయినప్పుడు కూడా ఉత్పత్తి తగ్గించవచ్చని స్పష్టం చేసింది. తక్కువ ధరకు విద్యుత్తు అందించే ఉత్పత్తి సంస్థలకు మొదట ప్రాధాన్యం ఇచ్చేలా కొన్ని యూనిట్లను రిజర్వ్ షట్ డౌన్ చేసే వెసులుబాటు కల్పించింది. ఆ వివరాలను ఎప్పటికప్పుడు కమిషన్‌కు అందించాలని చెప్పింది.

ఎక్కువైనా, తక్కువైనా ప్రమాదమే

రాష్ట్ర ప్రజల అవసరాల మేరకు థర్మల్ పవర్ స్టేషన్లు సగటున 73 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో 40 నుంచి 45 శాతం ఏపీ జెన్‌కో నుంచే సమకూరుతోంది. లోడ్ డిస్పాచ్ సెంటర్ ఫ్రీక్వెన్సీని బట్టి గ్రిడ్‌కు విద్యుత్ సరఫరా, స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. గ్రిడ్‌కు మనం ఎంత విద్యుత్ సరఫరా చేస్తామో అంత తీసుకోవచ్చు. తక్కువ ఇచ్చి ఎక్కువ (ఓవర్ డ్రాలో) తీసుకుంటే ఆ మేరకు చెల్లించాలి. అపరాధ రుసుం భరించాలి. తరచూ ఇలా చేస్తే గ్రిడ్ కనెక్షన్ తప్పిస్తుంది. మన అవసరాలకు మించి గ్రిడ్‌కు సరఫరా చేస్తే డిమాండు లేనప్పుడు అదనపు విద్యుత్‌కు పైసా రాదు. అయితే సౌర, పవన విద్యుత్ అందుబాటులో ఉంటే దానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని కేంద్రం స్పష్టంగా చెప్పింది. దీంతో పర్యావరణ హితం కోరి పవన, సౌర విద్యుత్ వినియోగానికి 'మస్ట్ రన్ స్టేటస్' కింద రాష్ట్ర విద్యుత్ సంస్థలు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. అదే విధంగా థర్మల్ విద్యుదుత్పత్తి సామర్థ్యంలో 50 శాతం తగ్గించాలని ఇండియన్ ఎలక్ట్రిసిటీ గ్రిడ్ కోడ్ (ఐఈజీసీ) నిబంధనలు చెబుతున్నాయి. అలాగే పాత బొగ్గు యూనిట్లను మూసివేస్తే పదేళ్లలో రాష్ట్రం రూ.76 వేల కోట్లకు పైగా ఆదా చేయగలదని 'రిటైరింగ్ టు సేవ్' పేరుతో జరిగిన థింక్ ట్యాంక్ క్లైమేట్ రిస్క్ హారిజన్స్ పరిశోధనలో తేలింది. ఖరీదైన బొగ్గు యూనిట్లను చవకైన పునరుత్పాదకశక్తితో భర్తీ చేయడం వల్ల వినియోగదారులకు విద్యుత్ ఖర్చులను తగ్గించడం, పంపిణీ సంస్థల ఆర్థిక పనితీరు మెరుగుపరచడం, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను సాధించడంలో మూడు రెట్లు ప్రయోజనాలు ఉంటాయని ఈ అధ్యయనం వెల్లడించింది. దేశంలోనే పునరుత్పాదక విద్యుత్ రంగంలో వేగంగా వృద్ధిని సాధిస్తున్న రాష్ట్రాల్లో మన రాష్ట్రం ఇప్పటికే ముందు వరుసలో ఉంది. థర్మల్ విద్యుత్‌కు బదులు తక్కువ ధరకు దొరికే పునరుత్పాదక విద్యుత్‌ను కొనడం ద్వారా డిస్కంలకు దీర్ఘకాలిక ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

సింహాద్రి అప్పన్న సన్నిధిలో సీబీఐ డైరెక్టర్



ప్రవీణ్‌సూద్‌కు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: స్థానిక శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రవీణ్‌సూద్ పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని, జ్ఞాపికను దేవస్థానం ఈవో త్రినాథరావు అందించారు.

ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు బదిలీ

- కేంద్రానికి 'కొలీజియం' సిఫార్సు
- జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ గుజరాత్ హైకోర్టుకు.. మధ్యప్రదేశ్ హైకోర్టుకు జస్టిస్ డి.వెంకటరమణ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులను బదిలీ చేయాలని సుప్రీం కోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేసింది. జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌ని గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ డి. వెంకటరమణను మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేయాని సిఫార్సు చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం ఈ నెల 3న సమావేశమై చేసిన తీర్మానాలను గురువారం రాత్రి వెబ్‌సైట్‌లో ఉంచారు. తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆగస్టు 7న జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ విజ్ఞప్తి చేశారని కొలీజియం తెలిపింది. ఆ విజ్ఞప్తిని పరిశీలించామని, అయితే అందులో మెరిట్ కనిపించలేదని పేర్కొంది. గుజరాత్ హైకోర్టుకు బదిలీకి సిఫార్సు చేస్తున్నట్లు తెలిపింది. కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలన్న జస్టిస్ వెంకటరమణ విజ్ఞప్తి చేయగా, అందులో ఎలాంటి మెరిట్ కనిపించకపోవడంతో మధ్యప్రదేశ్ హైకోర్టుకు బదిలీచేయాలని సిఫార్సు చేసినట్లు పేర్కొంది. ఈ సిఫార్సులను రాష్ట్రపతి ఆమోదించాల్సి ఉంది.

18 నుంచి 20 వరకు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్ నిలిపివేత

APPSC

సాక్షి, అమరావతి: వార్షిక నిర్వహణ కోసం ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌ను 48 గంటల పాటు నిలిపివేయనున్నట్టు కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 రాత్రి 9 నుంచి 20వ తేదీ రాత్రి 9 గంటల వరకు(48 గంటలు) సేవలు అందుబాటులో ఉండవని పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ప్రకటించిన పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను ముందుగానే డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు.

శంకరంబాడి సుందరాచారికి ఘన నివాళి



శంకరంబాడికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైభవానికి ప్రతీకగా 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గీతం నిలిచిందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో శంకరంబాడి సుందరాచారి జయంతిని ఘనంగా నిర్వహించారు. సుందరాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆధునిక ఆంధ్ర కవుల్లో సుందరాచారి అగ్రశ్రేణిలో కొనసాగారని కొనియాడారు. విద్యావేత్త, రచయిత్రి శృంగేరి శారద, అధికార భాషా సంఘం సభ్యుడు జి.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

సాక్షి, అమరావతి: జాతీయ నులిపురుగుల నిర్మూలన డే సందర్భంగా గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్టు వైద్య ఆరోగ్యశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పంపిణీ లక్ష్యం 1.10 కోట్ల మంది పిల్లలు కాగా, గురువారం 1.06 కోట్ల మందికి (97 శాతం) అందజేసినట్లు పేర్కొంది. మిగతా 4 లక్షల మంది పిల్లలకు ఈ నెల 17న జరిగే మాప్‌అప్ రోజు మాత్రలు అందజేస్తామని వివరించింది. గుంటూరు నగరంలోని సంగడిగుంట సాదు చలమయ్య పాఠశాలలో మాత్రల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.నివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.10 కోట్ల మంది పిల్లలకు మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తామని, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల పిల్లలకు మాత్రలు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ జిల్లాలో 99.30 శాతం, చిత్తూరు జిల్లాలో 99.03 శాతం, అనంతపురం జిల్లాలో 98.89, ఏలూరు జిల్లాలో 98.78 శాతం, ఎన్టీఆర్ జిల్లాలో 97.50 శాతం, ప్రకాశం జిల్లాలో 97 శాతం పంపిణీ నమోదు కాగా, మిగిలిన అన్ని జిల్లాలలో 100 శాతం పంపిణీ చేశామని వివరించారు.



చింతపల్లి మండలం కొలంబంద ఎంపీయూపీ స్కూల్లో తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన గిరిజనులు

సర్కారు బడి..

తల్లిదండ్రుల మమేకంతో..
సరికొత్త ఒరవడి

పిల్లల మేలు కోసం పేరెంట్స్-టీచర్స్ సమావేశం

- 45,219 సర్కారు పాఠశాలల్లో బడిబాట పట్టిన తల్లిదండ్రులు
- తొలి సమావేశానికి 60% హాజరు
- పిల్లల చదువులపై తల్లిదండ్రుల ఆరా
- సౌకర్యాలను వివరించిన టీచర్లు
- కొండకోనల్లో సైతం విజయవంతం
- ఎఫ్ఏ/ఎస్ఏ పరీక్షల అనంతరం తప్పనిసరిగా సమావేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు సమకూరుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. బోధనలోనూ అత్యాధునిక పద్ధతులతో విద్యార్థులను అత్యున్నతంగా తీర్చిదిద్దుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందుకోవాలన్న లక్ష్యంతో స్కూళ్ల తీరుతెన్నులనే మార్చేసింది. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతి, తరగతిలో వారి పరిస్థితిని తల్లిదండ్రులు తెసుకునేందుకు పేరెంట్ - టీచర్స్ సమావేశాలు ఏర్పాటు చేస్తోంది. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పేరెంట్-టీచర్స్ సమావేశాలు విజయవంతమయ్యాయి. ఫార్మాటివ్ అసెస్‌మెంట్ అనంతరం పిల్లల ప్రగతిని తల్లింద్రులకు వివరించేందుకు గురువారం 45,219 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సమావేశాలు జరిగాయి. రెండురోజుల క్రితమే సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పనులను సైతం పక్కనబెట్టి పాఠశాలలకు వచ్చారు. మొదటి సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం మంది తల్లిదండ్రులు హాజరై బడిలో వారి పిల్లల ప్రగతిని స్వయంగా తెలుసుకున్నారు. ప్రభుత్వం వారి పిల్లల కోసం చేస్తున్న మంచిని కొనియాడారు. ఏజెన్సీ ప్రాంతమైన చింతపల్లి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు 30 కిలోమీటర్ల దూరంలోని గిరిజన గూడేల నుంచి తల్లిదండ్రులు హాజరవడం.. పిల్లల మేలు కోసం తల్లిదండ్రులు పడుతున్న తపనకు అద్దం పట్టింది. పూర్తి స్నేహపూరిత వాతావరణంలో జరిగిన ఈ సమావేశాల్లో విద్యార్థులు చదువులో రాణిస్తున్న వైనాన్ని, పాఠశాలల్లో కల్పించిన సౌకర్యాలను, విద్యా విషయక మార్పులను, సాధించిన పురోగతిని ఉపాధ్యాయులు తల్లింద్రులకు వివరించారు. ఇంటి వద్ద పిల్లలు ఎలా మసలుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఇకపై ఫార్మాటివ్, సమ్మెటివ్ అసెస్‌మెంట్స్ అనంతరం పేరెంట్స్-టీచర్స్ సమావేశాలు ఉంటాయని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ బడుల్లో ఇలాంటి సమావేశాలు గతంలో ఎప్పుడూ చూడలేదని, ఇవి తమ బాధ్యతను మరింత పెంచిందని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ బడుల్లో ఎన్ని మార్పులు వచ్చాయో స్వయంగా చూశామని, ఈ పథకాలు, సమావేశాలు కొనసాగించాలని కోరారు.

ఇంత బాగుంటుందని అనుకోలేదు



మా అమ్మాయి భవాని ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఇక్కడ ఎలా ఉంటుందో, ఏం తింటుందో అని బెంగగా ఉండేది. మా ఊరు దూరమైనా బిడ్డ బాగుకోసం వచ్చాను. ఇక్కడ సౌకర్యాలన్నీ బాగున్నాయి. ఎలా చదువు చెబుతున్నారో చెప్పారు. పిల్లలను బాగా చూసుకుంటున్నారు. ఈ సమావేశం లేకపోతే ఈ విషయాలు తెలిసేది కాదు. ఇది చాలా మంచి కార్యక్రమం.
– కొర్ర తిలో, నిమ్మపాడు, చింతపల్లి మండలం

ఎలా చదువుతుందో తెలుసుకున్నా



నాతవరం మండలం గునుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మా అమ్మాయి ఆశ్రిత ఎనిమిదో తరగతి చదువుతోంది. తల్లిదండ్రుల మీటింగ్‌లో ఫార్మెటివ్ పరీక్ష ఫలితాలను మాకు తెలియజేశారు. మా పిల్లలు ఎలా చదువుతున్నారో చెప్పారు. గతంలో ఎప్పుడూ ప్రభుత్వ స్కూల్లో ఇలాంటి సమావేశాలు జరగలేదు. ఇప్పుడు మా బాధ్యత ఏంటో తెలిసింది. పిల్లలు కూడా జాగ్రత్తగా చదువుతారు. ఈ సమావేశాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పి తీరాలి.
– సాంబారు గోవింద, గునుపూడి, అనకాపల్లి జిల్లా

మా బాధ్యతను గుర్తుచేశారు



మా అమ్మాయి మహాలక్ష్మి వాకతిప్ప హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. గతంలో ప్రభుత్వ బడిలో చదువు రాదనే అనుకునేవాళ్లం, కానీ ఇప్పుడు అంతా మారిపోయింది. ఇదో కొత్త ప్రపంచంలా ఉంది. ప్రైవేటు బడులకంటే చాలా బాగున్నాయి. తల్లిదండ్రులను పిలిపించి పిల్లలు ఎలా చదువుతున్నారో చెప్పారు. మా బాధ్యతను గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంత గొప్ప మార్పు సాధ్యమేనని సీఎం జగన్ నిరూపించారు.
– గౌరి, ఉప్పాడ కొత్తపల్లి, కాకినాడ జిల్లా

చెప్పగానే అందరూ వచ్చారు



పాఠశాలలో పిల్లలు ఎలా చదువుతున్నారో వారి తల్లిదండ్రులకు తెలియాలి, అప్పుడే పిల్లల్లో భయం, బాధ్యత పెరిగి బాగా చదువుకుంటారు. పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత కూడా పెరుగుతుంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల దృష్టి పిల్లలపై ఉందంటే వారు ఉన్నతంగా ఎదుగుతారు. ఈ సమావేశాల ముఖ్యోద్దేశం అదే. చెప్పగానే పేరెంట్స్ అందరూ వచ్చారు. మీటింగ్ పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు.
కె.జాషువా ఆనందకుమార్, హెచ్‌ఎం జడ్పీ హైస్కూల్, వాకతిప్ప, కాకినాడ జిల్లా

ఉత్తమ ఫలితాలకు ఉత్తమ మార్గం



సీబీఎస్ఈ విద్యా విధానం, ఇంగ్లిష్ మీడియం బోధన, టోఫెల్ పరీక్షల నిర్వహణ, ఐఎఫ్‌బీ, స్మార్ట్ టీవీల ద్వారా బోధన వంటి ఎన్నో గొప్ప సంస్కరణలు చేశాం. పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. దీనివల్ల టీచర్లు ఇంకా బాధ్యతగా ఉంటారు. అందుకే పేరెంట్-టీచర్స్ సమావేశాలు ఏర్పాటుచేశాం. ఎఫ్ఏ/ఎస్ఏ పరీక్షల అనంతరం తప్పనిసరిగా సమావేశాలు నిర్వహిస్తాం.
– ఎస్.సురేష్‌కుమార్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్

క్రిస్ సిటీ తొలి దశలో 78,900 మందికి ఉపాధి

- చెన్నై – బెంగళూరు కారిడార్‌లో నిక్‌డిక్ట్, రాష్ట్ర భాగస్వామ్యంతో కృష్ణపట్నం నోడ్ అభివృద్ధి
- మూడు దశల్లో 10,834.5 ఎకరాల్లో భారీ పారిశ్రామిక నగర నిర్మాణం
- మొదటి దశలో రూ.1,503.16 కోట్లతో 2,500 ఎకరాలు అభివృద్ధి
- 872.7 ఎకరాల్లో పరిశ్రమలు
- పరిపాలన అనుమతులు మంజూరు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యాధునిక వసతులతో కూడిన భారీ పారిశ్రామిక నగరం అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. చెన్నై – బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా ఈ పారిశ్రామిక నగరాన్ని మూడు దశల్లో నిర్మిస్తోంది. ఇందులో తొలి దశ అభివృద్ధికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. కృష్ణపట్నం నోడ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (నిక్‌డిక్ట్) ఏపీఐఐసీతో కలిసి నిక్‌డిక్ట్ కృష్ణపట్నం ఇండస్ట్రియల్ సిటీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ (క్రిస్ సిటీ) పేరుతో ప్రత్యేక కంపెనీని ఏర్పాటు చేసింది. క్రిస్ సిటీలో భారీ పరిశ్రమలతో పాటు వాక్ టు వర్క్ విధానంలో అక్కడే నివాసముండేలా ఓ నగరాన్ని కూడా నిర్మిస్తుంది. పరిశ్రమలకు, నివాస ప్రాంతానికి కూడా అత్యాధునిక వసతులు సమకూరుస్తుంది. మొత్తం 10,834.5 ఎకరాల విస్తీర్ణంలో క్రిస్ సిటీ ఏర్పాటవుతుంది. తొలి దశలో రూ.1,503.16 కోట్లతో సుమారు 2,500 ఎకరాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. ఈపీసీ విధానంలో క్రిస్ సిటీలో కీలక మౌలిక వసతుల కల్పనకు రూ.1,021.41 కోట్ల విలువైన పనులకు ఏపీఐఐసీ త్వరలో టెండర్లు పిలవనుంది. 2022–23 ఎస్‌వోఆర్ ధరల ప్రకారం టెండర్లను పిలుస్తున్నట్లు ఏపీఐఐసీ అధికారులు 'సాక్షి'కి తెలిపారు. ఈ టెండర్లను న్యాయ పరిశీలన కోసం జ్యుడిషియల్ ప్రివ్యూకు పంపినట్లు చెప్పారు. కాంట్రాక్టు పొందిన సంస్థ ఇక్కడ రహదారులు, విద్యుత్, నీరు, మురుగు నీరు, వరద నీరు నిర్వహణ, శుద్ధి, పరిశ్రమల వ్యర్థాలు, నివాస వ్యర్థాల శుద్ధి వంటి కనీస మౌలిక వసతులు అభివృద్ధి చేసి వాటిని నిర్వహించాల్సి ఉంటుంది. ఈ టెండర్లపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే జ్యుడిషియల్ ప్రివ్యూకు తెలియజేయాలని ఏపీఐఐసీ పేర్కొంది.

వాక్ టు వర్క్ విధానంలో అభివృద్ధి

పనిచేసే చోటే నివాసం ఉండేలా అత్యంత పర్యావరణ అనుకూల పారిశ్రామిక నగరంగా క్రిస్ సిటీని నిర్మిస్తున్నారు. తొలి దశలో అభివృద్ధి చేసే 2,500 ఎకరాల్లో రహదారులు వంటి వసతులకు సుమారు 494 ఎకరాలు పోగా 2,006 ఎకరాలు అందుబాటులో ఉంటాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో 872.7 ఎకరాలు పారిశ్రామిక అవసరాల కోసం, మిగిలిన ప్రాంతాన్ని నివాసానికి అవసరమైన మౌలిక వసతుల కోసం వినియోగిస్తారు. తొలి దశ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 78,900 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఇందులో సుమారు 77,300 మంది ఇక్కడే నివాసముంటూ పని చేస్తారని, దీనికి అనుగుణంగా 21,870 కుటుంబాలు నివాసం ఉండేలా గృహ సముదాయాలు, వాణిజ్య సముదాయాలు, స్కూల్స్, హాస్పిటల్స్, రవాణా వంటి కీలక మౌలిక వసతులను కల్పించనున్నారు. 36 నెలల్లో తొలి దశ అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం మూడు దశలు పూర్తయితే ఒక్క క్రిస్ సిటీనే 4,67,800 మందికి ఉపాధి కల్పిస్తుంది. ఆ నగరంలో 2,91,000 మంది నివాసముంటారని ఏపీఐఐసీ అంచనా వేస్తోంది.

పర్యాటక ప్రదేశంగా అంబేడ్కర్ స్మృతి వనం

- మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మితమవుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ స్మృతి వనం ప్రదేశాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి అన్నారు. విగ్రహ స్మృతి వనం సుందరీకరణ పనులను ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్–బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ బి.రాజశేఖర్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్‌తో కలసి గురువారం ఆమె పరిశీలించారు. స్వరాజ్ మైదానం చుట్టూ ఉన్న ప్రదేశాలను, ఫుట్‌పాత్‌లు, డివైడర్లను మరింత అందంగా హరితహారం ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మొఘల్ గార్డెన్ ల్యాండ్ స్కేపింగ్ భాగాలు, వెదురు ఫ్రేమ్‌లో బోగన్విలేయా మొక్కలు, గులకరాయి నమూనాలు, రంగురంగుల పూలలో జాతీయ పక్షి నెమలి కనిపించేలా డిజైన్ చేసిన ప్రదేశాలను సందర్శించారు. దేశ వ్యాప్తంగా లక్షలాదిమంది పర్యాటకులు స్మృతి వనం చూసేందుకు వస్తారని, వారికి అవసరమైన వసతులు కల్పిస్తున్నామన్నారు. విగ్రహ నిర్మాణంలో అత్యంత కీలకమైన అంబేడ్కర్ చూపుడువేలుకు సంబంధించి పనులు జరుగుతున్నాయని అతి త్వరలోనే పనులు పూర్తవుతాయని శ్రీలక్ష్మి వివరించారు.

ఎమ్మెల్సీలుగా కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబు





సాక్షి, అమరావతి: గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు శాసన మండలి స్థానాలకు కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబును ఎంపిక చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ నామినేట్ చేసిన కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబును శాసన మండలి సభ్యులుగా నియమిస్తూ జీవో ఎంఎస్ నంబర్ 87 జారీ చేశారు. గతంలో గవర్నర్ కోటాలో శాసన మండలి సభ్యులుగా ఉన్న చాదిపిరాళ్ల శివనాథరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ పదవీకాలం జూలై 20వ తేదీతో ముగిసింది. దీంతో వారి స్థానంలో కర్రి పద్మశ్రీ, కుంభా రవిబాబును ఎంపిక చేశారు.

ఇదీ రవిబాబు, పద్మశ్రీ నేపథ్యం

ఎస్టీ సమాజికవర్గానికి చెందిన కుంభా రవిబాబు 2004 నుంచి 2009 వరకు విజయనగరం జిల్లా శృంగవరపుకోట(ఎస్.కోట) ఎమ్మెల్యేగా పనిచేశారు. 2008 నుంచి 2009 వరకు ఏపీ ఏపీ షెడ్యూల్ ట్రైబ్స్ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2021 నుంచి 2023 మే వరకు ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించారు. వాడబలిజ మత్స్యకార వర్గానికి చెందిన కర్రి పద్మశ్రీ ఏయూలో ఎంఏ చదివారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ ఫిషర్‌మెన్ సంస్థకు జాతీయ మహిళా అధ్యక్షురాలిగా, అఖిల భారత కాశ్యప్ మహాసంస్థ ప్రతినిధిగా సేవలందించారు. ఆమె భర్త నారాయణరావు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

అమెరికా చదువులకు గురుకుల విద్యార్థులు

- దేశవ్యాప్తంగా 30 మందికి అవకాశం
- ఐదుగురు ఏపీ విద్యార్థులకు చోటు



విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, అధికారులు, ఉపాధ్యాయులు

విశాఖ (విద్య): రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకులాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అమెరికా చదువులకు ఎంపికయ్యారు. కెన్నడీ లూగర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రామ్ (కేఎల్‌వైఈఎస్)కు దేశవ్యాప్తంగా 30 మంది విద్యార్థులను ఎంపిక చేయగా.. వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులకు చోటు దక్కింది. వీరిలో కృష్ణా జిల్లా ఈడ్పుగల్లు గురుకులం నుంచి ఇద్దరు విద్యార్థినులు, ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం, విశాఖ జిల్లా శ్రీకృష్ణాపురం, కొమ్మాది స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నుంచి ఒక్కో విద్యార్థి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు అమెరికాలో హోస్ట్ ఫ్యామిలీగా ఏడాది పాటు అక్కడే విద్యాభ్యాసం కొనసాగిస్తారు. ఇందుకు ఒక్కో విద్యార్థికి రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చు కానుండగా.. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు నీతిఆయోగ్ ముందుకొచ్చింది. ఎంపికైన విద్యార్థులకు ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఒక్కొక్కరికీ రూ.50 వేలు అందించనున్నారు. కెన్నడీ లూగర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రామ్‌కు ప్రతిభ గల విద్యార్థులను ఎంపిక చేసే నిమిత్తం దేశవ్యాప్తంగా విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. వివిధ విద్యాలయాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఇందుకు పోటీపడ్డారు. 8 దశల్లో జరిగిన వడపోత అనంతరం దేశవ్యాప్తంగా 30 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వీరందరికీ నీతిఆయోగ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో రెండు సార్లు అవగాహన సదస్సు సైతం నిర్వహించారు.

విద్యార్థులకు సత్కారం

అమెరికా చదువులకు ఎంపికైన విశాఖ జిల్లాలోని శ్రీకృష్ణాపురం ఇంటర్మీడియెట్ విద్యార్థి సింగంపల్లి జ్ఞానేశ్వరరావు, కొమ్మాది స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యార్థిని రూడ ఇవాంజలితోపాటు వారి తల్లిదండ్రులను గురువారం విశాఖ కలెక్టర్ ఎ.మల్లికార్జున ఉమ్మడి విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల కన్వీనర్ ఎస్.రూపవతి ఘనంగా సత్కరించారు.

'సహకారం' మరింత బలోపేతం

- ఆప్కాబ్, డీసీసీబీ, పీఏసీఎస్‌లతో ఆర్బీకేలను అనుసంధానం చేయాలి
- వీటి నెట్‌వర్క్‌ను విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది
- సహకార శాఖ సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సహకారరంగంపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'మనది వ్యవసాయ ఆధారిత రాష్ట్రం.. మన రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలంటే రైతులు, మహిళల ఆర్థికంగా బలంగా ఉండాలి. వ్యవసాయ కార్యకలాపాలకు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు తక్కువ వడ్డీకే రుణాలు అందించడం ద్వారా వారిని చేయి పట్టుకుని నడిపించగలుగుతాం. ఈ లక్ష్యసాధనలో ఆప్కాబ్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు (డీసీసీబీలు), ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్–ప్యాక్స్), రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) భాగస్వామ్యం కావాలి. వీటి నెట్‌వర్క్‌ను విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎం ఏమన్నారంటే..

ఆర్బీకేల రూపంలో ప్రతీ గ్రామంలో ఓ బ్రాంచ్

ప్రతి పీఏసీఎస్ పరిధిలో 3 నుంచి 4 ఆర్బీకేలను తీసుకువచ్చాం. ప్రతీ ఆర్బీకేలోనూ ఓ బ్యాంకింగ్ కరస్పాండెంట్‌ను నియమించాం. వీరు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో భాగం కావాలి. పీఏసీఎస్‌లు, ఆర్బీకేలు ఒకదానితో ఒకటి అనుసంధానం చేశాం. పీఏసీఎస్‌లు ఇప్పటికే ఆర్బీకేల ద్వారా రుణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నాయి. క్రెడిట్, నాన్ క్రెడిట్ సేవలను గ్రామ స్థాయిలో పీఏసీఎస్‌లు ఆర్బీకేల ద్వారా అందిస్తున్నాయి. ఇలా పీఏసీఎస్‌ల మాదిరిగానే ఆర్బీకేల రూపంలో ప్రతి గ్రామంలో ఆప్కాబ్‌కు, డీసీసీబీలకు ప్రత్యేకంగా శాఖలు ఉన్నట్టుగానే పరిగణించాలి. దేశంలో మరే ఇతర బ్యాంకుకు లేని అవకాశం రాష్ట్రంలోని సహకార బ్యాంకులకు ఉంది. రైతులకు రుణాల విషయంలో ఆర్బీకేలకు ఒక ప్రాంతీయ కార్యాలయాల మాదిరిగా పీఏసీఎస్‌లు వ్యవహరించాలి. ఆర్బీకేల ద్వారా ఆర్థిక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో విస్తరింపజేసేలా గ్రామ స్థాయి వరకు ఉన్న ఈ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

డీసీఎంఎస్‌పై అధ్యయనం చేయాలి

జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల పనితీరుపై పూర్తిస్థాయి అధ్యయనం చేయాలి. గ్రామ స్థాయిలో ఆర్బీకేలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం స్థానికంగా ఉన్న అవసరాలకు అనుగుణంగా డీసీఎంఎస్ కార్యకలాపాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. వాటి సేవలను మరింత విస్తృతం చేసే దిశగా, రైతులతో పాటు సంబంధిత వర్గాల వారికి మరింత ప్రయోజనం చేకూర్చేలా తీసుకోవాల్సిన చర్యలపై ఈ అధ్యయనం జరగాలి. వ్యవసాయ ఉత్పత్తులు వాటి ధరలపై ఎప్పటికప్పుడు సీఎం యాప్ ద్వారా వివరాలు వస్తున్నాయి. ఎక్కడైనా కనీస మద్దతు ధర లభించకపోయినా, ధరలు నిరాశాజనకంగా ఉన్నా సీఎం యాప్ ద్వారా వివరాలు తెలియగానే ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకొని చర్యలు తీసుకుంటోంది. ఈ ప్రక్రియలో డీసీఎంఎస్‌లకు సముచిత పాత్ర కల్పించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలి. దీంతో పాటు ప్రైమరీ, సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ వ్యవస్థలను కూడా డీసీఎంఎస్‌ల ద్వారా ఇంటిగ్రేట్ చేయాలి. ఇందుకోసం సమగ్ర అధ్యయనం చేసి తగిన సిఫార్సులతో కూడిన నివేదిక సిద్ధం చేయాలి.

స్వయం ఉపాధి కల్పించాలి

గ్రామస్థాయిలో తక్కువ వడ్డీకే రుణాలివ్వడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది. వైఎస్సార్ చేయూత ద్వారా మహిళల స్వయం ఉపాధికి ఆప్కాబ్ చర్యలు తీసుకోవాలి. గుర్తించిన లబ్ధిదారు చేతిలో వరుసగా నాలుగేళ్ల పాటు ఏటా రూ.18,750 చొప్పున ప్రభుత్వం డబ్బులు పెడుతుంది. వీటితో వారిని స్వయం ఉపాధి దిశగా నడిపించేలా చర్యలు తీసుకోవాలి. కమర్షియల్ బ్యాంకుల కన్నా తక్కువ వడ్డీలకే రుణాలివ్వాలి. బంగారంపై ఇచ్చే రుణాలపై కూడా తక్కువ వడ్డీ ఉండాలి. పీఏసీఎస్‌ల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియ సరళతరంగా, సమర్థంగా ఉండేలా చూడాలి. వీటి కోసం ప్రత్యేకంగా ఎస్‌ఓపీలు తయారుచేయాలి.

లాభాల బాట పట్టించేలా చూడాలి..

గతంలో చూడని పురోగతి ఈ నాలుగేళ్లలో ఆప్కాబ్‌లో కనిపిస్తోంది. ఆప్కాబ్ మన బ్యాంకు, మనందరి బ్యాంక్ అన్న భావనతో తీర్చిదిద్దాలి. మరింత ముందుకు తీసుకువెళ్లాలి. ఆప్కాబ్ మాదిరిగానే డీసీసీబీలు, పీఏసీఎస్‌లను కూడా నూటికి నూరు శాతం లాభాల బాట పట్టించేలా చర్యలు తీసుకోవాలి. నష్టాలు ఎందుకు వస్తున్నాయన్న దానిపై పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి. లాభాల బాట పట్టించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. వెబ్ ల్యాండ్, రెవెన్యూ రికార్డులను పూర్తిగా అప్‌డేట్ చేయాలి. ఆ వివరాలు పీఏసీఎస్‌ల వద్ద అందుబాటులో ఉంచాలి. దీనివల్ల రికార్డుల స్వచ్ఛీకరణ జరుగుతుంది. తద్వారా పారదర్శకత పెరుగుతుంది.

84.32 శాతం పెరిగిన కార్యకలాపాలు: అధికారులు

ప్రభుత్వ ప్రోత్సాహం, సంస్కరణల ఫలితంగా సహకార రంగంలో ఆర్థిక కార్యకలాపాలు ఈ నాలుగేళ్లలో అనూహ్యంగా పెరిగాయని అధికారులు సీఎం వైఎస్ జగన్‌కు వివరించారు. 2019తో పోలిస్తే 2023 నాటికి 84.32 శాతం పెరిగాయన్నారు. 2019 వరకూ పీఏసీఎస్‌లో ఆర్థిక కార్యకలాపాలు రూ. 11,884.97 కోట్లు కాగా, 2023 నాటికి ఈ మొత్తం రూ. 21,906 కోట్లకు చేరిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 400 పీఏసీఎస్‌లు నష్టాల నుంచి లాభాల బాట పట్టాయని సీఎంకు చెప్పారు. ఆప్కాబ్‌లో 2019 మార్చి నాటికి రూ. 13,322.55 కోట్ల టర్నోవర్ ఉండగా, అది 2023 మార్చి నాటికి రూ. 36,732.43 కోట్లకు చేరిందన్నారు. నాలుగేళ్లలో 175 శాతం గ్రోత్ రేటు నమోదైందన్నారు. సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, పౌరసరఫరాల సంస్థ ఎండీ జి.వీరపాండియన్, సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్, ఆప్కాబ్ ఎండీ ఆర్ఎస్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంచాలి

మనది వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కావడం వలన సహకార రంగంలోని ప్రతి వ్యవస్థను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రంగంలో పూర్తి స్థాయిలో వృత్తి నైపుణ్యం తీసుకురాగలిగితే ఆ మేరకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందుతాయి. డీసీసీబీల్లో ఇప్పటికే ప్రొఫెషనలిజం తీసుకొచ్చాం. అదే రీతిలో పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లలో కూడా ప్రొఫెషనలిజాన్ని పెంచాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థల్లో పీఏసీఎస్‌లు కీలక పాత్ర పోషించాలి. పీఏసీఎస్‌లు, ఆర్బీకేల నెట్‌వర్క్ ద్వారా గ్రామ స్థాయిలో నాణ్యమైన సేవలు అందుతాయి. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు అందించే ఎరువులు, మిగిలిన వాటిలో నాణ్యత చాలాముఖ్యం. ఎట్టిపరిస్థితుల్లోనూ కల్తీలకు ఆస్కారం లేకుండా చూడాలి. పీఏసీఎస్‌ల కింద నడిచే పెట్రోలు బంకుల్లో ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ యూనిట్లు కూడా ఏర్పాటు చేయాలి. నవంబర్ నాటికి పీఏసీఎస్‌లలో పూర్తి స్థాయి కంప్యూటరీకరణ అందుబాటులోకి తీసుకురావాలి. ఆప్కాబ్, సహకార బ్యాంకులు, పీఏసీఎస్‌లలో క్రమం తప్పకుండా ఆడిట్ జరిగేలా చూడాలి.

క్లుప్తంగా...

తెలంగాణ సర్కార్‌పై చర్యలు తీసుకోండి..

సాక్షి, అమరావతి: శ్రీశైలం ప్రాజెక్టులో అక్రమంగా విద్యుదుత్పత్తి చేయకుండా తెలంగాణ జెన్‌కోను నియంత్రించి.. తమ హక్కులను పరిరక్షించాలని కృష్ణా బోర్డును రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అనుమతి తీసుకోకుండా, నీటి కేటాయింపులు లేకున్నా విద్యుదుత్పత్తి చేస్తూ శ్రీశైలం ప్రాజెక్టును ఖాళీ చేస్తున్న తెలంగాణ సర్కార్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్ కుమార్‌కు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి గురువారం లేఖ రాశారు. రాష్ట్రానికి హక్కుగా దక్కిన జలాలను తెలుగు గంగ, ఎస్సార్బీసీ, గాలేరు–నగరి, హంద్రీ–నీవా ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకుంటామని బోర్డుకు ముందస్తుగా సమాచారం ఇచ్చారు. శుక్రవారం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని విడుదల చేస్తామన్నారు. మల్యాల పంప్ హౌస్ నుంచి హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకానికి నీటిని తరలిస్తామన్నారు.

రైతుకు హక్కే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ధర్మాన



ఆత్మకూరు: దశాబ్దాలుగా పరిష్కారంకాని చుక్కల భూముల సమస్యను ఒక్క జీవోతో పరిష్కరించి వాటిని అనుభవిస్తున్న రైతులను హక్కుదారులుగా చేయడమే లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో స్థానిక శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో చుక్కల భూముల సమస్య తొలగి లబ్ధిదారులైన రైతులకు భూహక్కు పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. మంత్రి ధర్మాన మాట్లాడుతూ రైతులు ఈ భూములను వారి కుటుంబసభ్యుల పేర్లతో మార్చుకునేందుకు, అవసరాలకు విక్రయించుకునేందుకు హక్కులు ఏర్పడ్డాయని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలోనే 20 వేల ఎకరాలకుపైగా చుక్కల భూముల రైతులకు లబ్ధిచేకూరిందని, మరో ఆరువేల ఎకరాలకు సాంకేతిక సమస్యలు పరిష్కరించి హక్కులు కల్పించనున్నామని చెప్పారు. కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఎస్.గురుమోహన్, ఉదయగిరి పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి గురువారం యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. యూనియన్ నాయకులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి సురేష్ స్పందిస్తూ అమ్మ ఒడి, చేయూత పథకాలను అర్హులైన మున్సిపల్ కార్మికులకు అందించాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు పరిహారాన్ని వెంటనే చెల్లించాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, అప్కాస్ ఎండీ వాసుదేవరావు, అడిషనల్ సీడీఎంఏ శివపార్వతి పాల్గొన్నారు.

మరీ అంతగా పళ్లు కొరకొద్దు.. పక్షవాతం వస్తుంది

రఘురామకు ఎంపీ సురేశ్ హెచ్చరిక



సాక్షి, న్యూఢిల్లీ: నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు మీడియాలో మాట్లాడుతూ పళ్లు కొరుకుతున్నారని, మరీ అంతగా కొరికితే పక్షవాతం రావొచ్చని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేశ్ హెచ్చరించారు. ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు మద్దతివ్వాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కోరారని, కానీ టీడీపీ వాళ్లు పిలవని పేరంటానికి నేరుగా భోజనశాలకు వచ్చారని విమర్శించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబుతో ఉన్నవాళ్లెవరూ ఫెయిర్‌గా ఉండరని చెప్పారు. రఘురామ ఇష్టానుసారం మాట్లాడితే త్వరలోనే బుద్ధి చెబుతామన్నారు. ఆయన మత్తు పదార్థాలు తీసుకొనే స్థాయి దాటి సహనం కోల్పోయి, కడుపు మంట చల్లార్చుకోవడానికి పళ్లు కొరుకుతున్నారని ఎంపీ సురేశ్ చెప్పారు.

సాంఘిక సంక్షేమ అధికారులకు జైలుశిక్ష, జరిమానా

సాక్షి, అమరావతి: కోర్టు ధిక్కార కేసులో సాంఘిక సంక్షేమశాఖ అధికారులకు హైకోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ పరిధిలోని విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పిటీషన్‌పై కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారంటూ సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, ఏపీ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి ఆర్.పవన్‌మూర్తికి నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ.1,000 జరిమానా విధించింది. ఆగస్టు 16లోపు రిజిస్ట్రార్ ముందు లొంగిపోవాలని వారిని ఆదేశించింది. తరువాత వారిని జైలుకు పంపాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు ఇటీవల తీర్పు చెప్పారు.

‘బోలో’ శంకరా.. నిబంధనలు పాటించరా?

భోళా శంకర్ చిత్రం టిక్కెట్ రేట్లపై ప్రభుత్వంపై దుష్ప్రచారం.. ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నం

- సినిమా టిక్కెట్ రేట్ల పెంపునకు రాష్ట్రంలో స్పష్టమైన నిబంధనలు
- సినిమా పెద్దలతో చర్చించిన తర్వాత రూపొందించిన నిబంధనలే
- వాటిని వేటినీ భోళా శంకర్ చిత్రం నిర్మాణ సంస్థ పాటించలేదు
- ప్రభుత్వం అడిగిన సమాచారం ఇవ్వలేదు
- రాష్ట్రంలో షూటింగ్‌కు సంబంధించిన ఆధారాలివ్వలేదు
- కానీ టిక్కెట్ ధరలు పెంపునకు అనుమతించమంటే ఎలా?



సినిమా టికెట్ రెట్ల పెంపునకు విధివిధానాలు ఖరారు చేస్తూ గతంలోనే ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు



ANDHRA PRADESH STATE FILM TELEVISION AND THEATRE DEVELOPMENT CORPORATION LIMITED

టికెట్ రేట్ల పెంపునకు అవసరమైన పత్రాలు సమర్పించాలని భోళా శంకర్ నిర్మాణ సంస్థకు సూచించిన ఏపీఎస్‌ఎఫ్ టీవీటీడీసీ

సాక్షి, అమరావతి : సినిమా టిక్కెట్ రేట్ల పెంపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలు రూపొందించింది. అదీ.. సినీ పరిశ్రమ పెద్దలతో చర్చించి, రూపొందించిన నిబంధనలే. గతంలో విడుదలైన సినిమాలకు ఈ నిబంధనల మేరకు సమాచారాన్ని, ఆధారాలను సమర్పించి, ఆ సినిమాల నిర్మాతలు రేట్లు పెంచుకున్నారు. చిరంజీవి నటించిన భోళాశంకర్ సినిమాకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం కొన్ని మీడియా సంస్థలు, సోషల్ మీడియా సంస్థలకు నచ్చలేదట. వెంటనే అవి ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని ప్రారంభించాయి. నిబంధనలు పాటించకపోయినా, ఆధారాలు సమర్పించకపోయినా సరే.. టిక్కెట్ రేట్లు పెంచాలంటూ అడ్డగోలుగా వాదిస్తున్నాయి. నిబంధనలు పాటించినట్టు ఆధారాలు సమర్పించినందునే గతంలో చిరంజీవి హీరోగా నటించిన ఆచార్య, వాల్తేర్ వీరయ్య సినిమాలకు టిక్కెట్ రేట్లను తొలి వారం రోజుల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అదే రీతిలో నిబంధనలను పాటించినట్టు ఆధారాలు సమర్పించాలని చెబితే మాత్రం భోళా శంకర్ సినిమా నిర్మాణ సంస్థ ముఖం చాటేసింది. పైగా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తుండటం విస్మయపరుస్తోంది. ఈ వ్యవహారంలో అసలు నిజాలివీ..

టిక్కెట్ రేట్ల పెంపునకు నిబంధనలు ఇవీ...

సినిమా టికెట్ల రేట్లను తొలి వారం, పది రోజుల పాటు పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలను ఖరారుచేసింది. సినీ పరిశ్రమకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించి చర్చించి మరీ ఈ విధి విధానాలను రూపొందించింది. ఈ మేరకు 2022 ఏప్రిల్ 11న మెమో జారీ చేసింది. ఆ ప్రకారం హీరో హీరోయిన్, డైరెక్టర్ల పారితోషికాలు కాకుండా ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ వ్యయం కలిపి రూ.100 కోట్లు దాటాలి. సినిమా షూటింగ్‌లో కనీసం 20 శాతం ఆంధ్రప్రదేశ్‌లో చేయాలి. సినిమా నిర్మాణ వ్యయానికి సంబంధించిన అఫిడవిట్‌ను సమర్పించాలి. దాన్ని చార్టెడ్ అకౌంటెంట్ ద్వారా ధ్రువీకరించాలి. సినిమా నిర్మాణానికి చేసిన చెల్లింపులకు సంబంధించి జీఎస్టీ/ ట్యాక్స్ రిటర్న్‌లు, ఇన్వాయిస్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు సమర్పించాలి. మొత్తం 12 రకాల సాధారణ పత్రాలను సమర్పించాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

ఆచార్య, వాల్తేర్ వీరయ్య సినిమాలకు ఇదే రీతిలో అనుమతి

చిరంజీవి హీరోగా నటించిన ఆచార్య, వాల్తేర్ వీరయ్య సినిమాలకు ఈ నిబంధనల ప్రకారమే టిక్కెట్ రేట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ సినిమాల నిర్మాణ సంస్థలు నిర్దిష్ట పత్రాలతో సహా దరఖాస్తు చేశాయి. వాటిని పరిశీలించి సక్రమంగా ఉండటంతో టిక్కెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

నిబంధనలు పాటించకుండా టిక్కెట్ రేట్లు పెంచమంటే ఎలా?

భోళా శంకర్ సినిమాను నిర్మించిన అడ్వెంచర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆ నిబంధనలను ఏపీ పట్టించుకోలేదు. తొలి వారం రోజులు టిక్కెట్ రేట్ల పెంపునకు అనుమతినివ్వాలని ఆ సంస్థ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్‌ఎఫ్‌టీవీటీడీసీ)కి జులై 30న దరఖాస్తు చేసింది. దానిని ఏపీఎస్‌ఎఫ్‌టీవీటీడీసీ పరిశీలించింది. జీవో నంబర్ 2 ప్రకారం ఇచ్చిన ఉత్తర్వుల్లో నిబంధనలను పాటించాలని, ఆధారాలు చూపాలని ఈ నెల 2న లిఖితపూర్వకంగా చెప్పింది. కానీ అడ్వెంచర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఇప్పటివరకు ఆ ఆధారాలను సమర్పించలేదు. వైజాగ్ పోర్టు, అరకు ప్రాంతాల్లో 25 రోజులపాటు భోళా శంకర్ సినిమా షూటింగ్ చేసినట్టు అడ్వెంచర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ అంతకు ముందు దరఖాస్తులో తెలిపింది. అందుకు ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని ఏపీఎస్‌ఎఫ్‌టీవీటీడీసీ కోరింది. దీనిని సినిమా నిర్మాణ సంస్థ పట్టించుకోలేదు. నిర్మాణ వ్యయం అఫిడవిట్, జీఎస్టీ చెల్లింపులు, ట్యాక్స్ రిటర్న్‌లు, ఇన్వాయిస్‌లు, బ్యాంక్ స్టేట్‌మెంట్లు వంటి పత్రాలు వేటినీ చిత్ర నిర్మాణ సంస్థ సమర్పించనే లేదు. ఇవేవీ లేకుండా టిక్కెట్ రేట్ల పెంపునకు ప్రభుత్వం ఎలా అనుమతిస్తుంది?

ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం

భోళా శంకర్ చిత్రం నిర్మాణ సంస్థ కూడా ఇదే రీతిలో నిబంధనలను పాటిస్తే రేట్ల పెంపునకు అనుమతిస్తామని ఏపీఎస్‌ఎఫ్‌టీవీటీడీసీ స్పష్టం చేసింది. కానీ కొందరు దురుద్దేశంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే భోళా శంకర్ సినిమా టిక్కెట్ రేట్ల పెంపునకు అనుమతినివ్వడం లేదంటూ కొన్ని మీడియాలతోపాటు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నారు.

కృష్ణాపై తెలంగాణ మరో అక్రమ ఎత్తిపోతల

- అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండా అచ్చంపేట ఎత్తిపోతల నిర్మాణం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: కృష్ణా నదిపై తెలంగాణ ప్రభుత్వం మరో అక్రమ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. అపెక్స్ కౌన్సిల్ ఆమోదం, పర్యావరణ అనుమతి తీసుకోకుండా అచ్చంపేట ఎత్తిపోతల నిర్మాణానికి సిద్ధమైంది. శ్రీశైలం జలాశయం నుంచి 5 టీఎంసీలను తరలించి అచ్చంపేట నియోజకవర్గంలో 57,200 ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించేలా రూ.1,061.39 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టింది. బుధవారం టెండర్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీనిని నిలిపివేసేలా తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించాలని కేంద్ర జల్‌శక్తి శాఖ, కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్జీటీలో పిటిషన్ దాఖలు చేసేందుకు కూడా సిద్ధమైంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కృష్ణా నదిపై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు కొత్తగా ఏ ప్రాజెక్టు చేపట్టాలన్నా అపెక్స్ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. కానీ శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 60 రోజుల్లో 120 టీఎంసీలు తరలించడానికి తెలంగాణ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను 2015లో చేపట్టింది. ఓటుకు కోట్లు కేసులో తెలంగాణ సర్కారుకు దొరికిపోయిన నాటి సీఎం చంద్రబాబు.. ఈ ఎత్తిపోతలను అడ్డుకోవడంలో, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో విఫలమయ్యారు. ఇప్పుడు పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా అదనంగా 5 టీఎంసీలను శ్రీశైలం నుంచి తరలించి, వాటిని ఎదుల రిజర్వాయర్‌లో నిల్వ చేసి, అక్కడి నుంచి ఉమామహేశ్వర రిజర్వాయర్‌లోకి.. అక్కడి నుంచి అచ్చంపేట ఎత్తిపోతల కింద కొత్తగా నిర్మించే రిజర్వాయర్లలోకి తరలించేలా తెలంగాణ నూతన ప్రాజెక్టు చేపట్టింది. దీనికి పర్యావరణ అనుమతి, అపెక్స్ కౌన్సిల్, కృష్ణా బోర్డు, సీడబ్ల్యూసీ అనుమతి తీసుకోలేదు. ఈ ఎత్తిపోతలను తక్షణమే నిలిపివేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జల్ శక్తి శాఖకు, కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎన్జీటీలో పిటిషన్ వేయనుంది.

అడ్డంగా బుక్కయిన చంద్రబాబు!

- అంగళ్లలో టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి దాడులు చేయించిన వైనం
- పెద్దిరెడ్డి కథ చూద్దాం పుంగనూరుకు పదండని పిలుపు
- చంద్రబాబు సూచన మేరకే పుంగనూరు వద్ద విధ్వంసకాండ
- షెడ్యూల్‌ను మార్చి.. పార్టీ శ్రేణుల్ని దారి తప్పించిన చంద్రబాబు
- షెడ్యూల్‌లో లేకున్నా ములకలచెరువు, బురకాయలకోట, అంగళ్లలో రోడ్‌షో
- అల్లర్లకు ప్రేరేపించిన దృశ్యాలు వీడియోల్లో ప్రస్ఫుటం
- అందుకే చంద్రబాబు ఏ1గా కేసు నమోదు



కార్యకర్తలను రెచ్చగొడుతూ ప్రసంగిస్తున్న చంద్రబాబు (ఫైల్)

చిత్తూరు అర్బన్/బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లా అంగళ్లు, చిత్తూరు జిల్లా పుంగనూరు వద్ద ముందస్తు ప్రణాళికలో భాగంగానే టీడీపీ శ్రేణులను బహిరంగంగా రెచ్చగొట్టి దాడులు చేయించిన చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారు. విధ్వంసానికి దిగాలని చంద్రబాబు బహిరంగంగానే పిలుపునివ్వగా.. పార్టీ శ్రేణులు, కిరాయి మూకలు దాడులకు తెగబడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు ‘పచ్చ మీడియా’ సహా అన్ని చానళ్లలోనూ ప్రసారమయ్యాయి. వాస్తవానికి తంబళ్లపల్లె నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన లేకపోయినా.. ముందురోజు సాయంత్రం పర్యటనలో మార్పు చేయడం.. ముందుగా ప్రకటించిన షెడ్యూల్‌లో లేకున్నా ములకలచెరువు, బురకాయలకోట, అంగళ్ల గ్రామాల పర్యటనకు వెళ్లడం వంటి అంశాలు చంద్రబాబు ఈ కుట్రకు ఏవిధంగా తెర తీశారనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. గతంలో తెలంగాణలో ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయిన చంద్రబాబు.. ఆ ఆడియో టేపులోని మాటలు తనవి కాదని బొంకారు. కానీ.. తాజా కేసులో పార్టీ శ్రేణులను రెచ్చగొట్టిన వీడియో సాక్ష్యాలు ఉండటంతో ఈ కేసులో అడ్డంగా దొరికిపోయారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ చంద్రబాబు తాను రెచ్చగొట్టలేదని మాట మారిస్తే.. పోలీసుల వద్ద ఉన్న, ఎల్లో మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన వీడియోలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపి.. చట్టపరంగా ముందుకు వెళ్లడానికి పోలీస్ యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఏ1గా కేసు నమోదైంది.

అంతా వ్యూహం ప్రకారమే..

ఈ నెల 4న ఉదయం 10:30 గంటలకు నాయన చెరువుపల్లెలో పనుల పరిశీలనకు రావాల్సిన చంద్రబాబు 12 గంటలు దాటాక చేరుకున్నారు. నేరుగా పనుల పరిశీలనకు వెళ్లకుండా షెడ్యూల్‌ను పక్కనపెట్టి ములకలచెరువులో ప్రసంగించారు. ఈ ప్రసంగంలోనూ టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా మాట్లాడారు. అక్కడినుంచి నాయన చెరువుపల్లెకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బురకాయలకోటలో కారు పుట్ బోర్డు పైకి ఎక్కి రోడ్‌షో నిర్వహించారు. బి.కొత్తకోట మండలంలో హంద్రీ–నీవా కాలువను కొద్దిసేపు పరిశీలించారు. అంగళ్లలో చంద్రబాబు రోడ్‌షో, ప్రసంగం లేదు. కానీ.. మసీదు వద్దకు రాగానే చంద్రబాబు తాను ప్రయాణించే కారుపై రోడ్‌షో నిర్వహించారు. నాయన చెరువుపల్లె, హంద్రీ–నీవా కాలువ పనుల పరిశీలన మినహా షెడ్యూల్ మేరకు మిగతా ఏ కార్యక్రమం లేదు. కానీ.. ఆద్యంతం షెడ్యూల్‌కు భిన్నంగానే చంద్రబాబు పర్యటన కొనసాగించారు.

రెచ్చగొట్టి.. ఉసిగొల్పి..

ప్రాజెక్టుల సందర్శన పేరిట చంద్రబాబు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విధ్వంసక వ్యూహం ప్రకారమే వచ్చినట్లు అర్థమవుతోంది. వాస్తవానికి హంద్రీ–నీవా కాలువ వద్ద రైతులతో చంద్రబాబు సమావేశం కావాల్సి ఉంది. దానిని రద్దు చేసుకుని మరీ అంగళ్లు గ్రామానికి చేరుకున్న చంద్రబాబు మసీదు వద్దకు రాగానే కారుపై నిలబడి రోడ్‌షో ప్రారంభించారు. అంగళ్లలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమాపతిరెడ్డి చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నించారు. పిచ్చలవాండ్లపల్లె రిజర్వాయర్‌పై చంద్రబాబు కోర్టులో కేసు వేయించి పనులు అడ్డుకున్నందుకు నల్లకండువాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఒక్కసారిగా ఆవేశంతో ఊగిపోయిన చంద్రబాబు ‘తరమండిరా.. కొట్టండిరా నా కొడుకులను..’ అంటూ గొడవకు ఉసిగొల్పారు. అంతటితో ఆగక ‘పుంగనూరులో ఆ పుడింగి సంగతి తేలుద్దాం.. పదండి’ అంటూ పిలుపునిచ్చారు. దీంతో అప్పటికే ముందస్తు వ్యూహం ప్రకారం పుంగనూరు వద్ద వేచి ఉన్న టీడీపీ మూక, అల్లరి మూక విధ్వంసకాండకు దిగారు. అంగళ్లలో చెలరేగిన టీడీపీ నేతల రౌడీయిజంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పోలీసులు గాయపడ్డారు. పుంగనూరు వద్ద మారణాయుధాలు, రాళ్లు, కొడవళ్లు, ఇటుకలతో చేసిన దాడిలో పదుల సంఖ్యలో పోలీసులు గాయపడిన విషయం తెలిసిందే. కానిస్టేబుల్ రణధీర్ ఒక కంటి చూపును శాశ్వతంగా కోల్పోయారు. డీఎస్పీ బాబుప్రసాద్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. మహిళా ఎస్ఐ కరీమున్నీసా నడవలేని పరిస్థితి.

బాబు ప్రోద్బలంతోనే పోలీసులపై దాడులు

- పోలీసులపై దాడి కేసులో ఎవ్వరినీ ఉపేక్షించొద్దు
- రాష్ట్ర డీజీపీ, ప్రభుత్వానికి పోలీసు అధికారుల సంఘం విజ్ఞప్తి



కర్నూలులో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కర్నూలు/తిరుపతి క్రైం/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): రాజకీయ కుట్రలో భాగంగానే ముందస్తు ప్రణాళికతో టీడీపీ అధినేత చంద్రబాబు ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి ప్రోత్సహించడం వల్లే పుంగనూరులో పోలీసులపై దాడులు జరిగాయని ఏపీ పోలీసు అధికారుల సంక్షేమ సంఘం, తిరుపతి పోలీస్ అసోసియేషన్ నేతలు స్పష్టం చేశారు. పోలీసులపై భౌతిక దాడులకు చంద్రబాబే కారణమని, తనపై పెట్టిన కేసునుంచి తప్పించుకునేందుకు, ప్రజల్లో సానుభూతి పొందేందుకు ఆయన పోలీసు వ్యవస్థపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అంగళ్లు, పుంగనూరు వద్ద పోలీసులపై జరిగిన హింస ఘటనలో ఎంతటివారైనా ఉపేక్షించకుండా చట్టం ముందు నిలబెట్టాలని రాష్ట్ర డీజీపీ, ఏపీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్‌ఖాన్, వైస్ ప్రెసిడెంట్ నాగిని, కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏపీ పోలీసు అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, కర్నూలు, కడప జిల్లాల అధ్యక్షులు వై.నాగరాజు, డి.సురేష్, ఏపీఎస్పీ రెండో బెటాలియన్ అధ్యక్షుడు వై.పెద్దన్న, చిత్తూరు ఎస్పీ కార్యాలయంలో తిరుపతి పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్, రాష్ట్ర కమిటీ ట్రెజరర్ సోమశేఖర్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు ఘటనలో ఇంతమంది పోలీసులు తీవ్రంగా గాయపడితే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పరామర్శించకపోగా, పోలీసులకు రాజకీయ రంగు రుద్దడం శోచనీయమని అన్నారు. టీడీపీ దాడుల్లో కొంతమంది పోలీసులకు కాళ్లు చేతులు పూర్తిగా విరిగిపోయాయని, తలలు పగిలాయని, యువ కానిస్టేబుల్ రణధీర్‌కు ఒక కన్ను పూర్తిగా పోయిందని, మరో కన్ను కూడా సరిగా కనిపించడం లేదని చెప్పారు. అయినా ‘నా పైనే కేసులు కడతారా’ అని చంద్రబాబు పోలీసులను బెదిరిస్తున్నారని, ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం భారతదేశంలోని అందరికీ ఒకే రకమైన చట్టం ఉంటుందని తెలిపారు. చంద్రబాబు చట్టానికి అతీతులు కారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. సమర్థవంతంగా విధులు నిర్వహించే పోలీసులను మానసికంగా దెబ్బతీసేలా లోకేశ్ మాట్లాడటం శోచనీయమన్నారు.

బాబును రాష్ట్రం నుంచి బహిష్కరించాలి

- అధికార దాహంతోనే విధ్వంసానికి కుట్ర
- ఎక్కువ కేసులు ఉన్నవారికి లోకేశ్ పదవులు ఇస్తారా?
- కన్నుపోయిన కానిస్టేబుల్‌కు సంఘీభావం ప్రకటించలేరా?
- బాధితులైన పోలీసులను వదిలేసి.. బాబుకు వంతపాడటం ఏమి జర్నలిజం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో మేధావులు ఆగ్రహం



హింసా రాజకీయాలపై ప్రజలకు వాస్తవాలను తెలిపే పోస్టర్ విడుదల చేస్తున్న వివిధ రంగాల ప్రముఖులు

సాక్షి, అమరావతి: ‘ప్రజాస్వామ్యంలో హింసా రాజకీయాలు ప్రమాదకరం. ప్రతిపక్షాలు విధానపరమైన అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. అధికారం కోసం అమాయకులను రెచ్చగొట్టడం సమంజసం కాదు. అసమర్థుల ఆఖరి అస్త్రమే హింస. పుంగనూరు, అంగళ్లు ఘటనలను నివారించాల్సిన చంద్రబాబు.. ఆయనే కార్యకర్తలను ఉసిగొల్పి పోలీసులపై దాడి చేయించడం హేయమైన చర్య. రాజ్యాధికారాన్ని ఎలాగైనా పొందాలనే ఉద్దేశంతో దారుణాలకు తెగబడుతున్న చంద్రబాబును రాష్ట్రం నుంచి, రాజకీయాల నుంచి బహిష్కరించాలి. తనపై పోలీసులు కేసు నమోదు చేస్తే స్పందించిన చంద్రబాబు.. దాడుల్లో గాయపడిన పోలీసులకు సంఘీభావం తెలియజేయకపోవడం ఆయన నీచత్వానికి పరాకాష్ట. అదేవిధంగా కొన్ని పత్రికలు వాస్తవాలను వక్రీకరిస్తూ ఏకపక్షంగా వార్తలు రాస్తూ మీడియా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నాయి. అల్లరిమూకల దాడిలో కన్ను పోగొట్టుకున్న కానిస్టేబుల్, గాయపడిన 30 మంది పోలీసుల గురించి ఒక్క మాట కూడా రాయకపోవడం సిగ్గుచేటు. ఇదేమి జర్నలిజం..’ అని వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో ‘ఆంధ్రప్రదేశ్‌లో హింసా రాజకీయాలు–కట్టడి–మీడియా పాత్ర’ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు హింసా రాజకీయాలపై ప్రజలకు వాస్తవాలను తెలిపేలా ప్రచారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు ప్రముఖుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

అనిశ్చితిని పెంచే కుట్ర

ఎన్నికలు సమీపిస్తుండటంతో హింసా ధోరణిని పెంచి ప్రజల్లో అనిశ్చితిని సృష్టిస్తున్నారు. దానిని తిరిగి పాలకపక్షంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. హింసను ప్రభుత్వం అరికట్టలేకపోతోందని ఒక వర్గం మీడియా ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. పవన్ కళ్యాణ్ తన ప్రసంగాల్లో కార్యకర్తలు చావులకు సిద్ధపడి రావాలని పిలుపునివ్వడం వెనుక పెద్ద కుట్ర ఉందనే అనుమానం కలుగుతోంది. లోకేశ్ సైతం ఎక్కువ కేసులు ఉన్నవారికి పదవులు కట్టబెడతామని చెప్పడం హింసా రాజకీయానికి నిదర్శనం కాదా!. ప్రజలు ఇవన్నీ గుర్తించాలి. హింసను ప్రోత్సహించేవారికి బుద్ధి చెప్పాలి.

– మేడపాటి వెంకట్, ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ అధ్యక్షుడు

ప్రతిపక్షాల తీవ్రవాద రాజకీయం

ఎన్నడూ రాష్ట్రంలో ఇలాంటి అరాచక పరిస్థితులు కనిపించలేదు. అధికారం కోసం అర్రులు చాస్తూ.. హింసాత్మక ధోరణిని అవలంబిస్తున్నారు. ప్రతిపక్షాలు తీవ్రవాద రాజకీయాలు చేస్తున్నాయి. పుంగనూరులో పోలీసులపై దాడి గురించి జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశాం. ఇందులో ఆరు సెక్షన్ల ప్రకారం చంద్రబాబు నేరాలకు పాల్పడ్డారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ చేస్తున్న వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ అరాచక తీవ్రవాద రాజకీయాలను మొగ్గలోనే తుంచాలి.

– వీవీఆర్ కృష్ణంరాజు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

బాబు, పవన్ చీడపురుగులు

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ రాష్ట్రానికి పట్టిన చీడపురుగులు. అధికారం కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితులు పెంచాలని సీఎం జగన్ చూస్తుంటే... ప్రతిపక్షాలు మాత్రం జనం చావులను కోరుకుంటున్నాయి. చంద్రబాబు చేసే ప్రతి పనిలోనూ హింస దాగుంటుంది. కార్యకర్తలు చనిపోతే వారి శవాలపై నుంచి వచ్చి అధికారం పొందాలని ప్లాన్ వేశారు.

– మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఫోరం ఫర్ బెటర్ సొసైటీ గుంటూరు కన్వీనర్

రక్తపాతాన్ని కోరుకుంటున్న బాబు

చంద్రబాబు ఓ ఘోరీ, ఓ గజినీ మహ్మద్ మాదిరిగా రక్తపాతాన్ని కోరుకుంటున్నారు. అల్లర్లు సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని ప్రయత్నిస్తున్నారు. విధి నిర్వహణలో మహిళా సీఐ ఓ వ్యక్తిని చెంపదెబ్బ కొడితే వీరంగం చేసిన వికృత రాజకీయ నటుడు పవన్ కళ్యాణ్.. ఇంతమంది పోలీసులకు గాయాలైతే ఎందుకు నోరు మెదపడంలేదు. అధికారాన్ని ప్రజల మనసుల ద్వారా గెలుచుకోవాలి.

– విజయబాబు, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు

కన్నుపోయిన కానిస్టేబుల్‌పై సానుభూతి చూపరా..?

రాష్ట్రంలో హింసా రాజకీయం పేట్రేగుతోంది. దీనిపై మేధావులు, పాత్రికేయులు, రాజకీయ పక్షాలు ప్రజలను అప్రమత్తం చేయాలి. అసలు హింసకు పాల్పడినవారెవరో, బాధితులెవరో అందరికీ తెలిసినా కొన్ని పత్రికలు, చానళ్లు పోలీసులదే తప్పని వక్రీకరించి వార్తలు రాయడం, ప్రసారం చేయడం సిగ్గుచేటు. కన్ను కోల్పోయిన కానిస్టేబుల్‌పై కనీస సానుభూతి చూపని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ప్రజలకు ఏం సమాధానం చెబుతారు. పుంగనూరు, అంగళ్లలో పోలీసులు దెబ్బలు తిని ప్రజల ప్రాణాలు కాపాడారు.

– కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ మీడియా అకాడమీ చైర్మన్

రూట్ మ్యాప్‌ను ఎందుకు మార్చారు?

చంద్రబాబు ప్లాన్ ప్రకారమే తన పర్యటన రూట్ మ్యాప్‌ను పుంగనూరు ఊరిలోకి మార్పు చేసినట్లు తెలుస్తోంది. శాంతి భద్రతల సమస్య సృష్టిస్తే పోలీసులు కాల్పులు జరుపుతారని, అప్పుడు తమ కార్యకర్తలు చనిపోతే సానుభూతి పొందవచ్చని పథకం రచించారు. సభకు వచ్చేటప్పుడు వ్యాన్లలో రాడ్లు, తుపాకులు తీసుకురావడమే ఇందుకు నిదర్శనం. కానీ పోలీసులు సంయమనంతో వ్యవహరించారు.

– చెన్నంశెట్టి చక్రపాణి, మాజీ పోలీసుల అధికారి

దిగజారిన ప్రతిపక్షాలు

నాలుగేళ్లుగా ప్రభుత్వంపై దాడి జరుగుతూనే ఉంది. ప్రతిపక్షాలు దిగజారిపోయి ప్రవర్తిస్తున్నాయి. బాధితులను పట్టించుకోకుండా దాడులకు పురిగొల్పిన వారిని కొన్ని పత్రికలు, చానళ్లు వెనకేసుకురావడం క్రూరమైన చర్య. మేనిఫెస్టోను అమలు చేయని ప్రభుత్వాలను రీకాల్ చేయాలి. అప్పుడు చంద్రబాబు లాంటి నాయకులు నిలవలేరు.

– చలాది పూర్ణచంద్రరావు, ఏపీ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు

పవన్.. బలిదానాలు ఎందుకు?

ప్రస్తుతం ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు. ఇది నచ్చకనే చంద్రబాబు.. ఆయన తనయుడు లోకేశ్.. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఆత్మ బలిదానాలకు సిద్ధం కావాలని జనసేన కార్యకర్తలకు చెబుతున్నారు. ఎవరి ఆత్మను ఎవరు బలి తీసుకుంటారు. ఒక్కసారైనా ప్రతిపక్ష నాయకులుగా ప్రజల మేలుకోరే సూచనలను చేశారా?.

– సునీత, మూరుతీ మహిళా సొసైటీ అధ్యక్షురాలు

చంద్రబాబుపై సివిల్ వార్ తప్పదు

హింసను ప్రేరేపిస్తున్న చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. చంద్రబాబుపై పోలీసులే తిరగబడే రోజు వస్తుంది. ఇకపై సివిల్ వార్ ప్రారంభమవుతుంది. అప్పుడు బయటకు రావాలంటేనే బాబు భయపడక తప్పదు. చంద్రబాబు తనను ప్రశ్నించిన వ్యక్తి రక్తం చూస్తాడు. ఈ విషయం అనేకసార్లు రుజువైంది.

– మాదిగాని గురునాథం, ఎస్‌డీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఓ విశ్వాసులారా! ఒకనిని చెడ్డపేరుతో పిలిచిన పిదప పశ్చాత్తాపపడకుంటే, అలాంటి వారు చాలా దుర్మార్గులు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 11 ఆగస్టు 2023

భూతల స్వర్గం ఇక 'కేరళమ్'!

పచ్చని ప్రకృతితో భూతల స్వర్గంగా, 'దేవుడి సొంతగడ్డ'గా పేరుబడ్డ రాష్ట్రానికి త్వరలోనే కొత్త పేరు ఖరారు కానుందా? కేరళ అతి త్వరలోనే అధికారికంగా పేరు మార్చుకోనుందా? అవును. దేశానికి దక్షిణ కొసనున్న ఈ మలయాళ రాష్ట్రం 'కేరళమ్'గా కొత్త నామధేయం స్వీకరించడానికి సన్నాహాలు సాగుతున్నాయి. రాష్ట్రం పేరును రాజ్యాంగంతో సహా అన్ని ఆఫీసు రికార్డుల్లోనూ అధికారికంగా 'కేర ళమ్'గా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ, కేరళ శాసనసభ తీర్మానం చేయడంతో అందుకు రంగం సిద్ధమైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరాయి విజయన్ బుధవారం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని విపక్షాలతో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం పార్టీలకతీతంగా కొత్త పేరుకున్న సర్వ జనా మోదాన్ని తెలియజేస్తోంది. అసెంబ్లీ తీర్మానం తర్వాత కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఇంకా అనేక అంచెలున్నందున అవన్నీ దాటుకొని మలయాళీల ఆకాంక్ష నెరవేరడానికి మరికొంత కాలం పట్టవచ్చు.

నిజానికి, మలయాళంలో అసలు ఆ రాష్ట్రం పేరు కేరళమే. మలయాళీలు సాధారణంలో వాడు కలో చెప్పేది అలానే. ఎటొచ్చీ అధికారిక, ఇంగ్లీష్ రికార్డులోనే ఈ కేరళ అనే మాట. చరిత్ర పరికిస్తే – మలయాళం మాట్లాడే ప్రజలు రకరకాల రాజులు, సంస్థానాల పాలనలో ఉండేవారు. మలబార్, కొచ్చి, ట్రావన్‌కోర్‌లను కలిపి, మలయాళ భాషీయులు అందరికీ సమైక్యంగా ఒకే రాష్ట్రం కావాలనే 'ఐక్య కేరళ ఉద్యమం' 1920ల నుంచే ఉంది. ఒకే భాష, ఒకే చరిత్ర, సంస్కృతి, సంప్రదాయమున్న మలయాళీలంతా ఐక్యం కావాలనే బలమైన డిమాండ్ దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సంస్థానాల విలీనంతో క్రమక్రమంగా నెరవేరింది. 1949 జూలై 1న ట్రావన్‌కోర్, కొచ్చి రాష్ట్రాలు రెండూ ఏకమై, ట్రావన్‌కోర్ – కొచ్చిన్ రాష్ట్రం ఏర్పడింది. ఆ తర్వాత భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరుగుతున్నప్పుడు పునర్వ్యవస్థీకరణ సంఘం కేరళ రాష్ట్ర ఏర్పాటును సిఫార్సు చేసింది. అలా 1956 నవంబర్ 1న ఇప్పటి కేరళ రాష్ట్రం ఆవిర్భవించింది. రాష్ట్రం పేరును మలయాళంలో కేరళమ్ అని పేర్కొన్నా, అప్పట్లో రాజ్యాంగం తొలి షెడ్యూల్‌లో ఇంగ్లీషులో కేరళ అని రాశారు. ఇప్పుడు అదే రాజ్యాంగం 3వ అధికరణ కింద అంతటా కేరళమ్‌గా మార్చాలన్నది కేంద్రానికి అసెంబ్లీ తీర్మానం.

సాధారణంగా పేరులో ఏముంది పెన్నిధి అనుకోవచ్చు. కానీ, అనేక సందర్భాల్లో ఆ పేరు, ఆ పేరు వెనుక చరిత్ర, దానితో ముడిపడ్డ అనుబంధం నిజంగానే ఓ పెన్నిధి. అస్తిత్వానికీ, అపారమైన సెంటిమెంట్‌కూ నెలవు. అనేక ప్రాంతీయ, అస్తిత్వ ఉద్యమాలకు ఆ యా ప్రాంతాల ప్రజల భాష, గోస, ఊరు, పేరు బలమైన ఊతమిచ్చాయనేది మర్చిపోలేని చరిత్ర. ఒకప్పుడు మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి విడిగా తమకు ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ తెలుగువారు చేసిన పోరాటమే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు దారి తీసింది. దక్షిణాదిన తెలుగువారికి, తమిళులకు, కన్నడిగులకు, మలయాళీలకు ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడ్డాయి. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు తర్వాత స్థానిక సెంటిమెంట్లను గౌరవిస్తూ, కొన్ని రాష్ట్రాల పేర్లూ మారాయి. 'మద్రాస్ రాష్ట్రం' అనంతర కాలంలో 1967 నుంచి తమిళనాడు అయినా, 'మైసూర్ స్టేట్' అటుపైన 1973లో కర్ణాటకగా పేరు మార్చుకున్నా అలాగే జరిగింది. ఇప్పుడు కేరళ ప్రజాప్రతినిధులు అసెంబ్లీ ఏకగ్రీవంగా తమ రాష్ట్రం పేరును స్థానిక పురాతన చరిత్రను ప్రతిఫలించేలా కేరళమ్‌గా మార్చాలంటూ చేసిన తీర్మానం కూడా ఆ కోవలోనిదే!

శబ్ద వ్యుత్పత్త్యర్థాల ప్రకారం చూసినా చాలా కథే ఉంది. మలయాళంలో 'కేర' అంటే కొబ్బరి కాయ. అలా 'కేరళ' అంటే నారికేళాల భూమి అని శబ్దార్థం. కేరళ సీమలో ఎటు చూసినా పచ్చటి కొబ్బరి చెట్లు విస్తృతంగా ఉండడమే ఈ శబ్దోత్పత్తికి నేటికీ సాక్ష్యం. క్రీ.పూ. 257 నాటి అశోకుని రెండో శిలాశాసనంలోనే తొలిసారి కేరళ ప్రస్తావన కనిపిస్తుంది. అందులో స్థానిక పాలకుణ్ణి 'కేరళపుత్ర' అనీ, చేర రాజవంశాన్ని ప్రస్తావిస్తూ 'చేర పుత్రుడ'నీ ఉంది. గోకర్ణం నుంచి కన్యాకుమారి మధ్య ఉన్న ప్రాంతాన్ని 'చేరమ్' అనేవారట. 'చేర' అనే మూలపదానికి అనుసంధానించడమనీ, 'అళం' అంటే ప్రాంతమనీ అర్థం. అలా చేరమ్, చేరళమ్ పదాల నుంచే 'కేరళమ్' అనే మాట పుట్టిందట.

దేశపు నైరుతి మూలన మలబార్ తీరంలో నెలకొన్న ఈ రాష్ట్రానికి అనేక విశిష్టతలున్నాయి. ఇది పరశురామ క్షేత్రమనీ, బలి చక్రవర్తి ఇక్కడ నుంచే భూమండలాన్ని పాలించాడనీ పురాణగాథ. మల బార్ సీమ వారిది ప్రత్యేక భాష, సంస్కృతి, సంప్రదాయం. సహజంగానే స్వరాష్ట్రం పేరు సైతం వాటిని ప్రతిఫలించేలా, స్థానిక భావోద్వేగాలను ప్రతిబింబించేలా ప్రతిష్ఠాత్మకంగా ఉండాలని వారు కోరుకుంటారు. అది నూరుపాళ్ళూ సమంజసమే. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు మొదలు సమైక్య ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్ర విభజన దాకా ఇవన్నీ ఆ కోవలో వచ్చినవే! అయితే, పేరు మార్పుకూ పెద్ద తతంగం ఉంది. కొత్త రాష్ట్రాల ఏర్పాటు, సరిహద్దులు, పేర్లలో మార్పుల అంశాలు రాజ్యాంగం 3వ అధికరణం కిందకు వస్తాయి. నగరాల పేర్లు మార్చేందుకు కేంద్ర ఆమోదం అవసరం లేకున్నా, రాష్ట్రాల పేర్ల మార్పునకు కేంద్ర హోమ్‌శాఖ అంగీకారం తప్పనిసరి. రాజ్యాంగ సవరణ అవసరం. సాధారణంగా రాష్ట్ర సర్కార్ నుంచి ప్రతి పాదన రాగానే కేంద్రం పేరు మార్పు ప్రక్రియ ఆరంభమవుతుంది. ఆ పైన ఇంటెలిజెన్స్ బ్యూరో, రైల్వే, తపాలా శాఖలు వగైరాల నుంచి నిరభ్యంతర పత్రాలు కోరుతుంది. పార్లమెంట్ ఆమోదంతో చట్టమయ్యాక, రాష్ట్రానికి కొత్త పేరు అమలులోకి వస్తుంది. కేరళ విజయాలను ప్రపంచానికి చాటేలా ఈ నవంబర్ 1న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి 'కేరళీయమ్ 2023' పేరున ఉత్సవాలు జరగను న్నాయి. ఆలోగా పేరు మారితే ఉత్సవాలకూ నిండుదనమన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన ఫలిస్తుందా?

చట్టం మీ బాబు చుట్టమా రామోజీ?

వాహనాల్లో తుపాకులు... చేతుల్లో కర్రలు, రాళ్లు, తాగి ఖాళీ చేసిన బీరు బాటిళ్లు... ఇవన్నీ పట్టుకుని ప్రాజెక్టులు చూడటానికి 'యాత్ర'గా వెళ్లారంటే నమ్మగలమా? వీళ్లు ఎలాంటి యాత్రకు ప్లాన్ చేస్తున్నారో తెలియటం లేదా? గుంపును నడిపించే నాయకుడు ఆవేశంతో... "తరమండిరా నా కొడుకుల్ని" అంటూ ఎదుటివాళ్లను కొట్టమని రెచ్చగొడుతుంటే దాన్నేమనుకోవాలి? పైపెచ్చు... "ఒళ్లు దగ్గర పెట్టుకోండి. నాతో పెట్టుకుంటే ఇలాగే జరుగుతుంది. తమాషాలు చేస్తున్నారా. చూసుకుందాం రండ్రా నా కొడకల్లారా.." అని తన బావమరిది సినిమాల్లో రెచ్చిపోయినట్లుగా 73 ఏళ్ల చంద్రబాబు నాయుడు రెచ్చిపోయాడంటే ఏమనుకోవాలి? ఆయన మాటలతో రెచ్చిపోయి పరుగులు తీస్తూ ఎదుటి వ్యక్తులపై రాళ్ల దాడికి తెగబడ్డ తెలుగుదేశం రౌడీ మూకలు ఏం యాత్ర చేస్తున్నట్లు? నిరసన తెలపటానికి నల్ల జెండాలతో వచ్చిన 20 మంది కూడా లేని వైఎస్సార్ సీపీ కార్యకర్తలను తరమటంతో పాటు పోలీసులను రాళ్లు విసిరి గాయపరిచిన వారిపై కేసు పెట్టడం తప్పా? అన్నమయ్య జిల్లా 'అంగళ్లు' ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో ఎవరు ఎవరిపై హత్యాయత్నం చేశారో తెలియటం లేదా? మరి ఈ ఘటనలో కెమెరాల సాక్షిగా కార్యకర్తల్ని రెచ్చగొట్టి విధ్వంసానికి పాల్పడిన చంద్రబాబు నాయుడిపై కేసు పెట్టడం తప్పెలా అవుతుంది? దీన్ని కూడా తెలుగుదేశం పార్టీ కోణంలోనే చూసి... 'వైకాపా జులుం' అంటూ రాసిన మీ కలానికి జోహార్లు రామోజీరావు గారూ!!. మీ పాత్రికేయానికి 50 ఏళ్లు నిండుతున్న తరుణంలో మీరు కొత్త లోతులకు దిగజారిపోతున్నారని అర్థం కావటం లేదా?

- చంద్రబాబు దాడులు చేయిస్తే నేరం కాదా.. కేసు పెట్టొద్దా..!?
- 47 మంది పోలీసులపై దాడి చేస్తే హత్యాయత్నం కాదా?
- ఉద్దేశపూర్వకంగా దాడులు చేయించిన వాళ్లది నేరం కాదా?
- ఒక పోలీసు కానిస్టేబుల్ కన్ను పోగొట్టడం హేయం కాదా?
- నిర్దేశించిన రూట్ కాకుండా వేరే రూట్లోకి రావటమెందుకు?
- యాత్రకు వెళ్లేవారి వాహనాల్లో తుపాకులెందుకు?
- కర్రలు, రాళ్లు, బీరు బాటిళ్లు వెంట తెచ్చుకున్నారంటే అర్థమేంటి?
- నాయకుడన్నాక సంయమనంతో ఉండాలని బాబుకు తెలీదా?
- 'తరమండిరా..' అంటూ రెచ్చగొట్టేవాణ్ణి నాయకుడంటారా?
- ఈ వాస్తవాలకు ముసుగులేసి మీ పెడబొబ్బలేంటి రామోజీ?
- ఇంకెన్నాళ్లు నిజాలు రాయటం మానేస్తారో...!


వైకాపా పోలీస్ జులుం
తెదేపా వారిని కొట్టడం.. వారిపైనే కేసులు పెట్టడం
ఇదీ రాష్ట్రంలో అమలవుతున్న రాజ్యాంగం!
చంద్రబాబుపై హత్యాయత్నం కేసు
ఏ-1గా ఎఫ్ఐఆర్ నమోదు
మరో 20 మందిపైనా బనాయించిన ముదివేడు పోలీసులు

పుంగనూరులో మరీ దారుణం. అక్కడ వైసీపీ కార్యకర్తలు కూడా లేరు. ఉన్నదల్లా పోలీసులే. వారు కూడా బందోబస్తు కోసం పుంగనూరు ఊళ్లోకి వెళ్లే రోడ్లకు బారికేడ్లు పెట్టి... ఆ బారికేడ్ల వెనక నిలుచున్నారు. ఇక చంద్రబాబు నాయుడి మూకకు ఆ ఊళ్లోకి వెళ్లాల్సిన పనే లేదు. ఎందుకంటే వాళ్లు అనుమతి తీసుకున్న రూట్ మ్యాప్‌లో... పుంగనూరు బైపాస్ మీదుగా వెళ్లిపోవాలి తప్ప పుంగనూరు ఊళ్లోకి వెళ్లటమనేది లేదు. అందుకే పోలీసులు అక్కడ బందోబస్తుగా నిలుచున్నారు. అలాంటి చోట వెళుతూనే... దూరం నుంచే పోలీసులపైకి రాళ్లు, బీరు బాటిళ్లు విసురుతూ వారిని గాయపరిచిందెవరు? ఉద్దేశ పూర్వకంగా దాడి చేసి... ఏకంగా 47 మంది పోలీసుల్ని రక్తం వచ్చేలా రాళ్లతో కొట్టిందెవరు? ఒక కానిస్టేబుల్ కంటి చూపు కూడా పోయింది కదా!!. ఇది హత్యాయత్నం కాక మరేమిటి? చంద్రబాబు నాయుడు వెనక ఉండి ఉసిగొల్పడం వల్లే కదా... వారంతా పోలీసుల పైకి రాళ్లతో విరుచుకుపడ్డారు!!.

ఏది నిజం?

ఆ సమయంలో పోలీసులు లాఠీచార్జి చేయటంతో... టీడీపీ మూకలు కూడా తాము తెచ్చుకున్న కర్రలు, రాళ్లతో ఎదురుదాడికి దిగాయి. చంద్రబాబు నాయుడు దాడులకు ప్రేరేపించటంతో పాటు... దగ్గరుండి రెచ్చగొడుతూ దాడులు చేయించటం... ఆయన సమక్షంలోనే మొత్తం దాడులు జరగటం... ఇదంతా కుట్ర కాక మరేంటి? చంద్రబాబుపై కేసు పెడితే తప్పేంటి రామోజీరావు గారూ? అసలు ముందే దాడులు చేయాలన్న ప్రణాళిక లేకుంటే తెలుగుదేశం నేతల వాహనాల్లో తుపాకులు ఎందుకున్నాయి? కర్రలు, రాడ్లు ఎందుకు వెంట తెచ్చుకున్నారు? చేతుల్లో రాళ్లు సిద్ధంగా ఉన్నాయంటే అర్థమేంటి? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పండి రామోజీరావు గారూ?

కూడా. ఇంకా.. 'దెబ్బలు తగిలినా.. తలలు పగిలినా భయపడేది లేదు. నేను ఎన్ఎస్‌జి రక్షణలో ఉన్నా. ఏయ్ పోలీస్... బట్టలిప్పు. రోషం లేని జీవితం. మీ పతనం చూసేవరకు వెంటపడతా' అంటూ పుంగనూరులో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇవన్నీ ఆడియో, వీడియో సాక్ష్యాలతో సహా బయటపడ్డాయి. చంద్రబాబు వైఖరిని చూసి జనం ఛీకొట్టడమే కాదు... ఆయన అడ్డంగా దొరికిపోయాడు కనక పోలీసులు తననే ఏ-1గా పెట్టి కేసు నమోదు చేశారు. అంతటా తనకు ప్రతికూలత పెరుగుతుండటంతో... సంఘటన జరిగిన నాలుగు రోజుల తరవాత ఆయన కొత్త పల్లవి అందుకున్నారు. తనపైనే హత్యాయత్నం జరిగిందని, అలాంటిది తనపైనే కేసు పెట్టడం ఏంటని కొత్త రాగం అందుకున్నారు. అందుకే.. రామోజీరావు సైతం తన బాబుకు మద్దతుగా సంఘటన జరిగిన నాలుగు రోజుల తరవాత... అంతా వైఎస్సార్ సీపీ కార్యకర్తలే చేశారని, ఎదురు కేసులు పెడుతున్నారని కొత్త కథనం అందుకున్నారు. ఇదంతా చంద్రబాబు మాస్టర్ ప్లాన్‌లో భాగమేనని అర్థం కావటానికి ఇంకా ఏం కావాలి?

అయినా సాక్ష్యాలతో దొరికిపోవడం చంద్రబాబుకు ఎప్పుడూ అలవాటే. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఓట్ల కోసం కోట్లు లంచాలిచ్చిన కేసులో చంద్రబాబు ఇలానే 'మా వాళ్లు బ్రీఫ్డ్ మీ' అంటూ అడ్డంగా దొరికిపోయిన వ్యవహారం ఎవరికీ తెలియంది కాదు. ఇక అంగళ్లు, పుంగనూరులో బహిరంగంగానే పోలీసులపై దాడులు చేయాలని ఆయన తమ కార్యకర్తలను ఆదేశించారు. మరి హత్యాయత్నానికి ప్రేరేపించిన వ్యక్తిపై కేసు పెట్టరా? చట్ట ప్రకారం పోలీసులు కేసు పెడితే అంతగా పెడబొబ్బలు పెడితే ఎలా...! చంద్రబాబు మీకు ఎక్కువ కావచ్చు. కానీ చట్టానికి అతీతుడు కాదు.

దాడికి తెగబడ్డారు. ఈ పెనుదాడిలో 47 మంది పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఒళ్లంతా రక్తమోడుతూ కుప్పకూలిపోయారు. టీడీపీ అల్లరి మూకల రాళ్లవర్షంతో గాయపడిన మహిళా పోలీసులు హాహాకారాలు చేయడం అక్కడున్న అందరినీ కలచివేసింది. చాలా మంది ఖాకీ దుస్తులు రక్తంతో తడిసి ఎర్రబారటం దాడి తీవ్రతకు నిదర్శనం. టీడీపీ రౌడీల రాళ్ల దాడితో రణధీర్ అనే కానిస్టేబుల్ కన్ను పోయింది. మరో కంటికి ఆపరేషన్ చేస్తేగానీ ఏమీ చెప్పలేమన్నది వైద్యుల మాట. ఇవన్నీ వీడియోలు, ఫొటోలతో సహా బయటపడినా... 'ఈనాడు' మాత్రం ఎవరిపై దాడి చేశారు...? ఎవరు గాయపడ్డారు?...అంటూ నంగనాచి కబుర్లు చెప్పడం పాత్రికేయానికి పట్టిన ఖర్మ కాక మరేంటి?

అంతా చంద్రబాబు పన్నాగమే...

రోజు రోజుకు ప్రజల్లో ఆదరణ కరువవుతున్న టీడీపీకి... లేని సానుభూతి సృష్టించేందుకు చంద్రబాబు కుట్రపన్నారన్నది పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. సాగునీటి ప్రాజెక్టుల పేరిట తాను చేపట్టే యాత్రలో విధ్వంసం సృష్టించాలనేది ఆయన పన్నాగం. ముందుగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో అంగళ్లు సర్కిల్‌కు వద్దకు చంద్రబాబు చేరుకోగానే టీడీపీ మూకలు కేకలు వేస్తూ... తొడలు చరుస్తూ కర్రలు, బీరు బాటిళ్లు, రాళ్లు విసురుతూ దాడులకు తెగబడ్డాయి. దాంతో పోలీసులతో సహా పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంతటితో చంద్రబాబు శాంతించ లేదు. తన వాహనం నుంచే ప్రసంగిస్తూ 'పుంగనూరులో ఓ పుడింగి ఉన్నాడు.. పదండి అక్కడ తేల్చుకుందాం' అని టీడీపీ నేతలు, కార్యకర్తలతో అన్నాడు. పుంగనూరులో విధ్వంసానికి అప్పటికే 'అన్నీ' సిద్ధం చేసుకునే ఆయన ఆ మాటన్నారు. 2 వేల మందికిపైగా టీడీపీ రౌడీలు మాటువేశారు. అప్పటికే కృష్ణదేవరాయ కూడలికి సమీపంలో సిద్ధంగా ఉంచుకున్న రాళ్లు, మద్యం బాటిళ్లు, బీరు బాటిళ్లు, గుండ్రటి టపాసు బాంబులును గట్టిగా విసిరే బాధ్యత కొందరికి అప్పగించారు. ఒకరిద్దరు పోలీసులు చనిపోయినా పర్వాలేదు... పోలీసులు అనివార్యంగా కాల్పులు జరిపే పరిస్థితిని క్రియేట్ చేయాలన్నది బాబు లక్ష్యం. పోలీసు కాల్పుల్లో టీడీపీ కార్యకర్తలు చనిపోతే రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలకు విఘాతం కలించాలన్నది అసలు పన్నాగం. అందుకే రూట్ మ్యాప్‌లో లేకపోయినా సరే పుంగనూరు పట్టణంలోకి వెళ్లాలని పట్టుబట్టారు. ఎన్ఎస్‌జీ కమాండోల భద్రతలో ఉండే చంద్రబాబు పర్యటన రూట్‌ను ముందే ఖరారు చేస్తారు. ఆ మేరకు ఆ రూట్‌ను భద్రతా బలగాలు పరిశీలించి క్లియరెన్స్ ఇస్తాయి. అదే రీతిలో టీడీపీ నేతలు ముందుగా ఇచ్చిన దరఖాస్తు మేరకు పుంగనూరు బైపాస్ నుంచి యాత్రకు అనుమతినిచ్చారు. ఆ విషయాన్ని ఎన్ఎస్‌జీ కార్యాలయానికి కూడా తెలిపారు. కానీ చివరి నిముషంలో ఆ రూట్ కాకుండా పుంగనూరు పట్టణంలోకి వెళ్లాలని చంద్రబాబు ఎందుకు పట్టుబట్టారు? అదీ తనకు భద్రత విధుల్లో ఉండే ఎన్ఎస్‌జీ కమాండోలకు ఎలాంటి సమాచారం లేకుండా? ఎందుకంటే పుంగనూరులో అయితే యథేచ్ఛగా విధ్వంస కాండ సృష్టించవచ్చనేది కుతంత్రం. ఇవన్నీ పోలీసుల దర్యాప్తులో వెల్లడైన నిఖార్సైన నిజాలు. పోలీసులు సంయమనం పాటించి కాల్పులు జరపకపోవటం వల్లే పరిస్థితి చేయిదాటిపోకుండా ఉందన్నది ఎవ్వరూ కాదనలేని వాస్తవం. కానీ 'ఈనాడు'కు ఇవేవీ పట్టవు. ఎందుకంటే దానికి నిజాలతో పనిలేదు. బాబు కోసం పనిచేస్తే చాలు.

చంద్రబాబు టీడీపీ గుండాలను ఉసిగొల్పిన వీడియోలు వైరల్...

డీఎస్పీని ఉద్దేశించి 'ఆ బట్టలు తీసేయండయ్యా. అందరూ పెయిడ్ ఆర్టిస్టులే. గాడిదలు కాస్తున్నారా' అంటూ నోరుపారేసుకున్నారు చంద్రబాబు. తనను అడ్డుకుంటే ఇలాగే జరుగుతుందని హెచ్చరించారు


టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడి, నడవలేక జ్వరంతో మంచం పట్టిన ఎస్ఐ కరీమున్నీసా


పుంగనూరు వద్ద 4న టీడీపీ శ్రేణుల దాడితో కానిస్టేబుల్ రణధీర్ కంటి నుంచి కారుతున్న రక్తం

పోలీసులను రక్తమోడేలా కొట్టారు... ఒకరి కన్నుపోగొట్టారు

చంద్రబాబు ఆదేశాలతో టీడీపీ రౌడీ మూకలు అంగళ్లలో సృష్టించిన విధ్వంస కాండా అంతా ఇంతా కాదు. ఏకంగా ముందస్తు కుట్రతోనే తెచ్చుకున్న రాళ్లూ, కర్రలు, బీర్ సీసాలతో పోలీసులపై మూకుమ్మడి


పుంగనూరు వద్ద ఈ నెల 4న పోలీసు వాహనానికి నిప్పపెడుతున్న టీడీపీ శ్రేణులు

ఓర్వలేకే అనారోగ్యపు రాతలు!

విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

- వైద్యారోగ్య రంగంలో రాష్ట్రప్రభుత్వం దాదాపు 50వేల పోస్టులను భర్తీ చేసింది.
- నాడు – నేడు ద్వారా సుమారు రూ. 16,800 కోట్లు ఖర్చు చేస్తోంది. పీహెచ్సీలు, సీహెచ్సీలు, ఏరియా ఆస్పత్రులు, వైద్యకళాశాలల్లో సమూల మార్పులు తీసుకువచ్చింది.
- కొత్తగా 17 మెడికల్ కాలేజీలు, అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు, మూడు క్యాన్సర్, ఒక కిడ్నీ ఆస్పత్రి, ఐటీడీఏ పరిధిలో 5 మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రులు నిర్మిస్తోంది.
- ప్రతి సచివాలయంలో విలేజ్ అర్బన్ క్లినిక్ ను పెట్టింది.
- మంచి ప్రమాణాలున్న మందులనే అందిస్తోంది.
- 2019 నాటికి ఆరోగ్యశ్రీలో చికిత్సలు వేయి ఉంటే వాటిని 3,255కి పెంచింది.
- చికిత్స తర్వాత రోగి కోలుకునేంత వరకూ అండగా నిలుస్తూ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా అందిస్తోంది.

ప్రజారోగ్యం మెరుగవుతుంటే కడుపుమంట ఎందుకు?

- దేశంలో ఏపీ 108 సౌండ్‌పై చర్చిస్తుంటే భయమేస్తోందా?
- ఇపుడు ప్రతి మండలంలోనూ అందుబాటులో అంబులెన్సు
- కొత్త అంబులెన్సులు, మెరుగైన నిర్వహణ, గతంకన్నా తగ్గిన సమయం
- గతంతో పోలిస్తే తగ్గిన నవజాత శిశు మరణాలు
- దేశంలో అన్ని రాష్ట్రాలకన్నా ఏపీలోనే మెరుగైన సేవలు
- ఏడాదికి 108, 104 నిర్వహణ కోసం రూ.334.72 కోట్ల ఖర్చు
- పెరిగిన తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు.. పాత 'ఓమ్ని'ల స్థానంలో కొత్త ఏసీ వాహనాలు
- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పేదల ఇంటికే వైద్య సహాయం
- ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి సీఎం జగన్ బాటలు



దేశంలో అగ్రస్థానంలో ఏపీ

25 కోట్లకుపైగా జనం ఉన్న ఉత్తరప్రదేశ్‌లో 988 అంబులెన్సులు సేవలందిస్తుండగా అంతకంటే ఐదు రెట్లు తక్కువ జనాభా కలిగిన ఏపీలో 768 అంబులెన్సులు సేవల్లో ఉన్నాయి. ఏపీ కంటే పెద్ద రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, గుజరాత్‌లో చాలా తక్కువ సంఖ్యలో అంబులెన్సులు ఉండటం గమనార్హం. ఏపీలో సగటున 64,306 మందికి ఒక అంబులెన్సు ఉంది. తెలంగాణలో 75, 524 మందికి, కర్ణాటకలో 85,929 మందికి, యూపీలో 2,00,200 మందికి, గుజరాత్‌లో 1,15,000 మందికి, అస్సాంలో 1,15,000 మందికి తమిళనాడులో 1,18,000 మందికి ఒక అంబులెన్సు మాత్రమే ఉండటం గమనార్హం.

సాక్షి, అమరావతి: పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందని సామెత. అలాంటి పరిస్థితే ఈనాడు అధిపతి రామోజీరావుకు దాపురించింది. ఒకప్పుడు అస్తవ్యస్తంగా ఉన్న ప్రజారోగ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో కుదుటపడుతుంటే.. ఈ కామెర్ల రోగి కంటి సొకులు వెతుకుతున్నారు. దేశ వ్యాప్తంగా ఏపీ 108 సౌండ్ గురించి చర్చిస్తుంటే.. రాజగురువుకు భయమేస్తున్నట్లుంది. అందుకే 'వైద్య సేవల మెరుగు ఉత్తదే' అంటూ ఉత్తుత్తి కథనం అచ్చేశారు. రాష్ట్రంలో 108 వాహనాలు 768 ఉన్నాయి. మొబైల్ క్లినిక్స్ 104లు 936, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కింద 500 వాహనాలు సేవలందిస్తున్నాయి. మొత్తం 2,204 వాహనాల ద్వారా ప్రజల ప్రాణాలను అత్యంత వేగంగా కాపాడే వ్యవస్థ దేశంలో మరెక్కడా లేదు. ఇదే రామోజీ కడుపుమంటకు అసలు కారణం.

ఇప్పుడు మండలానికి ఒక అంబులెన్సు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చే నాటికి 108 అంబులెన్సుల సంఖ్య 531. అవి కూడా నిర్వహణ సక్రమంగా లేక మూలనపడి మూలుగుతున్నాయి. 336 వాహనాలు అరకొరగా రోడ్లపై కనిపించేవి. అంటే అప్పట్లో 679 మండలాలు (ప్రస్తుతం 686) ఉంటే మండలానికి ఒక అంబులెన్స్ కూడా లేని దుస్థితి. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం జగన్ 2020 జూలై1న 412 కొత్త 108 అంబులెన్సులను ప్రారంభించారు. 26 నియోనాటల్ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఒక్కసారిగా ప్రభుత్వ అంబులెన్సుల సంఖ్య 748కు పెరిగింది. ఇందు కోసం మొత్తం రూ.96.5 కోట్లు ఖర్చు చేశారు. కరోనా సమయంలో ఈ వాహనాలు ప్రజల ప్రాణాలు కాపాడాయి. 2022 అక్టోబర్‌లో అదనంగా మరో 20 108 అంబులెన్సులను గిరిజన ప్రాంతాల్లో చేర్చారు. వీటి కోసం రూ.4.76 కోట్లు వెచ్చించారు. ఇప్పుడు 108 అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది. 2.5 లక్షల కిలో మీటర్లకుపైగా తిరిగిన పాత వాహనాలను తొలగించి వాటి స్థానంలో 146 కొత్త అంబులెన్సులను ప్రభుత్వం ఈ ఏడాది కొనుగోలు చేసింది. దీని కోసం రూ.34.79 కోట్లు ఖర్చు చేసింది. ప్రతి నెలా 108 అంబులెన్సుల నిర్వహణ కోసం రూ.14.39 కోట్లు వెచ్చిస్తోంది. అంటే ఏడాదికి రూ.172.68 కోట్లు కేవలం 108అంబులెన్సుల నిర్వహణ కోసం కేటాయిస్తోంది. వీటికి తోడు ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ కోసం ఏడాదికి రూ.15.88 కోట్లు ఖర్చు చేస్తోంది. కానీ కళ్లకు గంతలు, చెవుల్లో దూది పెట్టుకున్న రామోజీకి ఇవేవీ కనిపించడం లేదు. వినిపించడం లేదు.

108లు నాడు-నేడు..

గతంతో పోలిస్తే అంబులెన్సులు ప్రమాదం జరిగిన చోటుకు వచ్చే సమయం బాగా తగ్గింది. వీటికి తోడు ఇపుడు నియోనాటల్ అంబులెన్సులు పెట్టడంతో నవజాత శిశు మరణాల రేటు తగ్గింది. అప్పట్లో 86 అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్సులు ఉంటే వాటి సంఖ్య ఇప్పుడు 216కు పెరిగింది. గతంలో కొన్ని కేసులకు మాత్రమే ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ (ఈఆర్సీ) సూచించేవారు. ఇప్పుడు ప్రత్యేక ఫిజీషియన్ ద్వారా ఈఆర్సీ కేసులు అన్నింటినీ పర్యవేక్షిస్తున్నారు. అన్ని అంబులెన్స్‌లలోనూ అడ్వాన్స్‌డ్ వెహికల్ లొకేషన్ సిస్టమ్స్‌ను పెట్టారు. గతంలో మొబైల్ డేటా టెర్మినల్ లేదు. ఇప్పుడు అన్ని అంబులెన్స్‌ల్లో అమర్చారు. సగటున 108 అంబులెన్సులు రోజుకు 3,809 కేసుల్లో సేవలందిస్తున్నాయి. 2020 జూలై నుంచి 2023 జూన్ వరకు 33,35,670 మందికి అత్యవసర సేవలు అందించాయి. పట్టణ ప్రాంతాల్లో అంబులెన్సుకు ఫోన్ చేస్తే చేరే నిర్దేశిత సమయం 15 నిమిషాలుగా ఉంది. ఈ జూలై నాటికి అది 14.17 నిమిషాలకు తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో 20 నిమిషాలు నిర్దేశిత సమయం కాగా ఇపుడు 17 నిమిషాల్లోనే చేరుకుంటున్నాయి. గిరిజన ప్రాంతాల్లో గతంలో 30 నిమిషాలుగా ఉంటే ఇపుడు అది 17–23 నిమిషాలకు తగ్గింది.

తల్లీబిడ్డలు క్షేమంగా!

గతంలో కేవలం 279 తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు ఉంటే.. ఈ ప్రభుత్వం వచ్చాక వాటి సంఖ్య 500కు పెరిగింది. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పేరిట గతంలో ఓమ్ని వాహనాలను వినియోగించేవారు. ఒకే వాహనంలో ఒకరికంటే ఎక్కువమంది గర్భిణులను తరలించేవారు. ఏసీ సదుపాయం ఉండేది కాదు. ఈ ప్రభుత్వం విశాలమైన ఎకో మోడల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఒక వాహనంలో ఒక గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్నారు. 2022 ఏప్రిల్ నెల నుండి ఈ ఏడాది జూన్ చివరి నాటికి ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలలో మొత్తం 3,47,245 ప్రసవాలు జరగగా, అందులో 2,89,307 మంది బాలింతలను (83.3శాతం) ప్రసవానంతరం సురక్షితంగా వారి ఇళ్లకు తరలించారు. ఇందుకు ఒక్కో మహిళకు రూ.895 చొప్పున మొత్తం రూ.24,32,35,045లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

మారిన 104ల స్వరూపం

ప్రస్తుత ప్రభుత్వంలో 104 సర్వీసులు పూర్తిగా మార్పులు చేశారు. జూలై 2020లో 656 వాహనాలను (104లను) సీఎం జగన్ ప్రారంభించారు. తర్వాత మరో 20 వాహనాలను గిరిజన ప్రాంతాల్లో సేవలకోసం కొనుగోలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,032 వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేయడానికి వీలుగా అదనంగా 260 వాహనాలను (104లను) ప్రవేశపెట్టారు. మొత్తంగా 910 మొబైల్ క్లినిక్ యూనిట్లు నడుస్తున్నాయి. వీటి ద్వారా జూలై 2022 నుంచి మే 2023 వరకూ 2,84,81,484 మంది రోగులు సేవలందుకున్నారు. ప్రతి రోజూ ఒక వాహనం ద్వారా గత ఏడాది 42 మంది సగటున సేవలు అందుకుంటే.. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వల్ల ఆ సంఖ్య 75 మందికి పెరిగింది. ప్రభుత్వ వైద్యులు 15,50,783 కుటుంబాల దగ్గరకు వెళ్లి ఈ మొబైల్ యూనిట్ల ద్వారా సేవలందించారు. 12,39, 984 మంది గిరిజనులు ఈ మొబైల్ క్లినిక్స్ ద్వారా ఆరోగ్య సేవలు అందుకున్నారు. ఏడాదికి 108, 104 నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.334.72 కోట్లు వెచ్చిస్తోంది.

దేశాభివృద్ధిలో యువతదే కీలకపాత్ర

- భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారాధికారి నాగసాయి సూరి



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని తులసి

కేవీబీపురం (తిరుపతి జిల్లా): భారతదేశ అభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారాధికారి నాగసాయి సూరి పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో మేరా మాటి, మేరా దేశ్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో మొదటిసారిగా తిరుపతి జిల్లా కేవీబీపురం మండలంలోని రాగిగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన ప్రారంభించారు. రాగిగుంట కూడలిలో త్రివర్ణ పతాకంతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. రాష్ట్ర హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని మాతృదేశం పట్ల కృతజ్ఞతాభావాన్ని కలిగి ఉండాలన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సాధించే దిశగా ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని 'నాభూమి – నా దేశం' కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం తరపున ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ద్వారా విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కేవీబీపురం ఎస్‌ఐ సునీల్, ఎంఈవో లక్ష్మీపతి, ఎంపీడీవో రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన రెండో విడత కౌన్సెలింగ్

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో సీట్ల భర్తీకి 2 రోజుల పాటు నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. రెండో రోజు కౌన్సెలింగ్‌లో నూజివీడు ట్రిపుల్ ఐటీలో 11 మంది, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో 215 మంది, శ్రీకాకుళంలో ఐదుగురు, ఇడుపులపాయలో 50 మంది కలిపి మొత్తం 281 మంది ప్రవేశాలు పొందారు. కౌన్సెలింగ్ ప్రక్రియను నూజివీడు డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు పరిశీలించగా, అడ్మిషన్ల కన్వీనర్ గోపాలరాజు పర్యవేక్షించారు. 2 రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 4 ట్రిపుల్ ఐటీల్లో కలిపి 765 సీట్లకు గాను 531 సీట్లు భర్తీ అయ్యాయి. మిగిలిన 298 సీట్లకు త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

అభూతకల్పనతో ఈనాడు ఒప్పందం

వర్సిటీల్లో బోధన పోస్టుల భర్తీని జీర్ణించుకోలేని రామోజీ

- ఒప్పంద ఉద్యోగులకు ఎసరంటూ అసత్య రాతలు
- ఎక్కువ మంది సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ప్రోగ్రామ్‌ల్లో ఒప్పంద అధ్యాపకులుగా విధులు
- ప్రభుత్వం భర్తీ చేసే పోస్టులన్నీ రెగ్యులర్‌లోనే..
- ఒప్పంద అధ్యాపకులకు వెయిటేజీతో భరోసా ఇచ్చిన ప్రభుత్వం


ఒప్పంద అధ్యాపకుల
ఉద్యోగాలకు జగన్ ఎసరు!

సాక్షి, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనతో ఈనాడుకు గొంతులో వెలక్కాయ పడ్డట్టు అయింది. వర్సిటీల్లో బోధన పోస్టుల నియామకాల అంశం కోర్టులో ఉన్నంత కాలం ఒక్క పోస్టు కూడా ప్రభుత్వం భర్తీ చేయట్లేదని మొసలి కన్నీరు కార్చిన రామోజీ.. ఇప్పుడు ఒప్పంద ఉద్యోగులకు భద్రత లేదంటూ కొత్త పల్లవి అందుకున్నారు. అభూత కల్పనలు, అవాస్తవాలతో ఒప్పందం చేసుకుని విషపూరిత రాతలతో ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. ఇందులో భాగంగానే 'ఒప్పంద అధ్యాపకుల ఉద్యోగాలకు జగన్ ఎసరు' అంటూ అసత్య కథనాన్ని అచ్చేశారు. దీనిని ఉన్నత విద్యామండలి గురువారం ఓ ప్రకటనలో ఖండించింది.

3,295 పోస్టుల భర్తీ

ప్రభుత్వం ఉన్నత విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. చంద్రబాబు హయాంలో చేసిన తప్పులను సరిదిద్దుతూ బోధన సిబ్బంది నియామకాలు చేపడుతోంది. వర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో 3,295 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిని జీర్ణించుకోలేని రామోజీరావు ఒప్పంద ఉద్యోగులకు భద్రత కరువైందంటూ ఊహాజనిత వార్తను అచ్చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో 20 వర్సిటీల్లో దాదాపు 3,046 మంది ఒప్పంద అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరిలో అత్యధిక శాతం సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ప్రోగ్రామ్‌లలో ఉన్నారు. వర్సిటీల్లో కొత్తగా చేపడుతున్న అధ్యాపక నియామకాలన్నీ రెగ్యులర్ పోస్టుల్లోనివే. అందువల్ల సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ ప్రోగ్రామ్‌లలో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులకు ఎటువంటి ఇబ్బందీ లేదు.

వెయిటేజీతో భరోసా

వర్సిటీల్లో పోస్టుల భర్తీలోనూ ఒప్పంద అధ్యాపకులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెయిటేజీ రూపంలో భరోసా కల్పించారు. దీనిపై త్వరలో ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఈ వెయిటేజీతో చాలా మంది ఒప్పంద అధ్యాపకులు రెగ్యులర్‌గా మారతారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గతంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసింది. అయితే వర్సిటీల్లో ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కొన్ని ప్రతిబంధకాలు ఉన్నాయి. చాలా వర్సిటీల్లో ఒప్పంద అధ్యాపకులను నియమించేటప్పుడు రిజర్వేషన్ విధానాన్ని అవలంబించలేదు. రోస్టర్ పద్ధతిని పాటించలేదు. ఏ వర్సిటీ కూడా యూజీసీ నిర్దేశించిన పద్ధతుల్లో ఒప్పంద అధ్యాపకులను నియమించలేదు. కొన్ని వర్సిటీల్లో ఎవరు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు పని చేస్తున్నారు, ఎవరు రెగ్యులర్ పోస్టులకు పని చేస్తున్నారో కూడా తెలియదు. ఆ వ్యత్యాసాన్ని పాటించలేదు. మరీ ముఖ్యంగా ఆర్థిక శాఖ ఆమోదాన్ని పొందలేదు. వీటన్నింటికీ తోడు కోర్టు ఉత్తర్వులు వీరిని రెగ్యులరైజ్ చేయడానికి ప్రతిబంధకాలుగా మారాయి. అంతేగానీ ఎవరికీ అన్యాయం చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదు. రాష్ట్రంలోని వర్సిటీల్లో పని చేస్తున్న పలువురు ఒప్పంద అధ్యాపకులు రెగ్యులర్ అవుతారు. మిగతా వారు ఇప్పుడున్నట్లుగానే కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతారు. ఎవరి ఉద్యోగాలకూ ఎటువంటి ఇబ్బందీ ఉండదు. పైగా కాంట్రాక్టు ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా వెయిటేజీని ప్రస్తావిస్తుంటే వారి ఉద్యోగాలు పోతాయంటూ ఈనాడు దుర్మార్గపు రాతలు రాయడం సిగ్గుచేటు.

నువ్వెవరు.. ఇక్కడ పెత్తనం మాది!

- గన్నవరం నియోజకవర్గ టీడీపీ నేతల మధ్య భగ్గుమన్న విభేదాలు
- నియోజకవర్గ పరిశీలకుడిపై స్థానిక నేతల తీవ్ర ఆగ్రహం
- కమ్మ, కాపు వర్గాలుగా విడిపోయి దాడులకు ప్రయత్నం



టీడీపీ కార్యాలయంలో నాయకుల మధ్య వాగ్వాదం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. చంద్రబాబు చేసిన ప్రయోగం వికటించి... కమ్మ, కాపు నేతలు రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దిగారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడి ఎదుటే ఒకరిపై మరొకరు కుర్చీలు విసురుకుని వీరంగం సృష్టించారు. హనుమాన్‌జంక్షన్‌లోని టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ నియోజకవర్గ సమన్వయ సమావేశం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు హాజరైన ఈ సమావేశం ప్రారంభంలోనే రసాభాసగా మారింది. నియోజకవర్గ పరిశీలకుడు హరిబాబు నాయుడుపై గన్నవరం మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఖర్చు మాది... మేం లోకల్.. నువ్వు నాన్‌లోకల్. మామీద నీ పెత్తనం ఏమిటీ. నాకు నేరుగా చంద్రబాబుతోనే సంబంధాలు ఉన్నాయి. నువ్వెంత. ఇక్కడ మాదే పెత్తనం ...' అంటూ జాస్తి ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. హరిబాబు నాయుడుపై జాస్తి వెంకటేశ్వరరావుతోపాటు మరికొందరు నాయకులు దాడి చేసేందుకు దూసుకెళ్లారు. దీంతో హరిబాబు నాయుడు సైతం తీవ్రంగా స్పందించడంతో సమావేశంలో పాల్గొన్న నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. కమ్మ, కాపు నేతలు రెండు వైపులకు చేరి ఒకరిపై మరొకరు కుర్చీలు విసురుకున్నారు. హరిబాబు నాయుడుకు వ్యతిరేకంగా ఉంగుటూరు మండల టీడీపీ అధ్యక్షుడిని సైతం స్థానిక నేతలు రెచ్చగొట్టారు. దీంతో గొడవ తారాస్థాయికి చేరింది. ఈ సమయంలో కొనకళ్ల నారాయణరావు జోక్యం చేసుకుని సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఇరువర్గాలు వినకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు.

వికటించిన చంద్రబాబు ప్రయోగం...

టీడీపీ గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడిగా గుంటూరు జిల్లాకు చెందిన కాపు నేత వద్రాం హరిబాబు నాయుడును ఆ పార్టీ అధినేత చంద్రబాబు నియమించాడు. నియోజకవర్గంలోని కాపులను సమన్వయం చేస్తారనే ఉద్దేశంతో ఆయనకు పరిశీలకుడి బాధ్యతలు అప్పగించారు. అయితే, హరిబాబు నియామకం తొలి నుంచి ఇక్కడ కొందరు నాయకులకు నచ్చలేదు. ముఖ్యంగా మాజీ మంత్రి దేవినేని ఉమా అనుచరులుగా ఉంటూ మట్టిదోపిడీ, సెటిల్‌మెంట్లు చేసినవారికి హరిబాబు నియామకం మింగుడు పడలేదు. దీంతో ఆధిపత్యం కోసం పోరు జరుగుతూనే ఉంది. ఇటీవల నిర్వహించిన 'భవిష్యత్‌కు గ్యారెంటీ' బస్సుయాత్రలో హరిబాబు నాయుడు యాక్టివ్‌గా వ్యవహరించడాన్ని స్థానిక నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలోనే పథకం ప్రకారమే గురువారం జాస్తి వెంకటేశ్వరరావు గొడవకు దిగడంతోపాటు ఆ తర్వాత ఉంగుటూరు మండల అధ్యక్షుడు కూడా నిరసన తెలియజేసినట్లు తెలుస్తోంది. మరోవైపు టీడీపీలో కొందరు నేతల ఆధిపత్య, అహంకారపూరిత ధోరణి వల్లే ఈ గొడవ జరిగిందని, వీరి వైఖరి వల్ల అన్ని సామాజికవర్గాలు పార్టీకి దూరమవుతున్నాయని కార్యకర్తలు బహిరంగంగానే వ్యాఖ్యానించడం గమనార్హం.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- హిందూ ధార్మికతను ప్రపంచవ్యాప్తం చేస్తాం
- సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తాం
- టీటీడీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారోత్సవంలో భూమన కరుణాకరరెడ్డి



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఈఓ ధర్మారెడ్డి

సాక్షి, తిరుపతి/తిరుమల: సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం చేయించడానికే ప్రాధాన్యత ఇస్తానని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. ఆయన టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి.. భూమన కరుణాకరరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అన్నమయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కరుణాకరరెడ్డి మాట్లాడుతూ స్వామి సేవకులకు సేవకుడిగా పనిచేస్తానన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి దయ, ఆశీస్సులతో తనకు రెండోసారి టీటీడీ చైర్మన్‌గా సేవచేసే మహద్భాగ్యం దక్కిందన్నారు. ఇంతటి అదృష్టం ఇచ్చిన స్వామికి, మరోసారి పనిచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సనాతన హిందూధర్మాన్ని విశ్వవ్యాప్తంగా ప్రచారం చేయడంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేలా తమ ధర్మకర్తల మండలి పనిచేస్తుందని చెప్పారు. స్వామి వైభవాన్ని ప్రజల హృదయాల్లో తీర్చిదిద్దేలా వారిలో ఆధ్యాత్మిక వెలుగులు నింపుతామని, స్వామిని భక్తుల దగ్గరికే తీసుకెళ్లి భక్తిప్రసాదం పంచుతామని తెలిపారు. దేశవిదేశాల్లోని హిందువులందరినీ ఏకతాటిపైకి తెచ్చి హిందూధర్మాన్ని ప్రచారం చేసేలా టీటీడీ నాయకత్వం వహిస్తుందని చెప్పారు. తాను 2006 నుంచి 2008 వరకు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా పనిచేసినప్పుడు సనాతన హిందూధర్మాన్ని దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేశామని, సామాన్య భక్తులకు అవసరమైన వసతులు కల్పించటమేగాక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ద్వారా ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇచ్చామన్నారు. ఇప్పుడు కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఉద్యోగులకు ఇంటిస్థలాలు ఇప్పిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు ఆర్.కె.రోజా, అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీకి మేనేజ్‌మెంట్ బోర్డ్ నియామకం

- 15 మందిని నామినేట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బోర్డ్‌లో 15 మంది సభ్యులను నామినేట్ చేస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త కేటగిరీలో డి.కోదండరామిరెడ్డి (నెల్లూరు), అకడమిక్ కౌన్సిల్ సభ్యులుగా స్కూల్ ఆఫ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ (తిరుపతి) డైరెక్టర్ డాక్టర్ పీవీ సత్యగోపాల్, కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్(గుంటూరు) అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ చైతన్యకుమారి, నైరా అగ్రికాలేజ్ (శ్రీకాకుళం) ప్రొఫెసర్ డాక్టర్ పి.గురుమూర్తిలను నియమించారు. చట్టసభల నుంచి అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, కనిగిరి, బద్వేల్, పత్తికొండ ఎమ్మెల్యేలు బుర్రా మధుసూదన్ యాదవ్, దాసరి సుధ, కె.శ్రీదేవి, ఆదర్శ రైతుల కేటగిరీలో డొక్కా కోటేశ్వరరావు (విజయవాడ), డేగల సాయిలక్ష్మి (రంగరాయపురం, విజయనగరం జిల్లా), ఎం.మల్లిఖార్జునరెడ్డి, చింతా ఈశ్వరరావు(పెద్దకోటూరు, కాకినాడ జిల్లా)తోపాటు వ్యవసాయ పరిశ్రమలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి బి.మురళీధర్‌రెడ్డి (అనంతపురం) బి.శ్రీనివాసులరెడ్డి (అన్నమయ్య), పంచాయతీరాజ్ విభాగం నుంచి స్టేట్ చాంబర్ స్పెషల్ ఆఫీసర్‌ను నియమించారు. వీరితోపాటు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఎన్జీ రంగా యూనివర్సిటీ వీసీ, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల డైరెక్టర్లు, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శులను నియమించారు.

జాతీయం / అంతర్జాతీయం

సీఈసీ నియామకంలో సీజేఐకు అధికారం లేనట్టే

- నియామక కమిటీలో సీజేఐకి బదులుగా కేబినెట్ మంత్రికి స్థానం
- రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రం



ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ మధ్య కొలీజియంపై విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో మరో వివాదాస్పద బిల్లును మోదీ సర్కార్ గురువారం రాజ్యసభలో ప్రవేశ పెట్టింది. కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించింది. ఆయన స్థానంలో కేబినెట్ మంత్రికి స్థానం కల్పించింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఎన్నికల సంఘంపై కేంద్ర ప్రభుత్వానికి మరిన్ని అధికారాలు లభిస్తాయి. కేంద్రం ప్రభుత్వం కొత్త చట్టం తీసుకు వచ్చే వరకు ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య కమిటీ సీఈసీ, ఇతర కమిషనర్ల నియామకాలు చేపడుతుందని గత మార్చిలో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సీజేఐను తప్పించి కేబినెట్ మంత్రిని చేర్చడం వివాదానికి దారితీసింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ రాజ్యసభలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్స్ (అపాయింట్‌మెంట్ కండిషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీసు) బిల్లు, 2023ను ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో ప్రధానమంత్రి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ప్రధాని నామినేట్ చేసిన కేబినెట్ మంత్రి సభ్యులుగా ఉంటారు. ఆ కమిటీయే సీఈసీ, ఈసీలను ఎంపిక చేస్తుంది. కాంగ్రెస్, ఆప్ ఇతర విపక్ష పార్టీ సభ్యుల ఆందోళనల మధ్య ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

సుప్రీం తీర్పుని లెక్క చేయరా ?

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఉత్తర్వుల్ని నీరు కార్చేలా ఈ బిల్లు ఉందని విపక్షాలు విమర్శించాయి. కమిటీ నుంచి సీజేఐని తప్పించడం అత్యంత ప్రమాదకరమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికలపై ఇది ప్రభావం చూపిస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పులేవైనా బీజేపీకి నచ్చకపోతే వాటిని లెక్క చేయదని ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘం మొత్తాన్ని ప్రధాని మోదీ తన గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ ఆరోపించారు. కమిటీలో ఇద్దరు బీజేపీకి చెందినవారే ఉంటే నిష్పాక్షికంగా కమిషనర్ల ఎంపిక ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు.

వచ్చే ఏడాది ఈసీలో ఖాళీ

కేంద్ర ఎన్నికల కమిషన్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఖాళీ ఏర్పడనుంది. ఎన్నికల కమిషనర్ అనూప్ చంద్ర పాండేకి 65 ఏళ్లు నిండనుండడంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న పదవీ విరమణ చేస్తారు. 2024 లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్ది రోజుల ముందే ఆయన పదవీ విరమణ చేస్తారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించాలి. తాము చెప్పినట్టు వినే కమిషనర్‌ను నియమించుకొని ఎన్నికల కమిషన్‌ను తన గుప్పిట్లో పెట్టుకోవడానికే కేంద్రం ఇదంతా చేస్తోందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. సుప్రీంకోర్టు ఉత్తర్వుల కంటే ముందు కేంద్ర ప్రభుత్వం సిఫార్సుల మేరకు రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లను నియమించే వారు.

రాజ్యసభలో తీవ్ర రగడ

- మణిపూర్‌పై 176 నిబంధన కింద చర్చ కోసం విపక్షాల పట్టు
- చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల బిల్లుపై అభ్యంతరం

న్యూఢిల్లీ: మణిపూర్ అంశంతోపాటు వివాదాస్పద ముఖ్య ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల బిల్లుపై విపక్ష సభ్యులు ఆందోళన, నినాదాలతో గురువారం రాజ్యసభ అట్టుడికింది. మణిపూర్ హింసపై 267 నిబంధన కింద సభలో చర్చ చేపట్టాలని ఇన్నాళ్లూ పట్టుబట్టిన విపక్షాలు కొంత దిగొచ్చాయి. 176 నిబంధన కింద చర్చ ప్రారంభించాలని, ప్రధాని మోదీ సభకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి.

ప్రధానమంత్రి ఏమైనా దేవుడా?

రాజ్యసభ గురువారం ఉదయం ప్రారంభం కాగానే మణిపూర్ వ్యవహారంపై 176 నిబంధన కింద చర్చ కోసం విపక్ష సభ్యులు పట్టుబట్టారు. వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. ప్రధాని మోదీని సభకు రప్పించాలని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున ఖర్గే కోరారు. దీనిపై అభ్యంతరం తెలిపిన అధికార బీజేపీ ఎంపీలపై ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రధానమంత్రి ఎందుకు రాకూడదు? ఆయన ఏమైనా దేవుడా?' అని ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో సభను చైర్మన్ ధన్‌ఖడ్ మధ్యాహ్నం 2 గంటల దాకా వాయిదా వేశారు. అనంతరం వివిధ పార్టీల సభాపక్ష నేతలతో ఆయన సమావేశమయ్యారు. సభకు సహకరించాలని కోరారు. సభ పునఃప్రారంభమైన తర్వాత కూడా విపక్షాల ఆందోళన ఆగలేదు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సభ్యుడు డెరెక్ ఓబ్రెయిన్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. రాజ్యసభ కార్యకలాపాలకు కేంద్ర ప్రభుత్వమే అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. ఓబ్రెయిన్ తీరును కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తప్పుపట్టారు. అనంతరం మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. అధికార పక్షం వల్లే సభ సజావుగా సాగడం లేదని మండిపడ్డారు. బీజేపీ ఎంపీల వ్యవహార శైలిని ఆక్షేపిస్తూ ఓ కవిత వినిపించారు. ఖర్గే తీరు గురువింద గింజలా ఉందని పీయూష్ గోయల్ ఎద్దేవా చేశారు. ఖర్గే వ్యాఖ్యలను పలువురు బీజేపీ సభ్యులు ఖండించారు. మిజోరాం ఎంపీ ఒకరు మాట్లాడబోతుండగా చైర్మన్ ధన్‌ఖడ్ అనుమతించలేదు. పార్లమెంట్ సభ్యులకు దేశంలో ఏదో ఒక ప్రాంతం ముఖ్యం కాదని, దేశమంతా సమానమేనని ధన్‌ఖడ్ అన్నారు.

ఫార్మసీ(సవరణ) బిల్లుకు ఆమోదం

వివాదాస్పద 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్, అదర్ ఎలక్షన్ కమిషనర్స్(అపాయింట్‌మెంట్ కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ టర్మ్ ఆఫ్ ఆఫీస్) బిల్లు–2023ను కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పట్ల ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం విపక్షాల ఆందోళన మధ్యే కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ 'పోస్ట్ ఆఫీస్ బిల్లు–2023'ను ప్రవేశపెట్టారు. ఈ తర్వాత కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి మన్‌సుఖ్ మాండవీయా ప్రవేశపెట్టిన 'ఫార్మసీ(సవరణ) బిల్లు–2023' సభలో ఆమోదం పొందింది. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ధన్‌ఖడ్ ప్రకటించారు.

పూర్తి నిరాయుధీకరణ.. ఎన్నార్సీ అమలు

మణిపూర్‌లో శాంతికి ఇవే ప్రధానమంటూ ప్రధాని మోదీకి ఎమ్మెల్యేల వినతి

ఇంఫాల్: మణిపూర్‌లో ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే పూర్తి స్థాయి నిరాయుధీకరణ అవసరం ఎంతో ఉందని ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలు ప్రధాని మోదీకి సూచించారు. ఈ మేరకు మణిపూర్‌కు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు బుధవారం ప్రధాని మోదీకి ఒక వినతి పత్రం అందజేశారు. వీరిలో ఎక్కువ మంది మెయితీలు. కుకీల సమస్యకు రాజకీయ పరిష్కారం కనుగొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కుకీ మిలిటెంట్లతో 2008లో కుదుర్చుకున్న సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్(ఎస్‌ఓఎస్)నుంచి బయటకు రావాలని కోరారు. కుకీ మిలిటెంట్ గ్రూపులు ఒప్పందానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో హింసను నిలువరించేందుకు సాయుధ బలగాల మోహరింపు అవసరమే అయినప్పటికీ శాంతి భద్రతల స్థాపనకు అదొక్కటే సరిపోదన్నారు. రాష్ట్రంలో పూర్తి స్థాయి నిరాయుధీకరణతోనే శాంతి నెలకొంటుందని చెప్పారు. 'మిలిటెంట్ గ్రూపులు, విదేశీ సాయుధ బలగాల వద్ద ఉన్న ఆయుధాలను, ప్రభుత్వ బలగాల నుంచి ఎత్తుకుపోయిన ఆయుధాలన్నిటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి' అని ఎమ్మెల్యేలు ఆ వినతి పత్రంలో కోరారు. అదేవిధంగా, రాష్ట్రంలో జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ)ని అమలు చేయాలని, అటానమస్ జిల్లా కౌన్సిళ్లను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఛాయా చిత్రాలు తీసిన ల్యాండర్‌లోని కెమెరా



ల్యాండర్ పంపిన భూమి ఛాయాచిత్రం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్‌–3 మిషన్ చంద్రుడికి మరింత చేరువయ్యే సమయంలో ల్యాండర్ మాడ్యూల్‌లో అమర్చిన ''ల్యాండర్ హారిజెంటల్ వెలాసిటీ కెమెరా''(ఎల్‌హెచ్‌వీసీ) రెండు ఛాయా చిత్రాలను తీసి పంపింది. వాటిని ఇస్రో తన వెబ్‌సైట్‌లో అధికారికంగా విడుదల చేసింది. ఈనెల 6న ఎల్‌హెచ్‌వీసీ ఇన్‌స్ట్రుమెంట్ చంద్రుడ్ని తీసిన వీడియోను విడుదల చేసిన విషయం తెలిసిందే. తాజాగా లూనార్ కక్ష్యలో నుంచి చంద్రుడ్ని వీడియోతో పాటు ఛాయా చిత్రాలు తీయడం విశేషం. ప్రయోగం రోజున అంటే గత నెల 14న ''ల్యాండర్ ఇమేజర్ కెమెరా''భూమిని తీసిన ఛాయాచిత్రాలను కూడా గురువారం విడుదల చేసింది. చంద్రయాన్‌–1, చంద్రయాన్‌–2 ప్రయోగాల కంటే చంద్రయాన్‌–3 మిషన్‌లో అత్యంత హై రిజల్యూషన్ కెమెరాలను అమర్చినట్టుగా తెలుస్తోంది. ఈ రెండు చాయా చిత్రాలతో పాటుగా 14 సెకన్లపాటు తీసిన వీడియో కూడా ఎంతో స్పష్టతతో కూడి ఉండడం విశేషం. మరో 13 రోజుల్లో చంద్రయాన్‌–3 మిషన్ చంద్రుడి ఉపరితలంపై దిగడంతో ప్రయాణం పూర్తవుతుంది.

యుద్ధానికి సిద్ధంకండి

ఉత్తర కొరియా మిలటరీకి కిమ్ పిలుపు



సియోల్ : ఉత్తర కొరి యా సమరశంఖాన్ని పూరించింది. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ యుద్ధానికి సిద్ధంగా ఉండాలంటూ సైన్యాన్ని అప్రమత్తం చేసినట్టుగా దేశ అధికారిక మీడియా కేసీఎన్‌ఏ వెల్లడించింది. యుద్ధ సన్నాహాల్లో భాగంగా అత్యున్నత స్థాయి మిలటరీ జనరల్‌ను మార్చారు. ఆయుధాల ఉత్పత్తిని పెంచాలని సైనిక సన్నాహాలు మరింత వేగవంతం చేయాలని కిమ్ ఆదేశాలు జారీ చేశారు. అమెరికా, దక్షిణ కొరియా కలిసి ఈ నెల 21 నుంచి 24 మధ్య సంయుక్తంగా మిలటరీ విన్యాసాలు చేపట్టనున్న నేపథ్యంలో కిమ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం మిలటరీ జనరల్‌గా ఉన్న పాక్ సూ ఇల్ స్థానంలో జనరల్ రియాంగ్ గిల్‌ను నియమిస్తున్నట్టుగా ప్రకటించారు. గతవారంలోనే కిమ్ ఆయుధ ఫ్యాక్టరీని సందర్శించి మరిన్ని క్షిపణులు, శతఘ్నులు, ఇతర ఆయుధాలను తయారు చేయాలని ఆదేశించినట్టుగా తెలిసిందే.

మణిపూర్‌లో మరో గ్యాంగ్ రేప్ ఘటన..

ఇంఫాల్: తెగల వైరంతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో జరిగిన మరో సామూహిక అత్యాచారఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్కడ ఘర్షణలు మొదలైన మే 3వ తేదీ నాడే ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. చురాచాంద్‌పూర్ జిల్లాకు చెందిన బాధితురాలి(37) ఫిర్యాదు మేరకు ఆగస్టు 9వ తేదీన బిష్ణుపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కుకీ తెగకు చెందిన కొందరు మే 3న సాయంత్రం బాధితురాలు ఉంటున్న గ్రామంపై దాడి చేసి ఇళ్లకు నిప్పుపెట్టారు. వారి బారి నుంచి తప్పించుకునేందుకు బాధితురాలు పరుగులుతీసింది. ఆమెను కొందరు అడ్డగించి, గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడ్డారు. ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం చురాచాంద్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అస్సాం రైఫిల్స్‌ను కొనసాగించండి: కుకీలు

ఇంఫాల్: మణిపూర్‌లో అస్సాం రైఫిల్స్ బలగాలను కొనసాగించాలని రాష్ట్రానికి చెందిన కుకీ ఎమ్మెల్యేలు ప్రధానిని కోరారు. అన్ని పార్టీలకు చెందిన 10 మంది కుకీ ఎమ్మెల్యేలు ఈ మేరకు ప్రధాని మోదీకి లేఖ రాశారు. అస్సాం రైఫిల్స్‌ను ఉపసంహరిస్తే గిరిజనుల భద్రత ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

హవాయి ద్వీపంలో భారీ కార్చిచ్చు



ఓ వీధిలో కమ్ముకున్న మంటలు



హవాయిలోని ఓ విమానాశ్రయంలో భారీగా జనం

36 మంది సజీవదహనం

వైలుకు: అమెరికాలో హవాయి దీవుల్లో భీకరమైన కార్చిచ్చు వ్యాపించింది. ఈ మంటలు వేగంగా విస్తరిస్తూ శతాబ్దాల చరిత్ర ఉన్న మాయి పట్టణాన్ని కాల్చి బూడిద చేస్తున్నాయి. ఈ విపత్తులో 36 మంది సజీవదహనమయ్యారు. వేలాది మంది తట్టా బుట్టా సర్దుకొని దీవి వదిలి వెళ్లిపోతున్నారు. మాయి కౌంటీలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఎన్నో భవంతులు, వీధుల్లో పార్క్ చేసి ఉంచిన కార్లు కూడా కార్చిచ్చుకి దగ్ధమయ్యాయి. ఎటు చూసినా కార్చిచ్చు పొగలే వ్యాపిస్తూ పట్టపగలే చీకట్లు అలుముకున్నాయి. హరికేన్ కూడా కమ్ముకొని ఉండడంతో గాలులు బలంగా వీయడంతో మంటలు త్వరితగతిన వ్యాపిస్తున్నాయి. కౌంటీలు కార్చిచ్చు వ్యాపిస్తూ ఉండడంతో తమ ప్రాణాలు కాపాడుకోవడం కోసం కొందరు పిల్లలు, పెద్దలు సముద్రంలోకి దూకిన ఘటనలు కూడా జరిగాయి. కార్చిచ్చుల్లో మంటలు దాదాపుగా 271 భవనాలు ధ్వంసమయ్యాయి. ఇక చాలా మంది మంటల్లో చిక్కుకొని కాలిన గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. అమెరికాలో ఇటీవల కాలంలో ఈ స్థాయిలో కార్చిచ్చు రాజుకోవడం ఇదే తొలిసారి.

మంటల్ని అదుపులోకి తీసుకురావడానికి ప్రభుత్వం శక్తివంచన లేకుండా శ్రమిస్తోంది. పర్యాటకులెవరూ ఈ దీవికి రావొద్దని హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మాయి కౌంటీలో మంటల్ని అదుపు చేసి ప్రజల్ని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి సైన్యం అన్ని విధాలా సహకరిస్తుందని ఒక ప్రకటనలో వెల్లడించారు. తీర ప్రాంత రక్షక దళం, నావికాదళ సభ్యులు సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు.

అవిశ్వాసం.. శుభప్రదం

▶ మొదటి పేజీ తరువాయి

మీకు అండగా ఉన్నారంటూ మణిపూర్ మహిళలకు భరోసా కల్పించారు. అవిశ్వాసంపై జరిగిన చర్చలో టీడీపీ తరఫున ఎవరూ మాట్లాడలేదు. మోదీ ప్రసంగం అనంతరం సభలో అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో వీగిపోయింది. ప్రధాని ప్రసంగం ఆయన మాటల్లోనే...

2028లోనూ అవిశ్వాసం పెట్టండి

వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మేము మళ్లీ ఘన విజయం సాధించడం తథ్యం. రికార్డులను తిరగరాయడం ఖాయం. ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మాకు శుభప్రదమే. 2018లో మాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. 2019లో జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించాం. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చాం. ఆ అవిశ్వాస తీర్మానం మాకు శుభ సూచకమని నిర్ధారణ అయ్యింది. ఇప్పుడు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మాకు శుభప్రదమే. 2018లో మాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. 2019లో జరిగిన ఎన్నికల్లో అఖండ విజయం సాధించాం. వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చాం. ఆ అవిశ్వాస తీర్మానం మాకు శుభ సూచకమని నిర్ధారణ అయ్యింది. ఇప్పుడు ప్రవేశపెట్టిన అవిశ్వాసం కూడా మాకు శుభాలు చేకూర్చబోతోంది. వచ్చే ఎన్నికల్లో నెగ్గబోతున్నాం. ప్రజలకు కుంభకోణాల రహిత, అవినీతి రహిత పాలన అందిస్తున్నాం. వరుసగా మూడోసారి అధికారంలోకి వస్తాం. 2028లో కూడా మాపై మరో అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడితే మన దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం తథ్యం. మా ప్రభుత్వంపై దేశ ప్రజలు మళ్లీ మళ్లీ విశ్వాసాన్ని కనబరుస్తున్నారు. అందుకు వారికి కృతజ్ఞతలు. ఈ పేదల బిడ్డను ప్రజలు ఆశీర్వదిస్తారు.

నార్త్‌ఈస్ట్‌... జిగర్ కా తుక్డా

ఈశాన్య ప్రాంతం మన దేశం హృదయంలో ఒక భాగం(జిగర్ కా తుక్డా). మణిపూర్‌లో హింస జరగడం నిజంగా బాధాకరం. మణిపూర్‌లో శాంతియుత పరిస్థితుల పునరుద్ధరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయి. త్వరలోనే అక్కడ శాంతి నెలకొంటుంది. మహిళలపై అరాచకాలను ఎంతమాత్రం సహించబోం. మహిళలను అవమానించిన వారిని, అకృత్యాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తాం. మణిపూర్‌లో త్వరలోనే శాంతి నెలకొంటుందని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా. మణిపూర్ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు హామీ ఇస్తున్నా. దేశం మొత్తం మీకు అండగా ఉంది. పార్లమెంట్ మీకు అండగా ఉంది. మణిపూర్‌లో సమస్యలకు పరిష్కారాన్ని కచ్చితంగా కనుగొంటాం. మణిపూర్ త్వరలోనే మళ్లీ అభివృద్ధి పథంలో పయనిస్తుంది.

మహిళలపై నేరాలు క్షమార్హం కావు

మణిపూర్ హైకోర్టు నిర్ణయం తర్వాతే అక్కడ సమస్య మొదలైంది. చిన్నచిన్న సంఘటనలు ఉద్రిక్తతలకు దారితీశాయి. హింస చోటుచేసుకుంది. ఎన్నో కుటుంబాలను సమస్యలను ఎదుర్కొన్నాయి. చాలామంది తమ ఆప్తులను కోల్పోయారు. మహిళలపై అఘాయిత్యాలు జరిగాయి. మహిళలపై నేరాలు క్షమార్హం కావు. మణిపూర్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగడం ప్రతిపక్షాలకు ఎంతమాత్రం ఇష్టం లేదు. అందుకే నిత్యం ఉభయ సభల్లో ఉద్దేశపూర్వకంగా రగడ సృష్టిస్తున్నాయి. దేశ అభివృద్ధికి సంబంధించిన బిల్లులపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేతలు చర్చ జరగనివ్వడం లేదు. వారికి దేశం కంటే పార్టీయే ముఖ్యమని నిరూపిస్తున్నారు. ప్రజలు వంచిస్తున్నారు. కాంగ్రెస్‌కు ప్రభుత్వంపై విమర్శలపై ఉన్న శ్రద్ధ పార్లమెంట్‌లో ఆమోదం పొందాల్సిన కీలక బిల్లులపై లేదు. విపక్షాలు నోబాల్స్ వేస్తుంటే అధికార పక్షం సెంచరీలు కొడుతోంది. మణిపూర్ విషయంలో రాజకీయాలు చేయొద్దని విపక్షాలను కోరుతున్నా. ప్రజల బాధలను తగ్గించే ఔషధంగా పనిచేయండి.

మా అంకితభావానికి నిదర్శనం

ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. గత తొమ్మిదేళ్లలో ఈశాన్య రాష్ట్రాల్లో 50 పర్యాయాల కంటే ఎక్కువే పర్యటించా. మా మంత్రులు 400 కంటే ఎక్కువసార్లు అక్కడ పర్యటించారు. ఇవి కేవలం గణాంకాలు కాదు. ఈశాన్యంపై మా ప్రభుత్వానికున్న అంకితభావానికి ఇవొక నిదర్శనం. ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 1966 మార్చి 5న మిజోరాం ప్రజలపై వైమానిక దాడులకు పాల్పడింది. సొంత ప్రజలపై వైమానిక దాడుల చేసిన ఘటన దేశ చరిత్రలో ఇదొక్కటే. 1962లో భారత్‌-చైనా యుద్ధ సమయంలో ఈశాన్య ప్రాంతాల ప్రజలను అప్పటి నెహ్రూ ప్రభుత్వం గాలికొదిలేసింది. 1980వ దశకంలో పంజాబ్‌లో అకల్ తఖ్త్‌పై కాంగ్రెస్ సర్కారు సైనిక చర్యకు దిగింది. మణిపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తీవ్రవాదులు చెలరేగిపోయారు.



విపక్ష దుకాణం త్వరలో బంద్

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి అహంకారులైన వారసత్వ రాజకీయ నాయకులతో నిండిపోయింది. విద్వేషం, విభజన, అత్యవసర పరిస్థితి, సిక్కులపై దాడులు, అబద్ధాలు, అవినీతి, కుంభకోణాలు, రెండంకెల ద్రవ్యోల్బణం, అస్థిరత, బుజ్జగింపు రాజకీయాలు, వారసత్వ రాజకీయాలు, నిరుద్యోగం, ఉగ్రవాదం.. ఇవన్నీ ప్రతిపక్షాల ఘనతలే. ప్రతిపక్ష నాయకులు గనుక అధికారంలోకి వస్తే దేశాన్ని రెండు శతాబ్దాలు వెనక్కి తీసుకెళ్తారు. ప్రతిపక్ష 'ఇండియా' కూటమి బీటలువారిన ఇంటికి పూతలు పూసే ప్రయత్నంలా ఉంది. మా కూటమి ఎన్డీయే కేవలం అభివృద్ధి రాజకీయాలు చేస్తోంది. దేశం పేరు పెట్టుకున్న విపక్ష కూటమితో ఒరిగేదేమీ లేదు. విపక్షాల కొత్త దుకాణం త్వరలో బంద్ అవుతుంది. ఈ విషయం విపక్ష నేతలకు కూడా తెలుసు. అది కేవలం లూటీ దుకాణం, విద్వేష బజార్. మా కూటమి ఎన్డీయే. దానికి రెండు 'ఐ' అక్షరాలు కలిపి 'ఇండియా' అని పెట్టుకున్నారు. అందులో ఒక 'ఐ' 26 పార్టీల అహంకారం. మరో 'ఐ' ఒక కుటుంబ అహకారం. పేరు మార్చుకున్నంత మాత్రాన పాత పాపాలను దాచలేరు. వారసత్వ రాజకీయాలు అంతం కావాలని మహాత్మాగాంధీ, అంబేడ్కర్, మౌలానా ఆజాద్ తదితర గొప్ప నాయకులు ఆకాంక్షించారు. కానీ, వారసత్వ రాజకీయాలు, డబ్బుతోనే ఒక కుటుంబం చుట్టూ 'ఇండియా' కూటమి ఏర్పాటైంది.

ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలు పెట్టనివ్వలేదు. స్కూళ్లలో జాతీయ గీతం పాడనివ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహంపై ముష్కరులు బాంబుదాడి చేశారు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో దారుణాలు జరిగాయి.

దాడులు చేస్తున్న దేశంతో చర్చలు జరపాలా?

కాంగ్రెస్‌కు, దాని మిత్రపక్షాలకు పాకిస్తాన్ అంటే ఎనలేని ప్రేమ. మనదేశంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడల్లా పాకిస్తాన్‌పై అనురాగం ప్రదర్శిస్తుంటాయి. భారతీయులను మనోభావాలను పక్కన పెట్టి పాకిస్తాన్‌ను సమర్థిస్తుంటాయి. విపక్షాలు ఎప్పుడూ పాకిస్తాన్‌నే నమ్ముతుంటాయి. భారతదేశపు అంతర్గత శక్తియుక్తులపై, భారత సైనికుల సామర్థ్యంపై ప్రతిపక్షాలకు విశ్వాసం లేదు. కశ్మీర్‌లోని వేర్పాటువాదులంటే విపక్ష నాయకులకు ఎంతో మక్కువ. వారు ఎక్కువగా వేర్పాటువాదులనే కలుస్తుంటారు. పాకిస్తాన్ మన సరిహద్దుల్లో దాడులు చేస్తోంది. ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి మన దేశంలోకి పంపిస్తోంది. భారత్‌లో ఉగ్రదాడులు జరిగితే పాకిస్తాన్ ఎలాంటి బాధ్యత తీసుకోదు. అయినా మన ప్రతిపక్ష నాయకులు పాకిస్తాన్‌నే సమర్థిస్తుంటారు. పాకిస్తాన్ దేశం ఏది చెబితే అది వాస్తవమని నిస్సిగ్గుగా వెనకేసుకొస్తారు. మన భారతగడ్డపై పాకిస్తాన్ ముష్కరులు దాడులు చేస్తున్నా ఆ దేశంతో చర్చలు జరపాలని మూర్ఖంగా వాదిస్తుంటారు.

కాంగ్రెస్ నిర్వాకం వల్లే ఈశాన్యంలో సమస్యలు

పరాయి గడ్డ నుంచి దేశంలోకి వస్తున్న ముష్కరమూకలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ మాట్లాడిన దాఖలాలు లేవు. అందుకే కాంగ్రెస్ పట్ల దేశ ప్రజలు పూర్తి అవిశ్వాసం ప్రదర్శిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఒక విజన్ గానీ, విధానం లేవు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో దేశ ఆర్థిక వ్యవస్థ పాత్ర గురించి కాంగ్రెస్‌కు తెలియదు. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి వెనుక తమ పాత్ర ఉందని ఆ పార్టీ చెప్పుకుంటోంది. అందులో ఎంతమాత్రం నిజంలేదు. ఈశాన్య రాష్ట్రాల్లో అన్ని సమస్యలకు కాంగ్రెస్, ఆ పార్టీ నీచ రాజకీయాలే మూలకారణం. అక్కడి ప్రజలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసింది. ఈశాన్యంతో నాకు భావోద్వేగ అనుబంధం ఉంది. ప్రధానమంత్రిని కాకముందే ఆ ప్రాంతంలో ఎన్నోసార్లు పర్యటించా.

రాహుల్.. విఫల ఉత్పత్తి

మన భరతమాత మృతి చెందాలని కొందరు ఎందుకు కోరుకుంటున్నారో అర్థం కావడం లేదు. భారతమాత హత్య అంటూ అనుచితంగా మాట్లాడడం భారతీయుల మనోభావాలను తీవ్రంగా గాయపర్చింది. ప్రజాస్వామ్యం హత్య, రాజ్యాంగం హత్య అంటూ మాట్లాడే ఈ వ్యక్తులే(కాంగ్రెస్ నాయకులు) భరతమాతను మూడు ముక్కలు చేశారు. బానిసత్వం నుంచి భరతమాతకు విముక్తి కలిగించే సమయం వచ్చినప్పుడు ఆమె అవయవాలను నరికేశారు. కాంగ్రెస్‌కు రాజకీయాలు చేయడం తప్ప మరేమీ తెలియదు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని పలుమార్లు రాజకీయాల్లో ప్రవేశపెట్టారు. ప్రతిసారీ ఆయన విఫలమయ్యారు. ఆయనొక 'విఫల ఉత్పత్తి'.

ప్రతిపక్షాల వద్ద 'రహస్య వరం'

ప్రతిపక్షాలు అహంకారానికి, అవిశ్వాసానికి మారుపేరు. వాటిది నిప్పుకోడి తరహా మనస్తత్వం. భారతదేశ కీర్తిప్రతిష్టలు అంతర్జాతీయ నూతన శిఖరాలకు చేరుతున్నాయి, ప్రజల్లో కొత్త ఉత్సాహం, కొత్త శక్తి నిండుతోంది. ఈ నిజాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రతిపక్షాల వద్ద 'రహస్య వరం' ఏదో ఉన్నట్టుంది. ఇతరులకు చెడు జరగాలని వారు (విపక్ష నేతలు) కోరుకుంటే మంచి జరుగుతోంది. అందుకు నేనే ఉదాహరణ. గత 20 ఏళ్లుగా నన్ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు. కానీ, నాకు ఏమీ కాలేదు. బ్యాంకింగ్ రంగంపై, ప్రభుత్వ రంగంలోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌పై, భారతీయ జీవిత బీమా సంస్థపై ప్రతిపక్షాలు ఎన్నో ఆరోపణలు చేశాయి. వాస్తవానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించాయి. హెచ్ఏఎల్ రికార్డు స్థాయిలో రెవెన్యూ సాధించింది. ఇక ఎల్ఐసీ అద్భుత పనితీరుతో లాభాల బాటలో దూసుకెళ్తోంది. విపక్షాలు ఇప్పుడేం చేయాలో తెలియక చివరకు దేశాన్ని శపిస్తున్నాయి. కానీ, మన దేశం మరింత శక్తివంతంగా మారుతోంది. ప్రభుత్వం సైతం బలోపేతం అవుతోంది. మూడో పర్యాయం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అప్పుడు మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. భారత్ ఇప్పుడు చాలా కీలక దశలో ఉంది. దీని ప్రభావం మరో వెయ్యేళ్లు ఉంటుంది. దేశ ప్రజల బలం, శ్రమ, కష్టపడే తత్వం వచ్చే వెయ్యి సంవత్సరాలకు బలమైన పునాది వేస్తాయి. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. దేశంలో ఐదేళ్లలో ఏకంగా 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు.

పాకిస్తాన్ జెండాలు మోసినవారే కాంగ్రెస్‌కు ఇష్టం

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉగ్రవాద మంటల్లో కశ్మీర్ చిక్కుకుంది. కశ్మీర్ ప్రజలను కాంగ్రెస్ విశ్వసించలేదు. హురియత్ కాన్ఫరెన్స్‌ను, వేర్పాటువాదులను, పాకిస్తాన్ జెండాలు మోసినవారిని కాంగ్రెస్ నమ్మింది. పాక్‌లో నక్కిన ముష్కరులపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించినప్పుడు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నానా యాగీ చేశాయి. మన సైనిక దళాల బలాన్ని విశ్వసించలేదు. మన శత్రువులు చెప్పిన దాన్నే విశ్వసించాయి. భారతదేశానికి వ్యతిరేకంగా ఎవరు ఏది మాట్లాడినా దాన్ని మరింత పెద్దది చేసి చూపి, సంబరపడే శక్తి ప్రతిపక్షాలకు ఉంది.

నేను ప్రధాని కావడం కాంగ్రెస్ జీర్ణించుకోవడం లేదు



నేను పేద కుటుంబం నుంచి వచ్చా. పేదల బిడ్డ అధికారంలోఉండడాన్ని గాంధీ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. దేశంలో 30 ఏళ్ల తర్వాత ప్రజలు పూర్తి మెజార్టీతో ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. నిరుపేద బిడ్డ ఉన్నత పదవిలో ఉండడం ఏమిటని కాంగ్రెస్ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. వారు(కాంగ్రెస్ నాయకులు) గతంలో విమానాల్లో పుట్టిన రోజు కేకులు కట్ చేసుకున్నారు. మనం అదే విమానాల్లో వ్యాక్సిన్లు రవాణా చేశాం. వారు తమ దుస్తులను విమానాల్లో పంపించుకున్నారు. నేడు పేదలు సైతం విమానాల్లో ప్రయాణిస్తున్నారు. వారు నావికాదళం నౌకలను విందులు వినోదాల కోసం వాడుకున్నారు. అది 'ఇండియా' కాదు, ముమ్మాటికీ అహంకార కూటమి. అందులోని ప్రతి నాయకుడు పెళ్లి కొడుకు(ప్రధానమంత్రి) కావాలనుకుంటున్నారు. కాంగ్రెస్‌ను ఒక విదేశీయుడు స్థాపించారు. ఆ పార్టీ జెండా, పార్టీ గుర్తు, సిద్ధాంతాలు ఇతరుల నుంచి దొంగిలించినవే. అహంభావం వల్లే కాంగ్రెస్ 400 సీట్ల నుంచి 40 సీట్లకు పడిపోయింది. బెంగళూరులో 'యూపీఏ'కు సమాధి కట్టిన విపక్ష స్నేహితులకు ఇదే నా సానుభూతి.



పార్లమెంట్ నుంచి బయటకు వస్తున్న సోనియా, రాహుల్ గాంధీ

మోదీకి కాంగ్రెస్ ఫోబియా

- రావణుడిలా అహంకారి: కాంగ్రెస్
- వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదని జోస్యం
- లోక్‌సభ నుంచి విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ ఫోబియాలో నిండా కూరుకుపోయారని ఆ పార్టీ ఎద్దేవా చేసింది. అందుకే గురువారం లోక్ సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చకు బదులిచ్చే క్రమంలో దాదాపు రెండు గంటల ప్రసంగంలో ఆసాంతం కాంగ్రెస్‌పై విమర్శలకే పరిమితమయ్యారని విమర్శించింది. ప్రధాన సమస్య అయిన మణిపూర్ జాతుల హింసాకాండను కేవలం ప్రస్తావనతో సరిపెట్టారని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్ దుయ్యబట్టారు. ప్రధాని ప్రసంగంలో మణిపూర్ ప్రస్తావన లేదని ఆరోపిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్, సహా పలు విపక్షాలు వాకౌట్ చేశాయి. అనంతరం పార్లమెంట్ ఆవరణలో నేతలు మీడియాతో మాట్లాడారు. బీజేపీది కుహనా జాతీయవాదమని గొగొయ్ ఆరోపించారు. వాళ్లసలు దేశ భక్తులే కారన్నారు. 'మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయడంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీ ఆపసోపాలు పడుతోంది. విపక్ష ఇండియా కూటమి నిండు సభలో తన కళ్ల ముందే ఒక్కతాటిపై రావడం, ఇండియా, ఇండియా అంటూ నినాదాలతో హోరెత్తించడాన్ని మోదీ భరించలేకపోయారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఇండియా కూటమి పోరాడుతుంది. 2024 సాధారణ ఎన్నికల్లో బీజేపీని ఓడించి అధికారంలోకి వస్తుంది' అని ధీమా వెలిబుచ్చారు. 'మేం లేవనెత్తిన మూడు ప్రశ్నలకు బదులివ్వనందుకు, మణిపూర్ బీజేపీ ఎంపీలకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు, అన్ని రకాలుగా విఫలమైన మణిపూర్ సీఎంకు క్లీన్ చిట్ ఇచ్చినందుకు, మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులపై మౌనంగా ఉన్నందుకు... ఇలాంటి పలు కారణాలతో మేం వాకౌట్ చేశాం' అని వివరించారు. 'రావణుడు తనను తాను మహామేధావిని అనుకునేవాడు. కానీ అహంకారమే అతని పతనానికి కారణమైంది' అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, విదేశీ చట్టసభల్లో పేరు గొప్ప ప్రసంగాలు మాని మన పార్లమెంటులో దేశ సమస్యలకు సమాధానాలు ఇచ్చేలా చేయడమే మా అవిశ్వాస తీర్మానం లక్ష్యం. రోజుల తరబడి పోరాడి మోదీని లోక్ సభకు రప్పించడంలో ఇండియా కూటమి విజయం సాధించింది. కానీ రాజ్యసభలో కూడా చర్చలో పాల్గొనాలనే ఇంగితం ఆయనలో లేకపోయింది' అంటూ తూర్పారబట్టారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ మాట్లాడుతూ..'మణిపూర్ అంశంపై మాట్లాడాలని ప్రధానిని కోరాము. ఒక గంటా 45 నిమిషాల ప్రసంగం ముగిసినా మణిపూర్ పేరును ఆయన ప్రస్తావించనేలేదు. ఆయన మొత్తం రాజకీయాలపైనే మాట్లాడారు. అందులో కొత్తేముంది? గతంలో మాదిరిగానే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేశారు. దేశ ప్రజలకు ఆయన చెప్పేదేమిటో మనకు తెలియదా? అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన ప్రశ్నలకు ఆయన ప్రసంగంలో ఎటువంటి సమాధానాల్లేవు'అని అన్నారు. డీఎంకే ఎంపీ టీఆర్ బాలు మాట్లాడుతూ..మణిపూర్ సహా దేశంలో హింసాత్మక ఘటనలు జరుగుతున్న మిగతా ప్రాంతాల్లో పరిస్థితులపై ప్రధాని మోదీ మాట్లాడతారని మేమంతా ఎదురుచూశాం. ఆయన మాత్రం రాజకీయ ప్రసంగం చేశారు. అవిశ్వాస తీర్మానం లక్ష్యం నెరవేరలేదు. ఆయన ప్రసంగానికి అంతరాయం కలిగించాం. ఆయన స్పందించలేదు'అని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం మాట్లాడుతూ..దేశ చరిత్రలో గొప్ప స్పిన్నర్ ఎవరనే చర్చ ముగిసింది. అది ఎవరో కాదు ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వమే. 90 నిమిషాల ప్రసంగంలో అసలు అంశం మణిపూర్‌పై ప్రసంగించలేదు. ప్రధాని సభకు వచ్చి, మణిపూర్ సమస్యపై ప్రభుత్వం ఏం చేస్తుందనే విషయం చెబుతారనే లక్ష్యంతోనే అవిశ్వాస తీర్మానం పెట్టాం. ఇది దేశ సమగ్రతకు అవమానం. అందుకే మేం వాకౌట్ చేశాం'అని తెలిపారు.

అధిర్ రంజన్ చౌదరి సస్పెన్షన్

అప్రజాస్వామికం: కాంగ్రెస్ ఆగ్రహం

న్యూఢిల్లీ: లోక్ సభలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరిపై సస్పెన్షన్ వేటు పడింది. సభా కార్యకలాపాలకు పదేపదే అడ్డు తగులుతున్నారనే అభియోగాలపై స్పీకర్ ఓం బిర్లా గురువారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అధీర్‌పై అధికార బీజేపీ పక్షం మోపిన అభియోగాలపై సభా హక్కుల సంఘం విచారణ జరపనుంది. అప్పటిదాకా ఆయనపై సస్పెన్షన్ అమల్లో ఉండనుంది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. దీన్ని నమ్మశక్యం కానీ అప్రజాస్వామిక చర్యగా అభివర్ణించింది. ప్రధాన ప్రతిపక్ష నేతను ఇలా సస్పెండ్ చేయడం బహుశా పార్లమెంట్ చరిత్రలోనే తొలిసారి అని ఎద్దేవా చేసింది. అధీర్ సస్పెన్షన్ తీర్మానాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ సభలో ప్రవేశపెట్టారు. అధీర్ పదేపదే సభా కార్యకలాపాలకు అడ్డు తగులుతున్నారని అందులో ఆరోపించారు. ముఖ్యంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల ప్రసంగాలకు పదేపదే అడ్డు తగులుతూ వస్తున్నారని పేర్కొన్నారు. 'ఇలా ప్రవర్తించడం ఆయనకు పరిపాటిగా మారింది. సభలో అతి పెద్ద విపక్ష నేతగా ఇలా చేయడం చాలా దురదృష్టకరం. చర్చల్లో అధీర్ నిత్యం నిరాధార ఆరోపణలు చేస్తారు. ఎన్నిసార్లు హెచ్చరించినా ఆయన తీరు మెరుగు పడలేదు. ఎన్నడూ కనీసం క్షమాపణలు చెప్పరు. ఈ రోజూ అంతే. కేంద్ర హోం మంత్రిపై కూడా ఇలాంటి ఆరోపణలే చేశారు. సభా అన్నా, స్పీకర్ స్థానమన్నా ఆయనకు గౌరవమే లేదు' అన్నారు. సస్పెన్షన్ తీర్మానాన్ని మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. గురువారం చర్చ సందర్భంగా అధీర్, బీజేపీ ఎంపీ వీరేంద్ర సింగ్ ప్రవర్తన హుందాగా లేదని ఓం బిర్లా అన్నారు. దాంతో వీరేంద్ర క్షమాపణలు తెలిపారు.

అనంతరం అధీర్ పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సభలో తాను మోదీని అవమానించలేదని స్పష్టం చేశారు. అది తన ఉద్దేశం కూడా కాదన్నారు. మణిపూర్ హింసాకాండపై మోదీ నీరవ్ (నిశ్శబ్దం)గా ఉన్నారంటూ తూర్పారబట్టారు. 'మోదీకే తననేదో అవమానించారని అనిపించలేదు. కానీ ఆయన దర్బారీలు (సహచర మంత్రులు, ఎంపీలు) మాత్రమే అలా అనుకున్నారు' అని ఎద్దేవా చేశారు.

కాషాయీకరణ 'క్విట్ ఇండియా'

పాలకుడు ధృతరాష్ట్రుడిలా అంధుడైతే మహిళలను రక్షించేదెవరు?

- మణిపూర్ ప్రజలకు ప్రధాని మోదీ శాంతి సందేశం ఇవ్వాలి
- లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి డిమాండ్



న్యూఢిల్లీ: కాషాయీకరణను, మత శక్తుల ఏకీకరణను, మతతత్వాన్ని దేశం నుంచి తరిమికొట్టాల్సిన సమయం వచ్చిందని కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదర అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో గురువారం జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. అవినీతి క్విట్ ఇండియా అంటూ బీజేపీ ఇచ్చిన నినాదాన్ని తిప్పికొట్టారు. క్విట్ ఇండియా ఉద్యమం జరగాల్సిందేనని చెప్పారు. కాషాయీకరణ, మతతత్వం క్విట్ ఇండియా అని సభలో అధిర్ రంజన్ నినదించారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే..

కేవలం ఒక రాష్ట్ర సమస్యగా చూడొద్దు

''నరేంద్ర మోదీ 100సార్లు ప్రధానమంత్రి అయినా మాకు ఎలాంటి ఆందోళన, అభ్యంతరం లేదు. మా ఆందోళన అంతా దేశ ప్రజల గురించే. మణిపూర్ ప్రజలకు ప్రధానమంత్రి స్వయంగా శాంతి సందేశం ఇవ్వాలని మా పార్టీ కోరుతోంది. మణిపూర్ హింసాకాండ గురించి 'మన్ కీ బాత్'లో కనీసం ఒక్కసారైనా మోదీ మాట్లాడాలని మేము ఆకాంక్షిస్తున్నాం. మణిపూర్‌లో హింస అనేది సాధారణ అంశం కాదు. ఆ రాష్ట్రంలో తెగల మధ్య ఘర్షణ జరుగుతోంది. పౌర యుద్ధం కొనసాగుతోంది. మణిపూర్ హింస మొత్తం ప్రపంచం దృష్టిలో పడింది. యూరోపియన్ యూనియన్ పార్లమెంట్‌తోపాటు అమెరికాలోనూ దీనిపై చర్చ జరిగింది. మణిపూర్ వ్యవహారాన్ని కేవలం ఒక రాష్ట్ర సమస్యగా చూడొద్దు. అందుకే ప్రధానమంత్రి స్వయంగా కలుగజేసుకోవాలని, మణిపూర్‌లో పరిస్థితిని చక్కదిద్దాలని, శాంతిని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రధానమంత్రిని లోక్‌సభకు రప్పించడానికి అవిశ్వాస తీర్మానం మినహా మాకు (విపక్ష 'ఇండియా' కూటమి) మరో మార్గం లేకుండా పోయింది.

బఫర్ జోన్.. ప్రజల మధ్య వద్దు

అది హస్తినాపురం అయినా, మణిపూర్ అయినా మహిళలపై అకృత్యాలు, అత్యాచారాలు జరుగుతూ ఉంటే దేశాన్ని పరిపాలించే రాజు అంధుడిగా వ్యవహరించకూడదు. కఠిన చర్యలు ఉపక్రమించాలి. దోషులను శిక్షించాలి. దేశాన్ని ఏలే పాలకుడు అంధుడైన ధృతరాష్ట్రుడిలా మిన్నకుండిపోతే ఇక మహిళలకు రక్షణ కల్పించేదెవరు? మణిపూర్‌లో రెండు వర్గాల ప్రజల మధ్య 'బఫర్ జోన్'ను ప్రభుత్వం సృష్టించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బుధవారం సభలో చెప్పారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. బఫర్ జోన్ అనేది రెండు దేశాల మధ్య ఉంటుంది. అంతేతప్ప ప్రజల మధ్య ఉండడం తగదు. అవిశ్వాస తీర్మానంపై సభలో మాట్లాడేందుకు మణిపూర్‌కు చెందిన ఇద్దరు ఎంపీలు ప్రయత్నిస్తే స్పీకర్ అనుమతించకపోవడం దారుణం'' అని అధిర్ రంజన్ చౌదరి అసంతృప్తి వ్యక్తం చేశారు.

అధిర్ రంజన్ వ్యాఖ్యలు తొలగింపు

లోక్‌సభలో అధిర్ రంజన్ చేసిన వ్యాఖ్యలపై హోంమంత్రి అమిత్ షా తీవ్ర అభ్యంతరం తెలిపారు. ప్రధాని మోదీని ధృతరాష్ట్రుడితో పోల్చడం ఏమిటని నిలదీశారు. అధిర్ రంజన్ వ్యాఖ్యల రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్లా చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ సైతం అధిర్ రంజన్ వ్యాఖ్యలను ఖండించారు. సభకు, దేశానికి అధిర్ రంజన్ క్షమాపణ చెప్పాలని సోషల్ మీడియాలో డిమాండ్ చేశారు.

పటిష్టంగా భారత్ ఆర్థిక వ్యవస్థ

- ప్రపంచ దేశాల కంటే మెరుగ్గా ఉన్నాం
- ప్రధాని మోదీ పాలనలో సమూల మార్పులతో ఆర్థిక పురోగతి
- అవిశ్వాసంపై చర్చలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కష్టాల్లో ఉన్న సమయంలో భారత ప్రభుత్వం తన భవిష్యత్ వృద్ధిపై ఆశాజనకంగా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తాము ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తూ పాలనలో సమూల మార్పులు తీసుకువచ్చిందన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో గురువారం నిర్మలా సీతారామన్ మాట్లాడారు. అమెరికా, యూకే, యూరోజోన్ వంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా ఎన్నో ఆర్థిక సవాళ్ల మధ్య ఉన్నాయని, అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా కూడా వినియోగదారుల డిమాండ్లు, వేతనాల స్తబ్దత వంటి సమస్యలనెదుర్కొంటోందని తెలిపారు. ''ప్రపంచబ్యాంకు గణాంకాల ప్రకారం 2022లో ప్రపంచ ఆర్థిక పురోగతి 3%గా ఉంది. 2023 నాటికి అది 2.1శాతానికి పడిపోయింది. అదే సమయంలో మోర్గన్ స్టేన్లీ సంస్థ 2013లో భారత ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉందని పేర్కొంది. అదే సంస్థ తాజాగా పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్‌ను గుర్తించింది. కేంద్రం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలే దీనికి కారణం'' అని చెప్పారు.

మిలేగా స్థానంలో మిల్‌గయా

ఇందిరాగాంధీ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వ నినాదం గరీబీ హఠావో నినాదాన్ని సీతారామన్ ఎగతాళి చేస్తూ వాస్తవంగా పేదరికం తొలగిపోయిందా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక పరిపాలనలో సమూల మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. ఒకప్పుడు మిలేగా (లభిస్తుంది) అన్న పదం స్థానంలో ఇప్పుడు మిల్ గయా (అన్నీ అందాయి) అని ప్రజలు చెప్పుకునే స్థాయికి పాలన వెళ్లిందన్నారు. అవినీతి, బంధుప్రీతితో దశాబ్దాల పాటు కాంగ్రెస్ సమయాన్ని వృథా చేసిందని, అన్ని సంక్షోభాల్ని అవకాశాలుగా అందిపుచ్చుకొని ముందుకు వెళుతున్నామన్నారు. నిర్మలా సీతారామన్ ప్రసంగంలో తమిళనాడు ప్రస్తావన వచ్చినప్పుడల్లా తమిళంలో మాట్లాడారు. సెంగాల్ (రాజదండం) గురించి ఆమె ప్రస్తావిస్తూ దానిని ఎక్కడో మ్యూజియంలో పడేశారని అది తమిళనాడు ఆత్మగౌరవాన్ని అవమానించడం కాదా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సెంగాల్‌ను లోక్‌సభలో ప్రతిష్ఠించి సముచిత స్థానాన్ని కల్పించారన్నారు. అదే సమయంలో ఆమె సభను పక్కదారి పట్టిస్తున్నారంటూ కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, లెఫ్ట్ పార్టీల ఎంపీలు వాకౌట్ చేశారు.

నిండుసభలో జయలలిత చీర లాగారు

మణిపూర్‌లో మహిళల అకృత్యాల గురించి సీతారామన్ ప్రస్తావిస్తూ కేవలం మణిపూర్ మాత్రమే కాదు మహిళల్ని అవమానపరిచే, కించపరిచే ఘటనలు రాజస్థాన్, ఢిల్లీ ఇలా ఏ రాష్ట్రంలో జరిగినా ఆందోళన కలిగిస్తాయన్నారు. ఈ ఘటనలు ఎక్కడ జరిగినా తీవ్రంగా పరిగణించాలన్నారు. మణిపూర్ అంశంపై ప్రసంగించిన డీఎంకే ఎంపీ కనిమొళికి ఈ సందర్భంగా ఒక ఘటనను గుర్తు చేయాలనుకుంటున్నాను అంటూ తమిళనాడు అసెంబ్లీలో జయలలితకు జరిగిన పరాభవం గురించి ప్రస్తావించారు. ''జయలలిత ప్రతిపక్ష నాయకురాలిగా ఉన్నప్పుడు 1989 మార్చి 25న పరమ పవిత్రమైన నిండు సభలో ఆమె చీరను లాగారు. డీఎంకే సభ్యులు అదంతా చూస్తూ జయలలితను గేలి చేశారు. ఆమెను చూసి నవ్వుకున్నారు. రెండేళ్ల తర్వాత జయలలిత ముఖ్యమంత్రిగా మళ్లీ అసెంబ్లీలో అడుగుపెట్టారు. తమిళనాడు అసెంబ్లీలో జయలలితను పరాభవించినప్పుడు అధికారంలో ఉన్న పార్టీ వారు ఇప్పుడు విపక్ష నేతలుగా ద్రౌపదికి చీర లాగడం గురించి మాట్లాడుతున్నారు'' అని డీఎంకేకి చురకలు అంటించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023

అనుమతులు లేని ప్రైవేటు స్కూళ్ల మూత : సర్కారు

శివాజీనగర: 2022-23వ సంవత్సరంలో రాష్ట్రంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ప్రైవేటు స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. కర్ణాటక విద్యాచట్టం కింద ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలు 45 రోజుల్లో అవసరమైన అనుమతులను తీసుకోవాలని ఆ శాఖ అధికారులు గతంలో ఆదేశించారు. ఈ నేపథ్యంలో నియమాలను ఉల్లంఘించి నిర్వహిస్తున్న పాఠశాలలను ఈ నెల 14లోగా మూసివేయాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌లకు ఆదేశాలు వచ్చాయి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఈ నెల 16 నాటికి తమ జిల్లా వ్యాప్తిలో అనధికారిక పాఠశాలలు లేవని ప్రకటించాలి. ఒకవేళ నిర్ధారించిన తేదీలోగా ఎలాంటి సమాచారాన్ని సమర్పించని పక్షంలో సదరు అధికారులపై చర్యలు తీసుకుంటామని సర్కారు తెలిపింది.

న్యూస్‌రీల్

తీరంలో ప్లాస్టిక్ చెత్తతో సమస్య : మంత్రి

శివాజీనగర: కోస్తా ప్రాంతంలో సముద్రాల్లో ప్లాస్టిక్ చెత్త వల్ల జలచరాలకు ఇబ్బంది కలుగుతోందని, దీనిని నివారించాలని అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె అన్నారు. గురువారం ప్రపంచ బ్యాంక్ బృందంతో సమావేశమైన ఆయన రాష్ట్రంలో 317 కిలోమీటర్ల పొడవునా సముద్ర తీరం ఉందని, ప్రతిరోజు 50 టన్నుల ప్లాస్టిక్ చెత్త సముద్రంలో చేరడం చాలా ప్రమాదకరమని అన్నారు. దీంతో సముద్ర అంచునకు వచ్చి గుడ్లు పెట్టి పిల్లలు పుట్టించే జలచరాల సంతానోత్పత్తికి ఆటంకం ఏర్పడుతుందని చెప్పారు. బ్లూ ప్యాక్ ప్రాజెక్ట్ ద్వారా ప్లాస్టిక్ చెత్త సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇందుకు రూ.840 కోట్లు అవుతుందని, ఇందులో 70 శాతం ప్రపంచ బ్యాంకు రుణం ఇస్తుందని చెప్పారు.

లింక్ పంపి రూ.5.48 లక్షలు లూటీ

మైసూరు: కరెంటు బిల్లును చెల్లించాలి మెసెజ్ చేసి దాని ద్వారా సుమారు రూ. 5.48 లక్షలను సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. ఈ సంఘటన మైసూరు నగరంలో చోటుచేసుకుంది. బాధితుడు యాదవగిరిలో నివాసం ఉండే కణ్ణన్ (52). గుర్తు తెలియని వ్యక్తి ఇతని మొబైల్ ఫోన్‌కు కరెంటు బిల్లును చెల్లించాలి మెసేజ్‌తో పాటు ఒక లింక్‌ను పంపించాడు. బాధితుడు నిజమేనేమో అనుకుని మెసెజ్‌ను ఓపెన్ చేసి లింక్‌ను నొక్కాడు. అంతే.. కణ్ణన్ బ్యాంకు ఖాతాలో నుంచి సుమారు రూ. 5.48 లక్షలు వేరే ఖాతాల్లోకి బదిలీ అయినట్లు మెసేజ్ రావడంతో నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

త్వరలో రాష్ట్రమంతటా ఈ-చలాన్లు

బనశంకరి: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన, జరిమానాల వసూలులో కర్ణాటక దేశంలోనే చాలా ముందుందని ఏడీజీపీ అలోక్‌కుమార్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల ఈ-చలానాల వసూలులో ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. 50 శాతానికి పైగా ఈ-చలాన్ వ్యవస్థ ఉందని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ-చలాన్ విధానాన్ని అమలులోకి తీసుకువస్తామని, పాత వ్యవస్థను రద్దు చేస్తామని తెలిపారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రంలో 24,594 ఈ-చలానాలు ఇచ్చి రూ.1.22 కోట్ల జరిమానా సేకరించామని తెలిపారు.

కేంద్రమంత్రిపై బీజేపీ ఎమ్మెల్యే ధ్వజం

బనశంకరి: రాష్ట్ర బీజేపీలో సొంత పార్టీ నేతల మధ్య కక్షలు బయటపడుతున్నాయి. బీజేపీ ఎమ్మెల్యే ప్రభుచౌహాన్, కేంద్రమంత్రి భగవంత్ ఖుబా మధ్య సమరం మొదలైంది, తనను హత్య చేసి ఆరు నెలల్లో ఉప ఎన్నికలు నిర్వహించడానికి కుట్ర పన్నుతున్నారని ఔరాద్ ఎమ్మెల్యే ప్రభుచౌహాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. గుండాలతో హత్య చేయించడానికి పథకం పన్నారని బహిరంగంగా ఆరోపించారు. బీదర్ జిల్లా ఔరాద్ పట్టణంలో నిర్వహించిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో ప్రభు చౌహాన్ మాట్లాడుతూ .. 2023 శాసనసభ ఎన్నికల్లో తనను ఓడించడానికి భగవంత్‌ఖుబా ఎన్నో ప్రయత్నాలు చేశారని, అవి విఫలమాయ్యయని, తనను హత్యచేయించి ఉప ఎన్నికల కోసం ప్లాన్ చేశారని దుయ్యబట్టారు.

రాత్రి 8 వరకు నమ్మ క్లినిక్‌లు

శివాజీనగర: సామాన్య ప్రజలకు ఉచిత వైద్య చికిత్స కల్పించడానికి ప్రారంభించిన నమ్మ క్లినిక్‌లు ఇకపై రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఈ మేరకు ఆరోగ్యమంత్రి మంత్రి దినేశ్ గుండూరావ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 415 నమ్మ క్లినిక్‌లు ఉండగా, వీటిలో 25 శాతం క్లినిక్‌ల సమయాన్ని మార్చేందుకు ఆరోగ్య మంత్రి శాఖాధికారులకు సూచించారు. ఈ క్లినిక్‌లు ఉదయం 9 గంటలకు తెరిచి మధ్యాహ్నం 12.30 గంటలకు మూతవేసేవారు. మధ్యాహ్నం భోజనం తరువాత 2 గంటలకు తెరచి సాయంత్రం 4 వరకు పనిచేసేవి. అనారోగ్యంతో సాయంత్రం తరువాత వచ్చే వారు కూడా ఎక్కువ కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలకు ఊరట

- వారిపైనున్న మేకెదాటు కోవిడ్ కేసులు మాఫీ
- కేబినెట్ భేటీలో తీర్మానం



అప్పట్లో మేకెదాటు వద్ద పాదయాత్ర ప్రారంభోత్సవ సభ (ఫైల్)

బనశంకరి: మేకెదాటు పాదయాత్ర సమయంలో కాంగ్రెస్ సీనియర్లు సిద్దరామయ్య, డీకే శివకుమార్, డీకే. సురేశ్‌లకు ఊరట కలిస్తూ, వారిపై నమోదైన కోవిడ్ మార్గదర్శకాల ఉల్లంఘన కేసులు ఎత్తివేయాలని కేబినెట్‌లో తీర్మానించారు. గతేడాది జనవరిలో మేకెదాటు ప్రాజెక్టు నిర్మాణం కోరుతూ డీకే ఆధ్వర్యంలో మేకెదాటు నుంచి బెంగళూరుకు పాదయాత్ర నిర్వహించడం తెలిసిందే. ఈ సమయంలో కోవిడ్ థర్డ్ వేవ్ నిబంధనలు అమల్లో ఉన్నాయి. గురువారం విధానసౌధలో మంత్రిమండలి సమావేశం అనంతరం మంత్రి హెచ్‌కే పాటిల్ వివరాలను వెల్లడించారు. రామనగరలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 9 క్రిమినల్ కేసులను ఎత్తివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పాదయాత్రలో కోవిడ్ నిబంధనలకు విరుద్ధంగా వందలాది మందితో ర్యాలీలు చేయడంతో బొమ్మై సర్కారు కేసులు నమోదుచేసింది.

పలు ముఖ్యమైన తీర్మానాలు

- వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం హెచ్.నాగేశ్, గత జాయింట్ డైరెక్టర్‌లకు నిధుల దుర్వినియోగం కేసులో సెషన్స్‌కోర్టు 5 ఏళ్ల జైలుశిక్ష విధించడంతో వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని తీర్మానం.
- బెంగళూరులో ఏరోస్పేస్ రక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ.391 కోట్లకు పాలనాత్మక ఆమోదం. ఇందిరానగర సీవీ.రామన్ ఆసుపత్రి వైద్యురాలు ఎస్ డీ.నాగమణి లోకాయుక్తకు పట్టుబడగా తప్పనిసరి రిటైర్మెంటుకు తీర్మానం. రామనగర మహిళా వైద్యురాలు డాక్టర్ ఉషా కదరమండలగికి ఇదే నిర్ణయం.
- హూవినహడగలి నియోజకవర్గం విద్యాశాఖాధికారి ఎస్ఎస్. హళ్లిగుడిపై ఆరోపణలు ఉన్నందున సేవల నుంచి సస్పెండ్.

ఆస్పత్రులకు నిధులు

- బెళగావి మెడికల్ కాలేజీలో 325 పడకల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రికి రూ.187 కోట్ల మంజూరు
- కరావళి అభివృద్ధి ప్రాధికార పేరును కరావళి ప్రాదేశికాభివృద్ధి మండలి అని పేరు మార్పు
- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ నియోజకవర్గాల్లో 20 సంచార ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు. రూ. 47 కోట్లతో ఐదు జిల్లా ఆసుపత్రులైన మైసూరు, చిత్రదుర్గ, సీవీ రామన్‌నగర, వెన్‌లాక్ ఆసుపత్రి, కేసీ. జనరల్ ఆసుపత్రుల్లో 15 ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు.




కొత్తగా సైబర్ భద్రతా చట్టం

- కర్ణాటక సైబర్ భద్రతా చట్టం 2023 -24 కు అనుమతి. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాల కట్టడి నేపథ్యంలో సైబర్ భద్రతకు చట్టం ఆమోదం
- సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో పామాయిల్‌కు బదులుగా సన్ ఫ్లవర్ నూనె పంపిణీ.
- బీబీఎంపీ చట్టాన్ని ఇతర మహానగర పాలికె, నగర సభ, పురసభల్లో అమలుకు పరిశీలన.

అలాగే అక్రమ కట్టడాలు, బయలు భూమిపై పన్ను విధింపు పరిశీలనకు మంత్రి వర్గ ఉపసమితి ఏర్పాటు.

బస్సులు, క్యాబ్‌లలో ట్రాకింగ్, ప్యానిక్ బటన్



ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, క్యాబ్‌లు తదితర ప్రజా రవాణా సంస్థల వాహనాల్లో ప్రయాణికులు, మహిళల భద్రత కోసం వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్, ప్యానిక్ బటన్‌ను అమర్చడానికి నిర్ణయం. ఇందుకోసం పర్యవేక్షణకు కేంద్రీకృత కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు రూ.30.74 కోట్ల మంజూరుకు పాలనాత్మక ఆమోదం. ప్రయాణికులకు వాహనం సమాచార వసతి, సజావుగా ప్రయాణం, ప్రమాదాల నియంత్రణకు ఇది దోహదపడుతుంది.

చిన్నారులపై దూసుకెళ్లిన వాహనం

- ఇద్దరు మృతి


మృతిచెందిన చిన్నారులు రోహిన్, శాలిని

దొడ్డబళ్లాపురం: గూడ్స్ వాహనం ఢీకొని ఇద్దరు చిన్నారులు మృతిచెందగా, మరో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డ ఘోర దుర్ఘటన రామనగర తాలూకా గొల్లరదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. రోహిన్ (5), శాలిని (8) మృతులు, సుచిత్, గౌతమి అనే మరో ఇద్దరు క్షతగాత్రులు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో నలుగురు పిల్లలు ట్యూషన్ ముగించుకుని ఇళ్లకు నడిచి వస్తుండగా టాటాఏస్ గూడ్స్ వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన నలుగురు పిల్లలను ఆస్పత్రికి తరలించగా రోహిన్, శాలిని చికిత్స ఫలించక మృతిచెందారు. ప్రమాదం జరిగిన వెంటనే గూడ్స్ వాహనం డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బాధిత తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు.

లారీ-బైక్ ఢీ.. తండ్రి మృతి


ప్రమాద దృశ్యం,


మృతి చెందిన వెంకటేశ్ (ఫైల్)

- కుమార్తెకు తీవ్ర గాయాలు

దొడ్డబళ్లాపురం: లారీ, బైక్ ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో తండ్రి మృతి చెందిన సంఘటన దొడ్డ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దొడ్డ తాలూకా ముద్దనాయకనపాళ్య గ్రామానికి చెందిన వెంకటేశ్ (45) మృతి చెందగా ఈయన కుమార్తె యశస్విని (15) తీవ్రంగా గాయపడింది. స్వగ్రామం నుంచి వెంకటేశ్ కుమార్తెను పాఠశాలకు వదలడానికి బైక్‌పై వస్తుండగా పట్టణంలోని ఏపీఎంసీ ముందు బెంగళూరు-హిందూపురం రహదారిపై తుమకూరు వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో తండ్రి, కుమార్తె బైక్‌తో పాటు లారీ చక్రాల కింద చిక్కుకున్నారు. వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా యశస్విని తీవ్రంగా గాయపడింది. ఆమెను బెంగళూరు తరలించారు. దొడ్డ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తలతిక్క యూట్యూబర్‌కు కటకటాలు

- రద్దీ రహదారిలో బైక్‌స్టంట్లు


మాస్కు ధరించి స్టంట్‌లు చేస్తున్న యూట్యూబర్

దొడ్డబళ్లాపురం: ముఖానికి మాస్క్ ధరించి బైక్‌పై తిరుగుతూ రద్దీగా ఉన్న రోడ్లపై స్టంట్‌లు చేస్తూ వాహనదారులకు ఇబ్బందులకు గురిచేసిన యూట్యూబర్‌ను యలహంక పోలీసులు అరెస్టు చేసారు. మహమ్మద్ జావిద్ అరెస్టయిన యూట్యూబర్. ఇతడు తలతిక్క వీడియోలు చేస్తూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. ఈక్రమంలోనే ఇటీవల ముఖానికి మాస్క్ ధరించి బైక్‌పై తిరుగుతూ కెంపేగౌడ ఎయిర్ పోర్టు రోడ్డులో సిగ్నల్స్ జంప్ చేసి వన్‌వేలో వెళ్లి ఒక కారు అద్దాలు పగలగొట్టి పరారయ్యాడు. ఈ వీడియో యూట్యూబ్‌లో అప్లోడ్ చేసాడు. జరిగిన సంఘటన మరియు వీడియోపై ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేసుకున్న యలహంక పోలీసులు జావిద్‌ను అరెస్టు చేసి బైక్ సీజ్ చేసారు. యలహంక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కాంట్రాక్టర్లపై డీసీఎం రుసరుస

శివాజీనగర: కాంట్రాక్టర్లను మీడియా ముందుకు ఎవరు పంపుతున్నారనేది నాకు తెలుసునని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. గురువారం సదాశివనగరలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, కాంట్రాక్టర్లు ప్రతిపక్ష నాయకులను కలవడంపై స్పందిస్తూ కమీషన్ల ఆరోపణలపై చట్ట ప్రకారం తనిఖీ చేపట్టాలని సూచించారు. కాంట్రాక్టర్ల సంఘం నేత కెంపణ్ణ నాపై ఫిర్యాదు చేశారు, ఆయనకు న్యాయం చేయాలి. ప్రజలకు కూడా న్యాయం లభించాలన్నారు. గతంలో కాంట్రాక్టర్లు చేసిన 40 శాతం కమీషన్ ఆరోపణ వాస్తవమేనని, ప్రస్తుతం చేస్తున్న 15 శాతం ఆరోపణ అబద్ధమని మంత్రి రామలింగారెడ్డి అన్నారు.

స్వర్ణాభరణాల ఉత్సవం



సాక్షి, బెంగళూరు: త్వరలో వర మహాలక్ష్మి పండుగను పురస్కరించుకుని ఉద్యాన నగరవాసుల కోసం ప్రతిష్టాత్మక ఆభరణాల ప్రదర్శన.. ఏసియా జ్యువెల్స్ షో మరోసారి వచ్చేసింది. బెంగళూరులోని ది రిట్జ్ కార్ల్టన్ హోటల్‌లో శుక్రవారం నుంచి ఈ 48వ ఎడిషన్ ప్రదర్శన ప్రారంభం అవుతోంది. దేశంలోని నలుమూలల పేరుగాంచిన వినూత్న ఆభరణాలన్నింటిని ఒకే వేదికపై తీసుకొచ్చే ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు జరుగుతుంది.


వైవిధ్య ఆభరణాలతో అందాల భామలు

అద్దె అడిగినందుకు చాకుతో దాడి

- తండ్రీ కొడుకుల దురాగతం


గాయపడిన శ్రీదేవి

బొమ్మనహళ్లి: మూడు నెలల నుంచి ఇంటి అద్దెను ఇవ్వకపోవడంతో అద్దె చెల్లించాలని నిర్వాహకురాలు అడిగింది, ఇక అంతే.. తండ్రీ కొడుకు కలిసి ఆమెపై చాకుతో దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయి. ఈ సంఘటన బెంగళూరు బండేపాళ్యలో జరిగింది. బండేపాళ్య పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మునేశ్వర నగరలో ఫయాజ్ అనే వ్యక్తికి 15 ఇళ్లు ఉన్నాయి. అతను విదేశాలకు వెళ్తూ ఆ ఇళ్ల ఆజమాయిషీని శ్రీదేవి అనే మహిళకు అప్పగించారు. ఆమె ఒక ఇంటిని నజీర్ అనే వ్యక్తికి బాడుగకు ఇచ్చింది. శ్రీదేవి అందరి వద్ద అద్దె వసూలు చేసి ప్రతి నెలా ఫయాజ్‌కు పంపించేది. నజీర్ మూడు నెలల నుంచి బాడుగ కట్టకపోవడంతో మూడు రోజుల క్రితం ఇంటికి వెళ్ళి ఆమె అడిగింది. డబ్బులు లేకపోతే ఇల్లు ఖాళీ చేయండి అని ఆమె గట్టిగా చెప్పడంతో ఆగ్రహంతో ఊగిపోయిన తండ్రి నజీర్, కుమారుడు సద్దాం శ్రీదేవితో గొడవకు దిగి చాకుతో ముఖం, మెడపైన పొడిచి పరారయ్యారు. స్థానికులు ఆస్పత్రికి తరలించి బండేపాళ్య పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించారు. పరారీలో ఉన్న తండ్రీ కొడుకుని అరెస్టు చేశారు.

ఎన్నికల తరువాత మహిళా ప్రధాని !

తుమకూరు: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దేశ ప్రధానిగా ఒక మహిళ అధికారం చేపడతారని ప్రముఖ జ్యోతిష్యుడు యశ్వంత గురూజీ చెప్పారు. తుమకూరు జిల్లాలోని తిపటూరు తాలూకా నోణవినకెరెలో ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తాను చెప్పిన జోస్యం నిజమైందని అన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఒక మహిళ పగ్గాలు చేపడుతుందని, ఇందిరాగాంధీ తరువాత ఆమె రెండవ మహిళా ప్రధాని అవుతారని చెప్పారు. రాబోయే మహా శివరాత్రి తరువాత దేశ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకుంటాయని అన్నారు. మహా శివరాత్రిలోగా ఎన్నికల జరిగితే ప్రధాని మోదీకి మరో అవకాశం ఉంటుంది, శివరాత్రి తరువాత జరిగితే ఆయనకు ఇబ్బందులు తప్పవని అన్నారు.

ప్రయాణికురాలిపై క్యాబ్ డ్రైవర్ దాడి


మహిళను కొడుతుండగా అడ్డుకుంటున్న తనయుడు

కృష్ణరాజపురం: బెంగళూరులో ఊబర్ డ్రైవర్ దారుణానికి పాల్పడ్డాడు, ప్రయాణికురాలపై దాడి చేసిన ఘటన నగరంలోని బెళ్లందూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని భోగనహళ్లిలో చోటు చేసుకుంది. బాధిత మహిళ తన కుమారున్ని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి క్యాబ్ బుక్ చేసుకుంది. అంతలోనే కుమారుడు మరో క్యాబ్‌ను బుక్ చేశాడు. ముందు వచ్చిన క్యాబ్‌లోకి ఎక్కారు, అయితే కుమారుడు ఇది మనం బుక్ చేసిన క్యాబ్ కాదని చెప్పాడు. క్యాబ్ డ్రైవర్ వారిని దించి ఆమెతో గొడవ పడ్డాడు. ఆమెపై చేయి చేసుకోవడంతో సమీపంలోని అపార్టుమెంట్ వాసులు వచ్చి కాపాడారు. ఇంతలో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు ఉచిత శిక్షణ

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ గ్రాంటు సహకారంతో తిరుపతి నిర్వహిస్తున్న రాస్ ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కోర్సులలో ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 31 నాటికి 17 ఏళ్ల పూర్తి అయి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థినులకు 5 ఏళ్ల సడలింపు ఉంటుందని తెలిపారు. ఇక్కడ చేరిన వారికి ఉచిత విద్య, వసతి లభించడంతో పాటు నెలకు రూ.500లు స్టైఫండ్ ఇస్తారు. చిత్తూరు, అనంతపురం జిల్లాలకు సంబంధించిన అభ్యర్థినులు మాత్రం ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. టెన్త్, ఇంటర్ మార్కులిస్ట్, టీసీ, కుల, స్థానికీకరణతో పాటు 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 8 పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు సెప్టంబర్ 30వ తేదీ లోపు ది ప్రిన్సిపాల్, రాస్ ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, కేరాఫ్ రాస్ సేవా నిలయం, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి-517501 చిరునామాకు పంపాలని తెలియజేశారు.

వక్కతోటలో గంజాయి, ఇద్దరి అరెస్ట్



శివమొగ్గ: వక్కతోటలో గంజాయి సాగు చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా కోణందూరు సమీపంలోని కొలిగె గ్రామానికి చెందిన సునీల్, కార్తీక్‌లు గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిసి పోలీసులు దాడి చేసి రెండు కిలోలకు పైగా గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 80 వేలు ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

అల్మట్టి ఎడమ కాలువకు గండి

- 200 ఎకరాల్లో పంట నష్టం



గండి నుంచి నీరు వృథా అవుతున్న దృశ్యం

రాయచూరు రూరల్: విజయపుర జిల్లాలో అల్మట్టి ప్రధాన ఎడమ కాలువకు గండి పడడంతో సుమారు 200 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కాలువకు ముద్దేబిహాళ తాలూకా హరింద్రాళ వద్ద గండి పడడంతో రైతులు వేసుకున్న మొక్కజొన్న తదితర పంటలు నీటిలో కొట్టుకుపోయాయి. కాలువ మరమ్మతు పనులను నాసిరకంగా చేయడం వల్లే మళ్లీ కాలువకు గండి పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలని అధికారులను కోరారు. గండిని సత్వరం పూడ్చడంలో కేబీజేఎన్ఎల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు వాపోయారు.

యాదగిరి ఐసీడీఎస్ డీడీగా వీరనగౌడ



బాధ్యతలు చేపట్టిన వీరనగౌడకు సత్కారం

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) డిప్యూటీ డైరెక్టర్‌గా వీరనగౌడ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో రాయచూరు, విజయనగర జిల్లాల్లో విధులు నిర్వహించిన వీరనగౌడకు యాదగిరికి బదిలీ అయ్యింది. ఈసందర్భంగా రాయచూరు ఐసీడీఎస్ డీడీ చేతన్ కుమార్, సీడీపీఓలు మహేష్ కుమార్, గోకూర్ సాబ్‌లు ఉన్నారు.

డీడీపీఐ బదిలీకి వినతి



వినతిపత్రం అందిస్తున్న శివకుమార్ యాదవ్

రాయచూరు రూరల్: జిల్లా విద్యా శాఖాధికారి(డీడీపీఐ) వృషబేంద్రయ్యను బదిలీ చేయాలని జయ కర్ణాటక సంఘం అధ్యక్షుడు శివకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. డీడీపీఐ వృషబేంద్రయ్య రెండేళ్ల వ్యవధిలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఉపాధ్యాయులు బదిలీల్లో ముడుపులు అందుకొన్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం యాదగిరికి బదిలీ చేసినా ఇంతవరకు రాయచూరు నుంచి వెళ్లడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయనను, ఆ కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారులను వేరే చోటికి బదిలీ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

నిరంతర అభ్యాసమే విజయానికి సోపానం



జ్యోతి వెలిగిస్తున్న జడ్జి మారుతి బగాదె

రాయచూరు రూరల్: నిరంతర అభ్యాసంతో న్యాయవాద వృత్తిలో విజయం సాధించవచ్చని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మారుతి బగాదె పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలోని ఎస్‌సీఏబీ న్యాయ కళాశాలలో భూస్వాధీన చట్టం–2023పై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులు న్యాయం ఇప్పించాలన్నారు. బలమైన వాదనలు, ప్రతివాదనలతో న్యాయం లభిస్తుందన్నారు. న్యాయవాదులు కక్షిదారులకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. కళాశాల అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రిన్సిపాల్ పద్మ, కార్యదర్శి సునీల్ కుమార్, అధ్యాపకులు ఉమా, మల్లికార్జునయ్య, వసుంధర పాటిల్ పాల్గొన్నారు.

కేకేడీఎస్సెస్ కార్యవర్గం ఎంపిక



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి: కళ్యాణ కర్ణాటక దళిత సంఘర్షణ సమితి(కేకేడీఎస్సెస్) పదాధికారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు యల్లప్ప కట్టిమని మాట్లాడుతూ వెనుకబడిన కళ్యాణ కర్ణాటక ప్రాంత వాసుల అభివృద్ధికి ఆర్టికల్–371జే అమలు చేసినా సంపూర్ణంగా అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళితుల అభివృద్ధి కోసం ఈ ప్రాంతానికే ప్రత్యేక సమితిని ఏర్పాటు చేశామన్నారు. తమ సంఘం కొప్పళ జిల్లాధ్యక్షులుగా జమదగ్ని చౌడికి, కారటగి తాలూకా అధ్యక్షులుగా మల్లేశ్ ఋక్కనహట్టి, గంగావతి తాలూకా అధ్యక్షులుగా సుమిత్రకుమార్, కనకగిరి తాలూకా అధ్యక్షులుగా మంజునాథ్ బడిగేర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దళిత ప్రముఖులు పాల్గొన్నారు.

చాపకింద నీరులా ప్లాస్టిక్ భూతం

- హోటళ్లు, బేకరీల్లో యథేచ్ఛగా కవర్ల వాడకం
- పట్టించుకోని పాలికె, ఆహార శాఖ అధికారులు

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా హోటళ్లు, అంగళ్లలో ప్లాస్టిక్ కవర్ల వాడకం జరుగుతోంది. అంగళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించే మాట అటుంచితే కనీసం హోటళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడంలో పాలికె, ఆహార శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్ద పెద్ద హోటల్ యజమానుల నుంచి ఫుట్‌పాత్ హోటళ్ల వరకు ప్లాస్టిక్ వాడకం నానాటికీ పెరిగిపోతోంది. హోటళ్లలో వేడివేడి అన్నం, సాంబార్, పప్పు, దోశలు కూడా ప్లాస్టిక్ కవర్లలో వేసి పార్శిల్ చేసి పంపుతున్నారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు వేసి పార్శిల్ చేయడం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులంటున్నారు. అయినా ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. హోటళ్లలో చివరికి ఇడ్లీలు తయారు చేసే పాత్రలో కూడా ప్లాస్టిక్ కవర్లు వేసి ఇడ్లీలు తయారు



బేకరీల్లో వేడివేడి సమోసాలు, వెజ్‌పఫ్‌లను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి ఉంచిన దృశ్యం

చేస్తుండడంతో ప్లాస్టిక్‌లో ఉన్న ఆరోగ్యానికి కీడు చేసే కెమికల్, ఇతరత్రా పదార్థాలు నేరుగా ఇడ్లీలోకి వెళుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

పార్శిళ్లకు ప్లాస్టిక్ కవర్లే దిక్కు

భగభగమండే వేడిలో ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి ఇడ్లీ తయారు చేయడంతో మరింత అనారోగ్య సమస్య ఏర్పడుతుందని తెలిసినా కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రిస్తామని సంబంధిత అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. హోటళ్లతో పాటు బేకరీల్లో కూడా ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. చిన్న చిన్న బేకరీల నుంచి పేరొందిన బేకరీల వరకు వేడి వేడి బ్రెడ్‌లు,



హోటళ్లలో వేడివేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ముందుగానే సిద్ధం చేసిన దృశ్యం

సమోసాలు, ఆలూ బన్లు తదితర బేకరీల్లో తయారు చేసిన వేడివేడి ఆహార పదార్థాలు అన్ని కూడా ముందుగానే ప్లాస్టిక్ కవర్లలో పార్శిళ్ల రూపంలో సిద్ధంగా ఉంచి అమ్ముతున్నారు. ఈనేపథ్యంలో హోటళ్లు, బేకరీల్లో ప్లాస్టిక్ వాడకంపై తక్షణం అధికారులు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గిరిజనులకు అండగా ఉంటాం

మైసూరు: జిల్లాలోని హెచ్.డి.కోటె తాలూకాలోని సొళ్లెపుర హాడిలో ఉన్న ఏకలవ్య వసతి పాఠశాలలో గురువారం బుడకట్టు సముదాయం దినోత్సవాలను మంత్రి నాగేంద్ర ప్రారంభించారు. రాష్ట్రంలో ఉన్న చిట్టచివరి వ్యక్తులు అయిన బుడకట్టు సముదాయం ప్రజలకు అన్ని రకాల పథకాలు చేరడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకే విధానసౌధలో కాకుండా మీ వద్దకే వచ్చి ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు సంతోషంగా జీవించేలా వారికి చదువు, ఆరోగ్యం, ఉద్యోగం ఇలా అన్ని రకాల వసతులను కల్పిస్తామని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. మానసిక అస్వస్థతకు గురైన రాఘవేంద్ర కులకర్ణి(27) రాత్రి 10 గంటలప్పుడు ఎంకే గోపాలనగర్‌లోని ఇంటి నుంచి నడుచుకుంటూ బయటికెళ్లాడు. గురువారం ఉదయం ప్రశాంతనగర్ వద్ద మృతదేహం లభించినట్లు ఎస్పీ నిఖిల్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాలూకా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

చింతకుంట వద్ద కారు బోల్తా.. ఇద్దరి మృతి

- మృతులిద్దరూ బళ్లారి తాలూకావాసులు
- క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమం
- ఆస్పత్రిలో మరో ఐదుగురికి చికిత్స

సాక్షి,బళ్లారి/ఆలూరురూరల్: కారు బోల్తా పడిన ఘటనలో బళ్లారి తాలూకాకు చెందిన ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హాలహర్వి ఎస్ఐ నాగేంద్ర తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన ఏడుగురు స్నేహితులు మంత్రాలయానికి వెళ్తుండగా గురువారం తెల్లవారు జామున 3 గంటలకు కర్నూలు జిల్లా ఆలూరు తాలూకా హాలహర్వి మండలం చింతకుంట గ్రామ సమీపంలోని కట్రవంక వద్ద కారు బోల్తా పడింది. ఈ ఘటనలో బళ్లారిలోని పార్వతీ నగర్‌కు చెందిన మారుతీ(25), సింధగేరికి చెందిన రమేష్(28) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించగా వీరేష్, విశ్వనాథ్, నాగరాజు, మంజులకు తీవ్ర గాయాలు కావడంతో బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. యువరాజ్(30) అనే యువకుడు తీవ్రంగా గాయపడి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని, అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై హాలహర్వి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మారుతి, రమేష్ మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బళ్లారి వాసులు వీరే, (ఇన్‌సెట్‌లో మారుతీ, రమేష్)



ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసు అధికారి

ఇసుకాసురుల దాడిలో మాజీ జవానుకు గాయాలు

రాయచూరు రూరల్: జిల్లాలో అక్రమ ఇసుక రవాణా దందాను అడ్డుకోబోయిన మాజీ సైనికుడిపై ఇసుకాసురులు దాడి చేసి గాయపరిచిన ఘటన జిల్లాలోని మాన్వి తాలూకా చీకలపర్వి, మసలాపురల్లో జరిగింది. బుధవారం రాత్రి అక్రమ ఇసుక డంప్ కేంద్రాల వద్దకు వెళ్లిన నీలప్ప లింగసూగూరు అనే మాజీ సైనికుడిపై ఇసుక దందారాయుళ్లు మారణాయుధాలతో దాడి చేశారు. గాయపడిన మాజీ సైనికుడిని నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో ఆరుగురిపై మాన్వి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న అధికారులు

మారికుప్పం జీపీలో కాషాయం పాగా

కేజీఎఫ్: తాలూకాలోని మారికుప్పం జీపీ రెండో అవధి అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో బీజేపీ మద్దతు కలిగిన అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో బీజేపీ మద్దతు అభ్యర్థి శంకరరెడ్డి, కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి కాంతమ్మ నామినేషన్ దాఖలు చేశారు. 18 మంది సభ్యులు కలిగిన పంచాయతీలో 17 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. బీజేపీ మద్దతు అభ్యర్థి శంకరరెడ్డికి 9 ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థికి 8 ఓట్లు వచ్చాయి. దీంతో బీజేపీ మద్దతు అభ్యర్థి శంకరరెడ్డి 1 ఓటు తేడాతో విజయం సాధించారు. అదేవిధంగా ఉపాధ్యక్ష స్థానానికి పోటీ చేసిన బీజేపీ మద్దతు అభ్యర్థి బిందు సతీష్‌కు 9 ఓట్లు లభించి ఉపాధ్యక్షుడిగా ఎన్నిక అయ్యారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

మాస్తేనహళ్లి జీపీ జేడీఎస్ కైవసం

శ్రీనివాసపురం: మాస్తేనహళ్లి జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానానికి గురువారం నిర్వహించిన ఎన్నికల్లో జేడీఎస్ మద్దతు అభ్యర్థులు అధ్యక్షురాలిగా మమత నారాయణస్వామి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మి కెపి నాగేష్ ఎన్నికయ్యారు. 16 మంది సభ్యులు కలిగిన పంచాయతీలో మమత 8 ఓట్లతో గెలుపొందగా, ప్రత్యర్థి కాంగ్రెస్ మద్దతు అభ్యర్థిని భారతికి 7 ఓట్లు రాగా ఒక ఓటు చెల్లలేదు. ఉపాధ్యక్ష స్థానానికి పోటీ చేసిన లక్ష్మి కెపి నాగేష్ 10 ఓట్లతో విజయం సాధించారు. దీంతో వీరు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కెసి మంజునాథ్ ప్రకటించారు. ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి జీపీ కార్యాలయంలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందించారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం

బోనస్, కమీషన్ పెంచాలి

గంగావతి: ఎల్ఐసీ ఏజెంట్లకు బోనస్ కమీషన్ పెంచాలనే డిమాండ్‌తో లికాయి సంస్థ ఆధ్వర్యంలో ఎల్ఐసీ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేశారు. లికాయి మాజీ అధ్యక్షులు నిరుపాది మాట్లాడుతూ ఎల్ఐసీకి పునాది లాంటి ఏజెంట్లు కష్టపడి పాలసీలను చేయించి సంస్థను అత్యున్నత స్థాయికి చేరేలా చేశారన్నారు. ఏజెంట్ల శ్రమకు తగినట్లుగా కమీషన్, బోనస్‌ను పెంచాలన్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటినందున ఎల్ఐసీ యాజమాన్యం ఏజెంట్లకు సౌకర్యాలను కల్పించాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పదాధికారులు వలీ మొహినుద్దీన్, భీమా చౌహాన్, బాషా, బసవరాజ్ సజ్జన్ పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకారం



రాహుల్ పాండేను అభినందిస్తున్న సుఖదేవ్ పాండే

రాయచూరు రూరల్: జెడ్పీ సీఈఓగా రాహుల్ తుకారాం పాండే గురువారం తన కార్యాలయంలో అధికార బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనను దేవదుర్గ తాలూకా విద్యాశాఖాధికారి(బీఈఓ) సుఖదేవ్ పాండే అభినందించారు.

నెలాఖరులో ఉద్యోగుల భవనానికి భూమిపూజ

కోలారు: సుమారు రూ.3 కోట్ల వ్యయంతో ఉద్యోగుల భవనాన్ని నిర్మించడానికి ఆగస్టు నెల చివరి వారంలో భూమిపూజ చేస్తామని జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.సురేష్‌బాబు తెలిపారు. గురువారం నగరంలోని రోటరీ భవనంలో జిల్లా ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశంలో నివృత్త ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సన్మానించిన అనంతరం మాట్లాడారు. మూడంతస్తుల సుందర భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడానికి పలువురు దాతలు ముందుకు వచ్చారన్నారు. దీనికి తోడు జిల్లాలోని అనేక మంది ఉద్యోగులు తమ వంతు విరాళాలు ఇవ్వడానికి అంగీకరించారన్నారు. నివృత్త ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ వంతు సహకారం అందిస్తున్నారన్నారు. జిల్లా ఉద్యోగుల సంఘం నుంచి సెప్టెంబర్ నెల మూడో వారంలో ఉత్తమ సాధన చేసిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందిస్తామన్నారు. శాసన సభ ఎన్నికల దృష్ట్యా వాయిదా పడిన ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలను తుమకూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కె ఎస్ మంజునాథ్, ఉపాధ్యాయ గౌరవ బళగ అధ్యక్షుడు నారాయణస్వామి, జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, రవిచంద్ర పాల్గొన్నారు.



నివృత్త ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

హాస్టల్‌లో వికటించిన ఆహారం

- 30 మందికి పైగా విద్యార్థినులకు అస్వస్థత

హొసపేట: కలుషిత ఆహారం తిని 30 మందికి పైగా హాస్టల్ విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన నగరంలో గురువారం చోటు చేసుకుంది. నగరంలోని ప్రభుత్వ ఎస్సీ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో 148 మంది విద్యార్థినుల్లో 30 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినులను నగరంలోని సబ్ డివిజన్ స్థాయి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మరి కొందరికి వైద్యులు హాస్టల్‌లోనే మాత్రలు, ఇంజెక్షన్లు ఇచ్చి నయం చేశారు. బుధవారం రాత్రి హాస్టల్‌లో చికెన్ వడ్డించారు. మొత్తం 148 మంది విద్యార్థినుల్లో 17 మంది శాఖాహారం, మిగిలిన వారం మాంసాహారం తిన్నారు. చికెన్ తిన్న వారికి తెల్లవారు జామున 3 గంటల సమయంలో కడుపునొప్పి వచ్చింది. ఈ తర్వాత వాంతులు, విరేచనాలు కనిపించడంతో విద్యార్థినులను వెంటనే నగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్, జిల్లా కలెక్టర్ దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, ఏసీ నాంగ్‌జోయ్ అక్రమ్ అలీ షా ఆస్పత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు



ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్, అధికారులు



- గుంతలోకి దూసుకెళ్లిన బస్సు

మండ్య: జిల్లాలోని మళవళ్లి తాలూకా మారెహళ్లి వద్ద గురువారం కేఎస్సార్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి పడడంతో బస్సు డ్రైవర్ మహాదేవస్వామి, కండక్టర్ శివకాళయ్య గాయపడ్డారు. మళవళ్లి నుంచి మద్దూరు–కొళ్లేగాల వెళ్లే రోడ్డులో మారెహళ్లి వద్ద వంతెన నిర్మాణం జరుగుతోంది. ఈ సమయంలో 12 మంది ప్రయాణికులతో తలకాడు నుంచి బెంగళూరుకు వెళుతున్న బస్సు అదుపుతప్పి వంతెన కోసం తవ్విన గుంతలోకి దూసుకెళ్లింది. ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన డ్రైవర్‌ను, కండక్టర్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

21న రైతు నేత రాకేష్ టికాయత్ రాక

బళ్లారి టౌన్: దీర్ఘకాలంగా బకాయి ఉన్న తమ పంట రుణాలను 50 శాతం వరకు మాఫీ చేసి రుణాల నుంచి విముక్తి చేయాలని కర్ణాటక గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద చేపడుతున్న పోరాటంలో పాల్గొనడానికి భారతీయ కిసాన్ సమాఖ్య నేత రాకేష్ టికాయత్ ఈనెల 21న బళ్లారికి రానున్నట్లు రైతు పోరాటానికి మద్దతు తెలిపిన ఎమ్మెల్యే బీఆర్.పాటిల్ తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో రైతు సంఘం నేతలు ఆర్.మాధవరెడ్డి, చాగనూరు మల్లికార్జున రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. గత 230 రోజులుగా నిరంతరంగా బ్యాంక్ వద్ద ఆందోళన చేపట్టామని, అయితే ఇంత వరకు బ్యాంక్ పాలక మండలి స్పందించలేదన్నారు. దీంతో తమ పోరాటానికి మద్దతు తెలిపేందుకు ఆయన వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 22 జిల్లాల్లో దాదాపు రూ.40 లక్షల వరకు రుణాలు పొందారని గుర్తు చేశారు. ఈ పోరాటానికి రైతు సంఘం జాతీయ నేతలు ఎస్.జాన్సీ, డాక్టర్ సునాలేమ్ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నబసవన్న, ఆలీ బాబా, విరుపాక్ష తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

డీఎస్పీ చొరవతో మార్కుల జాబితా వితరణ

కోలారు: తాలూకాలోని ఐతరాసనహళ్లికి చెందిన దళిత విద్యార్థిని ఎ.సోనియా 2020–21వ విద్యా సంవత్సరంలో నగరంలోని ఎంఎస్‌జీ ఇంటర్ కళాశాలలో చదివింది. అయితే సోనియా తండ్రి అంజినప్ప తమ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 17 మంది విద్యార్థులను కళాశాలలో చేర్పించినందుకు గాను సోనియాకు ఫీజు లేకుండా ఉచితంగా చదవడానికి అవకాశం కల్పిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది. అయితే పరీక్షలు ముగిసిన అనంతరం ఇంటర్, టెస్ట్ మార్కుల జాబితా ఇవ్వాలని అడగగా ఫీజుల తాలూకా రూ.లక్ష బకాయి చెల్లిస్తే ఇస్తామని తెలిపారు. గతంలో తనకు ఇచ్చిన మాటను తండ్రి మంజునాథ్ గుర్తు చేసినా ఫలితం లేదు. ఫీజు కట్టాల్సిందేనడంతో చివరికి దశల వారీగా ఎలాగో రూ.33 వేలను చెల్లించి ఇంతకంటే చెల్లించలేనని తెలిపినా పట్టించుకోలేదు. దిక్కుతోచని స్థితిలో సోనియా తండ్రి అంజినప్ప, గ్రామానికి చెందిన మంజునాథ్‌తో కలిసి పౌర నిర్దేశనాలయ డీఎస్పీ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన డీఎస్పీ రమేష్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌ను, పాలక మండలికి చెందిన సందేష్‌ను పిలిపించి వారిని ఒప్పించి మార్కుల జాబితాను ఇప్పించారు. దీంతో సోనియా తల్లిదండ్రులు డీఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థిని సోనియాకు మార్కుల జాబితాను అందిస్తున్న డీఎస్పీ రమేష్

సేవాభావంతోనే సమస్యలకు పరిష్కారం

కోలారు: ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సేవాభావంతో పని చేసినప్పుడే ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించవచ్చని పీడబ్ల్యూడీ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్.చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. గురువారం నగరంలోని పాత్రికేయుల భవనంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పీడబ్ల్యూడీ శాఖ అధికారులకు అక్రమణల తొలగింపునకు కలెక్టర్, ఎస్పీలు ఎంతో సహకరించారన్నారు. పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బివి గోపినాథ్ మాట్లాడుతూ ఈఈ చంద్రశేఖర్ తన అవధిలో కోలారులో ఉత్తమ సేవలను అందించారని కితాబు నిచ్చారు. కార్యక్రమంలో పాత్రికేయుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కెఎస్ గణేష్, నివృత్త డీఎస్పీ పి శివకుమార్, భారతీయ కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు చదుమనహళ్లి ఇ సుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో ఇంధనం తయారీ యూనిట్

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలోనే ప్రప్రథమంగా చెత్తతో ఇంధనాన్ని తయారు చేసే యూనిట్‌ను రామనగర తాలూకా బిడదిలో ప్రారంభించినట్లు రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి కేజే జార్జ్ తెలిపారు. గురువారం బిడదిలోని కేపీసీఎల్ యూనిట్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ యూనిట్ అక్టోబర్‌లో ప్రారంభమవుతుందన్నారు. 15 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ యూనిట్‌ను రూ.280 కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్నామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కోలారు: నగరంలోని విశ్వేశ్వరయ్య స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ పదాధికారులు గురువారం పరిశీలించారు. క్రీడా మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి జిల్లా యంత్రాంగం టెండర్ ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించింది. పనులను పరిశీలించిన పదాధికారులు పనులు నత్తనడకన సాగుతుండడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పనుల ఆలస్యంతో స్టేడియంలో క్రీడా పోటీల నిర్వహణ సాధ్యం కావడం లేదన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి క్రీడాకారులకు అనుకూలం కల్పించాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మునియప్ప, ప్రధాన కార్యదర్శి కె ఆర్ రాఘవేంద్ర, సీనియర్ క్రీడాకారుడు హెచ్ జగన్నాథన్, గౌస్ ఖాన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

డయాలసిస్ యూనిట్‌ను సరిచేయరూ

కోలారు: కోలారులోని ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో తాగునీటి సమస్యతో పాటు డయాలసిస్ యూనిట్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు గురువారం నగరంలోని ఎస్ఎన్ఆర్ ఆస్పత్రి ముందు ధర్నా చేసి జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్ మూతపడడంతో పేద కిడ్నీ రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని పునః ప్రారంభించాలని కోరారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, వక్కలేరి హనుమయ్య, మూరాండహళ్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి సర్జన్‌కు గోడు వినిపిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

హత్యాయత్నం కేసులో అరెస్ట్



తుమకూరు: వ్యక్తిపై వేట కొడవలితో దాడి చేసిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన కుణిగల్ పట్టణంలో చోటుచేసుకుంది. నిందితులను ఆకాశ్, సాగర్, రాజన్న, ప్రసాద్‌లుగా గుర్తించారు. తుమకూరు జిల్లా కుణిగల్ పట్టణంలోని సీఐ కార్యాలయం సమీపంలో ఆరు రోజుల క్రితం జగదీశ్ అనే వ్యక్తిపై నలుగురు వేటకొడవలితో దాడి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశారు.

పట్టుబడిన డ్రగ్స్ ముఠా

శివాజీనగర: విదేశీ మహిళతో పాటు ఐదుగురు డ్రగ్స్ పెడ్లర్లను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 230 గ్రాముల ఎండీఎంఏ మాదక వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నైజీరియాకు చెందిన మహిళ, కేరళకు చెందిన నలుగురు డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. ఢిల్లీ నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు శేషాద్రిపురం పోలీసులు నిఘా ఉంచి నిందితులను పట్టుకున్నారు.

గంజాయి రవాణా, వ్యక్తి అరెస్ట్

మైసూరు: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 9 కిలోలకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గురువారం పోలీసులు మైసూరు నగరంలోని దాసప్ప సర్కిల్ సమీపంలో కేఆర్ఎస్ రోడ్డులో రైల్వే వంతెన ముందు భాగంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరి వ్యక్తుల బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో గంజాయి బయటపడింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

పులిదాడిలో ఆవు మృతి

మైసూరు: పులి దాడిలో ఆవు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా సరగూరు తాలూకా హాదనూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు అశోక్ కుమార్ తన వ్యవసాయ స్థలంలో ఆవులను పోషిస్తున్నాడు. ఇంటిల్లి పాది పొలం పనులకు వెళ్లిన సమయంలో పులి ఓ ఆవుపై దాడి చేసి చంపేసింది. మిగతా ఆవులు పులిని చూసి పరుగులు పెట్టాయి. వాటి అరుపులు విన్న రైతులు అక్కడికి చేరుకుని చూసే సరికి పులి పారిపోయింది. బాధిత రైతుకు పరిహారం ఇస్తామని అటవీ అధికారులు హామీ ఇచ్చారు.

టగ్ బోటులో అగ్నిప్రమాదం



ఇంజిన్‌లో నుంచి పొగలు వస్తున్న దృశ్యం

యశవంతపుర: కారవార వద్ద అరేబియా సముద్ర తీరంలో అర్గ కదంబ నౌకాదళంలోని డాక్ యార్డ్‌లో తేజ్ అనే టగ్ బోటు ఇంజిన్‌లో మంటలు వచ్చాయి. గురువారం టగ్ బోటు ఇంజిన్‌లో నుంచి ఆకస్మికంగా పొగలు రావడంతో నౌకాదళ ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చని సిబ్బంది అనుమానిస్తున్నారు. ఎవరికీ ఏమీ కాలేదు.

లారీలలో డీజిల్ చోరీ, ఇద్దరి అరెస్ట్



శివమొగ్గ: నిలిపి ఉంచిన లారీలలో డీజిల్ చోరీ చేస్తున్న ఇద్దరిని భద్రావతి హలెనగర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను శివమొగ్గ నగరంలోని టిప్పు నగర్‌కు చెందిన సోను, నూరుల్లాగా గుర్తించారు. వీరి వద్ద నుంచి 150 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 6న వీరిద్దరు భద్రావతి పట్టణంలోని శివని క్రాస్ వద్ద ఉన్న పెట్రోల్ బంకు వద్ద నిలిపి ఉంచిన లారీ నుంచి డీజిల్ కొట్టేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని వీరిని అరెస్ట్ చేశారు.

రాజీవ్ సద్భావన జ్యోతికి ఘన స్వాగతం



తుమకూరు: తమిళనాడు రాష్ట్రం శ్రీ పెరంబదూరు నుంచి ప్రారంభమైన రాజీవ్‌గాంధీ సద్భావన జ్యోతియాత్ర గురువారం తుమకూరు నగరానికి చేరుకోవడంతో ఆ పార్టీ జిల్లా కాంగ్రెస్ నేతలు జ్యోతికి ఘన స్వాగతం పలికారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వాగతం పలికారు. అనంతరం నగరంలోని పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లి అక్కడి నుంచి సద్భావన జ్యోతికి వీడ్కోలు పలికారు.

ప్రకృతి అందాల దాండేలి

- సాహస క్రీడలకు అనువైన ప్రాంతం
- పచ్చని కొండలకు నెలవు
- కనువిందు చేసే జలపాతాలు, జంతుజాలం



దాండేలి అభయారణ్యంలో కాళీనది పాయ



జోరున ప్రవహించే నదిలో సర్ఫ్ బోటింగ్

బనశంకరి: ఉత్తర కన్నడ జిల్లాలోని ఒక గ్రామం. దీని చుట్టూ దట్టమైన అడవులు పశ్చిమ కనుమలు, నదులు ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రానికి ఇదొక ప్రధాన పర్యాటక ప్రాంతంగా చెప్పవచ్చు. అప్పట్లో మైసూరు మహారాజులకు దాండేలి వేట విడిదిగా ఉండేదట. అరుదైన జంతుజాలాలతో దట్టమైన పచ్చని ప్రకృతి అందాలతో ఈ ప్రదేశం పర్యాటకులను కనువిందు చేస్తుంది. దాండేలి దండకారణ్యంలో ఉన్నది కనుక దాండేలి అని పేరొచ్చిందని కాదు, దండనాయక అనే రాజు ఇక్కడి అందాలకు మోహితుడై దీనికి దండయారణ్యం అని ఊరికి దండేలి అని పేరుపెట్టారని చెబుతారు.

దాండేలిలో వన్యజీవుల అభయారణ్యం ప్రసిద్ధి చెందినది. ఇది కర్ణాటకలో రెండవ పెద్ద వన్యప్రాణుల అభయారణ్యం. 2007లో టైగర్ రిజర్వు జోన్‌గా ప్రకటించారు. అభయారణ్యం చుట్టూ కావేరినది ప్రవాహాలు, కాళీనది, దాని ఉపనదులు ప్రవహిస్తుంటాయి. దాండేలి గోవాకు 125 కిలోమీటర్ల దూరంగా ఉండగా బెంగళూరు నుంచి 480 కిలోమీటర్లు దూరంలో ఉంది.

దండేలి వన్యజీవుల అభయారణ్యం

దాండేలి వన్యజీవుల అభయారణ్యం చేరిన తరువాత పర్యాటకులు అక్కడ దృశ్యాలను రివర్ వ్యాలీలను, కొండచరియలు చూడవచ్చు. వాటిని దాటుకుంటూ అలా ముందు కెళితే వివిధ రకాల వన్యజంతువులు, పక్షులు, జలచరాలు వీక్షించవచ్చు. 200 రకాల పక్షులు, 300కు పైగా జంతు జాతులకు ఈ అభయారణ్య నిలయంగా ఉంది. పులులు, జింకలు, గుంటనక్కలు, ఏనుగులు, దుప్పులు మొదలైన వాటితో పాటు అరుదైన పక్షులను చూడవచ్చు. పర్యాటకులు టాప్‌లెస్ జీపులో ప్రయాణించే గైడ్ ద్వారా వాటి వివరాలు తెలుసుకోవచ్చు.

కాళీనది

కాళీనదిలో పర్యాటకులు బోటింగ్ పడవ ప్రయాణం చేయవచ్చు. అక్కడ అనేక పక్షులు కనిపిస్తాయి. చెకుముకి పిట్టలు, మైనా కోకిల, ఎన్నో రకాల చిలుకలు వీక్షించవచ్చు. నదిపై గల వంతెన నుంచి పర్యాటకులు సదాశివఘడ్ పోర్ట్‌ను చూడవచ్చు. రాఫ్టింగ్‌పై ఆసక్తి కలిగిన వారికి ఈ నది ఎంతో అనుకూలంగా ఉంటుంది.

కుల్గి నేచర్ క్యాంప్

కుల్గి నేచర్ క్యాంప్ దాండేలి బస్టాండుకు 12 కిలోమీటర్లు దూరంలో ఉంది. అక్కడ నుంచి దండేలి వన్యజీవుల అభయారణ్యం కొద్దిదూరంలో ఉంటుంది. నేచర్ క్యాంపులో వసతిపై గుడారాలు ఉంటాయి. ఒక్కో గుడారానికి ఒక పక్షిపేరు పెట్టారు. వసతి కై దాండేలి వైల్డ్‌లైఫ్‌ను సంప్రదించండి.

శిరోలి పీక్

శిరోలిపీక్ దాండేలి నుంచి 25 కి.మీ దూరంలో ఉంది.. ఇది వన్యప్రాణుల అభయారణ్యం పరిధిలోకి వస్తుంది. శిరోలి శిఖరాన్ని చేరిన పర్యాటకులు అక్కడ నుంచి సహ్యాద్రి పర్వతాలను చూడవచ్చు. శిరోలిపీక్ ఉత్తర కన్నడ ప్రాంతంలో ఉన్నత శిఖరం కావటం వల్ల ట్రెక్కర్లు బాగా ఇష్టపడతారు. ఈ శిఖరం నుంచి సూర్యాస్తమనం చూసి ఆనందిస్తారు. పర్యాటకులు అటవీశాఖ అనుమతులతో ప్రవేశించవచ్చు.

ఇతర ఆకర్షణలు

దాండేలి ప్రదేశం కేవలం ప్రకృతి అందాలకే పరిమితం అనుకుంటే పొరబడినట్లే అక్కడ ఉల్లవి దేవస్థానం, సైక్స్ పాయింట్, సూపర్ హైడ్రో ఎలక్ట్రిక్ డ్యామ్, కవనాగుహలు, సిందేరి రాక్స్ వంటివి ఉన్నాయి.

దాండేలి ఏలా చేరుకోవాలంటే...

దాండేలి సమీపాన గోవాలోని డబోలిం అంతర్జాతీయ విమానాశ్రయం, బెలగావి విమానాశ్రయం కలదు. ఇక్కడ నుంచి క్యాబ్ లేదా ట్యాక్సీల్లో దండేలి చేరుకోవచ్చు. రైలులో వెళ్లాలంటే ముంబై లేదా బెంగళూరు నుంచి ప్రయాణించి లొండాకు చేరి అక్కడ నుంచి రోడ్డు మార్గంలో డండేలి చేరుకోవచ్చు. రోడ్డు మార్గంలో బెంగళూరు, గోవా, కారవార, ముంబై, బెలగావి, హుబ్లీ ప్రాంతాలనుంచి అనేక బస్సులు డండేలికి కలవు.



జింకను వేటాడుతున్న నక్కలు



అభయారణ్యంలో పర్యాటకుల సఫారీ



రాత్రి వేళల్లో చిరుతల సంచారం

ఉడుపిలో సీఐడీ ఏడీజీపీ పర్యటన

యశవంతపుర: ఉడుపిలోని ఓ నర్సింగ్ కళాశాలలో యువతుల నగ్న వీడియోల చిత్రీకరణకు సంబంధించి సీఐడీ ఏడీజీపీ మనీశ్ కర్బీకర్ విచారణకు ఉడుపి చేరుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కేసుకు సంబంధించి విచారణ అధికారిగా సీఐడీ డీఎస్పీ అంజుమాలాను నియమించినట్లు చెప్పారు. విచారణ అనంతరం నివేదిక కోర్టుకు సమర్పిస్తామని ఏడీజీపీ తెలిపారు.

క్రీడా విజేతలకు బహుమతులు



అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

బొమ్మనహళ్లి: విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొని రాణించాలని బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి అన్నారు. గురువారం హెచ్ఎస్ఆర్ లేఔట్‌లోని క్రీడా మైదానంలో బెంగళూరు దక్షిణలోని ఎళ్లకుంటె క్లస్టర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్.శ్రీనివాస్ రెడ్డి, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేపీటీసీఎల్ ఉద్యోగుల ధర్నా

శివాజీనగర: రాష్ట్ర కేపీటీసీఎల్ ఉద్యోగులు గురువారం వివిధ డిమాండ్ల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫ్రీడం పార్కులో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ...ఇంధన శాఖ కింద వచ్చే సబ్ స్టేషన్లలో పనిచేస్తున్న పాళి ఇంజనీర్ గ్రేడ్-1, పాళి ఇంజనీర్ గ్రేడ్-2, పాళి అసిస్టెంట్లు, గ్యాంగ్ మెన్స్, మీటర్ రీడర్సు తమ ప్రాణాలను పణంగాపెట్టి అత్యంత ప్రమాదకర పనులు చేస్తున్నారని, ఉద్యోగ భద్రత కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను పర్మినెంట్ చేయాలని, ఏదైనా ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబానికి రూ. 50 లక్షలు, దివ్యాంగులైతే రూ. 25 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ కారణాలతో సస్పెండైన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు.

ప్లాస్టిక్ ఉత్పత్తి రంగంలో విపుల అవకాశాలపై దృష్టి పెట్టాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న

బనశంకరి: ప్లాస్టిక్ ఉత్పాదక రంగంలో విపుల అవకాశాలపై పారిశ్రామికవేత్తలు దృష్టి సారించాలని ఆలిండియా ప్లాస్టిక్ తయారీ అసోసియేషన్ పాలక మండలి అధ్యక్షుడు అరవింద్‌మెహతా తెలిపారు. గురువారం నగరంలో నిర్వహించిన 4వ సమ్మేళనాన్ని అరవింద్ మెహతా ప్రారంభించి మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన అధ్యయనం ప్రకారం 2021–22లో భారత్ రూ. 37,500 కోట్ల విలువైన ప్లాస్టిక్ దిగుమతి చేసుకుందని, చైనా దేశం నుంచి 48 శాతం ప్లాస్టిక్ వస్తువులు దిగుమతి అవుతున్నాయని, దీన్ని తగ్గించి స్వావలంభన సాధించే దృష్టితో మనమంతా సన్నద్ధం కావాలన్నారు. ఈ దృష్టితో ఏఐపీఎంఏ దేశంలోని 6 వలయాల్లో ప్లాస్టిక్ రంగంలో విపుల అవకాశాల పట్ల జాగృతం చేసే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా అభియాన్‌తో దేశంలో ప్లాస్టిక్ రంగాన్ని వేగవంతం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో చిన్నతరహా పరిశ్రమల సంఘం అధ్యక్షుడు సీఏ.శశిధరశెట్టి, కర్ణాటక ఉద్యోగమిత్ర ఎండీ దొడ్డబసవరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం ప్రారంభం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గౌరిబిదనూరు: ప్రభుత్వం ప్రజల సౌలభ్యాల కోసం ఎన్నికలకు ముందు ప్రకటించిన గ్యారంటీ పథకాలను దశల వారీగా అమలు చేస్తోందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కెహెచ్ పుట్టస్వామిగౌడ తెలిపారు. గురువారం ఉదయం తాలూకా విదురాశ్వత్థంలోని ఎన్సీ నాగయ్యరెడ్డి సభాభవనంలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. తహసీల్దారు మహేశ్ పత్రి, బెస్కాం ఏఈఈ పరమేశ్వర్, దొడ్డకురుగోడు జీపీ అధ్యక్షుడు శంకరప్ప, ఉపాధ్యక్షురాలు హనుమక్క పాల్గొన్నారు.

పౌష్టికాహారంలో బొద్దింకలు



విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణ సమీపంలోని హారహళ్లి పంచాయతీ పరిధి బుళహళ్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పంపిణీ చేసిన పౌష్టికాహారంలో బొద్దింకలు కనిపించాయి. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందజేసే ఈ పాకెట్లలో బొద్దింకలు కనిపించడంపై స్థానికుడు పోజప్ప తీవ్రంగా మండిపడ్డారు. ఈ విషయంపై కేంద్రం సహాయకురాలిని అడగ్గా పాకెట్లు అన్ని కేంద్రాలకు పంపినట్లే తమకు పంపించారని, ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

13న బ్రహ్మకుమారీల సభ

గౌరిబిదనూరు: నగరంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం 10 వార్షికోత్సవం ఈ నెల 13 ఆదివారం వైభవంగా జరుపనున్నట్లు స్థానిక కేంద్ర ముఖ్యస్థురాలు పద్మక్క గురువారం తెలిపారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సంచాలకులైన లీలా బెహన్‌జీ, ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ, గీతా బెహన్ జీ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

మాజీ కార్పొరేటర్ కొడుకు ఆత్మహత్య



గౌతమ్ (ఫైల్)

యశవంతపుర: నగరంలో అత్తిగుప్పె వార్డు బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ దొడ్డయ్య కొడుకు గౌతమ్ (29) ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం రాత్రి గౌతమ్ ఇంటిపై నుంచి దూకడంతో తీవ్ర గాయాలతో మరణించాడు. చంద్రా లేఔట్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. గౌతమ్‌కు పెళ్లి చేయాలని ఇటీవల తల్లిదండ్రులు అమ్మాయిని చూశారు. అయితే గౌతమ్ కాంట్రాక్ట్ పనులు చేశాడని, బిల్లులు రాని కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని బీజేపీ నాయకులు ఆరోపించారు.

పరిహారం కోసం మొర

క్రిష్ణగిరి: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి పాతపేటలో గత నెల 29వ తేదీ టపాసుల గిడ్డంగి పేలిపోయి చుట్టుపక్కల వారికి చెందిన ఇళ్లు, భవనాలు ధ్వంసం కాగా, పరిహారం అందజేయాలని బాధితులు జిల్లా కలెక్టర్ శరయుకి వినతిపత్రం అందజేశారు. గోదామును ఆనుకుని ఉన్న 7 దుకాణాలు, ఓ ఇల్లు నేలమట్టం కాగా, 9 మంది మృతి చెందగా మరో 15 మందికి గాయాలు తగిలాయి. ఈ ప్రమాదంలో దుకాణాలు, ఇల్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బాధిత ప్రజలు వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు చేపడతామని కలెక్టర్ బాధితులకు హామీ ఇచ్చారు.

ఈషా ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడలు

చిక్కబళ్లాపురం: నగర సమీపంలోని అగలగుర్కి సీపీఎడ్ ప్రభుత్వ కళాశాలలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈనెల 12, 13 తేదీలలో గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఈషా ఫౌండేషన్ ట్రస్ట్ స్వామి తెలిపారు. గురువారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...మహిళలకు త్రోబాల్, పురుషులకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. త్రోబాల్ పోటీలకు రూ. 2 లక్షలు, వాలీబాల్ విజేతలకు రూ. 5 లక్షలు బహుమతిగా అందజేస్తామన్నారు. సమావేశంలో ట్రస్ట్ రాఘవేంద్ర, ఆరతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వాయిద్య కచేరి

ప్రశాంతి నిలయం: హర్యానా చండీఘడ్ సత్యసాయి భక్తుల సంగీత వాయిద్య కచేరి భక్తులను అలరించింది. పర్తియాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం సత్యసాయి సన్నిధిలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హర్యానా, చండీఘర్ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో నాథ్ వాయిద్య కచేరి నిర్వహించారు.

బైక్‌లు ఢీ, ఇద్దరు దుర్మరణం

మైసూరు: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకా దేవలాపుర సమీపంలో చోటుచేసుకుంది. నెమ్మనహళ్లి గ్రామానికి చెందిన దేవేశ్, ప్రకాశ్ అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ప్రమాదంలో శ్రుతి అనే మహిళ గాయపడింది. ఆమెను ఆస్పత్రికి తరలించారు. సరగూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిశ్చితార్థం చేసుకుని మరొకరితో జంప్

బనశంకరి: రెండేళ్లపాటు పరస్పరం ప్రేమించుకుని ఇద్దరి ప్రేమ విషయం తెలిసి ఇంట్లో నిశ్చితార్థం చేశారు. అయితే పెళ్లి కొద్ది రోజులు ఉండగా యువతి మరో యువకుడితో పారిపోయింది. నగర శివారులోని ఆవలహళ్లి నివాసి జోసెఫ్ అనే యువకుడు రెండేళ్లుగా క్యాత్రిన్ అనే యువతిని ప్రేమించాడు. యువతి కూడా జోసెఫ్‌ను ఇష్టపడింది. వివాహానికి రెండు నెలలు సమయం ఉంది. అంతలోగా యువతి మరో యువకుడితో పారిపోయింది. నిశ్చితార్థం అయిన యువకుడు కాబోయే అత్తకు వివాహ ఖర్చుల కోసం రూ.5 లక్షలు ఇవ్వగా యువతి ఉడాయించడంతో తన డబ్బు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె నిరాకరించడంతో బాధితుడు జోసెఫ్ ఆవలహళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టాడు.

ఎక్స్‌ప్రెస్ వేపై ప్రమాదం



ప్రమాద దృశ్యం

దొడ్డబళ్లాపురం: కారు–లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే పై చోటుచేసుకుంది. చెన్నపట్టణ తాలూకా తిట్టమారనహళ్లి వద్ద బెంగళూరు నుంచి శ్రీరంగపట్టణం వెళ్తున్న కారు అదుపుతప్పి పాల లారీని ఢీకొంది. ప్రమాద తీవ్రతకు కారు పక్క రోడ్డులోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే గాయపడ్డవారి వివరాలు తెలిసిరాలేదు. చెన్నపట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

యశవంతపుర: దావణగెరె గ్రామాంతర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. డాగ్‌స్కాడ్ సాయంతో నిందితుడిని పట్టుకున్నారు. వివరాలు... దావణగెరె శ్రీరామనగర నివాసి లలితమ్మ తన చెల్లెలు తిమ్మక్క కొడుకు నరసింహ (26) హత్యకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. పోలీసు శునకం దాదాపు 8 కి.మీ పరుగు తీసి నిందితుడిని పట్టించింది. నిందితుడు శివమోగి అలియాస్ యోగి వద్ద నరసింహ రూ.35 వేలు నగదు తీసుకున్నారు. పనికి రాకుండా, డబ్బులు కూడా ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో నరసింహను హత్య చేసి పరారయ్యాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీస్ బృందాన్ని ఎస్పీ రామగొండ అభినందించారు.

హోసూరు వార్తలు..

వన్యమృగాల బాధితులను ఆదుకోవాలి



ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు

కెలమంగలం: అటవీ ప్రాంతాల్లో వన్యమృగాల దాడుల వల్ల ధ్వంసమైన పంటలకు పరిహారం చెల్లించడం లేదంటూ గురువారం బీజేపీ నాయకులు ఆందోళన చేశారు. తళి అటవీశాఖ కార్యాలయం ముందు ధర్నాలో బీజేపీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ఎం. నాగరాజ్ మాట్లాడుతూ తళి, జవుళగిరి తదితర ప్రాంతాల్లో ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. బాధిత రైతులకు పరిహారం అందజేయడంలో అటవీశాఖాధికార్లు నిర్లక్ష్యంగా ఉన్నారని, రైతులు, ప్రజలు కూడా జంతువుల దాడుల్లో చనిపోతున్నారని చెప్పారు. జవుళగిరి అటవీ ప్రాంతంలో నిలిపి వేసిన ముళ్ల కంచె పనులను పనులను పూర్తి చేయాలని, మృతి చెందిన బాధిత కుటుంబానికి రూ. 50 లక్షలు పరిహారం చెల్లించాలని, అడవి పందులను కాల్చి చంపేందుకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెళ్లి రద్దు చేశారని వక్కతోట ధ్వంసం

మైసూరు: వక్కతోటను దుండగులు ధ్వంసం చేసిన ఘటన మైసూరు జిల్లా హుణసూరు తాలూకా మనుగనహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ మూడు ఎకరాల్లో అల్లం, ఒక్కచెట్లు సాగు చేశాడు. ఈ క్రమంలో అతను నాటిన 850 మొక్కలను పెరికివేశారు. ఇదిలా ఉంటే బాధిత రైతు తన కుమార్తెను అశోక్ అనే వ్యక్తితో పెళ్లి నిశ్చయించాడు. అయితే అదే గ్రామానికి చెందిన అశోక్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో పెళ్లి రద్దు చేసుకున్నారు. దీంతో ఆగ్రహించిన అశోక్ వక్కచెట్లను పెరికివేయించినట్లు బాధిత రైతు ఆరోపించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వేర్వేరుగా ఇద్దరి ఆత్మహత్య

హోసూరు: వేర్వేరు కారణాలతో యువకుడు, వృద్ధురాలు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన గురువారం వెలుగు చూసింది. హోసూరు పారిశ్రామికవాడ చిన్నయలసగిరి ప్రాంతానికి చెందిన దీపక్ నారాయణ (19) అనే యువకునికి తాగుడు అలవాటుండేది. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికెళ్లిన అతను ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. అలాగే నాగొండపల్లికి చెందిన రామచంద్రన్ భార్య గౌరమ్మ (63) కొన్నిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. ఈ ఘటనలపై స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు.

టపాసుల ప్రమాదంపై ఫిర్యాదు

కెలమంగలం: కెలమంగలం దగ్గర జె.కారుపల్లి వద్ద నిర్వహిస్తున్న టపాసుల ఫ్యాక్టరీలో మూడు రోజుల కిందట అధికారులు తనిఖీలు చేస్తుండగా పేలుడు జరగడం తెలిసిందే. దీనిపై గ్రామాధికారి కెలమంగలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పేలుడులో ఆర్డీవో బాలాజీ, తహసీల్దార్, ఫ్యాక్టరీ ఉద్యోగికి కాలిన గాయాలు అయ్యాయి. వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని జే. కారుపల్లి గ్రామాధికారి రాజీవ్ కెలమంగలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హాస్టల్ భవనం ప్రారంభం

హోసూరు: హోసూరు ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న బీసీ, ఎస్టీ విద్యార్థుల కోసం కొత్తగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని చెన్నై నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ శరయు, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్, మేయర్ సత్య, కమిషనర్ స్నేహ, సబ్‌కలెక్టర్ శరణ్య తదితరులు పాల్గొని జ్యోతి వెలిగించారు. కలెక్టర్ మాట్లాడుతూ వంద మంది విద్యార్థులకు సరిపడేలా పక్కాభవనం నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, అధికారులు పద్మలత, స్వామినాథన్, పళనిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన దొంగలు అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు

హోసూరు: హోసూరు ప్రాంతంలో ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న ఇద్దరిని సిప్‌కాట్ పోలీసులు అరెస్ట్ చేసి 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... హోసూరు ప్రాంతంలో ద్విచక్ర వాహనాల అపహరణపై డీఎస్పీ బాబు ప్రశాంత్‌కు రహస్య సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు పోలీసులు బుధవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఆ మార్గంలో వెళ్తున్నప ద్విచక్ర వాహనాన్ని అడ్డగించి విచారణ చేయగా అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి విచారణ చేయగా హోసూరు చుట్టుక్కల ప్రాంతాల్లో 20 ద్విచక్ర వాహనాలను అపహరించినట్లు తేలింది. నిందితులను దిన్నూరు ప్రాంతానికి హరీష్‌కుమార్, డెంకణీకోటకు చెందిన షేక్‌ఖాదర్‌గా గుర్తించారు.

క్లుప్తంగా...

కాపు సంక్షేమంపై చర్చకు సిద్ధమా?

చంద్రబాబు, పవన్‌కు కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషు సవాల్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాపు సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేశ్‌తో పాటు పవన్‌కళ్యాణ్‌కు ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి సవాల్ విసిరారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. కాపు సంక్షేమం, కాపు కార్పొరేషన్‌పై టీడీపీ, దాని అనుబంధ ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. కాపు నేస్తం పథకం ఎన్నికల హామీ కాకపోయినా కూడా.. కాపులకు మేలు చేసే మంచి ఆలోచనతో సీఎం జగన్ అధికారం చేపట్టిన వెంటనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా 20 లక్షల మంది కాపులకు రూ.12,900 కోట్ల మేర లబ్ధి చేకూర్చారని వివరించారు.

'పంచాయతీ'నిధులు దోపిడీ

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): పంచాయతీల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటున్నదని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం సర్పంచ్ అకౌంట్లలో వేసిన డబ్బులను వేరే సంక్షేమ పథకాలకు మళ్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నేతృత్వంలో పాతజైలు రోడ్డు ప్రభుత్వ మహిళా కళాశాలకు ఎదురుగా గల రోడ్డులో గురువారం మహాధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. గ్రామ పంచాయతీలకు సమాంతర సచివాలయ వ్యవస్థను రద్దు చేయాలని, కాంట్రాక్టర్ల బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

నా విషయంలో పవన్‌ది 100% తప్పే: రేణుదేశాయ్



సాక్షి, అమరావతి: తన విషయంలో పవన్ కళ్యాణ్ చేసింది 100 శాతం తప్పేనని పవన్ కళ్యాణ్ మాజీ భార్య సినీ నటి రేణుదేశాయ్ స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ చేసిన తప్పులకు ఆయన మాజీ భార్యలు, పిల్లలకు ఎటువంటి బాధ్యత లేదు కాబట్టి రాజకీయ, వృత్తిపరమైన విభేదాల్లోకి వారిని లాగవద్దంటూ విజ్ఞప్తి చేస్తూ గురువారం ఓ వీడియోను రిలీజ్ చేశారు. ఈ మధ్య విడుదలైన పవన్‌కళ్యాణ్ సినిమా వివాదాలు సృష్టించిందని, ఆ సమయంలో తాను విదేశాల్లో ఉండటంతో ఏమి జరిగిందన్న విషయం తెలియలేదని చెప్పారు. ఆ సినిమా తర్వాత కొంతమంది పవన్ మాజీ భార్యలు, పిల్లలు మీద సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చేయనున్నట్లుగా ప్రకటించిన విషయం తెలిసిందని, పవన్‌తో రాజకీయ, వృత్తిపరమైన విభేదాలు ఏమైనా ఉంటే మీరు మీరు చూసుకోండి కానీ ఇందులోకి మహిళలను, పిల్లలను లాగవద్దని పేర్కొన్నారు.

నీకెందుకు భయపడాలి?

వారాహి యాత్రలో పవన్ కళ్యాణ్

సాక్షి, విశాఖపట్నం: 'జగన్.. నీకెందుకు భయపడాలి. నువ్వేమైనా పైనుంచి దిగొచ్చావా. నువ్వొక డెకాయిట్. నువ్వు రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయవు. ఆంధ్రా నీ నేల లాగా.. మేమంతా నీకు బానిసల్లాగా చూస్తున్నావు. పోలీసులను, అధికారులను భయపెడతావు. ప్రతి ఒక్కరినీ భయపెడతావు. ఎందుకు భయపడాలి నీకు? నీ ఇష్టానికి కూర్చుని చేస్తుంటే మేం చూస్తూ ఉంటామా?' అని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. వారాహి యాత్రలో భాగంగా గురువారం రాత్రి విశాఖ జగదాంబ జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణ నుంచి రాష్ట్రం విడిపోవడానికి కారణం కూడా వైఎస్ జగనే అని ఆరోపించారు. విశాఖలో తాను ఇల్లు తీసుకుని ఉంటానని చెప్పారు. ముఖ్యమంత్రిని కావాలని తాను అనుకుంటే చాలదని, ప్రజలంతా అనుకోవాలని పేర్కొన్నారు. తనకు వ్యతిరేకంగా మాట్లాడే వారిపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానని పవన్ చెప్పారు. విశాఖ 'స్టీల్‌ప్లాంట్' అంటూ ప్రస్తావించి.. వెంటనే మాట మార్చేశారు.

పవన్‌ది మోదీ యాత్ర

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు పాల్



సాక్షి,రాజమహేంద్రవరం/వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): జనసేన పవన్‌కళ్యాణ్ చేస్తోంది వారాహి యాత్ర కాదని, ప్రధాని మోదీ వద్ద ప్యాకేజీ తీసుకుని ఆయన్ని గెలిపించేందుకు చేస్తున్న మోదీ యాత్ర అని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ విమర్శించారు. ఆయన గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోను, ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోను విలేకరులతో మాట్లాడారు. పవన్ ప్యాకేజీ తీసుకుని బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని ఆరోపించారు. జనసేనలో చేరతానని చిరంజీవి లీకులిస్తున్నారని చెప్పారు. చిరంజీవి రూ.5 వేలకోట్లు తీసుకుని ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారని ఆరోపించారు. ప్రజారాజ్యం పార్టీలో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లకు రూ.1,500 కోట్లు వసూలు చేశారన్నారు. చిరంజీవి తన వద్ద ఉన్న వేలకోట్ల రూపాయల్ని కాపాడుకునేందుకు, పవన్ ప్యాకేజీ డబ్బులకు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. బుద్ధి ఉన్నవాళ్లు ఎవరైనా అలాంటి పార్టీలో ఉంటారా? అని ప్రశ్నించారు.

రామోజీ, కిరణ్, శైలజలపై ప్రాథమిక ఆధారాలున్నాయి

'ఈనాడు' తప్పుడు కథనాలపై సీఐడీ చేసిన ఫిర్యాదుపై స్పందించిన న్యాయస్థానం

- నిందితులతోపాటు ఆ పత్రిక పాత్రికేయులకు సమన్లు జారీ
- తదుపరి విచారణ నవంబర్ 25కి వాయిదా
- ఆ రోజున నిందితుల వ్యక్తిగత హాజరుకు ఆదేశాలు
- సీఐడీ విశ్వసనీయతను దెబ్బతీసేలా 'ఈనాడు' విషపూరిత కథనాలు
- ఇలాంటి వాటిని అడ్డుకోకపోతే అరాచకం రాజ్యమేలుతుంది
- కోర్టుకు నివేదించిన అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్ చట్టవిరుద్ధ కార్యకలాపాలు, నిధుల మళ్లింపు, ఇతర ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న ఏపీ సీఐడీపై ×ఈనాడు× పత్రిక ప్రచురిస్తున్న అసత్య, తప్పుడు కథనాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇచ్చిన ఫిర్యాదుపై గుంటూరు న్యాయస్థానం స్పందించింది. ఈ ఫిర్యాదులో నిందితులపై చేసిన ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలున్నాయని తెలిపింది. ఆ తర్వాతే ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఈ ఫిర్యాదును విచారణకు స్వీకరించారని వెల్లడించింది. ఈ ఫిర్యాదులో నిందితులుగా ఉన్న ఈనాడు అధినేత రామోజీరావు, మార్గదర్శి చిట్‌ఫండ్ లిమిటెడ్ ఎండీ శైలజా కిరణ్, ఈనాడు ఎండీ కిరణ్, ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, చీఫ్ ఆఫ్ న్యూస్ బ్యూరో నన్నపనేని విశ్వప్రసాద్, హైదరాబాద్ బ్యూరో చీఫ్ ఎం.నరసింహారెడ్డి, ఏపీ బ్యూరో చీఫ్ కనపర్తి శ్రీనివాసులు, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లకు సమన్లు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 25కి వాయిదా వేసింది. ఈ మేరకు గుంటూరు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి సీహెచ్.రాజగోపాలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నవంబర్ 25న రామోజీరావు, కిరణ్, శైలజా కిరణ్‌లతో సహా మిగిలిన వారందరూ వ్యక్తిగతంగా కోర్టు ముందు హాజరు కావాల్సి ఉంటుంది. ఆ రోజున న్యాయస్థానం ఇచ్చే ఆదేశాల మేరకు వారు పూచీకత్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కేసు విచారణ మొదలవుతుంది.

ఈనాడు తప్పుడు, విష కథనాలపై ఫిర్యాదు..

మార్గదర్శి అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న సీఐడీపై ఈనాడు వరుసగా తప్పుడు కథనాలు ప్రచురిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా 'మార్గదర్శిపై భారీ కుట్ర' అంటూ ఓ కథనం ప్రచురించింది. ఇందులో సీఐడీపై పలు అసత్య, నిరాధార ఆరోపణలు చేసింది. ఈ నేపథ్యంలో ఈనాడు ఎడిటర్, ఇతరులపై సీఆర్‌పీసీ సెక్షన్ 199(2) కింద ఫిర్యాదు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. అలాగే ఈనాడు, రామోజీరావు తదితరులపై గుంటూరు కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాఖలు చేసే ఫిర్యాదులో వాదనలు వినిపించే బాధ్యతలను అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి అప్పగించింది. దీంతో గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలై 4న కోర్టులో సీఆర్‌పీసీ సెక్షన్ 199(2) కింద ఫిర్యాదు దాఖలు చేశారు. దీంతోపాటు ఈనాడు ప్రచురించిన కథనం, ఫిర్యాదుల కాపీలు, ఎఫ్ఐఆర్‌లు, రామోజీరావు, కిరణ్‌ల వాంగ్మూలం, శైలజా కిరణ్ రిమాండ్ రిపోర్టులు తదితరాలను అందించారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి దీన్ని మరో న్యాయమూర్తికి పంపారు. ఈ నేపథ్యంలో ఈ ఫిర్యాదుపై మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి సీహెచ్ రాజగోపాలరావు గురువారం విచారణ జరిపారు.

సీఐడీ మనోస్థైర్యం దెబ్బతీసేలా తప్పుడు కథనాలు..

ఫిర్యాదుదారు తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చట్టప్రకారం చిట్ రిజిస్ట్రార్లు మార్గదర్శి చిట్‌ఫండ్‌లో చేసిన తనిఖీల్లో ఆ సంస్థ అక్రమాలు, అవకతవకలు బయటపడ్డాయన్నారు. దీంతో వాటిపై చిట్ రిజిస్ట్రార్లు సీఐడీకి ఫిర్యాదు చేశారని, దీని ఆధారంగా సీఐడీ విచారణ మొదలు పెట్టిందన్నారు. సీఐడీ చట్టప్రకారమే నడుచుకుంటున్నా దాని మనో, నైతిక స్థైర్యాలు దెబ్బతీసేలా ఈనాడు యాజమాన్యం తప్పుడు కథనాలు ప్రచురిస్తోందని కోర్టుకు నివేదించారు. సీఐడీ విశ్వసనీయతను దెబ్బతీసేందుకే ఈనాడు ఇలా చేసిందన్నారు. ఇలాంటి వాటిని అడ్డుకోకపోతే ఈనాడు యాజమాన్యం చేస్తున్న పనులకు అనుమతి ఇచ్చినట్లేనన్నారు. టీవీల్లో చర్చా కార్యక్రమాలు పెడుతూ న్యాయమూర్తులను లంచగొండులుగా చిత్రీకరిస్తున్నారని, దీన్ని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరువు, ప్రతిష్టలు ఎవరికైనా ఒకటేనని, వాటిని పరిరక్షించేందుకు న్యాయస్థానాలు ముందుకు రాకపోతే సమాజంలో అరాచకం రాజ్యమేలుతుందని తెలిపారు. 'ప్రభుత్వాలను నిలబెట్టేది మేమే.. కూల్చేది మేమే' అన్నట్లు ఈనాడు యాజమాన్యం వ్యవహరిస్తోందని.. ఇలాంటి తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని సుధాకర్‌రెడ్డి న్యాయస్థానానికి నివేదించారు. అందువల్ల ఈనాడు తప్పుడు, విష కథనాలు విషయంలో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆయన అభ్యర్థించారు.

నేడు 'వైఎస్సార్ సున్నా వడ్డీ' నగదు జమ

సాక్షి, అమరావతి: వరుసగా నాలుగో ఏడాదీ వైఎస్సార్ సున్నా వడ్డీ (మహిళలు) పథకం అమలుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత గల 9.48 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 1,05,13,365 మంది అక్కచెల్లెమ్మలు బ్యాంకులకు చెల్లించిన రూ.1,353.76 కోట్ల వడ్డీని రీయింబర్స్ చేస్తూ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి నేరుగా నగదు జమ చేస్తారు. ఈ రూ.1,353.76 కోట్లతో కలిపి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఇప్పటివరకు అందించిన మొత్తం సాయం రూ.4,969.05 కోట్లు అవుతుంది. పేద అక్కచెల్లెమ్మలకు సాధికారత కల్పిస్తూ.. వారు చేస్తున్న వ్యాపారాలకు ఊతమిచ్చేలా సున్నా వడ్డీకే రుణాలు అందించి, వారి జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరుస్తున్న సంగతి తెలిసిందే.

- ▲ ఈ క్రమంలో బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మల మీద వడ్డీ భారం పడకుండా వారి తరఫున ఆ భారాన్నీ వైఎస్సార్ సున్నా వడ్డీ కింద నేరుగా పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తోంది.
- ▲ అక్కచెల్లెమ్మలు వారి కాళ్ల మీద వారు నిలబడేలా.. వారి జీవనోపాధి మెరుగుపడేలా బహుళజాతి దిగ్గజ కంపెనీలు, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుని వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాలతో సుస్థిర ఆర్థికాభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం బాటలు వేసింది.
- ▲ ప్రభుత్వం చొరవ తీసుకుని బ్యాంకులతో మాట్లాడి వడ్డీరేట్లు తగ్గింపచేయడంతో అక్కచెల్లెమ్మలపై రూ.1,224 కోట్ల మేర వడ్డీ భారం తగ్గింది. దీంతో ఏటా రూ.30 వేల కోట్లకు పైగా రుణాలు అందుకుని.. వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటూ.. రుణాల రికవరీలో సైతం 99.67 శాతంతో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచి అక్కచెల్లెమ్మలు ఆర్థిక పరిపుష్టిని సాధించారు.
- ▲ ప్రభుత్వ సహకారంతో పశువుల కొనుగోలు, కిరాణా దుకాణాలు, వస్త్ర వ్యాపారాల వంటివి చేసుకుంటున్న 16,44,029 మంది అక్కచెల్లెమ్మలకు నెలకు రూ.7,000 నుంచి రూ.10,000ల వరకు అదనపు ఆదాయం. అమూల్‌తో ఒప్పందం కారణంగా మార్కెట్‌లో పోటీ పెరిగి లీటర్ పాలపై రూ.20 వరకు అదనపు ఆదాయం కూడా లభిస్తోంది.

నేడు అమలాపురానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్



సాక్షి, అమలాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శుక్రవారం డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం జనుపల్లిలో పర్యటించనున్నారు. ఇందు కోసం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి అమలాపురంలోని పోలీస్ గ్రౌండ్‌కు సీఎం జగన్ చేరుకుంటారు. అక్కడి నుంచి జనుపల్లి గ్రామానికి చేరుకొని.. బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా నాలుగో విడత వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద పొదుపు మహిళల ఖాతాల్లో వడ్డీ డబ్బును ముఖ్యమంత్రి జగన్ జమ చేస్తారు. కార్యక్రమం అనంతరంఅమలాపురానికి వచ్చి.. అక్కడి నుంచి తాడేపల్లిలోని నివాసానికి సీఎంజగన్ చేరుకుంటారు.

వంశధార పనులు చేసింది నేనే

- సిక్కోలు పర్యటనలో చంద్రబాబు
- బాబును నిలదీసిన నిర్వాసితులు



ఎల్.ఎన్.పేట/కొత్తూరు (శ్రీకాకుళం): వంశధార ప్రాజెక్టు పనులను తానే చేపట్టానని.. తానే పూర్తి చేశానని ప్రతిపక్ష నేత చంద్రబాబు చెప్పారు. ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా గురువారం శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మరోసారి అధికారం ఇస్తే వంశధార నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తే విద్యుత్ చార్జీలు పెంచనని, అవకాశం కలిసి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత అంచలంచెలుగా 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని స్పష్టం చేశారు. వలంటీర్లు తప్పుడు పనులు చేసుకుని తిరుగుతున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని, 18 ఏళ్లు పైబడిన వారి నుంచి పింఛన్ వచ్చేంత వరకు ప్రతినెలా ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. తల్లికి వందనం పేరుతో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న తనపై తప్పుడు కేసులు పెడుతున్నారని, హత్యాప్రయత్నం కేసు నమోదు చేశారని అన్నారు. పోలీసులు తమను కాపాడాలని, తర్వాత వారికి సహకరిస్తామని చెప్పారు.



నిరసన తెలిపేందుకు వస్తున్న నిర్వాసితులను రోప్ సాయంతో అడ్డుకున్న పోలీసులు

వంశధార నిర్వాసితుల నిరసన

చంద్రబాబు కొత్తూరు మండలం గూనభద్ర వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కేవలం టీడీపీ నాయకులు మాత్రమే హాజరయ్యారని, నిజమైన నిర్వాసితులకు అనుమతి ఇవ్వలేదని ఇరపాడుకు చెందిన జి.శాంతకుమార్, పాడలికి చెందిన జి.వెంకటరమణలుతో పాటు పలువురు నిర్వాసిత మహిళలు వేదిక ముందు నిరసన తెలిపారు. దీనివల్ల నిర్వాసితులకు ఒరిగేదేమీ లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పోలీసు బలగాలతో తమను నెట్టేసిన చంద్రబాబు ఇప్పుడు తమ వద్దకు రావడం సరికాదని పాడలి ముంపు గ్రామానికి చెందిన పలువురు అన్నారు. వీరి నిరసనను టీడీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఎస్ఐ గోవిందరావు సిబ్బందితో వచ్చి నిర్వాసితులను చెదరగొట్టారు. కార్యక్రమంలో కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, కలమట వెంకటరమణ, కిమిడి కళావెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

క్రీడల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు

రాజ్య సభలో ఎంపీ విజయసాయి రెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద పబ్లిక్, ప్రైవేట్ రంగాలకు చెందిన పలు సంస్థలు, వ్యక్తుల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.34.35 కోట్లు నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎన్ఎస్‌డీఎఫ్)కు సమకూరినట్లు క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి గురువారం లిఖితపూర్వక సమాధానమిస్తూ.. క్రీడాకారులు, క్రీడాసంస్థలను ప్రోత్సహించేందుకు మంత్రిత్వ శాఖ ఏటా అందించే నిధులకు అదనంగా సీఎస్ఆర్ కింద కూడా ఎన్ఎస్‌డీఎఫ్‌కు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సీఎస్ఆర్ ద్వారా రూ.43.88 కోట్లు సమకూర్చినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా క్రీడాకారులు, క్రీడా విభాగాల అభివద్ధి నిరంతర ప్రక్రియ అని మంత్రి చెప్పారు.

ఈ-శ్రమ్‌లో ఏపీ నుంచి 80 లక్షల మంది అసంఘటిత కార్మికులు

అసంఘటిత కార్మికుల వివరాలతో సమగ్రమైన జాతీయ డేటాబేస్ రూపొందించే లక్ష్యంతో కేంద్రం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఈ నెల 3వ తేదీకి ఆంధ్రప్రదేశ్ నుంచి 80,03,442 మంది పేర్లు, వివరాలను నమోదు చేసుకున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ప్రశ్నక ఆయన లిఖితపూర్వక సమాధానమిస్తూ.. దేశవ్యాప్తంగా28,99,63,420 మంది అసంఘటిత కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని చెప్పారు.

పీఎం10 తగ్గింపు లక్ష్యం



నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రొగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా ఏపీలో నగరాలకు వార్షిక పర్టిక్యులేట్ మీటర్ (పీఎం 10) తగ్గింపు లక్ష్యం విధించినట్లు కేంద్ర పర్యావరణశాఖ సహాయ మంత్రి అశ్విని కుమార్‌చౌబే తెలిపారు. అనంతపురం, చిత్తూరు, ఏలూరు, గుంటూరు, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం నగరాలను ఎన్‌సీఏపీలో చేర్చామని, వాటికి 2022–23, 2023–24ల్లో నిధులు కేటాయించామని వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

లోక్‌సభ

పోలవరం ప్రాజెక్టుకు కాంపొనెంట్ వారీ సీలింగ్ లేదు

- లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు వ్యయం రీయింబర్స్‌మెంట్ విషయంలో కాంపొనెంట్ వారీ సీలింగ్ ఎత్తివేయడానికి అభ్యంతరం లేదని ఆర్థిక శాఖ పేర్కొందని కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. అంచనా వ్యయం పెరుగుదల దృష్ట్యా పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సిఫారసు మేరకు కాంపొనెంట్ వారీ సీలింగ్‌ను సడలించినట్లు చెప్పారు. ఈమేరకు ఆయన గురువారం లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు. చెల్లింపులకు అర్హమైనప్పటికీ కాంపొనెంట్‌వారీ నియంత్రణవల్ల రూ.550.97 కోట్లు అబయెన్స్‌లో ఉండిపోయాయని, వాటిని ఇప్పుడు రీయింబర్స్ చేస్తున్నట్లు మంత్రి చెప్పారు.

కృష్ణా ట్రిబ్యునల్ -2 గడువు పొడిగింపు



ఏపీ, తెలంగాణల మధ్య నదీ జలాల వివాద పరిష్కారానికి ఏర్పాటైన కృష్ణా ట్రిబ్యునల్-2 కాలపరిమితిని వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగించినట్లు కేంద్ర మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. ఈ మేరకు ఆయన వైఎస్సార్‌సీపీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో 307 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు



ఆంధ్రప్రదేశ్‌లో 355 పబ్లిక్ ఈవీ (ఎలక్ట్రికల్ వెహికల్) ఛార్జింగ్ పాయింట్లు ఉండగా.. 307 అమలులో ఉన్నాయని కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి ఆర్కే సింగ్ వైఎస్సార్‌సీపీ సభ్యుడు గోరంట్ల మాధవ్ ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

గిరిజనుల రక్షణకు చర్యలు



ఇటీవల గోదావరి వరదల నేపథ్యంలో వేలేరుపాడు, కుకునూరు, పోలవరం, చింతూరు, ఎటపాక, రంపచోడవరం మండలాల్లోని నదీ పరిసర ప్రాంతాల్లో నివసించే గిరిజనుల రక్షణకు ఏపీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని కేంద్రమంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. గోదావరి ఒడ్డుకు ఎలాంటి విఘాతం కలగకుండా జులై 17న అత్యధికంగా వరద నీరు సముద్రంలోకి విడుదల చేసినట్లు వైఎస్సార్‌సీపీ సభ్యుడు మార్గాని భరత్‌రామ్ ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

నవంబరు 2024 కల్లా కృష్ణపట్నం పోర్టుకు ఆరు లేన్ల రహదారి



కృష్ణపట్నం పోర్టుకు ఆరు లేన్ల రహదారి ప్రాజెక్టు వచ్చే ఏడాది నవంబరుకల్లా పూర్తవుతుందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ.. వైఎస్సార్‌సీపీ సభ్యుడు బాలశౌరి ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో చెప్పారు.


సినీ రంగమేమీ ఆకాశం నుంచి ఊడిపడలేదు..

- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, అమరావతి: సినిమాటోగ్రాఫ్ బిల్లుపై పార్లమెంట్‌లో మాట్లాడితే కోట్ల రూపాయలకు పడగలెత్తిన కొందరు హీరోలు భుజాలు ఎందుకు తడుముకుంటున్నారోనని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. సినిమా పైరసీని అరికట్టడం ఎంత అవసరమో, సినీ కార్మికుల సంక్షేమం, సినీ పరిశ్రమలో పనిచేసే మహిళల భద్రత కూడా అంతే ముఖ్యమని, ఉన్నమాటంటే ఉలుకెందుకని ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'సినీ రంగమేమీ ఆకాశం నుంచి ఊడి పడలేదు. ఫిలిం స్టార్స్ అయినా, పొలిటీషియన్స్ అయినా ప్రజలు ఆదరిస్తేనే వారికి మనుగడ. సినీ పరిశ్రమలోని పేదలు, కార్మికుల సంక్షేమం బాధ్యత కూడా ప్రభుత్వానిదే. వాళ్లూ మనుషులే. వారి గురించి మీకెందుకు, వీరి గురించి ప్రభుత్వానికి ఎందుకంటే కుదరదు. వారి యోగక్షేమాల గురించి పట్టించుకునే బాధ్యత ప్రభుత్వానికి ఉంది. కొందరు సినిమా హీరోలు పాపం చాలా తక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటూ, వీలైతే ఉచితంగా నటిస్తూ.. లక్షలాది డైలీ వేజ్ సినీ కార్మికులను బతికిస్తున్నారు. కళామతల్లిపై ప్రేమతో ఎక్కువ సినిమాలు చేస్తున్నారు. తలసరి ఆదాయం, స్థూల రాష్ట్ర ఉత్పత్తి వృద్ధి కోసం అహర్నిశలూ చెమటోడుస్తున్నారు. అలాంటి వారికి హాట్సాఫ్' అని పేర్కొన్నారు. ఆంధ్రాపై పెత్తనం కోసం హైదరాబాద్‌లో ఉండే కొందరు కుట్రదారులు విషం చిమ్ముతున్నారని, హత్యలు చేసైనా ప్రభుత్వంపై వ్యతిరేకత రాజేయాలని కుట్రపన్నుతున్నారని చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చంద్రబాబు స్వార్థానికి కార్యకర్తలు బలి

- పుంగనూరు అల్లర్లను దగ్గరుండి కావాలనే రెచ్చగొట్టాడు
- ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా
- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



సాక్షి, అమరావతి: దాదాపు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకుంటున్న టీడీపీ నాయకుడు చంద్రబాబు తన స్వార్థం కోసం నమ్ముకున్న కార్యకర్తలను సైతం జైలుపాలు చేసి.. వారి తల్లుల గుండెకోతకు కారణమవుతున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. గురువారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పుంగనూరు అల్లర్లను దగ్గరుండీ మరీ రెచ్చగొట్టిన విషయం ఆధారాలతో సహా బయటపడిందని చెప్పారు. పోలీసులు ఎంతో సంయమనం పాటించినా టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పి పాశవికంగా వారిపై దాడులు చేయించారన్నారు. టీడీపీ కార్యకర్తలు, వారి కుటుంబాల ఉసురు, గాయపడిన పోలీసు కుటుంబాల ఉసురు బాబుకు తగులుతుందని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాజకీయాలకు, కులమతాలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తుంటే.. చంద్రబాబు భరించలేక దిగజారి ప్రవర్తిస్తున్నారన్నారు. తండ్రికి తగ్గట్టుగానే బాబు తనయుడు లోకేశ్ కూడా నేరాలను ప్రోత్సహిస్తున్నాడని, ఇలాంటి చర్యలను ప్రభుత్వం సహించబోదని మంత్రి హెచ్చరించారు.

అన్ని జిల్లాల్లో ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ..

ప్రభుత్వం సెప్టెంబర్ నుంచి ప్రజలకు ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్టు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం అందించే ఈ బియ్యంలో పిల్లెట్స్ లేదా కెర్నల్స్‌లా కనిపించేవి పోషకాలని, వాటిని ప్లాస్టిక్‌గా అపోహపడొద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో పౌర సరఫరాల కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్‌తో కలిసి మంత్రి వివరాలు వెల్లడించారు. ఫోర్టిఫైడ్ బియ్యం రక్తహీనతను తగ్గిస్తాయన్నారు. ఈ బియ్యాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పంపిణీ చేస్తుండగా.. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా అందించనున్నట్లు వివరించారు. ప్రజల్లో ఫోర్టిఫైడ్ బియ్యంపై అవగాహన పెంచేందుందుకు ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధుతో వీడియో రూపొందించినట్లు మంత్రి చెప్పారు. ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు రేషన్ దుకాణాల్లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ కలిపిన గోదుమపిండి కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వచ్చే సీజన్‌లో 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. రైతులకు ఐదారు రోజుల్లో నగదు జమ చేస్తామని, దళారీలకు అస్కారం లేకుండా కొనుగోళ్లు ఉంటాయని మంత్రి కారుమూరి వివరించారు.

ఆరోగ్యశ్రీలో 648 క్యాన్సర్ ప్రొసీజర్లు

- ఒక్క క్యాన్సర్ చికిత్సకే రూ.600 కోట్లు ఖర్చు
- అక్టోబర్ కల్లా రెండు స్టేట్ క్యాన్సర్ కేర్ సెంటర్లు :మంత్రి రజిని వెల్లడి

సాక్షి, అమరావతి: క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ తీసుకుంటున్న చర్యలు రాష్ట్రంలోని పేద రోగులకు ఎంతో మేలు చేస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఎంతో దార్శనికతతో క్యాన్సర్ నియంత్రణకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. క్యాన్సర్ నివారణ–ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ చికిత్సకు ఏడాదికి రూ.600 కోట్లకు పైగా నిధులు ఒక్క ఆరోగ్యశ్రీకే ఖర్చు చేస్తోందని తెలిపారు. మొత్తం 648 క్యాన్సర్ ప్రొసీజర్లకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 64 క్యాన్సర్ కేర్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్నాయని, అన్ని ఆస్పత్రుల్లో చికిత్స ఏకీకృతంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ప్రతి ఆరోగ్యశ్రీ ఆస్పత్రిలో 5 శాతం బెడ్లు పాలియేటివ్ కేర్ కోసం కేటాయించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

క్రమ పద్ధతిలో ఆస్పత్రుల అభివృద్ధి: నోరి దత్తాత్రేయుడు



మంత్రి రజినితో మాట్లాడుతున్న నోరి దత్తాత్రేయుడు

ప్రతి టీచింగ్ ఆస్పత్రిలో క్యాన్సర్‌కు చికిత్సను సమర్థవంతంగా అందించేందుకు ప్రభుత్వం రూ.120 కోట్లు ఖర్చుచేస్తోందని మంత్రి తెలిపారు. కర్నూలు, కడపలో స్టేట్ క్యాన్సర్ సెంటర్ల ఏర్పాటుకు మొత్తం రూ.220 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ రెండు చోట్లా క్యాన్సర్ కేర్ సెంటర్లు అక్టోబర్ చివరి కల్లా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గుంటూరులోని క్యాన్సర్ కేర్ సెంటర్‌ను కూడా తొలి విడతలోనే పూర్తి స్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. రెండో విడతలో అనంతపూర్, కాకినాడల్లో క్యాన్సర్ ఆస్పత్రులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఏపీలో ఒక క్రమ పద్ధతిన క్యాన్సర్ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు, క్యాన్సర్ చికిత్సకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలిపారు. దేశంలోనే క్యాన్సర్‌కు పూర్తి ఉచితంగా, అత్యాధునిక వైద్యాన్ని అందిస్తున్న రాష్ట్రాల్లో ఏపీ ముందంజలో ఉంటుందని చెప్పారు. వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ జె.నివాస్, ఏపీవీవీపీ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



ఒంగోలు టౌన్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లను పక్కన పెట్టి సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా పనులు చేయించడం సరికాదని ఆమె అన్నారు. పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారంటూ గురువారం ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారిమళ్లిస్తోందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంపద సృష్టించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన నిధులతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మిస్తున్నారని తెలిపారు. పంచాయతీల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని, సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులుకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శివారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దారా సాంబయ్య, ఈదర హరిబాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 11-8-2023

ఫ్యాషన్

నేచురల్ డైస్

స్లో ఫ్యాషన్... ఫాస్ట్‌గా!







సహజ రంగులు అద్దుకున్న ఫ్యాబ్రిక్ స్కిన్ ఫ్రెండ్లీగా అమరిపోతుంది. ఆ దుస్తుల్లో ఎక్కడ ఉన్నా హుందాతనం కనిపిస్తుంది. అందుకే స్లో ఫ్యాషన్‌గా పేరున్న దుస్తులు ఇప్పుడు ఫాస్ట్‌గా యువతను ఆకట్టుకుంటున్నాయి. టై అండ్ డై తోనూ అట్రాక్ట్ చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని తెలంగాణ క్రాఫ్ట్ కౌన్సెల్‌లో సహజ రంగులతో దారాలను, ఫ్యాబ్రిక్‌ను ఎంత కలర్‌ఫుల్‌గా మార్చేయవచ్చో కళ్లకు కడుతున్నారు.




పోచంపల్లి, ఇకత్, పటోల వంటి.. మన చేనేతల్లో రంగుల వాడకం తెలిసిందే. అయితే ఈ రంగులు అన్నీమొక్కల బెరడు, పండ్లతొక్కలు, ఆకులు, పువ్వులు, వేర్లు.. మొదలైనవాటితో తయారు చేసి, ఆ ప్రింట్లను దుస్తుల మీదకు తీసుకురావడం పెద్ద ప్రక్రియే. కానీ, వీటి వల్ల ప్రకృతికి దగ్గరగా ఉంటాం. పైగా కాటన్ ఫ్యాబ్రిక్, సహజ రంగుల వల్ల సూర్యుని నుంచి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల నుంచి మన చర్మాన్ని కాపాడుకోవచ్చు. డై చేసిన ఈ సహజ రంగులు ఎంతకాలమైనా మన్నికగా ఉండటంతో ఈ కాటన్ వస్త్రాలకు డిమాండ్ కూడా పెరుగుతోంది. మన దేశీయ కళను మరింత విస్తృతంగా కళ్లకు కడుతుంది.

సహజరంగు దారాలు

కాటన్, పట్టుదారాలను ముందుగా రంగులో ఉడికించి, తర్వాత వాటిని నీడలో ఆరబెట్టి, మగ్గం మీద నేయడానికి వాడుతారు. ఈ రంగు దారాలతో చీరలు, ఫ్యాబ్రిక్‌ను తయారుచేస్తారు. సేంద్రీయ రంగులతో తయారైన ఫ్యాబ్రిక్ రంగులు, ప్రింట్స్ కాలక్రమేణా వెలిసిపోతాయి అనుకుంటారు. కానీ, సరైన జాగ్రత్తలతో వేసిన సహజ రంగులు చాలాకాలం పాటు ఉంటాయి. ఫ్యాబ్రిక్ మన్నికను మించి కూడా రంగులు తమ సహజ గుణాన్ని చూపగలవు. డా. లక్ష్మీ పూజ శంకు టై అండ్ డై, నేచరల్ డైస్‌కు సంబంధించి వర్క్‌షాప్ ద్వారా మరిన్ని వివరాలను మనకు అందించారు.

● ముందు నీళ్లను బాగా మరిగించి, అందులో ఎంపిక చేసుకున్న పువ్వు లేదా బెరడు వంటివి వేసి ఉడికించాలి. పదార్థంలో ఉన్న రంగు అంతా నీళ్లలోకి వచ్చేశాక, వడకట్టుకొని, ఆ నీటిని మళ్లీ మరిగించాలి ● మిషనరీ లేదా మగ్గంపై తయారైన కొత్త క్లాత్‌లో స్టార్చ్, దుమ్ము ఉంటుంది. ఎంపిక చేసుకున్న క్లాత్‌ని ముందుగానే బాగా ఉతికి, ఆరేసి ఉంచాలి ● డిజైన్‌ను బట్టి క్లాత్‌ను మడిచి, గట్టిగా ముడివేసి, ఉడుకుతున్న రంగులో ముంచి, అరగంట ఉంచి, తీసి, తర్వాత నీడలో ఆరబెట్టాలి ● యార్న్ అయినా అదేవిధమైన జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే, రంగు తయారీలో సమయం, పీహెచ్ లెవల్స్ ని పెంచడంలో మరికొన్ని పద్ధతులు ఉన్నాయి. వీటిని అనుసరిస్తే రంగుల్లో రకరకాల షేడ్స్ తీసుకురావచ్చు ● నేచరల్ కలర్స్ అంత ఫాస్ట్ కలర్స్ మరేమీ ఉండవు. ప్రాచీన సౌందర్యం, ఆ హుందాతనం మనల్ని ఎలాగైతే ఆకట్టుకుంటుందో అంత బాగా ఈ సహజ రంగుల అందం కట్టిపడేస్తుంది.

– నిర్మలారెడ్డి

ప్రక్రియలో నేర్పు అవసరం



టై అండ్ డై, యార్న్ డై టెక్నిక్స్‌కు నేచరల్, సింథటిక్ రెండింటికీ వాడచ్చు. మనకు ఎన్ని రంగులు కావాలో ముందు డిసైడ్ చేసుకోవాలి. డైయింగ్ పద్ధతి పూర్తయ్యాకే మనకు కావాల్సిన డిజైన్ వస్తుంది కాబట్టి, టై చేసే విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలి. దానిమ్మ, బంతిపువ్వు, బీట్‌రూట్, ఆలివ్స్.. ఇలా అన్నింటినుంచి లేత, ముదురు రంగులను సహజంగా తయారు చేసుకోవచ్చు.

– డా. లక్ష్మీ పూజ శంకు
అసిస్టెంట్ ప్రొఫెసర్, జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్శిటీ



ఆహారాన్ని ఔషధంలా తీసుకోవాలి...లేకపోతే...
ఔషధాలనే ఆహారంగా తీసుకోవాల్సి వస్తుంది.
ఈ సూక్తిలో గొప్ప ఆరోగ్య హెచ్చరిక దాగి ఉంది.
ఆహారంతోనే ఆరోగ్యం... అంటుంది వైద్యరంగం.
ఆహారంలోని ఔషధాన్ని వెలికి తీసి వాడితే...
ఎలా ఉంటుంది? త్రిపుర చేస్తున్న ప్రయత్నమూ అదే.

● త్రిపుర

ఆహారంలోనే ఔషధం

'ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగిన వారి కోసం ఒక సమూహాన్ని సంఘటితం చేస్తున్నాను' అంటున్నారు లక్కీ 4 యూ న్యూట్రాస్యుటికల్స్ ప్రతినిధి త్రిపుర. 'ఆహారం అంటే కంటికి ఇంపుగా కనిపించినది, నాలుకకు రుచిగా అనిపించినది తినడం కాదు. దేహానికి ఏమి కావాలో, ఏది వద్దో తెలుసుకుని తినడం. ఈ విషయంలో నాకు స్పష్టత వచ్చేటప్పటికే నా జీవితం భారీ మూల్యాన్ని చెల్లించుకుంది. పీసీఓడీ, ఒబేసిటీ వల్ల పిల్లలు పుట్టడం ఆలస్యమైంది. కోవిడ్ సమయంలో వ్యాక్సిన్‌లు వేసుకుని జాగ్రత్తలన్నీ తీసుకున్నాం. మా వారికి రక్తం మరీ చిక్కబడడం, బ్లడ్ థిన్నర్స్ వాడినా ఫలితం కనిపించక బ్రెయిన్ స్ట్రోక్ ఆయనను తీసుకెళ్లి పోవడం వంటి పరిణామాలు జరిగిపోయాయి. జీవితం అగమ్యగోచరమైంది. ఆ షాక్‌లో ఉన్న నాకు ఒక వ్యాపకం ఉండాలని మా అన్నయ్య చేసిన ప్రయత్నమే ఇది' అంటూ తాను పరిశ్రమ నిర్వాహకురాలిగా మారిన వైనాన్ని సాక్షితో పంచుకున్నారు త్రిపుర సుందరి.

ఇంటర్నెట్ నేర్పించింది!

''నేను పుట్టింది, పెరిగింది విజయవాడలో. సిద్ధార్థ మహిళా కళాశాలలో బీఏ చేశాను. భర్త, ఇద్దరు పిల్లలతో గృహిణిగా సౌకర్యవంతంగా ఉన్న సమయంలో జీవితం పరీక్ష పెట్టింది. నన్ను మామూలు మనిషిని చేయడానికి మా అన్నయ్య తిరుపతికి తీసుకెళ్లిపోయాడు. ఆస్ట్రేలియాలో కెమికల్ ఇంజనీరింగ్ చేసి తిరుపతిలో న్యూట్రాస్యూటికల్స్ ఎక్స్‌ట్రాక్షన్ యూనిట్ పెట్టుకున్నాడు. నన్ను కూడా ఫార్మారంగంలో పనిచేయమని ప్రోత్సహించాడు. నేను చదివింది ఆర్ట్స్ గ్రూపు. ఫార్మా పట్ల ఆసక్తి లేదనడం కంటే అసలేమీ తెలియదనే చెప్పాలి. కలినరీ సైన్స్ (పాకశాస్త్రం) ఇష్టమని చెప్పాను. ఆ సమయంలో నా మాటల్లో తరచూ మన ఆరోగ్యం మీద ఆహారం ఎంతటి ప్రభావం చూపిస్తుందోననే విషయం వస్తుండేది. మేము ఎదుర్కొన్న అనారోగ్యాలన్నీ ఆహారం పట్ల గమనింపు లేకపోవడంతో వచ్చినవే కావడంతో నా మెదడులో అవే తిరుగుతుండేవి. నాకు అప్పటికి ప్రొటీన్ ఏంటి, విటమిన్ ఏంటనేది కూడా తెలియదు. కానీ ఈ రంగంలో పని చేయాలనుకున్నాను. బ్రాండ్ రిజిస్ట్రేషన్ నుంచి పరిశ్రమ స్థాపనకు అవసరమైన ఏర్పాట్లన్నీ అన్నయ్య చేసి పెట్టాడు. ఈ రంగం గురించిన వ్యాసాలనిచ్చి చదవమనేవాడు. ఆ తర్వాత నేను ఇంటర్నెట్‌ను కాచి వడపోశాననే చెప్పాలి. ఇప్పుడు సీవోటూ ఎక్స్‌ట్రాక్షన్ ప్రాసీజర్స్ నుంచి కాంబినేషన్‌ల వరకు క్షుణ్ణంగా తెలుసుకున్నాను. నాకు సబ్జెక్టు తెలిసినప్పటికీ సర్టిఫైడ్ పర్సన్ తప్పని సరి కాబట్టి క్వాలిటీ కంట్రోల్ మేనేజర్, ముగ్గురు ఫుడ్ ఎక్స్‌పర్ట్‌లను తీసుకున్నాను.

తేనెతోపాటు ఇంకా...

ఫలానా ఆరోగ్య సమస్యకు ఉదయాన్నే తేనెలో అల్లం రసం కలిపి తినాలి, తేనెతో లవంగం లేదా దాల్చినచెక్క పొడి తీసుకోవాలి. మొలకెత్తిన గింజలను ఉదయం ఆహారంగా తినాలి... ఇవన్నీ ఆరోగ్యకరం అని తెలిసినప్పటికీ ఈ రోజుల్లో వాటిని రోజూ చేసుకునే టైమ్ లేని వాళ్లే ఎక్కువ. కోవిడ్ తర్వాత ప్రతి ఒక్కరూ అంతలా డీలా పడిపోవడానికి కారణం దేహంలో పోషకాల నిల్వలు ఉండాల్సిన స్థాయిలో లేకపోవడమే. అందుకే ఇన్‌ఫ్యూజ్‌డ్ హనీ తయారు చేశాం. అలాగే స్ప్రౌట్స్ తినే వారికి ఉద్యోగరీత్యా క్యాంప్‌లకెళ్లినప్పుడు కుదరదు కాబట్టి డీ హైడ్రేటెడ్ స్ప్రౌట్స్ తీసుకువచ్చాను. ఇలా ప్రతి ఉత్పత్తినీ ఆయుర్వేద వైద్యుల సూచన మేరకు మోతాదులు పాటిస్తూ నేను చేసిన ప్రయత్నాలు విజయవంతం అయ్యాయి. ముంబయిలో ఈ నెల 16 నుంచి నాలుగు రోజుల పాటు జరిగే 'ఎఫ్ ఐ ఇండియా' సదస్సులో నా అనుభవాలను పంచుకుంటూ ప్రసంగించనున్నాను. దుబాయ్‌లో జరిగే ఎగ్జిబిషన్‌లో కూడా అన్ని దేశాల వాళ్లు స్టాల్ పెడుతుంటారు. గత ఏడాది తెలుసుకోవడం కోసమే వెళ్లాను. నా యూనిట్‌ని ఇంకా ఎలా విస్తరించవచ్చనే స్పష్టత వచ్చింది. ఈ ఏడాది చివరలో దుబాయ్ ఎగ్జిబిషన్ ద్వారా అంతర్జాతీయ వేదిక మీదకు వెళ్లడానికి సిద్ధమవుతున్నాను'' అని వివరించారు త్రిపుర.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఇష్టంగా పనిచేశాను!

నా యూనిట్‌ని మా అన్నయ్య యూనిట్‌కు అనుబంధంగా నిర్మించాం. కాబట్టి ప్రతిదీ తొలి నుంచి నేర్చుకోవాల్సిన అవసరం రాలేదు. కానీ ప్లాంట్ నిర్మాణం నుంచి ప్రతి విషయాన్నీ దగ్గరుండి చూసుకోమని చెప్పడంతో రోజుకు పదమూడు గంటలు పని చేశాను. ఇప్పుడు మూడు షిఫ్టుల్లో పని జరుగుతోంది. యూనిట్ ఎస్టాబ్లిష్ చేస్తున్నప్పుడు ఇంట్లో ఒకవిధమైన ఆందోళన వాతావరణమే ఉండేది. ఈ ప్రయత్నం సక్సెస్ అవుతుందా అనే సందేహం నాతోపాటు అందరిలోనూ ఉండింది. మా అన్నయ్య మాత్రం 'ఏదయితే అదవుతుంది, నువ్వు ముందుకెళ్లు' అనేవాడు. నేను చేస్తున్న పని మీద ఇష్టం పెరగడంతో అదే నా లోకం అన్నట్లు పని చేశాను. మా ఉత్పత్తులకు ఎఫ్‌ఎస్‌ఎస్ఏఐ, జీఎమ్‌పీ, ఐఎస్‌ఓ వంటి దేశీయ విదేశీ సర్టిఫికేట్‌లు వచ్చాయి. కానీ నేను మా ఉత్పత్తుల అవసరం ఉన్న అసలైన వాళ్లకు పరిచయమైంది మాత్రం ఈ నెల మొదటి వారంలో జరిగిన 'రాయలసీమ ఆర్గానిక్ మేళా'తోనే.



– ఎం. త్రిపుర,
ఆపరేషనల్ మేనేజర్,
లక్కీ 4 యూ

వంటిల్లు

కడుపునిండా తిందాం...
బరువు తగ్గించుకుందాం

బరువు పెరగకుండా ఉండేందుకు, పెరిగిన బరువు తగ్గించుకునేందుకు తిండి మానేస్తుంటారు. కానీ తింటూనే బరువు తగ్గాలని డాక్టర్లు సూచిస్తున్నారు. అందుకే కడుపునిండా తింటూ బరువుని తగ్గించుకునే వంటకాలతో ఈ వారం వంటిల్లు...

అప్పం



కావలసినవి: పొట్టు తీసిన పెసరపప్పు – కప్పు ; మినపపప్పు – అరకప్పు ; సోంపు – అరటీస్పూను; అల్లం – అంగుళం ముక్క ; క్యారట్, బీట్ రూట్, ఫ్రెంచ్ బీన్స్, బేబీ కార్న్, పచ్చి బఠాణీ – అన్నీ కలిపి కప్పు; ఉప్పు – రుచికి సరిపడా ; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● పప్పులను శుభ్రంగా కడిగి నానబెట్టుకోవాలి ● నానిన పప్పుల్లో అల్లం, సోంపు కొద్దిగా నీళ్లు వేసుకుని మెత్తగా రుబ్బుకోవాలి ● ఇప్పుడు రుబ్బిన పిండిలో కూరగాయ ముక్కలు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● గుంత పునుగుల ప్లేట్లకి కొద్దిగా నూనె రాసి పిండి మిశ్రమాన్ని అప్పాల్లా వేయాలి ● కొద్దిగా నూనె వేసి రెండువైపులా చక్కగా కాల్చుకుంటే హెల్దీ అప్పం రెడీ.

సొరాటా



కావలసినవి: సొరకాయ లేదా గుమ్మడి తురుము – మూడు టేబుల్ స్పూన్లు; శనగపిండి – రెండు టేబుల్ స్పూన్లు; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; అల్లం తరుగు – టేబుల్ స్పూను; పసుపు – ముప్పావు టీస్పూను; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – టీస్పూను; నెయ్యి – టీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో సొరకాయ తురుము, శనగపిండి, పుదీనా, అల్లం తరుగులు, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి కలపాలి ● చివరిగా నూనె వేసి ముద్దలా కలుపుకోవాలి ● ఈ ముద్దను ఉండలుగా చేసి పరాటాల్లా వత్తుకోవాలి ● కొద్దిగా నెయ్యి వేసి రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే సొరాట రెడీ.

మీల్‌మేకర్ మొలకల టిక్కీ



కావలసినవి: మీల్‌మేకర్ – ఒకటిన్నర కప్పులు; పెసర మొలకలు – అరకప్పు; పాలకూర – చిన్నకట్ట ఒకటి; అల్లం – అంగుళం ముక్క; బియ్యప్పిండి – నాలుగు టేబుల్ స్పూన్లు; శనగపిండి – మూడు టేబుల్ స్పూన్లు; ధనియాల పొడి – ఒకటిన్నర టీస్పూను; జీలకర్ర పొడి – టీస్పూను; రాక్ సాల్ట్ – అరటీస్పూను; కొత్తిమీర, పుదీనా తరుగు – అరకప్పు; ఉప్పు – రుచికి సరిపడా; నూనె – టిక్కీ వేయించడానికి సరిపడా.

తయారీ: ● ముందుగా వేడినీటిలో మీల్ మేకర్ వేసి పదినిమిషాలపాటు నానబెట్టాలి.
● నానిన మీల్ మేకర్‌ను మూడుసార్లు నీటితో కడగాలి
● చివరిగా మీల్ మేకర్‌లోని నీటిని పిండి పక్కన పెట్టుకోవాలి
● పాలకూరను శుభ్రంగా కడిగి, మరుగుతోన్న నీటిలో వేసి రెండు నిమిషాలు ఉంచాలి
● రెండు నిమిషాల తరువాత తీసి చల్లని నీటిలో వేసి, నీటిని పిండి పక్కన పెట్టుకోవాలి
● మిక్సీజార్‌లో పుదీనా, కొత్తిమీర, అల్లం వేసి గ్రైండ్ చేయాలి ● ఇవన్నీ నలిగిన తరువాత పెసర మొలకలు వేసి గ్రైండ్ చేయాలి ● చివరగా... నీళ్లు పోయకుండా మీల్‌మేకర్, పాలకూర వేసి గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని గిన్నెలోకి తీసుకుని ధనియాలపొడి, బియ్యప్పిండి, శనగపిండి, జీలకర్రపొడి, రాక్ సాల్ట్, రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి పక్కనపెట్టుకోవాలి ● పదినిమిషాల తరువాత పిండిమిశ్రమాన్ని టిక్కిల్లా చేసుకోవాలి ● మీడియం మంటమీద నూనె వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు టిక్కీలను కాల్చుకుని సర్వ్ చేసుకోవాలి.

ఓట్స్ బీట్‌రూట్ పన్నీర్ పరాటా



కావలసినవి: వేయించిన ఓట్స్ – కప్పు; బీట్‌రూట్ ప్యూరీ – కప్పు; పన్నీర్ తరుగు – అరకప్పు; గోధుమ పిండి – అరకప్పు ; జీలకర్ర – అరటీస్పూను; వాము – అరటీస్పూను; కారం – అరటీస్పూను; ఉప్పు – అరటీస్పూను ; నూనె – రెండు టీస్పూను.

తయారీ: ● పెద్దగిన్నెలో ఓట్స్, బీట్‌రూట్ ప్యూరీ, పనీర్ తరుగు, గోధుమ పిండి, జీలకర్ర, వాము, కారం, ఉప్పు వేసి కలపాలి ● కొద్దికొద్దిగా నీళ్లుపోసుకుంటూ పరాటా పిండి ముద్దలా కలుపుకోవాలి ● ఈ ముద్దను ఉండలుగా చేసుకుని పరాటాల్లా వత్తుకోవాలి ● పరాటాలను రెండు వైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు కాల్చుకుంటే పరాటా రెడీ ● పెరుగు లేదా చట్నీతో సర్వ్‌చేసుకోవాలి.

మొలకల డోక్లా



కావలసినవి: శనగ మొలకలు – కప్పు; పాలకూర తరుగు – అరకప్పు; శనగపిండి –రెండు టేబుల్ స్పూన్లు; రాక్ సాల్ట్ – టీస్పూను; నూనె – టేబుల్ స్పూను; నువ్వులు – టీస్పూను ; ఇంగువ – అరటీస్పూను; కరివేపాకు – రెండు రెమ్మలు.

తయారీ: ● మొలకలు, పాలకూరను మిక్సీజార్‌లో వేసి కొద్దిగా నీళ్లపోసి గ్రైండ్ చేయాలి ● గ్రైండ్ అయిన మిశ్రమాన్ని గిన్నెలో తీసుకుని..శనగపిండి, రాక్ సాల్ట్ వేసి కలపాలి ● ఈ మిశ్రమాన్ని ప్లేటులో పోసి ఆవిరి మీద పదిహేను నిమిషాలపాటు ఉడికించాలి ● బాణలిలో నూనెవేసి కాగిన తరువాత నువ్వులు, ఇంగువ, కరివేపాకు వేసి వేయించాలి ● ఇప్పుడు ఉడికిన డోక్లాపై ఈ తాలింపుని వేసి, నచ్చిన ఆకారంలో ముక్కలు కోసి సర్వ్ చేసుకోవాలి.

ఓట్స్ స్మూతీ



కావలసినవి: ఓట్స్ –మూడు టేబుల్ స్పూన్లు; వేయించి పొట్టుతీసిన పల్లీలు – పావు కప్పు ; అవిసెగింజలు – టేబుల్ స్పూను; సబ్జాగింజలు – టీస్పూను; దాల్చిన చెక్క – అరంగుళం ముక్క; కర్జూరాలు – నాలుగు; బాగా పండిన అరటి పండు – ఒకటి .

తయారీ: ● ఓట్స్‌ను పదిహేను నిమిషాలు నానబెట్టుకోవాలి ● నానిన తరువాత శుభ్రంగా కడిగి మిక్సీజార్‌లో వేయాలి. దీనిలో కప్పు నీళ్లుపోయాలి ● పల్లీలు, అవిసె, సబ్జా గింజలు, దాల్చిన చెక్క, కర్జూరాలు, అరటిపండు ముక్కలు కూడా వేయాలి ● వీటన్నింటిని చక్కగా గ్రైండ్ చేస్తే స్మూతీ రెడీ.

ఇలా చేస్తే కనరెక్కదు..



● వంకాయ ముక్కలను కోసిన వెంటనే ఉప్పు నీటిలో వేయాలి.

★★★

● రెండు స్పూన్ల నీటిలో స్పూను పాలు పోసి చక్కగా కలపాలి. ఈ పాల మిశ్రమాన్ని వంకాయ ముక్కలపై చల్లాలి. ముక్కలు చేదుగా మారవు.

★★★

● టేబుల్ స్పూను నిమ్మరసం వేసిన నీటిలో కోసిన వంకాయ ముక్కలు వేస్తే కనరెక్కవు.

★★★

● వంకాయ ముక్కలు లేదా కూరగాయ ముక్కలు వేసే నీటిలో టేబుల్ స్పూను వెనిగర్ వేసి కలపాలి. అప్పుడు కూరగాయ ముక్కలు రంగు మారకుండా ఉంటాయి.



బీట్‌రూట్‌తో డే క్రీమ్



● తొక్కతీసిన అరకప్పు బీట్‌రూట్ ముక్కలను గిన్నెలో వేసి అరగ్లాసు నీళ్లపోసి ఐదు నిమిషాలు ఉడికించాలి. తరువాత స్టవ్ ఆపేసి బీట్‌రూట్ ముక్కల్లో టీస్పూను సోంపు వేసి పదినిమిషాలు నానబెట్టాలి. పదినిమిషాల తరువాత బీట్‌రూట్ ముక్కల్లో ఉన్న నీటిని వడగట్టి తీసుకోవాలి. ఈనీటిలో టీస్పూను రోజ్ వాటర్, రెండు టీస్పూన్ల అలోవెరా జెల్ వేసి బాగా కలపాలి.

● ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసుకోవాలి. వారం రోజులపాటు నిల్వ ఉండే ఈ క్రీమ్‌ను రోజూ ఉదయం పూట రాసుకుంటే.. ముఖం మీద మచ్చలు, ముడతలు, డార్క్ సర్కిల్స్ తగ్గుముఖం పట్టి ప్రకాశవంతముగా కనిపిస్తుంది.



యాపిల్ సైడర్ వెనిగర్‌లో కొద్దిగా నీళ్లు కలిపి, తలస్నానం చేసిన జుట్టుకు కుదళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. ఇలా చేయడం వల్ల తల స్నానం చేసిన తరువాత కూడా జుట్టుకు పట్టి ఉండే జిడ్డు వదులుతుంది. వారానికి ఒకసారి ఇలా చేయాలి.

యువర్స్

● మ్యూజిక్ వరల్డ్

రాయల్ సింగర్

పంజాబ్‌కు చెందిన జస్లీన్ రాయల్ సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్‌గా తనదైన ప్రతిభ చాటుకుంటోంది. పంజాబీ, హిందీ, బెంగాలీ, గుజరాతీలతో పాటు ఇంగ్లిష్ లోనూ పాటలు పాడింది. ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ అందుకున్న తొలి మహిళా మ్యూజిక్ డైరెక్టర్‌గా చరిత్ర సృష్టించింది.

లుథియానాలో హైస్కూల్ చదువు పూర్తయిన తరువాత పై చదువుల కోసం దిల్లీ వచ్చింది జస్లీన్. హిందూ కాలేజ్‌లో బి.కామ్ పూర్తి చేసింది.

సంగీతంలో ఎవరి దగ్గరా శిక్షణ తీసుకో లేదు జస్లీన్. తాను సెల్ఫ్-టాట్ ఆర్టిస్ట్. ఒకే టైమ్‌లో వివిధ రకాల మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను ప్లే చేయడం తన ప్రత్యేకత. పిల్లలకు సంగీత పాఠాలు చెప్పడం వల్ల పాకెట్ మనీ కోసం తల్లిదండ్రుల మీద ఆధారపడే అవసరం ఉండేది కాదు.

'ఇండియాస్ గాట్ టాలెంట్' ఫస్ట్ సీజన్‌లో సెమీ ఫైనలిస్ట్‌లలో ఒకరిగా అందరి దృష్టిని ఆకర్షించింది జస్లీన్. తన సంగీత ప్రతిభతో 'వన్ ఉమెన్ బ్యాండ్'గా పేరు తెచ్చుకుంది.

'బాలీవుడ్‌లోకి రావాలనేది నా చిన్నప్పటి కల. అయితే అది అంత సులభంగా నెరవేరలేదు. ఇక వెనక్కి వెళ్లిపోదాం అనుకునే సందర్భాలు అందరిలాగే నాకూ ఎదురయ్యాయి. పరీక్ష సమయంలో గట్టిగా నిలబడితే విజయం మన సొంతం అవుతుంది. నా విషయంలోనూ అదే జరిగింది' అంటున్న జస్లీన్ రాయల్ రకరకాల ప్రాజెక్ట్‌లతో ముంబైలో బిజీబిజీగా ఉంది.



జస్లీన్ రాయల్

● చేంజ్ మేకర్



ఆకాశమంత ఆశ

ఆశావాది కంటే బలవంతుడు ఎవరూ లేరు. ఆశ అనే విత్తనమే చెట్టు అనే విజయానికి మూలం. పర్యావరణ స్పృహకు సంబంధించిన విషయాలను ప్రచారం చేస్తున్న డిజిటల్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఆకాష్ రానిసన్‌కు సోషల్ మీడియాలో వేలాది మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇండోర్‌కు చెందిన 28 సంవత్సరాల ఆకాష్ 'గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్' ద్వారా రకరకాల కార్యక్రమాలు చేపడుతున్నాడు. తాజాగా మరో అడుగు ముందుకు వేసి 'ఐయామ్ ఏ క్లైమెట్ ఆప్టిమిస్ట్' అనే పుస్తకం రాశాడు...

ఆకాష్ రానిసన్

ఎనిమిది సంవత్సరాల క్రితం...

వాతావరణ మార్పులకు సంబంధించిన ఆర్టికల్స్ చదివిన ఆకాష్ అక్కడితో ఆగిపోలేదు. ఈ టాపిక్‌కు సంబంధించి ఎన్నో యూనివర్శిటీలలో ఎన్నో కోర్సులు చేశాడు. ఫలితంగా వాతావరణ మార్పుల గురించి లోతుగా తెలుసుకునే అవకాశం ఏర్పడింది.

తాను తెలుసుకున్న విషయాలను విస్తృతంగా ప్రచారం చేయాలని గట్టిగా అనుకున్నాడు.

ఆకాష్‌లో ఉన్న బలం... ఎంత జటిలమైన విషయాన్ని అయినా సులభంగా, ఆకట్టుకునేలా చెప్పడం. ఆ ప్రతిభ ఇప్పుడు ఉపయోగపడింది.

'క్లైమెట్ చేంజ్'కు సంబంధించిన విషయాలను ప్రజల దగ్గరికి తీసుకువెళ్లడానికి ఆర్ట్ ఇన్‌స్టాలేషన్‌లు, డాక్యుమెంటరీలు, సోషల్ మీడియా కంటెంట్... ఇలా ఎన్నో దారుల్లో పయనించాడు. తాజాగా 'ఐయామ్ ఏ క్లైమెట్ ఆప్టిమిస్ట్' పుస్తకం రాశాడు.

'గత పదిసంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలు తిరిగాను. రుచికరమైన తిండి కోసమో, అద్భుత నిర్మాణాలను చూడడానికో నేను వెళ్లలేదు. ప్రకృతిని చూసి పరవశించడం కోసం తిరిగాను. ప్రకృతి పట్ల మన ఆరాధన ప్రకృతిని రక్షించుకోవాలనే బలమైన ఆకాంక్షకు కారణం అవుతుంది. పర్యావరణ సంరక్షణ కోసం నా వంతుగా ఏంచేయగలను? అందుకు నాలో ఉన్న నైపుణ్యాలు ఏమిటి? అనే దాని గురించి ఆలోచించాను. నా వంతుగా చేయడానికి ఎన్నో దారులు కనిపించాయి. అది సోషల్ మీడియాలో పర్యావరణ సంరక్షణ ప్రచారం కావచ్చు, పుస్తకం రాయడం కావచ్చు' అంటాడు ఆకాష్.

పుస్తకం రాయడానికి ముందు ఆకాష్‌కు అర్థమైన విషయం ఏమంటే, పర్యావరణ సంరక్షణకు సంబంధించిన సమాచారం చాలా ఎక్కువగా పాశ్చాత్యదేశాలకు సంబంధించే ఉంది. మన దేశంలోని వాతావరణ పరిస్థితులకు అది ఉపయోగపడదు. దీంతో దేశీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈ పుస్తకాన్ని రాశాడు. కర్బన ఉద్గారాల నుంచి క్లైమెట్ ఎమర్జెన్సీ వరకు ఎన్నో అంశాలను ఈ పుస్తకంలో చర్చించాడు.

'ఐయామ్ ఏ క్లైమెట్ ఆప్టిమిస్ట్' కోసం పర్యావరణ వేత్తలు, ఇండస్ట్రీ ఎక్స్‌పర్ట్‌లతో సంభాషించాడు.

గతంలో ఎన్నో మంచి విషయాలు, పద్ధతులు ఉండేవి, అయితే అవి కాలగర్భంలో కలిసిపోయాయి. వాటిని మళ్లీ వెలికి తీయాల్సిన అవసరం ఉంది అంటాడు ఆకాష్.

'ఇప్పుడు అన్నం మిగిలింది అంటే చెత్తబుట్టలో వేయడమే అన్నట్లుగా ఉంది. ఒకప్పుడు అలా కాదు రకరకాల దినుసులు కలిపి, వేడి చేసి మిగిలిన అన్నాన్ని వృథా కాకుండా చేసేవాళ్లు. చపాతీల విషయంలోనూ ఇంతే. ఈ ఆన్‌లైన్ ఫుడ్‌కాలంలో చిటికెలో ఏదైనా తినగలుగుతున్నాం. అయితే వృథా అవుతున్న ఆహారంపై మాత్రం బొత్తిగా దృష్టి పెట్టడం లేదు. ఒకవైపు తిండి దొరకక ఆకలితో అల్లాడే మనుషులు, మరోవైపు ఆహార వృథా గురించి పట్టించుకోని మనుషులు. ఇదొక వైరుధ్యం' అంటాడు ఆకాష్.

ఒక్క ఆహార రంగం మాత్రమే కాదు టెక్స్‌టైల్ ఇండస్ట్రీ నుంచి ఎన్నో ఇండస్ట్రీలలో జరిగే వృథాను, పర్యావరణ చేటును కళ్లకు కడతాడు ఆకాష్.

'ఇక అంతా అయిపోయినట్లేనా...రానున్నది విలయ విధ్వంస కాలమేనా!' అనే నిరాశవాదంలోకి ఎప్పుడూ వెళ్లడు. ఎందుకంటే మినిమలిస్ట్ లైఫ్ స్టైల్‌ను గడుపుతున్న ఆకాష్ తనను తాను 'ఐయామ్ ఏ క్లైమెట్ ఆప్టిమిస్ట్' అని పరిచయం చేసుకుంటాడు. 'మంచి పనుల ద్వారా మంచి కాలం వస్తుంది' అని నమ్ముతాడు.

● అవును... ఇది నిజమే!



* 2009లో ఫాస్ట్‌ఫుడ్ దిగ్గజం కెంటకీ ఫ్రైడ్ చికెన్ తన మార్కెటింగ్ క్యాంపెయిన్‌లో భాగంగా రోడ్లపై గుంతలను పూడ్చే పనులు చేపట్టింది. ఈ ప్రాజెక్ట్‌కు 'కేఎఫ్‌సీ రిఫ్రెషెస్ ది నేషన్స్ రోడ్స్' అని పేరు పెట్టింది.

* నార్వేలో పోలీస్ ఆఫీసర్ కావాలంటే పోలీస్ యూనివర్శిటీ కాలేజీలో డిగ్రీ చేయాలి. మొదటి రెండు సంవత్సరాలు క్రిమినల్ లా, ఎథిక్స్, సోషల్ సైన్సెస్ చదువుకోవాల్సి ఉంటుంది. మూడో సంవత్సరం ప్రాక్టికల్ ఫీల్డ్ ట్రైనింగ్ ఉంటుంది.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



అకిలీజ్ హీల్

ఫెయిల్యూర్‌కు కారణమయ్యే బలహీనతల విషయంలో వాడే మాట ఇది.

ఉదా: ఐయామ్ ట్రైయింగ్ టు లూజ్ వెయిట్, బట్ ఐస్‌క్రీమ్ ఈజ్ మై అకిలీజ్ హీల్.

గ్రీకు పురాణాల్లో నుంచి పుట్టిన ఇడియం ఇది. శత్రువుల దాడికి గురి కాకుండా నింఫ్ అనే తల్లి తన కుమారుడు అకిలీజ్‌ను పవిత్రమైన నదిలో ముంచుతుంది. ఈ జలాలకు అమరత్వాన్ని ప్రసాదించే శక్తి ఉంటుంది. అయితే నదిలో ముంచినప్పుడు అకిలీజ్ కాలి మడమ మాత్రం జలాలను తాకదు. ఫలితంగా అది బలహీన స్థానం అవుతుంది. జీవిత చరమాంకంలో మడమకు బాణం తగలడం వల్ల అకిలీజ్ చనిపోతాడు.

ఆల్ హెల్ బ్రోక్ లూజ్

ఉన్నట్టుండి పరిస్థితి ఉద్రిక్తంగా, హింసాత్మకంగా, అస్తవ్యస్తంగా మారే సందర్భంలో ఉపయోగించే మాట ఇది.

ఉదా: ఐ వాజ్ వాకింగ్ త్రూ ది స్టేషన్ ఆన్ మై వే టు వర్క్ వెన్ ఐ హర్డ్ దిస్ హ్యూజ్ ఎక్స్‌ప్లోజన్ అండ్ దెన్ ఆల్ హెల్ బ్రోక్ లూజ్.

టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ జడ్ ఫ్లిప్5



డిస్‌ప్లే: 6.7 అంగుళాలు
రిజల్యూషన్: 1080×2640 పిక్సెల్స్
మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్; 512 జీబి 8జీబి ర్యామ్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
బ్యాటరీ: 3700 ఎంఏహెచ్
కనెక్టివిటీ: 5జీ

యాపిల్ డిస్కవరీ స్టేషన్

సంగీత ప్రియుల కోసం యాపిల్ 'డిస్కవరీ స్టేషన్'ను లాంచ్ చేసింది. యూజర్ మ్యూజిక్ ప్రిఫరెన్స్ ఆధారంగా ప్లేలిస్ట్ ఉంటుంది. యాపిల్ మ్యూజిక్ డిస్కవరీ స్టేషన్ మొబైల్ డివైజ్‌లు, డెస్క్ కంప్యూటర్‌లు, వెబ్ బ్రౌజర్‌లలో అందుబాటులో ఉంటుంది. ఇది లేటెస్ట్ మ్యూజిక్‌ను, గతంలో వినని కొత్త మ్యూజిక్‌ను యూజర్‌లకు పరిచయం చేస్తుంది. ఒక విధంగా చెప్పాలంటే యాపిల్ డిస్కవరీ స్టేషన్ స్పోటిఫై 'డిస్కవరీ వీక్లీ'ని పోలి ఉంటుంది.

జీమెయిల్‌లో ఇమెయిల్ ట్రాన్స్‌లేషన్

జీమెయిల్ యాప్‌లో ఇమెయిల్ ట్రాన్స్‌లెట్ చేసే కొత్త ఫీచర్‌ని తీసుకురానున్నట్లు గూగుల్ ప్రకటించింది. ఈ ఫీచర్ వెబ్‌లో మాత్రమే అందుబాటులో ఉండేది. ఇప్పుడు ఆండ్రాయిడ్ మరియు ఐవోఎస్ డివైజ్‌లకు కూడా అందుబాటులోకి రానుంది. ఉదాహరణకు...ఇమెయిల్ స్పానిష్‌లో ఉంది, యూజర్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ అనుకుందాం. 'ట్రాన్స్‌లెటెడ్ టు ఇంగ్లీష్'ను ట్యాప్ చేయడం ద్వారా ట్రాన్స్‌లేటెడ్ టెక్స్ట్‌ను చూడవచ్చు. ఎప్పుడూ ఉపయోగించని భాష, ఎప్పుడూ ఉపయోగించే భాష విషయంలో సెట్టింగ్స్‌లోకి వెళ్లి ట్రాన్స్‌లేషన్ ప్రిఫరెన్స్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు ● ఒక మెసేజ్‌ను ట్రాన్స్‌లేట్ చేయడానికి ఈమెయిల్ టాప్‌లో ఉన్న 'ట్రాన్స్‌లేషన్' ఆప్షన్‌ను క్లిక్ చేస్తే సరిపోతుంది ● ఏదైనా లాంగ్వేజ్‌కు సంబంధించి 'ట్రాన్స్‌లెట్ బ్యానర్' టర్న్ ఆఫ్ చేయవచ్చు.



మానిటర్ డెస్క్ ఆర్మ్



బ్రాండ్: గాడ్జెట్ వ్యాగన్;
మోడల్: జీ డబ్ల్యూ-హెచ్ 100
మూమెంట్: రోటెట్;
మోడల్ నేమ్: హెచ్ 100 లాంగ్ డెస్క్ ఆర్మ్
సపోర్ట్: 75×75 ఎంఎం అండ్ 100×1000 ఎంఎం
కలర్: బ్లాక్
కంపాటిబుల్ డివైజ్‌లు: మానిటర్స్, ల్యాప్‌టాప్స్

సినిమా



● బీవీఎస్ఎన్ ప్రసాద్, సాక్షీ వైద్య, వరుణ్ తేజ్, ప్రవీణ్ సత్తారు, బాపినీడు

అందుకే గాండీవధారి అర్జున చేశాను

- వరుణ్ తేజ్

"ప్రవీణ్ సత్తారు 'గాండీవధారి అర్జున' కథ చెప్పినప్పుడు బాగా నచ్చేసింది. ఓ సమస్య గురించి సినిమా తీస్తున్నప్పుడు ఓ నటుడిగా అలాంటి సినిమా చేయటం నా బాధ్యత అనిపించింది.. అందుకే ఈ మూవీ చేశాను'' అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో వరుణ్ తేజ్, సాక్షీ వైద్య జంటగా నటించిన చిత్రం 'గాండీవధారి అర్జున'. బాపినీడు .బి సమర్పణలో ఎస్‌వీసీసీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. గురువారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ వేడుకలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''గాండీవధారి అర్జున' ట్రైలర్ చూసి యాక్షన్ మాత్రమే ఉంటుందనుకోవద్దు.. మంచి ఎమోషన్స్ ఉంటాయి. దేశానికి వచ్చే సమస్య ఏంటి? అనేది చూపించాం'' అన్నారు.

''వరుణ్ తేజ్‌తో మేం చేసిన మొదటి సినిమా 'తొలి ప్రేమ', సాయితేజ్‌తో చేసిన 'విరూపాక్ష' హిట్ అయ్యాయి. ఇప్పుడు 'గాండీవధారి అర్జున' కూడా సూపర్ హిట్ అవుతుంది'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్. ''భూమిపై ఉన్న వనరులను ఇష్టానుసారం వాడేస్తున్నాం. భవిష్యత్ తరాల గురించి ఆలోచించటం లేదు. పర్యావరణ పరిరక్షణ గురించి ఈ సినిమా తీశాం'' అన్నారు ప్రవీణ్ సత్తారు.

కొత్త సినిమాకి క్లాప్



● సిద్ధు జొన్నలగడ్డ, అల్లు అరవింద్

'డీజే టిల్లు' ఫేమ్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా 'బొమ్మరిల్లు' ఫేమ్ భాస్కర్ దర్శకత్వంలో కొత్త సినిమా షురూ అయింది. బాపినీడు.బి సమర్పణలో ఎస్‌వీసీసీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న 37వ సినిమా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రొడ్యూసర్ 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా బీవీఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ– ''భాస్కర్ దర్శకత్వంలో సిద్ధుతో మా బ్యానర్‌లో సినిమా చేయటం ఎంతో సంతోషంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా మూవీ ఉంటుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు వై.రవిశంకర్, వంశీ, దామోదర్ ప్రసాద్, రాధా మోహన్, మిర్యాల రవీందర్ రెడ్డి, రచయిత కోన వెంకట్, డైరెక్టర్ నందినీ రెడ్డి, కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సాయి ప్రకాష్.

అసాధారణ ప్రయాణం




● దుల్కర్ సల్మాన్, ఐశ్వర్య లక్ష్మి


దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కింగ్ ఆఫ్ కోత'. అభిలాష్ జోషి దర్శకత్వంలో జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్ నిర్మించాయి. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్. ఈ నెల 24న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు, హిందీ, మలయాళ, తమిళ ట్రైలర్స్‌ని హీరోలు నాగార్జున, షారుక్ ఖాన్, మోహన్ లాల్, సూర్య విడుదల చేశారు. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ– ''కింగ్ ఆఫ్ కోత' ఒక అసాధారణ ప్రయాణం. గొప్ప పాత్రలు, క్లిష్టమైన కథతో రూపొందించాం'' అన్నారు. ''ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు జీ స్టూడియోస్ సౌత్ హెడ్ అక్షయ్ కేజ్రీవాల్.

హిందీలోనూ హిట్ అవుమా?

ఓ సినిమా హిట్ అయితే... ఆ సినిమాలోని కథ ఏ భాషకైనా, ప్రాంతానికైనా నప్పే విధంగా ఉంటే.. అందరి దృష్టీ ఆ సినిమా మీద పడుతుంది. అలా తమిళంలో హిట్టయిన చిత్రాల మీద హిందీ పరిశ్రమ దృష్టి పడింది. ఆ చిత్రాల రైట్స్ చేజిక్కించుకుని, రీమేక్ చేస్తున్నారు. మరి.. తమిళంలో హిట్ ఆన (అయిన) సినిమా హిందీలోనూ హిట్ అవుమా? (అవుతుందా?) అంటే.. వేచి చూడాల్సిందే. ఇక హిందీలో రీమేక్ అవుతున్న తమిళ చిత్రాల గురించి తెలుసుకుందాం.



● అక్షయ్ కుమార్



● జాన్ అబ్రహాం



● వరుణ్ ధావన్



● అర్జున్ కపూర్



● రణ్‌వీర్ సింగ్

విమానయానం

ఎయిర్ డెక్కన్ వ్యవస్థాపకుడు కెప్టెన్ జీఆర్ గోపీనాథ్ జీవితంతో సుధ కొంగర దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'సూరరై పోట్రు' ('ఆకాశం నీ హద్దురా'). సూర్య హీరోగా నటించిన ఈ చిత్రం 2020లో డైరెక్ట్‌గా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో రిలీజై, మంచి ప్రశంసలు దక్కించుకుంది.

ఈ సినిమా హిందీ రీమేక్‌లో అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్నారు. సుధా కొంగరే రీమేక్‌ను డైరెక్ట్ చేస్తున్నారు. ఈ రీమేక్‌కు సూర్య ఓ నిర్మాతగా ఉండటం విశేషం. సామాన్యులు సైతం విమానయానం చేసేందుకు గోపీనాథ్ ఏ విధంగా కృషి చేశారు? ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు? అనేది 'సూరరై పొట్రు' కథాంశం. అలాగే విజయ్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన 'కత్తి' (2014) రీమేక్‌లో అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తారని సమాచారం. హిందీ రైట్స్‌ను దర్శక-నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ దక్కించుకున్నారు.

హిందీ అపరిచితుడు

విక్రమ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'అన్నియన్' ('అపరిచితుడు') ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేయనున్నట్లు శంకర్ ప్రకటించారు. ఇందులో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించాల్సింది. కొన్ని లీగల్ కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్ వాయిదా పడింది. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, అన్యాయాలపై మానసిక వేదనకు గురైన ఓ మధ్యతరగతి యువకుడు ఏం చేశాడు? అనేది ఈ చిత్రం కథాంశం.

గ్యాంగ్‌స్టర్ సెంటిమెంట్

చెల్లెలి సంరక్షణ కోసం ఓ గ్యాంగ్‌స్టర్ తన జీవితాన్ని ఏ విధంగా మార్చుకున్నాడు? ప్రత్యర్థి గ్యాంగ్‌స్టర్లకు ఎలా బుద్ధి చెప్పాడు? అనే అంశాలతో రూపొందిన తమిళ చిత్రం 'వేదాళం'. అజిత్ హీరోగా శివ దర్శకత్వంలో 2015లో విడుదలైన ఈ సినిమా హిట్ సాధించింది. ఈ సినిమా 'వేద'గా హిందీలో రీమేక్ అవుతోంది. జాన్ అబ్రహాం టైటిల్ రోల్ చేస్తున్నారు. నిఖిల్ అద్వానీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్స్ తమన్నా, శర్వారి లీడ్ రోల్స్ చేస్తున్నారు. జాన్ అబ్రహాం సిస్టర్‌గా శర్వారి, హీరోయిన్‌గా తమన్నా నటిస్తున్నట్లు తెలుస్తోంది.

16ఏళ్లు కోమాలో ఉంటే..

దాదాపు 16 సంవత్సరాలు కోమాలో ఉన్న ఓ వ్యక్తి ఆరోగ్యం హఠాత్తుగా కుదుటపడుతుంది. కోమా నుంచి బయటకు వచ్చిన అతను సమకాలీన నాగరికత, జీవన విధానం, టెక్నాలజీలను చూసి ఆశ్చర్యపోతాడు. ఈ పరిస్థితులను అతడు తన జీవితానికి ఎలా అన్వయించుకున్నాడు? తన పూర్వీకులకు చెందిన ఓ విగ్రహం అతని జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేసింది? అన్నది 'కోమాళి' కథనం. 'జయం' రవి హీరోగా ప్రదీప్ రంగనాథన్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై విజయం సాధించింది. ఈ సినిమా హిందీ రీమేక్ హక్కులను బోనీ కపూర్ సొంతం చేసుకున్నారు. ఈ సినిమాలో అర్జున్ కపూర్ హీరోగా నటిస్తారని బాలీవుడ్‌లో ఎప్పట్నుంచో ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే.

ఇటు పోలీస్.. అటు ఎన్ఆర్ఐ

బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్ ఇటీవల రీమేక్స్ చిత్రాలపై ఆసక్తి చూపిస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం తమిళ దర్శకుడు అట్లీ నిర్మిస్తున్న ఓ సినిమాలో వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొదలైంది. తమిళ దర్శకుడు కాలిస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 2016లో అట్లీ దర్శకత్వంలో వచ్చిన తమిళ హిట్ ఫిల్మ్ విజయ్ 'తేరి'కి ఇది హిందీ రీమేక్ అని బాలీవుడ్ సమాచారం. ఓ రాజకీయ నాయకుడి కుమారుడు ఓ యువతిపై అత్యాచారం చేస్తే, అతన్ని చంపేస్తాడు ఓ పోలీసాఫీసర్. అప్పుడు ఆ రాజకీయ నాయకుడు ఆ పోలీసాఫీసర్‌పై ఏ విధంగా పగ తీర్చుకున్నాడు? ఆ రాజకీయ నాయకుణ్ణి ఆ పోలీసాఫీసర్ ఎలా ఢీ కొన్నాడు? అన్నదే టూకీగా 'తేరి' కథాంశం. ఈ చిత్రంలో పోలీసాఫీసర్‌గా వరుణ్ ధావన్ నటిస్తున్నారు. అలాగే మరో తమిళ హిట్ 'మనాడు' హిందీ రీమేక్‌లో కూడా వరుణ్ ధావన్ నటించనున్నారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. శింబు, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో వెంకట్ ప్రభు దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'మానాడు'. ఈ సినిమా హిందీ రీమేక్ రైట్స్ రానా వద్ద ఉన్నాయి. ఓ ఎన్ఆర్ఐకి, పోలీసాఫీసర్‌కి మధ్య కొన్ని రాజకీయ అంశాల నేపథ్యంలో ఎలాంటి శత్రుత్వం ఏర్పడింది? అనే కోణంలో ఈ సినిమా సాగుతుంది. ఎన్ఆర్ఐగా శింబు నటించగా, పోలీసాఫీసర్‌గా ఎస్‌జే సూర్య నటించారు.

ట్రెండీ లవ్‌స్టోరీ

రూ. 5 కోట్ల లోపు బడ్జెట్‌తో రూపొంది, బాక్సాఫీస్ వద్ద రూ. 50 కోట్లకుపైగా కలెక్షన్స్‌ను సాధించిన తమిళ ట్రెండీ లవ్‌స్టోరీ 'లవ్ టుడే'. ప్రదీప్ రంగనాథన్ నటించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఇవానా హీరోయిన్. గత ఏడాది నవంబరులో విడుదలైన ఈ సినిమా హిందీ రీమేక్‌ను ఫ్యాంథమ్ స్టూడియోస్, ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించనున్నాయి. ఇందులో హీరో హీరోయిన్లుగా ఆమిర్ ఖాన్ పెద్ద కొడుకు జైనైడ్ ఖాన్, శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్‌లు ఫైనల్ అయ్యారని, షూటింగ్ కూడా మొదలైందని బాలీవుడ్ సమాచారం. ప్రేమలో ఉన్న ఓ అబ్బాయి, ఓ అమ్మాయి పరస్పర అంగీకారంతో వారి మొబైల్ ఫోన్స్‌ను మార్చుకున్నప్పుడు ఏం జరిగింది? అనే అంశంతో 'లవ్ టుడే' చిత్రం రూపొందింది.

ఈ చిత్రాలే కాదు.. మరికొన్ని తమిళ సినిమాలు కూడా హిందీలో రీమేక్ కానున్నాయని తెలుస్తోంది.

భీమాకి జోడీగా..



● ప్రియ భవానీ శంకర్, మాళవికా శర్మ

గోపీచంద్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'భీమా'. కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెరకెక్కిస్తున్న ఈ సినిమాను కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ భీమ పాత్రలో నటిస్తున్నారు గోపీచంద్. భీమాకు జోడీగా ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మలను ఎంపిక చేసినట్లు గురువారం చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ''కుటుంబ భావోద్వేగాలు మిళితమైన యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'భీమా' రూపొందుతోంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	308	65,688
నిఫ్టీ ▽	89	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,736	△	12
డోజోన్స్	35,175	△	52
ఎఫ్‌టీఎస్ఈ 100	7,619	△	31
డాక్స్	15,997	△	144
షాంఘై	3,255	△	10
నికాయ్	32,474	▽	269


• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,909	▽	228
బంగారం (99.5 స్వచ్ఛత)	58,673	▽	228
వెండి (కిలో)	70,176	▽	49

మూడోసారీ మార్పులేదు

• కీలక రెపో రేటు 6.5 శాతంగా యథాతథం...
• కొనసాగుతున్న ద్రవ్యోల్బణం భయాల ప్రభావం
• ఆహార ధరలు పెరిగితే రేటు పెంపు తప్పదని సంకేతం
• 5.1 శాతం నుంచి 5.4 శాతానికి ద్రవ్యోల్బణం అంచనా పెంపు
• 2023–24 వృద్ధి రేటు అంచనా 6.5 శాతంగా పునరుద్ఘాటన


ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్

ముంబై: ధరల స్పీడ్‌ను కట్టడి చేసే విషయంలో రాజీ పడేదే లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. ఆహార ధరలు పెరుగుతుంటే దీని కట్టడికి అవసరమైతే రేటు పెంపే ఉంటుందని ఉద్ఘాటించింది. రిటైల్ ద్రవ్యోల్బణం అనిశ్చితి నేపథ్యంలో బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను (ప్రస్తుతం 6.5 శాతం) యథాతథంగా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. 2024 మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణానికి సంబంధించి క్రితం 5.1 శాతం అంచనాలను 5.4 శాతానికి పెంచుతూ ఆర్‌బీఐ గవర్నర్ నేతృత్వంలో సమావేశమైన ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన (ఎంపీసీ) కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. వృద్ధి రేటు అంచనాలను ప్రస్తుత 6.5 శాతంగానే కొనసాగించాలని మూడు రోజులపాటు సమావేశమైన కమిటీ నిర్ణయించింది. మంగళ, బుధ, గురు వారాల్లో జరిగిన ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమావేశ వివరాలను గవర్నర్ శక్తికాంతదాస్ వివరించారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, క్రూడ్ ధరల తీవ్రత, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ గడచిన మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోనికి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో తాజా సమీక్ష సహా గడచిన మూడు సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది. అయితే ద్రవ్యోల్బణం భయాలు పూర్తిగా తొలగిపోలేదని, అవసరమైతే కఠిన ద్రవ్య విధానానికే (రేటు పెంపు) మొగ్గుచూపుతామని కూడా ఆయా సందర్భాల్లో స్పష్టం చేస్తూ వచ్చింది. ఇదే విషయాన్ని తాజా సమీక్షా సమావేశం అనంతరం కూడా ఆర్‌బీఐ గవర్నర్ పునరుద్ఘాటించారు.

పాలసీలో కొన్ని ముఖ్యాంశాలు..

• **వృద్ధి ధోరణి:** 2023–24లో దేశ జీడీపీ 6.5 శాతం ఉంటుందని అంచనావేస్తుండగా, క్యూ1లో 8 శాతం, క్యూ2లో 6.5%, క్యూ3లో 6%, క్యూ4లో 5.7 శాతంగా అంచనా. 2024–25 మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు 6.6 శాతంగా అంచనా.

• **ద్రవ్యోల్బణం దాదాపు 6% లోపే:** 2023–24లో వినియోగ ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉంటుందని అంచనావేస్తుండగా, క్యూ2లో 6.2 శాతం, క్యూ3లో 5.7 శాతం, క్యూ4లో 5.2 శాతంగా అంచనా. వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో అంచనా 5.2%.

• **కొత్త ఉత్పత్తులతో ఊరట:** భారీగా ధర పెరుగుతున్న టమాటా సహా కూరగాయల ధరలు పెరుగుతుండడంతో సమీప భవిష్యత్తులో ధరల తీవ్రత ఒత్తిడి ఉంటుంది. అయితే కొత్త పంట వస్తుండడంతో కూరగాయల ధరలు తగ్గవచ్చన్న అంచనాలూ ఉన్నాయి.

• **డిజిటల్ లావాదేవీల చెల్లింపుల పెంపు లక్ష్యం:** యూపీఐ చెల్లింపుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని వినియోగించే అంశాన్ని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. యూపీఐ–లైట్‌లో ఆఫ్‌లైన్ చెల్లింపులలో నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ (ఎన్‌ఎఫ్‌సీ) టెక్నాలజీ వినియోగాన్ని ప్రస్తావించింది. అలాగే యూపీఐ లైట్‌లో చిన్న విలువ కలిగిన డిజిటల్ చెల్లింపుల కోసం లావాదేవీల పరిమితిని రూ. 200 నుండి రూ. 500కి పెంచాలని ప్రతిపాదించింది. అయితే ఇందుకు సంబంధించి రూ.2,000 రోజూవారీ పరిమితిని యథాతథంగా కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఆయా ఇన్‌స్ట్రుమెంట్ల వినియోగం, ధ్రువీకరణల విషయంలో ఎటువంటి అవకతవకలూ చోటుచేసుకోకుండా త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనుంది.

• **సీఆర్ఆర్‌లో లేని మార్పు:** బ్యాంక్ మొత్తం డిపాజిట్‌లో లిక్విడ్ క్యాష్ రూపంలో ఆ బ్యాంక్ నిర్వహించాల్సిన నగదుకు సంబంధించిన నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్ఆర్)ను యథాతథంగా 4.5% వద్ద కొనసాగింపు. దీనివల్ల ప్రస్తుత బ్యాంకింగ్ ద్రవ్య లభ్యత విషయంలో ఎలాంటి మార్పులూ ఉండవు.

• **అధిక ద్రవ్య లభ్యతపై చర్యలు:** రూ.2,000 నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి రావడం, ఆర్‌బీఐ నుంచి ప్రభుత్వానికి అందిన డివిడెండ్ వంటి చర్యల వల్ల వ్యవస్థలో ఏర్పడిన అధిక ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) తగినంత వరకూ వెనక్కు తీసుకోవడానికి చర్యలు కొనసాగుతాయి. పెరుగుతున్న ఎన్‌డీటీఎల్ (నెట్ డిమాండ్, టైమ్ లయబిలిటీ)పై గత మూడు నెలలుగా ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐ–సీఆర్ఆర్) 10 శాతానికి పెంపు. దీని వల్ల వ్యవస్థ నుంచి దాదాపు రూ.లక్ష కోట్లు వెనక్కు మళ్లుతున్నట్లు అంచనా. ద్రవ్యోల్బణం కట్టడి చర్యలో ఇదొక కీలక చర్య.

• తదుపరి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశం అక్టోబర్ 4–6 మధ్య జరుగుతుంది.

జాగరూకతతో నిర్ణయాలు



ద్రవ్యోల్బణాన్ని కట్టడిలోనే ఉంచుతూ వృద్ధి పటిష్టతకు దోహదపడే పాలసీ ఇది. ఆర్థిక వ్యవస్థ పటిష్టతే లక్ష్యంగా ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలు ఉన్నాయి. లిక్విడిటీకి (ద్రవ్య లభ్యత) సంబంధించి తీసుకున్న నిర్ణయాలు బ్యాంకింగ్ రుణ సామర్థ్యంపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపబోవు. – దినేశ్ ఖారా, ఎస్‌బీఐ చైర్మన్

గృహ డిమాండ్‌కు ఢోకాలేదు



ఆర్‌బీఐ యథాతథ రేటు విధానం వల్ల గృహ డిమాండ్‌కు తక్షణం వచ్చిన సమస్య ఏదీ లేదు. అయితే తదుపరి సమీక్షా సమావేశంలో రేటు కోత ఉంటుందని పరిశ్రమ విశ్వసిస్తోంది. ప్రస్తుతం ద్రవ్యోల్బణం కట్టడే లక్ష్యంగా పాలసీ విధానం కొనసాగినట్లు స్పష్టమవుతోంది. – బొమన్ ఇరానీ, క్రెడాయ్ ప్రెసిడెంట్

• రుణ గ్రహీతలకు ఊరట

ఫ్లోటింగ్ నుంచి ఫిక్స్‌డ్‌కు..!



పెరుగుతున్న వడ్డీరేట్ల వ్యవస్థ నుంచి ఊరటనిచ్చేందుకు ఆర్‌బీఐ పాలసీ సమీక్ష కీలక నిర్ణయం తీసుకుంది. గృహ, ఆటో ఇతర రుణాలు సంబంధించి రుణగ్రహీతలు ఫ్లోటింగ్ రేటు నుంచి ఫిక్స్‌డ్ రేట్ విధానానికి మారే వెసులుబాటును కల్పించనుంది. ఫ్లోటింగ్ వడ్డీ రేటు నుండి స్థిర వడ్డీ రేటుకు మారడానికి అనుమతించే ఫ్రేమ్‌వర్క్‌ను త్వరలో ప్రకటించనుంది. ఈ విధానం కింద బ్యాంకులు... రుణ కాల వ్యవధి, ఈఎంఐల గురించి రుణ గ్రహీతకు తగిన వివరాలు అన్నింటినీ అందజేయాల్సి ఉంటుంది. ఈఎంఐ ఆధారిత ఫ్లోటింగ్ వడ్డీ రుణాల వడ్డీ రేటు నిర్దేశంలో మరింత పారదర్శకత తీసుకునిరావడం, రుణగ్రహీతలు ఫిక్స్‌డ్ రేట్ రుణాలకు మారడం లేదా రుణాలను ముందుగానే చెల్లించడం వంటి పలు అంశాలు త్వరలో విడుదల కానున్న ఆర్‌బీఐ ఫ్రేమ్‌వర్క్‌లో ఉండనున్నాయి. కాగా, రుణ జారీల విషయంలో బ్యాంకులు ''మభ్యపెట్టే విధానాలను'' విడనాడాలని, రుణ గ్రహీత వయస్సు, తిరిగి చెల్లింపుల సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన కాల వ్యవధిలో రుణం తీర్చగలిగేలా రుణాలు మంజూరు చేయాలని పాలసీ సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ స్పష్టం చేశారు. ఆయా విషయంలో మభ్యపెట్టే విధానాలు విడనాడి, రుణగ్రహీతకు పూర్తి పారదర్శక విధానాలను పాటించాలని సూచించారు.

ఎల్ఐసీకి లాభాల కళ



• జూన్ త్రైమాసికంలో రూ.9,544 కోట్లు
• కొత్త పాలసీల ప్రీమియం డౌన్

న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజ సంస్థ ఎల్ఐసీ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి మెరుగైన ఫలితాలను ప్రకటించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 14 రెట్లు పెరిగి రూ.9,544 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో నికర లాభం రూ.683 కోట్లుగా ఉంది. ఆదాయం రూ.1,68,881 కోట్ల నుంచి రూ.1,88,749 కోట్లకు వృద్ధి చెందింది. కొత్త పాలసీలపై వచ్చే తొలి ఏడాది ప్రీమియం ఆదాయం తగ్గింది. ఈ రూపంలో జూన్ త్రైమాసికంలో వచ్చిన ఆదాయం రూ.6,811 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో కొత్త పాలసీల ప్రీమియం ఆదాయం రూ.7,429 కోట్లతో పోలిస్తే సుమారు 9 శాతం క్షీణించింది. పెట్టుబడుల రూపంలో వచ్చిన నికర ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.69,571 కోట్ల నుంచి రూ.90,309 కోట్లకు పెరిగింది. సాల్వెన్సీ రేషియో 1.88 శాతం నుంచి 1.89 శాతానికి పెరిగింది. ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. వసూలు కాని నిరర్థక ఆస్తులు 5.84 శాతం నుంచి 2.48 శాతానికి తగ్గాయి.

బీఎస్ఈలో ఎల్ఐసీ షేరు ఫ్లాట్‌గా రూ.642 వద్ద క్లోజయింది. ఫలితాలు మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడ్డాయి.

జీ–సోనీ విలీనానికి ఓకే

• తాజాగా ఎన్‌సీఎల్‌టీ గ్రీన్ సిగ్నల్
• 10 బిలియన్ డాలర్ల మీడియా దిగ్గజం ఆవిర్భావానికి వీలు



ముంబై: జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) తాజాగా జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్(జీల్), కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్(సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా) విలీనానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు హెచ్‌వీ సుబ్బారావు, మధు సిన్హా అధ్యక్షతన ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ అనుమతించింది. విలీనానికి సంబంధించిన అన్ని అభ్యంతరాలనూ తోసిపుచ్చింది. పలు రుణదాతల అభ్యంతరాలపై విచారణ చేపట్టిన తదుపరి బెంచ్ జూలై 11న తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. విలీనానికి వ్యతిరేకంగా యాక్సిస్ ఫైనాన్స్, జేసీ ఫ్లవర్ ఏఆర్‌సీ, ఐడీబీఐ బ్యాంక్, ఐమ్యాక్స్ కార్ప్, ఐడీబీఐ ట్రస్టీషిప్ చేసిన వాదనలపై విచారణ చేపట్టింది. తదుపరి వీటిని కొట్టివేసింది. వెరసి 10 బిలియన్ డాలర్ల(దాదాపు రూ. 83,000 కోట్లు) విలువైన మీడియా దిగ్గజం ఆవిర్భవించనుంది. దేశీయంగా అతిపెద్ద మీడియా దిగ్గజంగా నిలవనుంది.

తాజా పరిణామంతో జీల్ షేరు 18 శాతం జంప్ చేసి రూ. 286 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 20 శాతం దూసుకెళ్లి రూ. 291కు చేరింది.

సూచీలకు 'పాలసీ' నష్టాలు



బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్య పరపతి కమిటీ తీసుకున్న అదనపు నగదు నిల్వల నిష్పత్తి, ద్రవ్యోల్బణ అంచనాల పెంపు నిర్ణయాలు మార్కెట్ వర్గాలను నిరాశ పరిచాయి. అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి (గురువారం రాత్రి), దేశీయ సీపీఐ ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు విడుదల(నేడు)కు ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఫలితంగా స్టాక్ సూచీలు గురువారం దాదాపు అర శాతం నష్టపోయాయి. మెటల్, మీడియా మినహా అన్ని రంగాలూ అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఫైనాన్స్, కన్జూమర్ షేర్లలో పెద్ద ఎత్తున విక్రయాలు జరిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 487 పాయింట్లు నష్టపోయి 65,509 వద్ద, నిఫ్టీ 138 పాయింట్లు పతనమై 19,495 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. చివరికి సెన్సెక్స్ 308 పాయింట్ల నష్టపోయి 65,688 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 89 పాయింట్లు క్షీణించి 19,543 వద్ద నిలిచింది. ఆర్‌బీఐ వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం దేశీయ కరెన్సీకి కలిసొచ్చింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 17 పైసలు బలపడి 82.68 వద్ద స్థిరపడింది. అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.



హైదరాబాద్ ఎఫ్‌సీ పరాజయం

డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. చెన్నైయిన్ ఎఫ్ సీ జట్టుతో గువాహటిలో గురువారం జరిగిన గ్రూప్ 'ఇ' రెండో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 1–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. హైదరాబాద్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను చింగ్లెన్ సనా సింగ్ నాలుగో నిమిషంలో చేశాడు. చెన్నైయిన్ ఎఫ్‌సీ తరఫున జోర్డాన్ ముర్రే (46వ ని.లో), కానర్ షీల్డ్స్ (15వ ని.లో), అలెక్స్ సాజి (6వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఢిల్లీ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌ను 1–1తో 'డ్రా' చేసుకున్న హైదరాబాద్ ప్రస్తుతం ఒక పాయింట్‌తో గ్రూప్‌లో చివరి స్థానంలో ఉంది. ఈనెల 22న త్రిభువన్ ఆర్మీ (నేపాల్) జట్టుతో హైదరాబాద్ ఎఫ్‌సీ తమ ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడుతుంది. చివరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ జట్టు విజయం సాధించినా క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించే అవకాశాలు కనిపించడంలేదు.

ప్రిక్వార్టర్స్‌లో అర్జున్

బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అర్జున్‌తోపాటు భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. నాలుగో రౌండ్‌లో అర్జున్ 1.5–0.5తో సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై, విదిత్ 1.5–0.5తో ఎటిని బాక్రోట్ (ఫ్రాన్స్)పై గెలుపొందారు. సిందరోవ్‌తో బుధవారం జరిగిన తొలి గేమ్‌ను 'డ్రా' చేసుకున్న అర్జున్ గురువారం జరిగిన రెండో గేమ్‌లో 60 ఎత్తుల్లో నెగ్గాడు.



బాక్రోట్‌తో బుధవారం జరిగిన తొలి గేమ్‌లో గెలిచిన విదిత్ గురువారం జరిగిన రెండో గేమ్‌ను 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. నాలుగో రౌండ్‌లో రెండు గేమ్‌లు ముగిశాక గుకేశ్ (భారత్)–ఎసిపెంకో (రష్యా); ప్రజ్ఞానంద (భారత్)–నకమురా (అమెరికా); నిహాల్ (భారత్)–నెపోమ్‌నిషి (రష్యా) 1–1తో సమంగా ఉండటంతో వీరి మధ్య నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహిస్తారు.

మరోవైపు మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక కూడా నేడు టైబ్రేక్ గేమ్‌లు ఆడనున్నారు. బెలా ఖొటెనాష్‌విలి (జార్జియా)తో తొలి గేమ్‌లో ఓడిన హంపి గురువారం జరిగిన రెండో గేమ్‌లో 42 ఎత్తుల్లో గెలిచి స్కోరును 1–1తో సమం చేసింది. హారిక, ఎలైన్ రోబర్స్ (నెదర్లాండ్స్) మధ్య రెండో గేమ్ కూడా 'డ్రా'గా ముగియడంతో ఇద్దరూ 1–1తో సమంగా ఉన్నారు.

'నాలుగో స్థానంపై అనిశ్చితి ఉంది'

సమస్య వాస్తవమన్న భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ
హైదరాబాద్ యువ క్రికెటర్ తిలక్ వర్మపై కెప్టెన్ ప్రశంసలు



ముంబై: నాలుగేళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్‌కు ముందు భారత జట్టు నాలుగో స్థానంలో ఆడే బ్యాటర్ విషయంలో పెద్ద సమస్యను ఎదుర్కొంది. ఇప్పుడు కూడా కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ గాయాల నుంచి కోలుకోకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చినట్లు కనిపిస్తోంది. మిడిలార్డర్‌లో కీలకమైన ఈ స్థానం విషయంలో నెలకొన్న అనిశ్చితి వాస్తవమేనని స్వయంగా కెప్టెన్ రోహిత్ శర్మ అంగీకరించాడు. అయితే ప్రపంచకప్‌కు ముందు ఆసియా కప్ సమయానికి అంతా సర్దుకుంటుందని అతను విశ్వాసం వ్యక్తం చేశాడు. 'భారత జట్టులో నాలుగో స్థానం విషయంలో చాలా కాలంగా సమస్య ఉంది. యువరాజ్ రిటైరయ్యాక ఎవరూ అక్కడ నిలదొక్కుకోలేకపోయారు. అయితే గత కొంత కాలంగా ఆ స్థానంలో ఆడుతున్న శ్రేయస్ మంచి ప్రదర్శన ఇచ్చాడు. అతని గణాంకాలూ బాగున్నాయి. అయితే అతను గాయపడటంతో వేర్వేరు ఆటగాళ్లతో ప్రయత్నించాల్సి వచ్చింది. కీలక స్థానంలో ఆడే ఆటగాడు గాయపడినప్పుడు మళ్లీ కొత్తగా ప్రయత్నించాల్సి వస్తుంది. నేను కెప్టెన్ కాక ముందు కూడా ఇలాంటి పరిస్థితిని చూశాను' అని రోహిత్ శర్మ వ్యాఖ్యానించాడు. జట్టులో ఎవరి స్థానానికీ హామీ ఉండదని... గాయాల నుంచి కోలుకొని వచ్చిన తర్వాత కూడా ఆటగాళ్లు సత్తా చాటాల్సి ఉంటుందని రోహిత్ అన్నాడు. 'రాహుల్, శ్రేయస్ నాలుగు నెలలుగా క్రికెట్ ఆడలేదు. గాయాలు, శస్త్రచికిత్సలు కొనసాగాయి. కోలుకొని వచ్చిన తర్వాత ఎవరికైనా అంత సులువు కాదు. అయితే మీ కోసం స్థానం సిద్ధంగా ఉందని ఎవరికీ చెప్పలేం. చోటు దక్కించుకునేందుకు అందరూ పోటీ పడాల్సిందే. త్వరలో జరిగే సెలక్షన్ కమిటీ సమావేశం కూర్పు విషయంలో చర్చిస్తాం' అని కెప్టెన్ అన్నాడు. ప్రపంచ కప్‌ను ఎవరూ పళ్లెంలో పెట్టి ఇవ్వరని, దాని కోసం చాలా కష్టపడాల్సి ఉంటుందని రోహిత్ అభిప్రాయపడ్డాడు. '2011 నుంచి మేం అందుకోసం శ్రమిస్తున్నాం. ప్రతీ ఐసీసీ టోర్నీ సమయంలో గెలవగలమనే నమ్మకంతోనే బరిలోకి దిగుతాం. ఫలితం రాకపోయినా వచ్చేసారి గెలుస్తామనే నమ్ముతాం. ఏదో ఒక రోజు కప్ అందుకుంటాం కదా' అని ఈ ముంబైకర్ తన భావాన్ని వెల్లడించాడు. తగినంత అనుభవం లేకపోయినా అనూహ్యంగా ఎవరైనా కొత్తవారిని తీసుకోవడంలో తప్పు లేదని, అయితే అది అరుదుగా మాత్రమే సాధ్యమవుతుందని రోహిత్ చెప్పాడు. 2021 టి20 వరల్డ్ కప్‌లో వరుణ్ చక్రవర్తి ఇలాగే జట్టులోకి వచ్చాడన్న రోహిత్... తాజా సంచలనం తిలక్ వర్మపై ప్రశంసలు కురిపించాడు. అతని వయసును బట్టి చూస్తే చాలా పరిణతి కనబరుస్తున్నాడని, ఎలాగైనా పరుగులు సాధించాలనే తపన తిలక్‌లో కనిపిస్తోందన్న రోహిత్... అతనికి వన్డే జట్టులో చోటు కల్పించే విషయంపై మాట్లాడేందుకు నిరాకరించాడు.

ఫైనల్ బెర్త్ లక్ష్యంగా...

• ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీలో నేడు జపాన్‌తో భారత్ సెమీస్ పోరు
• రాత్రి గం. 8:30 నుంచి స్టార్ స్పోర్ట్స్ ఫస్ట్‌లో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: ఫైనల్ బెర్తే లక్ష్యంగా భారత హాకీ జట్టు సన్నద్ధమైంది. ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో శుక్రవారం జరిగే సెమీఫైనల్లో హర్మన్‌ప్రీత్ బృందం జపాన్ జట్టుతో తలపడుతుంది. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఓటమెరుగని భారత జట్టే ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఈ టోర్నీలో అందరిపై అధిపత్యం కనబరిచింది... గెలిచింది. కానీ ఇలాంటి అజేయమైన భారత్‌ను నిలువరించింది మాత్రం జపానే! లీగ్ దశలో ఇరుజట్ల పోరు 1–1తో డ్రాగా ముగిసింది. ఇప్పుడు నాకౌట్ దశలో జరిగే ఈ పోరులో ఎవరు గెలిస్తే వాళ్లే టైటిల్ ఫేవరెట్ కావడం ఖాయం. గతంలో జపాన్ చేతిలో భారత్‌కు చేదు అనుభవం ఉంది. 2021లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశలో టీమిండియా 6–0తో జపాన్‌ను చిత్తు చేసినప్పటికీ తీరా సెమీస్‌కు వచ్చేసరికి వారి చేతిలో 3–5తో ఓడింటికొచ్చింది. ఇప్పుడు సమష్టి ఆటతీరుతో బదులు తీర్చుకుంటుందా లేదంటే స్వదేశంలోనూ గత అనుభవాన్నే చవిచూస్తుందా అనేది ఇంకొన్ని గంటల్లో తేలుతుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌ను 4–0తో చిత్తు చేసి జోరుమీదున్న భారత్ పట్టుదలగా ఆడితే విజయం ఏమంత కష్టం కానేకాదు. మరో సెమీఫైనల్లో మలేసియాతో దక్షిణ కొరియా తలపడుతుంది. 5–6 స్థానాల కోసం పాకిస్తాన్, చైనా జట్లు తలపడతాయి.

'బాయ్' ఎక్సలెన్స్ సెంటర్ కోచ్‌గా ముల్యో హండోయో



న్యూఢిల్లీ: అస్సాం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) గువాహటిలో కొత్తగా నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీఈ)ను అధునాతన సౌబగులు, క్రీడా సదుపాయాలతో తీర్చిదిద్దింది. దీనికి హెడ్ కోచ్‌గా ఇండోనేసియాకు చెందిన ప్రఖ్యాత కోచ్ ముల్యో హండోయోను 'బాయ్' నియమించింది. హండోయోకు భారత షట్లర్లతో విజయవంతమైన అనుబంధముంది. హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, గురుసాయిదత్ తదితరుల ప్రతిభకు మెరుగులు దిద్ది... చైనా షట్లర్లకు ఎదురునిలిచే నైపుణ్యాన్ని ముల్యోనే నేర్పారు. ఆయన కోచింగ్ హయాంలోనే శ్రీకాంత్ ప్రపంచ నంబర్‌వన్‌గా ఎదిగాడు. అలాగే మరో ఇద్దరు విదేశీ కోచ్‌లను కూడా ఎన్‌సీఈకి నియమించారు. మాజీ ఆల్‌ఇంగ్లండ్ చాంపియన్ ఇవాన్ సాజొనౌవ్ (రష్యా) డబుల్స్ కోచ్‌గా, కొరియాకు చెందిన సింధు మాజీ కోచ్ పార్క్ తే సంగ్ కోచ్‌గా వ్యవహరిస్తారు. అస్సాం, బాయ్ ఉమ్మడి భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న ఎన్‌సీఈలో 24 కోర్టులున్నాయి. 3000 మంది ప్రేక్షకులు వీక్షించవచ్చు. శిక్షణపొందే షట్లర్లు, సిబ్బంది కోసం సౌకర్యవంతమైన వసతి గదులు, కసరత్తుకు జిమ్, ఇతరత్రా అధునాతన సదుపాయాలెన్నో ఉన్నాయి. ఈ సెంటర్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభిస్తారు.

రెండు నెలల్లో... పెద్ద సంఖ్యలో...

న్యూఢిల్లీ: జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) గత రెండు నెలల్లో పెద్ద సంఖ్యలో డోప్ టెస్టులు నిర్వహించింది. త్వరలో ఆసియా క్రీడలు (చైనా) జరుగనున్న నేపథ్యంలో పతకం కన్నా... భారత్ పరువు నిలిపే ఆటగాళ్లనే అక్కడికి పంపాలనే ఉద్దేశంతో 'నాడా' ఈ టెస్టులు చేసింది. జూన్ 1 నుంచి జూలై ఆఖరు వరకు ఏకంగా 914 రక్త, మూత్ర నమూనాలను సేకరించి పరీక్షించినట్లు 'నాడా' ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో అత్యధికంగా 199 పరీక్షలు ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లవే అని పేర్కొంది. ఆ తర్వాత బాక్సింగ్‌లో 71, అక్వాటిక్స్‌లో 65, వెయిట్‌లిఫ్టింగ్‌లో 56, సైక్లింగ్‌లో 55, కబడ్డీలో 52, రెజ్లింగ్‌లో 46, షూటింగ్‌లో 43 నమూనాలను తీసుకొని పరీక్షించినట్లు తెలిపింది.

సింధుకు క్లిష్టమైన 'డ్రా'



కౌలాలంపూర్: ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క టైటిల్ కూడా నెగ్గలేకపోయిన భారత స్టార్ పీవీ సింధుకు ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. ఈనెల 21 నుంచి 27 వరకు డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగెన్‌లో ఈ మెగా ఈవెంట్ జరగనుంది. దీనికి సంబంధించిన 'డ్రా' కార్యక్రమం గురువారం జరిగింది. మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి సింధు మాత్రమే బరిలో ఉంది. 16వ సీడ్‌గా బరిలోకి దిగనున్న సింధుకు తొలి రౌండ్‌లో 'బై' లభించింది. ఆ తర్వాత సింధుకు ప్రతి రౌండ్‌లో గట్టి ప్రత్యర్థి ఎదురయ్యే అవకాశముంది. రెండో రౌండ్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ నొజోమి ఒకుహారా (జపాన్)తో సింధు ఆడే చాన్స్ ఉంది. మూడో రౌండ్‌లో మరో ప్రపంచ మాజీ చాంపియన్ ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్) సిద్ధంగా ఉండవచ్చు. ఈ రెండు అడ్డంకులు దాటితే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సెయంగ్ (దక్షిణ కొరియా)తో సింధు ఆడే అవకాశముంది. ఆన్ సెయంగ్‌తో ఇప్పటి వరకు సింధు ఆరుసార్లు ఆడగా ఆరుసార్లూ ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో భారత్ నుంచి ప్రణయ్, లక్ష్య సేన్, కిడాంబి శ్రీకాంత్ బరిలో ఉన్నారు. పురుషుల డబుల్స్‌లో రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీకి... మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీకి తొలి రౌండ్‌లో 'బై' లభించింది.

వొజ్నియాకి ఓటమి



మాంట్రియల్: మూడున్నరేళ్ల తర్వాత పునరాగమనం చేసిన డెన్మార్క్ టెన్నిస్ స్టార్ కరోలైన్ వొజ్నియాకి నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 టోర్నీ నుంచి నిష్క్రమించింది. వింబుల్డన్ ఓపెన్ చాంపియన్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్)తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో మాజీ నంబర్‌వన్ వొజ్నియాకి 2–6, 5–7తో ఓడిపోయింది.

కృత్రిమ మేధే కొత్త ఆయుధం

భవిష్యత్తులో రక్షణ రంగంలో కీలక పాత్ర పోషించనున్న ఏఐ

- భారత సైనిక వ్యవహారాల్లో సరికొత్త విప్లవం
- సాయుధ బలగాల్లో విని యోగించే దిశగా ఆలోచనలు
- ఇప్పటికే 80కిపైగా ఏఐ ఆధారిత వ్యవస్థల ఆవిష్కరణ
- 30కి పైగా కృత్రిమమేధ ప్రాజెక్టులు మొదలు పెట్టిన భారత నౌకాదళం
- నీటి అడుగున పహారాకాసే మానవ రహిత విమానాల తయారీ
- నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ ఏర్పాటు



కేజీ రాఘవేంద్రారెడ్డి, సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ.. మనిషి మేధస్సుతో పోటీపడుతూ..కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) ప్రపంచాన్ని శాసిస్తోంది. అన్ని రంగాల్లోనూ తనదే పైచేయిగా ముందడగు వేస్తోన్న ఏఐ.. రక్షణ రంగంలోనూ 'మేజర్' అవతారమెత్తనుంది. అమ్ముల పొదిలో అస్త్రంగా..సాయుధ బలగాల్లో సైనికుడిగా.. సముద్ర జలాల్లో శత్రు వినాశనకారిగా..గగనతలంలో అణు సంపదగా.. ఇలా.. నీరు.. నింగి.. నేలపై సరికొత్త యుద్ధ విప్లవాన్ని తీసుకొచ్చే దిశగా ప్రపంచవ్యాప్తంగా అడుగులు పడుతున్నాయి. అగ్రరాజ్యాలతో పోల్చి చూస్తే.. ఏఐ వినియోగంలో భారత్ కాస్త ఆలస్యంగా మేల్కొన్నా.. అందరికంటే ముందంజ వేసేందుకు వ్యూహాత్మక ప్రణాళికల్ని నిర్దేశించుకుంది.

భారత్ దూకుడు.!

దేశ భద్రతలో ఏఐ కీలకమని భావించిన అమెరికా, చైనా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్ తదితర దేశాల సరసన చేరిన భారత్..పరిశోధన, అభివృద్ధి కోసం గణనీయంగా నిధులు కేటాయిస్తూ పరిశోధనలు, పెట్టుబడులు, ఆవిష్కరణల్లో దూకుడుగా వ్యవహరిస్తోంది. హై లెవల్ డిఫెన్స్ ఏఐ కౌన్సిల్ (డీఏఐసీ), డిఫెన్స్ ఏఐ ప్రాజెక్ట్ ఏజెన్సీ(డీఏఐపీఏ)లని ఏర్పాటు చేసి బడ్జెట్‌లో ఏటా రూ.1,200 కోట్ల వరకూ కేటాయిస్తోంది. భవిష్యత్తులో తలెత్తే యుద్ధాల్లో శత్రు దేశాలతో జరిగే యుద్ధంలో కృత్రిమ మేధ కీలకమవుతుందని గ్రహించిన రక్షణ మంత్రిత్వ శాఖ.. త్రివిధ దళాల్లో ఏఐని పెద్ద ఎత్తున వినియోగించేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది.

రక్షణ రంగంలో 80కి పైగా ఏఐ వ్యవస్థలు

రక్షణ రంగంలో కృత్రిమ మేధను ప్రవేశపెట్టే ప్రాజెక్టును కేంద్రం ప్రారంభించింది. ఏఐ సంబంధిత కార్యకలాపాలు సమన్వయం చేసేందుకు నోడల్ ఏజెన్సీగా 2022లో నేషనల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్‌ను రూపొందించింది. గతేడాది ఆగస్టులో భవిష్యత్ ప్రణాళికను ప్రకటించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. 2024కల్లా డిఫెన్స్ రంగంలో కీలకంగా వ్యవహరించేలా 25 నుంచి 30 ఉత్పత్తుల్ని తయారు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రక్షణ శాఖ 80కిపైగా ఏఐ వ్యవస్థల్ని సిద్ధం చేసుకుంది. అడాప్టివ్ కమ్యూనికేటింగ్ సిస్టమ్, సైబర్ దాడులు నియంత్రించడం, మల్టీ సెన్సార్ ఆధారిత వ్యవస్థ ఏర్పాటు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఏఐ ఆధారిత బెడ్ ల్యాబొరేటరీలు, డేటా విస్తృతం చేసేందుకు ఇంటర్ డిసిప్లినరీ డేటా సెంటర్ రూపొందించడం తదితర ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

త్రివిధ దళాల్లోనూ కీలకంగా..

సైనిక దళాల సంసిద్ధత స్థాయిని పెంచేందుకు వీలుగా మానవ రహిత ట్యాంకులను, నౌకలను, రోబోటిక్ ఆయుధాలను ప్రవేశపెట్టే దిశగా భారత్ పరిశోధనలు విస్తృతం చేసింది. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ రంగాల్లో కీలకంగా వ్యవహరించేలా ఆవిష్కరణలు మొదలయ్యాయి. ఒకవైపు చైనా తన సైన్యానికి సంక్లిష్టమైన ఏఐతో కూడిన అప్లికేషన్లను అభివృద్ధి చేస్తోన్న దశలో భారత్ అప్రమత్తమైంది. దీనికి సమాధానంలో త్రివిధ దళాల్లో ఏఐను విస్తృతం చేయడం ద్వారా రాబోయే యుద్ధాల్ని తెలివిగా ఎదుర్కొనేలా చేయడమే లక్ష్యంగా పరిశోధనలు, ఆవిష్కరణలు పెంపొందిస్తోంది. ఈ ఏఐ ప్రాజెక్టుకు సంబంధించిన ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధమైంది. దీన్ని సైనిక దళాలు, ప్రైవేటు రంగం భాగస్వామ్య నమూనాలో చేపట్టనున్నారు. ప్రాజెక్ట్ బీహైవ్ పేరుతో వీటి ఆవిష్కరణలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న 2,000 ఆర్మీ వర్క్‌షాప్స్‌లో ప్రాజెక్ట్ బీహైవ్ నిర్వహిస్తున్నారు. శత్రు స్థావరాల్ని జూమ్ చేసి వివరాలు సేకరించడం, యాంటీ ట్యాంక్ క్షిపణులతో పాట్‌షాట్‌లు తీయడం వంటి ఆవిష్కరణలనూ అభివృద్ధి చేస్తున్నారు.

సైనిక రంగంలో సరికొత్త విప్లవం..

భవిష్యత్తులో జరిగే యుద్ధాలు పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో, స్వయంచాలిత, రోబోలను ఉపయోగించే దశకు చేరుకునే అవకాశం ఉంది. సైనిక వ్యవహారాల్లో సరికొత్త విప్లవాన్ని సృష్టించే దిశగా రోబోల వినియోగంపై దృష్టి సారిస్తోంది. చైనా, పాక్ సరిహద్దుల్లో నిఘా, పెట్రోలింగ్ కార్యకలాపాల్లో ఏఐ పరికరాల్ని వినియోగించడం ద్వారా సంప్రదాయ సైనిక దళాలపై ఒత్తిడి తగ్గించవచ్చు. ఇందులో భాగంగా 150 వరకూ ఏఐ సెన్సార్స్‌ని బోర్డర్స్‌లో అమర్చింది. సైనికులు, రోబోలు కలిసి పని చేసేలా హ్యూమన్ మెషిన్ టీమింగ్ సూత్రాన్నీ అవలంబిస్తున్నారు. స్నేక్, లెగ్డ్ రోబోలు, వాల్ క్లైంబర్స్, మానవ రహిత వాహనాలు(యూజీవీ) తయారవుతున్నాయి. దీంతో పాటు నెట్‌వర్క్ ట్రాఫిక్ అనాలసిస్(నెట్రా)ని కూడా అభివృద్ధి చేశారు. ఉగ్రవాదులు అమర్చిన బాంబుల్ని, క్షిపణుల్ని నిర్వీర్యం చేయడం మొదలైన పరిశోధనలు చురుగ్గా సాగుతున్నాయి.

వివిధ దేశాల్లో ఇలా...!

స్మార్ట్ ఫోన్ సహాయంతో నడిపే అటానమస్ హెలికాప్టర్లను అమెరికా, యూరప్, చైనా దేశాలు అభివృద్ధి చేస్తున్నాయి. అటానమస్ ట్యాంక్స్, రవాణా వాహనాలు కూడా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో అభివృద్ధి చేస్తున్నారు. అమెరికా రక్షణ రంగంలో ఏఐ ద్వారా పనిచేసే రోబోలు, అటానమస్ యంత్రాల అభివృద్ధితో పాటు సైబర్, ఎలక్ట్రానిక్ యుద్ధాల కోసం 18 బిలియన్ డాలర్ల మేర వెచ్చించాలని నిర్ణయించింది. రష్యా కూడా రక్షణ రంగంలో ఏఐ ఆధారిత రోబోట్లు, యాంటీ డ్రోన్ సిస్టమ్స్, క్రూయిజ్ మిస్సైల్స్, తీరప్రాంత రక్షణ వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తోంది. తీర ప్రాంత రక్షణ కోసం ఏఐ ఆధారిత మానవ రహిత గస్తీ సబ్‌మెరైన్స్, రోబోటిక్స్, అటానమస్ యుద్ధ వాహనాల అభివృద్ధి కోసం చైనా కృషి చేస్తోంది.

వైమానిక దళంలో...!

స్వయంప్రతిపత్తి వ్యవస్థని బలోపేతం చేస్తూ పోరాట సామర్థ్యాన్ని మరింత పెంపొందించేలా ఏఐ శక్తిని వైమానిక దళంలో వినియోగిస్తున్నారు. యుద్ధ విమానాలు తీసే వీడియో ఫీడ్ నుంచి ఇమేజ్ రికగ్నిషన్ ఉపయోగించేలా వ్యవస్థ రూపొందుతోంది. హెలికాప్టర్లు, యుద్ధ విమానాల్ని రోబోలే నడిపేలా పరిశోధనలు జరుగుతున్నాయి. శత్రుదేశాల కవ్వింపు చర్యలు గుర్తించడం, సైనికులకు కావాల్సిన లాజిస్టిక్స్, ఆయుధాలు అందించడం మొదలైన పనుల్ని చేసేందుకు మానవ రహిత యుద్ధ విమానాలు త్వరలోనే సిద్ధం కానున్నాయి. యుద్ధ సమయంలోనూ ఏఐ ఆధారిత వైద్య సహకారం కూడా అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నౌకాదళంలో...!

భారత నౌకాదళంలో ఏఐ వినియోగంతో మానవ రహిత సాంకేతికత వ్యవస్థల్ని పెంపొందించే దిశగా ఇండియన్ నేవీ అడుగులు వేస్తోంది. డీఆర్‌డీవో సాయంతో సముద్ర గర్భంలోనూ పహారా కాసే మానవ రహిత వాహనాల్ని తన అమ్ముల పొదిలో చేర్చుకునేందుకు సన్నద్ధమవుతోంది. ఇటీవలే యూఏవీ (అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్) ప్రయోగాలు విజయవంతంగా డీఆర్‌డీవో పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో మానవ రహిత శక్తిని మరింత పెంపొందించాలని నిర్ణయించింది. నీటి అంతర్భాగంలో కూడా దూసుకెళ్లే యూఏవీలు తయారు చేస్తోంది. కేవలం నిఘాకు మాత్రమే కాకుండా యుద్ధ సమయంలోనూ సత్తా చాటే విధంగా డిజైన్ చేస్తోంది. ఏకంగా 15 రోజుల పాటు సముద్రంలోనే ఉంటూ పహారా కాసే వాహనాలు తయారవుతున్నాయి. వీటితో పాటుగా.. సబ్‌మెరైన్లు, యుద్ధ నౌకల్లోనూ కృత్రిమ మేధని వినియోగించే దిశగా పరిశోధనలు జరుగుతున్నాయి. భారత నౌకాదళంలో ఇప్పటికే 30కి పైగా ఏఐ ప్రాజెక్టులు చేపట్టింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఐఎన్ఎస్ వాల్సురా నౌకాదళ శిక్షణ కేంద్రాన్ని ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మార్చారు. నేవీ, బీఈఎల్, ఎస్ఎస్‌టీఎల్ కలిసి సముద్ర గర్భంలో స్థితిగతుల్ని ఎప్పటికప్పుడు తెలిపే సాఫ్ట్‌వేర్‌ని రూపొందిస్తున్నాయి. నౌకాదళ సిబ్బందికి సైతం ఏఐపై తర్ఫీదుని అందిస్తున్నారు. ఇలా త్రివిధ దళాల్లో కృత్రిమ మేధ వ్యవస్థని బలోపేతం చేసి.. శత్రుసైన్యాలకు హెచ్చరికల్ని పంపించేందుకు భారత్ సర్వం సన్నద్ధం చేస్తోంది.

అరాచకవాది బాబును జైల్లో పెట్టాలి

1,047వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: అధికారమే పరమావధిగా ప్రజలను రెచ్చగొట్టి రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్న అరాచకవాది చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,047వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో పలువురు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ తాను ఓడిపోవడం ఖాయమని గ్రహించిన చంద్రబాబు ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి దాడులకు పురిగొలుపుతున్నాడని విమర్శించారు. ఇటీవల పుంగనూరులో ఆయన చేసిన ప్రసంగమే అందుకు సాక్ష్యమన్నారు. కులవాదమే అజెండాగా కేవలం బాబు ఆయన బినామీల పెట్టుబడుల కోసం చేస్తున్న అమరావతి దొంగ దీక్షలను ఇకనైనా నా కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు పల్లె బాబు, కారుమూరి పుష్పరాజు, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కొనుగోలు టెండర్ల ప్రక్రియ చేపట్టిన ఆర్టీసీ

సాక్షి, అమరావతి : ఏసీ, నాన్ ఏసీ స్లీపర్, సీటర్ బస్సుల కొనుగోలుకు ఆర్టీసీ టెండర్లను ఆహ్వానించింది. ఇందుకోసం రూపొందించిన టెండరు పత్రాలను జ్యుడిషియల్ ప్రివ్యూ వెబ్‌సైట్, ఆర్టీసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. వాటిపై సలహాలు, సూచనలను ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఈ–మెయిల్ ద్వారా తెలియజేయాలని ఆర్టీసీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.
టెండరు పత్రాలు అందుబాటులో ఉంచిన వెబ్‌సైట్లు: https://judicialpreview. ap.gov.in/projects& received
www.apsrtc.ap.gov.in
సలహాలు, సూచనలు పంపాల్సిన మెయిల్ ఐడీ: apjudicialpreview @gmail.com

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి : నేషనల్ మీన్స్–కం–మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష(ఎన్ఎంఎంఎస్)కు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో 2023–24 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న వారు అర్హులని, ఈ ఏడాది ఎనిమిదో తరగతి చదువుతూ, కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000లోపు ఉన్న విద్యార్థులు అర్హులని అధికారులు ప్రకటించారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుంగా చెల్లించి వచ్చేనెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకుని, ప్రింటెడ్ నామినల్ రోల్స్, ధ్రువ పత్రాలను సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో అందించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్ 3న పరీక్ష నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పూర్తి వివరాలకు www.bse.ap.gov.in లేదా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సిడ్నీ మలబార్‌లో ఐఎన్ఎస్ సహ్యాద్రి, కోల్‌కతా

సింఢియా: భారత నావికాదళానికి చెందిన స్వదేశీ ఫ్రంట్‌లైన్ యుద్ధనౌకలు ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ కోల్‌కతా ఈ నెల 11, 12 తేదీల్లో ఆస్ట్రేలియా లోని సిడ్నీలో జరుగుతున్న మలబార్ 2023లో పాల్గొంటాయి. మలబార్ 2023ను రెండు దశల్లో నిర్వహిస్తారు. భాగస్వామ్య దేశాల నుంచి సముద్ర భద్రతా కార్యకలాపాల్లో అత్యుత్తమ అభ్యాసాలు నేర్చుకునేందుకు మలబార్ 2023 ఎంతో ఉపయోగపడుతుందని నౌకలకు నాయకత్వం వహిస్తున్న రాజన్‌కపూర్ అన్నారు.



మలబార్ 2023కు వెళుతున్న ఐఎన్ఎస్ కోల్‌కతా నౌక

కర్నూలులో ఎన్ఐఏ సోదాలు

కర్నూలు : జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు కర్నూలు నగరంలో తనిఖీలు నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున కర్నూలుకు చేరుకుని పాపులర్ ఫ్రంట్, ఎస్‌డీపీఐకి చెందిన ఇద్దరు నాయకుల ఇళ్లల్లో సోదాలు చేశారు. పాతబస్తీకి చెందిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా నేత షేక్ అబ్దుల్, ఆటోనగర్‌లో నివాసముంటున్న ఎస్‌డీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్‌మావ్య ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న పోలీస్ గెస్ట్ హౌస్‌కు తరలించి విచారించారు. దుబాయ్‌లో ఉన్న ఒక వ్యక్తి ద్వారా వీరి ఖాతాల్లోకి నిధులు మళ్లించారనే కోణంలో దర్యాప్తు చేసినట్టు తెలిసింది. ఎస్‌డీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అమీర్‌మావ్య నిజామాబాద్‌లో చదువుకుని ప్రస్తుతం కర్నూలులో వ్యాపారం చేస్తున్నాడు. గత ఎన్నికల్లో పోటీ చేసిన నామినేషన్ పత్రాలను కొన్నింటిని ఆయన ఇంట్లో స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం 6 గంటల వరకు ఇద్దరినీ వేర్వేరుగా విచారించి విడుదల చేశారు.

ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో బెయిల్ తిరస్కరణ

విశాఖలీగల్ : విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యుల అపహరణ కేసులో అరెస్టయిన ఆరుగురి బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ఈ మేరకు నగరంలోని మెట్రోపాలిటన్ ప్రధాన సెషన్స్ కోర్ట్ న్యాయమూర్తి శ్రీదేవి గురువారం ఆదేశాలు జారీ చేశారు. 2023 జూన్ 11న ఎంపీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసి మూడు రోజుల పాటు నిర్బంధంలో ఉంచారు. ఈ కేసును ఛేదించిన పీఎం పాలెం పోలీసులు నిందితులపై భారతీయ శిక్షా స్మృతి సెక్షన్ 323, 324, 364ఏ, 307, 386, 452 కింద కేసు నమోదు చేశారు. ప్రభుత్వం తరఫున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.జగదీశ్వరరావు వాదనలు వినిపించారు.

ఆక్వాకు పూర్వ వైభవం

కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ చట్టం సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

- ఫలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవ
- 200 మీటర్ల పరిధిలో హేచరీలకు గ్రీన్ సిగ్నల్
- 200 బిలియన్ల రొయ్య పిల్లలు ఉత్పత్తికి ఊపిరి
- ఆక్వా రంగానికి పూర్వ వైభవం తథ్యమంటున్న రైతులు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలించింది. కీలకమైన చట్ట సవరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చాలా కాలంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తోంది. ఈ ప్రయత్నం ఫలించి కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ(సీఏఏ)కి ప్రతిబంధకంగా మారిన చట్టాన్ని సవరిస్తూ తెచ్చిన బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ నెల 9న బుధవారం ఆమోదం లభించింది. ఈ నిర్ణయంతో ప్రశ్నార్థకంగా మారిన ఆక్వారంగం పూర్వ వైభవాన్ని సంతరించుకోనుందని ఆక్వా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సవరణలతో దేశీయ ఆక్వారంగం ప్రపంచంలోనే ఒక వెలుగు వెలగనుందని పేర్కొంటున్నాయి.

ముఖ్యమంత్రి చొరవతో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్వా రంగానికి ఎప్పటికప్పుడు అనేక ప్రోత్సాహకాలు అందిస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. 10 రోజులకు ఒకసారి రొయ్యల ధరలను నిర్ణయించి వాటిపై ప్రభుత్వం పూర్తిగా పట్టు బిగించి ఆక్వా రైతులకు, వ్యాపారులకు కొండంత అండగా నిలుస్తోంది. ఆక్వా రంగంలో విద్యుత్ రాయితీలు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌లో ఆక్వా ధరలపై సిండికేట్ జోక్యం లేకుండా చేసింది. తాజాగా కేంద్రం సీఏఏ చట్ట సవరణ చేయడంతో ఈ రంగానికి భారీ ఊరట కలిగించింది.

అసలేం జరిగిందంటే..!

వాస్తవానికి 1996 క్రితం వరకు కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జెడ్) అమలులో ఉండేది. అందులో సముద్ర తీరానికి 200 మీటర్ల పరిధిలో హేచరీలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించారు. కాలక్రమేణా 2005లో సీఆర్‌జెడ్‌లో మార్పులు తీసుకువచ్చి మత్స్య, వ్యవసాయ, వాణిజ్యం, పర్యావరణ తదితర విభాగాల నిపుణులతో కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీని తీసుకొచ్చారు. 27 శాఖలతో సీఏఏను ప్రతిపాదించిన ప్రభుత్వం ఆక్వా రంగంలో కోట్లాది రూపాయలు విదేశీమారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్న హేచరీలను హైటైడల్ జోన్ పరిధి(హేచరీస్ జోన్)ని నిర్ధారించడం సీఏఏలో విస్మరించింది. ఫలితంగా ఇటీవల చెన్నైకు చెందిన ఒక సంస్థ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో జోన్ పరిధిపై కేసు వేసింది. 200 మీటర్లలోపు హేచరీలకు ఎలా అనుమతిస్తారంటూ లేవనెత్తిన అభ్యంతరాన్ని ఎన్‌జీటీ సైతం ఆమోదించడం అక్వారంగంపై పిడుగుపాటులా మారి హేచరీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో ఎంపీలు వంగా గీతవిశ్వనాథ్, బీద మస్తాన్‌రావు తదితరులు ఈ సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని కేంద్రాన్ని ఒప్పించడం ద్వారా పార్లమెంట్‌లో బిల్లుకు సంపూర్ణ మద్దతుతో బిల్లుకు ఆమోదం లభించింది.

ఆక్వా రంగానికి పూర్వవైభవం

సీఏఏ సవరణ బిల్లుకు ఆమోదం లభించడం శుభపరిణామం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో పాటు మన ఎంపీలు చొరవ తీసుకోవడంతో ఇది సాధ్యమైంది. మన దేశ ఆక్వా రంగం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానానికి చేరుకోవడానికి ఈ చట్ట సవరణతో సాధ్యమవుతుంది.
– సత్తి వీర్రెడ్డి, ఆల్ ఇండియా ష్రింప్ హేచరీస్ అసోసియేషన్, కాకినాడ చాప్టర్

చట్ట సవరణతో మేలు

విదేశీ మారక ద్రవ్యం రెట్టింపు కావడానికి చట్ట సవరణ ఎంతగానో దోహదపడుతుంది. దేశ ఆక్వా రంగంలో ప్రధాన పాత్ర పోషించే ఏపీలో హేచరీలకు ఉజ్వల భవిష్యత్‌కు దోహదపడుతుంది. ఈ రంగంపై ఆధారపడ్డ రెండు లక్షల మంది ఉపాధి అవకాశాలకు ఢోకా ఉండదు. హేచరీలకు ఇదొక స్వర్ణయుగంగా మారుతుంది.
– సుంకరణం హరినారాయణరావు, జనరల్ సెక్రటరీ, ఆల్ ఇండియా ష్రింప్ హేచరీస్ అసోసియేషన్

రూ.50 లక్షల విలువైన ఎర్రచందనం పట్టివేత

- ఆరుగురు స్మగ్లర్ల అరెస్ట్
- తమిళనాడు కార్లకు ఏపీ నంబర్లు వేసుకుని స్మగ్లింగ్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు



టాస్క్‌ఫోర్స్ పోలీసుల అదుపులో నిందితులు

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 32 ఎర్రచందనం దుంగలతో పాటు ఓ కారు, మోటారు సైకిల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని, ఆరుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. తిరుపతి కపిల తీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో గురువారం డీఎస్పీ చెంచుబాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. రాయవరం సెక్షన్‌లోని అటవీ ప్రాంతంలో బుధవారం పోలీసులు కూంబింగ్ చేపట్టగా శేషాచలం ఎక్స్‌టెన్షన్ రిజర్వ్ ఫారెస్ట్‌లో కొందరు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టి అక్కడున్న 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఘటనలో తమిళనాడుకు చెందిన టి.వెంకటేశన్, హరి, చిత్తూరు జిల్లా కోట మండలానికి చెందిన కేసీ విజయకుమార్‌లను అరెస్ట్ చేశారు. మరో కేసులో సానిపాయరేంజ్‌లోని వానరాచపల్లి ఫారెస్ట్ బీటులో కొంతమంది ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ పోలీసుల కంటబడ్డారు. వారిని చుట్టుముట్టగా దుంగలను పడేసి పారిపోయారు. వారిలో ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో తమిళనాడుకు చెందిన పొన్నుస్వామిశరత్, చిన్నరాజి పచ్చయప్పన్, నడిపయ్యన్‌మణిలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి 22 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రేణిగుంట మండలం కరకంబాడి రోడ్డులోని మామండూరు వద్ద కూంబింగ్ చేస్తున్న అధికారులు ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన కార్లకు ఏపీ నంబర్లు వేసుకుని ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నట్టు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందన్నారు.

ఎన్టీపీసీలో ప్రమాదం.. ఇద్దరు కాంట్రాక్టు కార్మికుల దుర్మరణం

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఎన్టీపీసీలో లైమ్‌హ్యాండ్లింగ్ స్టోర్ వద్ద విరిగి పడిన కేబుల్ ట్రాక్

పరవాడ(పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీలో కేబుల్ ట్రాక్ విరిగి పడిన ఘటనలో ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన టింక్‌షేక్(32), షఫీరూల్ షేక్(26) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అదే ప్రాంతానికి చెందిన ఆసిక్ షేక్, హనికుల్ షేక్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరవాడ సీఐ ఈశ్వరరావు తెలిపిన వివరాలు.. సింహాద్రి ఎన్టీపీసీలో ఎఫ్‌జీడీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎరక్షన్ పనులను 'జీ' సంస్థ చేపడుతోంది. పనుల్లో భాగంగా కేబుల్ లైన్ గ్యాలరీపై కార్మికులు గురువారం విధులు నిర్వహిస్తున్న సమయంలో 12 మీటర్ల ఎత్తులో ఉన్న కేబుల్ లైన్ గ్యాలరీ ఒక్క సారిగా కుప్పకూలింది. ప్రమాదంలో గ్యాలరీపై విధులు నిర్వహిస్తున్న కార్మికులు కింద పడిపోగా వారిపై గ్యాలరీ పడడంతో మృత్యువాతపడ్డారు. మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. సమాచారం తెలుసుకున్న పరవాడ సీఐ ఈశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రమాదానికి సంబంధించి ఎన్టీపీసీ యాజమాన్యం మీడియాకి సమాచారాన్ని తెలియజేయడానికి ముందుకు రాలేదు.

రైలుకు, ప్లాట్‌ఫాంకు మధ్య ఇరుక్కుపోయి మెడికో దుర్మరణం

కాకినాడ రైల్వే స్టేషన్‌లో ఘటన



కాకినాడ క్రైం: రైలు దిగుతూ జారిపడి ఓ మెడికో ప్రాణాలు కోల్పోయింది. కాకినాడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. సిద్దాబత్తుల శ్రీనివాసమోహన్, సురేఖ దంపతుల చిన్న కుమార్తె సత్యతనూష గుంటూరు జిల్లా చినకాకాని ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతోంది. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో గురువారం నుంచి జరగనున్న వైద్య విద్యా సదస్సుకు హాజరయ్యేందుకు సత్యతనూష గురువారం ఉదయం విజయవాడలో శేషాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా జారిపడి ప్లాట్ ఫాంకి, రైలుకి మధ్య ఇరుక్కుపోయింది. ఈ లోగా రైలు కదిలింది. కదులుతూనే తనూషను పట్టాలపైకి లాగేసింది. గమనించిన తోటి ప్రయాణికులు గొలుసు లాగి రైలును నిలిపారు. అప్పటికే సత్యతనూషపైకి రైలు చక్రం ఎక్కడంతో ప్రాణాలు కోల్పోయింది. గ్యాంగ్‌మెన్‌లు, రైల్వే పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. కాకినాడ జీజీహెచ్‌లో పోస్ట్‌మార్టం నిర్వహించారు. కాకినాడ రైల్వే పోలీస్ ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేశారు. కాగా, ప్లాట్‌ఫాంకి, రైలు బండికి మధ్య ప్రమాదకర దూరం ఉందని రైలు ప్రయాణికులు పలుమార్లు రైల్వే అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా మరో నిండుప్రాణం బలైందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023

అనుమతులు లేని ప్రైవేటు స్కూళ్ల మూత : సర్కారు

శివాజీనగర: 2022–23వ సంవత్సరంలో రాష్ట్రంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ప్రైవేటు స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. కర్ణాటక విద్యాచట్టం కింద ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలు 45 రోజుల్లో అవసరమైన అనుమతులను తీసుకోవాలని ఆ శాఖ అధికారులు గతంలో ఆదేశించారు. ఈ నేపథ్యంలో నియమాలను ఉల్లంఘించి నిర్వహిస్తున్న పాఠశాలలను ఈ నెల 14లోగా మూసివేయాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌లకు ఆదేశాలు వచ్చాయి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఈ నెల 16 నాటికి తమ జిల్లా వ్యాప్తిలో అనధికారిక పాఠశాలలు లేవని ప్రకటించాలి. ఒకవేళ నిర్ధారించిన తేదీలోగా ఎలాంటి సమాచారాన్ని సమర్పించని పక్షంలో సదరు అధికారులపై చర్యలు తీసుకుంటామని సర్కారు తెలిపింది.

న్యూస్‌రీల్

తీరంలో ప్లాస్టిక్ చెత్తతో సమస్య : మంత్రి

శివాజీనగర: కోస్తా ప్రాంతంలో సముద్రాల్లో ప్లాస్టిక్ చెత్త వల్ల జలచరాలకు ఇబ్బంది కలుగుతోందని, దీనిని నివారించాలని అటవీశాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె అనన్నారు. గురువారం ప్రపంచ బ్యాంక్ బృందంతో సమావేశమైన ఆయన రాష్ట్రంలో 317 కిలోమీటర్ల పొడవునా సముద్ర తీరం ఉందని, ప్రతిరోజు 50 టన్నుల ప్లాస్టిక్ చెత్త సముద్రంలో చేరడం చాలా ప్రమాదకరమని అన్నారు. దీంతో సముద్ర అంచునకు వచ్చి గుడ్లు పెట్టి పిల్లలు పుట్టించే జలచరాల సంతానోత్పత్తికి ఆటంకం ఏర్పడుతుందని చెప్పారు. బ్లూ ప్యాక్ ప్రాజెక్ట్ ద్వారా ప్లాస్టిక్ చెత్త సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇందుకు రూ.840 కోట్లు అవుతుందని, ఇందులో 70 శాతం ప్రపంచ బ్యాంకు రుణం ఇస్తుందని చెప్పారు.

లింక్ పంపి రూ.5.48 లక్షలు లూటీ

మైసూరు: కరెంటు బిల్లును చెల్లించాలి మెసెజ్ చేసి దాని ద్వారా సుమారు రూ. 5.48 లక్షలను సైబర్ నేరగాళ్లు లూటీ చేశారు. ఈ సంఘటన మైసూరు నగరంలో చోటుచేసుకుంది. బాధితుడు యాదవగిరిలో నివాసం ఉండే కణ్ణన్ (52). గుర్తు తెలియని వ్యక్తి ఇతని మొబైల్ ఫోన్‌కు కరెంటు బిల్లును చెల్లించాలి మెసేజ్‌తో పాటు ఒక లింక్‌ను పంపించాడు. బాధితుడు నిజమేనేమో అనుకుని మెసెజ్‌ను ఓపెన్ చేసి లింక్‌ను నొక్కాడు. అంతే.. కణ్ణన్ బ్యాంకు ఖాతాలో నుంచి సుమారు రూ. 5.48 లక్షలు వేరే ఖాతాల్లోకి బదిలీ అయినట్లు మెసేజ్ రావడంతో నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

త్వరలో రాష్ట్రమంతటా ఈ–చలాన్లు

బనశంకరి: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘన, జరిమానాల వసూలులో కర్ణాటక దేశంలోనే చాలా ముందుందని ఏడీజీపీ అలోక్‌కుమార్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల ఈ–చలానాల వసూలులో ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. 50 శాతానికి పైగా ఈ–చలాన్ వ్యవస్థ ఉందని తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ–చలాన్ విధానాన్ని అమలులోకి తీసుకువస్తామని, పాత వ్యవస్థను రద్దు చేస్తామని తెలిపారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రంలో 24,594 ఈ–చలానాలు ఇచ్చి రూ.1.22 కోట్ల జరిమానా సేకరించామని తెలిపారు.

కేంద్రమంత్రిపై బీజేపీ ఎమ్మెల్యే ధ్వజం

బనశంకరి: రాష్ట్ర బీజేపీలో సొంత పార్టీ నేతల మధ్య కక్షలు బయటపడుతున్నాయి. బీజేపీ ఎమ్మెల్యే ప్రభుచౌహాన్, కేంద్రమంత్రి భగవంత్ ఖుబా మధ్య సమరం మొదలైంది, తనను హత్య చేసి ఆరు నెలల్లో ఉప ఎన్నికలు నిర్వహించడానికి కుట్ర పన్నుతున్నారని ఔరాద్ ఎమ్మెల్యే ప్రభుచౌహాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. గుండాలతో హత్య చేయించడానికి పథకం పన్నారని బహిరంగంగా ఆరోపించారు. బీదర్ జిల్లా ఔరాద్ పట్టణంలో నిర్వహించిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో ప్రభు చౌహాన్ మాట్లాడుతూ .. 2023 శాసనసభ ఎన్నికల్లో తనను ఓడించడానికి భగవంత్‌ఖుబా ఎన్నో ప్రయత్నాలు చేశారని, అవి విఫలమాయ్యయని, తనను హత్యచేయించి ఉప ఎన్నికల కోసం ప్లాన్ చేశారని దుయ్యబట్టారు.

రాత్రి 8 వరకు నమ్మ క్లినిక్‌లు

శివాజీనగర: సామాన్య ప్రజలకు ఉచిత వైద్య చికిత్స కల్పించడానికి ప్రారంభించిన నమ్మ క్లినిక్‌లు ఇకపై రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయి. ఈ మేరకు ఆరోగ్యమంత్రి మంత్రి దినేశ్ గుండూరావ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 415 నమ్మ క్లినిక్‌లు ఉండగా, వీటిలో 25 శాతం క్లినిక్‌ల సమయాన్ని మార్చేందుకు ఆరోగ్య మంత్రి శాఖాధికారులకు సూచించారు. ఈ క్లినిక్‌లు ఉదయం 9 గంటలకు తెరిచి మధ్యాహ్నం 12.30 గంటలకు మూతవేసేవారు. మధ్యాహ్నం భోజనం తరువాత 2 గంటలకు తెరచి సాయంత్రం 4 వరకు పనిచేసేవి. అనారోగ్యంతో సాయంత్రం తరువాత వచ్చే వారు కూడా ఎక్కువ కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంలకు ఊరట

- వారిపైనున్న మేకెదాటు కోవిడ్ కేసులు మాఫీ
- కేబినెట్ భేటీలో తీర్మానం



అప్పట్లో మేకెదాటు వద్ద పాదయాత్ర ప్రారంభోత్సవ సభ (ఫైల్)



బనశంకరి: మేకెదాటు పాదయాత్ర సమయంలో కాంగ్రెస్ సీనియర్లు సిద్దరామయ్య, డీకే శివకుమార్, డీకే. సురేశ్‌లకు ఊరట కలిస్తూ, వారిపై నమోదైన కోవిడ్ మార్గదర్శకాల ఉల్లంఘన కేసులు ఎత్తివేయాలని కేబినెట్‌లో తీర్మానించారు. గతేడాది జనవరిలో మేకెదాటు ప్రాజెక్టు నిర్మాణం కోరుతూ డీకే ఆధ్వర్యంలో మేకెదాటు నుంచి బెంగళూరుకు పాదయాత్ర నిర్వహించడం తెలిసిందే. ఈ సమయంలో కోవిడ్ థర్డ్ వేవ్ నిబంధనలు అమల్లో ఉన్నాయి. గురువారం విధానసౌధలో మంత్రిమండలి సమావేశం అనంతరం మంత్రి హెచ్‌కే పాటిల్ వివరాలను వెల్లడించారు. రామనగరలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 9 క్రిమినల్ కేసులను ఎత్తివేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పాదయాత్రలో కోవిడ్ నిబంధనలకు విరుద్ధంగా వందలాది మందితో ర్యాలీలు చేయడంతో బొమ్మై సర్కారు కేసులు నమోదుచేసింది.

పలు ముఖ్యమైన తీర్మానాలు

- వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎం హెచ్.నాగేశ్, గత జాయింట్ డైరెక్టర్‌లకు నిధుల దుర్వినియోగం కేసులో సెషన్స్‌కోర్టు 5 ఏళ్ల జైలుశిక్ష విధించడంతో వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలని తీర్మానం.
- బెంగళూరులో ఏరోస్పేస్ రక్షణ కేంద్రం ఏర్పాటుకు రూ.391 కోట్లకు పాలనాత్మక ఆమోదం. ఇందిరానగర సీవీ.రామన్ ఆసుపత్రి వైద్యురాలు ఎస్ డీ.నాగమణి లోకాయుక్తకు పట్టుబడగా తప్పనిసరి రిటైర్మెంటుకు తీర్మానం. రామనగర మహిళా వైద్యురాలు డాక్టర్ ఉషా కదరమండలగికి ఇదే నిర్ణయం.
- హువినహడగలి నియోజకవర్గం విద్యాశాఖాధికారి ఎస్ఎస్. హళ్లిగుడిపై ఆరోపణలు ఉన్నందున సేవల నుంచి సస్పెండ్.

ఆస్పత్రులకు నిధులు


- బెళగావి మెడికల్ కాలేజీలో 325 పడకల సూపర్ స్పెషాలిటి ఆసుపత్రికి రూ.187 కోట్ల మంజూరు
- కరావళి అభివృద్ధి ప్రాధికార పేరును కరావళి ప్రాదేశికాభివృద్ధి మండలి అని పేరు మార్పు
- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ నియోజకవర్గాల్లో 20 సంచార ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు. రూ. 47 కోట్లతో ఐదు జిల్లా ఆసుపత్రులైన మైసూరు, చిత్రదుర్గ, సీవీ రామన్‌నగర, వెన్‌లాక్ ఆసుపత్రి, కేసీ. జనరల్ ఆసుపత్రుల్లో 15 ఎంఆర్‌ఐ స్కానింగ్ సేవలు.

కొత్తగా సైబర్ భద్రతా చట్టం

- కర్ణాటక సైబర్ భద్రతా చట్టం 2023 –24 కు అనుమతి. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాల కట్టడి నేపథ్యంలో సైబర్ భద్రతకు చట్టం ఆమోదం
- సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో పామాయిల్‌కు బదులుగా సన్ ఫ్లవర్ నూనె పంపిణీ.
- బీబీఎంపీ చట్టాన్ని ఇతర మహానగర పాలికె, నగర సభ, పురసభల్లో అమలుకు పరిశీలన.

అలాగే అక్రమ కట్టడాలు, బయలు భూమిపై పన్ను విధింపు పరిశీలనకు మంత్రి వర్గ ఉపసమితి ఏర్పాటు.

బస్సులు, క్యాబ్‌లలో ట్రాకింగ్, ప్యానిక్ బటన్



ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, క్యాబ్‌లు తదితర ప్రజా రవాణా సంస్థల వాహనాల్లో ప్రయాణికులు, మహిళల భద్రత కోసం వెహికల్ ట్రాకింగ్ సిస్టమ్, ప్యానిక్ బటన్‌ను అమర్చడానికి నిర్ణయం. ఇందుకోసం పర్యవేక్షణకు కేంద్రీకృత కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు రూ.30.74 కోట్ల మంజూరుకు పాలనాత్మక ఆమోదం. ప్రయాణికులకు వాహనం సమాచార వసతి, సజావుగా ప్రయాణం, ప్రమాదాల నియంత్రణకు ఇది దోహదపడుతుంది.

చిన్నారులపై దూసుకెళ్లిన వాహనం

- ఇద్దరు మృతి


మృతిచెందిన చిన్నారులు రోహిన్, శాలిని

దొడ్డబళ్లాపురం: గూడ్స్ వాహనం ఢీకొని ఇద్దరు చిన్నారులు మృతిచెందగా, మరో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డ ఘోర దుర్ఘటన రామనగర తాలూకా గొల్లరదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. రోహిన్ (5), శాలిని (8) మృతులు, సుచిత్, గౌతమి అనే మరో ఇద్దరు క్షతగాత్రులు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో నలుగురు పిల్లలు ట్యూషన్ ముగించుకుని ఇళ్లకు నడిచి వస్తుండగా టాటాఏస్ గూడ్స్ వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన నలుగురు పిల్లలను ఆస్పత్రికి తరలించగా రోహిన్, శాలిని చికిత్స ఫలించక మృతిచెందారు. ప్రమాదం జరిగిన వెంటనే గూడ్స్ వాహనం డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. బాధిత తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు.

లారీ–బైక్ ఢీ.. తండ్రి మృతి


ప్రమాద దృశ్యం,


మృతి చెందిన వెంకటేశ్ (ఫైల్)

- కుమార్తెకు తీవ్ర గాయాలు

దొడ్డబళ్లాపురం: లారీ, బైక్ ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో తండ్రి మృతి చెందిన సంఘటన దొడ్డ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దొడ్డ తాలూకా ముద్దనాయకనపాళ్య గ్రామానికి చెందిన వెంకటేశ్ (45) మృతి చెందగా ఈయన కుమార్తె యశస్విని (15) తీవ్రంగా గాయపడింది. స్వగ్రామం నుంచి వెంకటేశ్ కుమార్తెను పాఠశాలకు వదలడానికి బైక్‌పై వస్తుండగా పట్టణంలోని ఏపీఎంసీ ముందు బెంగళూరు–హిందూపురం రహదారిపై తుమకూరు వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో తండ్రి, కుమార్తె బైక్‌తో పాటు లారీ చక్రాల కింద చిక్కుకున్నారు. వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా యశస్విని తీవ్రంగా గాయపడింది. ఆమెను బెంగళూరు తరలించారు. దొడ్డ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తలతిక్క యూట్యూబర్‌కు కటకటాలు

- రద్దీ రహదారిలో బైక్‌స్టంట్లు


మాస్కు ధరించి స్టంట్‌లు చేస్తున్న యూట్యూబర్

దొడ్డబళ్లాపురం: ముఖానికి మాస్క్ ధరించి బైక్‌పై తిరుగుతూ రద్దీగా ఉన్న రోడ్లపై స్టంట్‌లు చేస్తూ వాహనదారులకు ఇబ్బందులకు గురిచేసిన యూట్యూబర్‌ను యలహంక పోలీసులు అరెస్టు చేసారు. మహమ్మద్ జావిద్ అరెస్టయిన యూట్యూబర్. ఇతడు తలతిక్క వీడియోలు చేస్తూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. ఈక్రమంలోనే ఇటీవల ముఖానికి మాస్క్ ధరించి బైక్‌పై తిరుగుతూ కెంపేగౌడ ఎయిర్‌పోర్టు రోడ్డులో సిగ్నల్స్ జంప్ చేసి వన్‌వేలో వెళ్లి ఒక కారు అద్దాలు పగలగొట్టి పరారయ్యాడు. ఈ వీడియో యూట్యూబ్‌లో అప్లోడ్ చేసాడు. జరిగిన సంఘటన మరియు వీడియోపై ఫిర్యాదులు అందడంతో కేసు నమోదు చేసుకున్న యలహంక పోలీసులు జావిద్‌ను అరెస్టు చేసి బైక్ సీజ్ చేసారు. యలహంక ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కాంట్రాక్టర్లపై డీసీఎం రుసరుస

శివాజీనగర: కాంట్రాక్టర్లను మీడియా ముందుకు ఎవరు పంపుతున్నారనేది నాకు తెలుసునని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. గురువారం సదాశివనగరలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, కాంట్రాక్టర్లు ప్రతిపక్ష నాయకులను కలవడంపై స్పందిస్తూ కమీషన్ల ఆరోపణలపై చట్ట ప్రకారం తనిఖీ చేపట్టాలని సూచించాన్నారు. కాంట్రాక్టర్ల సంఘం నేత కెంపణ్ణ నాపై ఫిర్యాదు చేశారు, ఆయనకు న్యాయం చేయాలి. ప్రజలకు కూడా న్యాయం లభించాలన్నారు. గతంలో కాంట్రాక్టర్లు చేసిన 40 శాతం కమీషన్ ఆరోపణ వాస్తవమేనని, ప్రస్తుతం చేస్తున్న 15 శాతం ఆరోపణ అబద్ధమని మంత్రి రామలింగారెడ్డి అన్నారు.

స్వర్ణాభరణాల ఉత్సవం



సాక్షి, బెంగళూరు: త్వరలో వరమహాలక్ష్మి పండుగను పురస్కరించుకుని ఉద్యాన నగరవాసుల కోసం ప్రతిష్టాత్మక ఆభరణాల ప్రదర్శన.. ఏసియా జ్యువెల్స్ షో మరోసారి వచ్చేసింది. బెంగళూరులోని ది రిట్జ్ కార్ల్‌టన్ హోటల్‌లో శుక్రవారం నుంచి ఈ 48వ ఎడిషన్ ప్రదర్శన ప్రారంభం అవుతోంది. దేశంలోని నలుమూలల పేరుగాంచిన వినూత్న ఆభరణాలన్నింటిని ఒకే వేదికపై తీసుకొచ్చే ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు జరుగుతుంది.


వైవిధ్య ఆభరణాలతో అందాల భామలు

అద్దె అడిగినందుకు చాకుతో దాడి

- తండ్రీ కొడుకుల దురాగతం


గాయపడిన శ్రీదేవి

బొమ్మనహళ్లి: మూడు నెలల నుంచి ఇంటి అద్దెను ఇవ్వకపోవడంతో అద్దె చెల్లించాలని నిర్వాహకురాలు అడిగింది, ఇక అంతే.. తండ్రీ కొడుకు కలిసి ఆమెపై చాకుతో దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయి. ఈ సంఘటన బెంగళూరు బండేపాళ్యలో జరిగింది. బండేపాళ్య పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మునేశ్వర నగరలో ఫయాజ్ అనే వ్యక్తికి 15 ఇళ్లు ఉన్నాయి. అతను విదేశాలకు వెళ్తూ ఆ ఇళ్ల ఆజమాయిషీని శ్రీదేవి అనే మహిళకు అప్పగించారు. ఆమె ఒక ఇంటిని నజీర్ అనే వ్యక్తికి బాడుగకు ఇచ్చింది. శ్రీదేవి అందరి వద్ద అద్దె వసూలు చేసి ప్రతి నెలా ఫయాజ్‌కు పంపించేది. నజీర్ మూడు నెలల నుంచి బాడుగ కట్టకపోవడంతో మూడు రోజుల క్రితం ఇంటికి వెళ్ళి ఆమె అడిగింది. డబ్బులు లేకపోతే ఇల్లు ఖాళీ చేయండి అని ఆమె గట్టిగా చెప్పడంతో ఆగ్రహంతో ఊగిపోయిన తండ్రి నజీర్, కుమారుడు సద్దాం శ్రీదేవితో గొడవకు దిగి చాకుతో ముఖం, మెడపైన పొడిచి పరారయ్యారు. స్థానికులు ఆస్పత్రికి తరలించి బండేపాళ్య పోలీసులకు సమచారం ఇవ్వగా వారు వచ్చి పరిశీలించారు. పరారీలో ఉన్న తండ్రీ కొడుకుని అరెస్టు చేశారు.

ఎన్నికల తరువాత మహిళా ప్రధాని !

తుమకూరు: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో దేశ ప్రధానిగా ఒక మహిళ అధికారం చేపడతారని ప్రముఖ జ్యోతిష్యుడు యశ్వంత గురుజీ చెప్పారు. తుమకూరు జిల్లాలోని తిపటూరు తాలూకా నోణవినకెరెలో ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తాను చెప్పిన జోస్యం నిజమైందని అన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఒక మహిళ పగ్గాలు చేపడుతుందని, ఇందిరాగాంధీ తరువాత ఆమె రెండవ మహిళా ప్రధాని అవుతారని చెప్పారు. రాబోయే మహా శివరాత్రి తరువాత దేశ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకుంటాయని అన్నారు. మహా శివరాత్రిలోగా ఎన్నికల జరిగితే ప్రధాని మోదీకి మరో అవకాశం ఉంటుంది, శివరాత్రి తరువాత జరిగితే ఆయనకు ఇబ్బందులు తప్పవని అన్నారు.

ప్రయాణికురాలిపై క్యాబ్ డ్రైవర్ దాడి


మహిళను కొడుతుండగా అడ్డుకుంటున్న తనయుడు

కృష్ణరాజపురం: బెంగళూరులో ఉబర్ డ్రైవర్ దారుణానికి పాల్పడ్డాడు, ప్రయాణికురాలపై దాడి చేసిన ఘటన నగరంలోని బెళ్లందూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బోగనహళ్లిలో చోటు చేసుకుంది. బాధిత మహిళ తన కుమారున్ని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి క్యాబ్ బుక్ చేసుకుంది. అంతలోనే కుమారుడు మరో క్యాబ్‌ను బుక్ చేశాడు. ముందు వచ్చిన క్యాబ్‌లోకి ఎక్కారు, అయితే కుమారుడు ఇది మనం బుక్ చేసిన క్యాబ్ కాదని చెప్పాడు. క్యాబ్ డ్రైవర్ వారిని దించి ఆమెతో గొడవ పడ్డాడు. ఆమెపై చేయి చేసుకోవడంతో సమీపంలోని అపార్టుమెంట్ వాసులు వచ్చి కాపాడారు. ఇంతలో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. సీసీ పుటేజీ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు ఉచిత శిక్షణ

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ గ్రాంటు సహకారంతో తిరుపతి నిర్వహిస్తున్న రాస్ ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కోర్సులలో ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 2023 డిసెంబర్ 31 నాటికి 17 ఏళ్ల పూర్తి అయి 30 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థినులకు 5 ఏళ్లు సడలింపు ఉంటుందని తెలిపారు. ఇక్కడ చేరిన వారికి ఉచిత విద్య, వసతి లభించడంతో పాటు నెలకు రూ.500లు స్టైఫండ్ ఇస్తారు. చిత్తూరు, అనంతపురం జిల్లాలకు సంబంధించిన అభ్యర్థినులు మాత్రం ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. టెన్త్, ఇంటర్ మార్కులిస్ట్, టీసీ, కుల, స్థానికీకరణతో పాటు 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 8 పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులు సెప్టంబర్ 30వ తేదీ లోపు ది ప్రిన్సిపాల్, రాస్ ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, కేరాఫ్ రాస్ సేవా నిలయం, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి–517501 చిరునామాకు పంపాలని తెలియజేశారు.

వక్కతోటలో గంజాయి, ఇద్దరి అరెస్ట్



శివమొగ్గ: వక్కతోటలో గంజాయి సాగు చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. శివమొగ్గ జిల్లా తీర్థహళ్లి తాలూకా కోణందూరు సమీపంలోని కొలిగె గ్రామానికి చెందిన సునీల్, కార్తీక్‌లు గంజాయి సాగు చేస్తున్నట్లు తెలిసి పోలీసులు దాడి చేసి రెండు కిలోలకు పైగా గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 80 వేలు ఉంటుందని తెలిపారు.

12, 13న తిరుపతికి ప్రత్యేక రైలు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 12, 13 తేదీల్లో తిరుపతి– సికింద్రాబాద్ – తిరుపతి మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 12న శనివారం సికింద్రాబాద్ జంక్షన్ నుంచి (రైలు నంబర్ 07489) రాత్రి 10.05 గంటలకు బయలుదేరి తిరుపతికి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు చేరుతుందన్నారు. తిరిగి 13వ తేదీ తిరుపతి జంక్షన్ (నంబరు 07490) నుంచి సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు మరుసటి రోజు తెల్లవారుజామున 4.50 గంటలకు చేరుతుందన్నారు. ఈ రైలు కాచిగూడ, ఉందనగర్, షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, గద్వాల్, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుతుందన్నారు. ఈ స్పెషల్ రైలు 12, 13 తేదీల్లో మాత్రమే రాకపోకలు సాగిస్తుందన్నారు.





జై జై గజానన

వచ్చే నెల 18న వినాయక చవితి పర్వదినం కోసం అప్పుడే విఘ్ననాథులు సిద్ధమవుతున్నారు. గురువారం బెళగావి నగరంలో విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు. చవితి కోసం పెద్ద సంఖ్యలో విగ్రహాల ఆర్డర్లు వస్తున్నాయని తెలిపారు. ఈసారి చవితి మంచి గిరాకీ ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు

క్లుప్తంగా

అల్మట్టి ఎడమ కాలువకు గండి

• 200 ఎకరాల్లో పంట నష్టం


గండి నుంచి నీరు వృథా అవుతున్న దృశ్యం

రాయచూరు రూరల్: విజయపుర జిల్లాలో ఆల్మట్టి ప్రధాన ఎడమ కాలువకు గండి పడడంతో సుమారు 200 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. కాలువకు ముద్దేబిహళ తాలూకా హరింద్రాళ వద్ద గండి పడడంతో రైతులు వేసుకున్న మొక్కజొన్న తదితర పంటలు నీటిలో కొట్టుకుపోయాయి. కాలువ మరమ్మతు పనులను నాసిరకంగా చేయడం వల్లే మళ్లీ కాలువకు గండి పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలని అధికారులను కోరారు. గండిని సత్వరం పూడ్చడంలో కేజేబీఎన్‌ఎల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు వాపోయారు.

యాదగిరి ఐసీడీఎస్ డీడీగా వీరనగౌడ


బాధ్యతలు చేపట్టిన వీరనగౌడకు సత్కారం

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లా మహిళా శిశు అభివృద్ధి సంక్షేమ శాఖ(ఐసీడీఎస్) డిప్యూటీ డైరెక్టర్‌గా వీరనగౌడ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో రాయచూరు, విజయనగర జిల్లాల్లో విధులు నిర్వహించిన వీరనగౌడకు యాదగిరికి బదిలీ అయ్యింది. ఈసందర్భంగా రాయచూరు ఐసీడీఎస్ డీడీ చేతన్ కుమార్, సీడీపీఓలు మహేష్ కుమార్, గోకూర్ సాబ్‌లు ఉన్నారు.

డీడీపీఐ బదిలీకి వినతి


వినతిపత్రం అందిస్తున్న శివకుమార్ యాదవ్

రాయచూరు రూరల్: జిల్లా విద్యా శాఖాధికారి(డీడీపీఐ) వృషబేంద్రయ్యను బదిలీ చేయాలని జయ కర్ణాటక సంఘం అధ్యక్షుడు శివకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. డీడీపీఐ వృషబేంద్రయ్య రెండేళ్ల వ్యవధిలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఉపాధ్యాయులు బదిలీల్లో ముడుపులు అందుకొన్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం యాదగిరికి బదిలీ చేసినా ఇంతవరకు రాయచూరు నుంచి వెళ్లడానికి విముఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయనను, ఆ కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారులను వేరే చోటికి బదిలీ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

నిరంతర అభ్యాసమే విజయానికి సోపానం


జ్యోతి వెలిగిస్తున్న జడ్జి మారుతి బగాదె

రాయచూరు రూరల్: నిరంతర అభ్యాసంతో న్యాయవాద వృత్తిలో విజయం సాధించవచ్చని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మారుతి బగాదె పేర్కొన్నారు. ఆయన గురువారం నగరంలోని ఎస్‌సీఏబీ న్యాయ కళాశాలలో భూస్వాధీన చట్టం-2023పై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. న్యాయవాదులు న్యాయం ఇప్పించాలన్నారు. బలమైన వాదనలు, ప్రతివాదనలతో న్యాయం లభిస్తుందన్నారు. న్యాయవాదులు కక్షిదారులకు ఉత్తమ సేవలు అందించాలన్నారు. కళాశాల అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రిన్సిపాల్ పద్మ, కార్యదర్శి సునీల్ కుమార్, అధ్యాపకులు ఉమా, మల్లికార్జునయ్య, వసుంధర పాటిల్ పాల్గొన్నారు.

కేడీఎస్సెస్ కార్యవర్గం ఎంపిక


కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి: కళ్యాణ కర్ణాటక దళిత సంఘర్షణ సమితి(కేడీఎస్సెస్) పదాధికారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు యల్లప్ప కట్టిమని మాట్లాడుతూ వెనుకబడిన కళ్యాణ కర్ణాటక ప్రాంత వాసుల అభివృద్ధికి ఆర్టికల్-371జే అమలు చేసినా సంపూర్ణంగా అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. దళితుల అభివృద్ధి కోసం ఈ ప్రాంతానికే ప్రత్యేక సమితిని ఏర్పాటు చేశామన్నారు. తమ సంఘం కొప్పళ జిల్లాధ్యక్షులుగా జమదగ్ని చౌడికి, కారటగి తాలూకా అధ్యక్షులుగా మల్లేశ్ బుక్కనహట్టి, గంగావతి తాలూకా అధ్యక్షులుగా సుమిత్రకుమార్, కనకగిరి తాలూకా అధ్యక్షులుగా మంజునాథ్ బడిగేర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దళిత ప్రముఖులు పాల్గొన్నారు.

చాపకింద నీరులా ప్లాస్టిక్ భూతం

• హోటళ్లు, బేకరీల్లో యథేచ్ఛగా కవర్ల వాడకం
• పట్టించుకోని పాలికె, ఆహార శాఖ అధికారులు


బేకరీల్లో వేడివేడి సమోసాలు, వెజ్‌పఫ్‌లను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి ఉంచిన దృశ్యం

సాక్షి,బళ్లారి: నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా హోటళ్లు, అంగళ్లలో ప్లాస్టిక్ కవర్ల వాడకం జరుగుతోంది. అంగళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించే మాట అటుంచితే కనీసం హోటళ్లలో ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడంలో పాలికె, ఆహార శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో పెద్ద పెద్ద హోటల్ యజమానుల నుంచి ఫుట్‌పాత్ హోటళ్ల వరకు ప్లాస్టిక్ వాడకం నానాటికీ పెరిగిపోతోంది. హోటళ్లలో వేడివేడి అన్నం, సాంబార్, పప్పు, దోశలు కూడా ప్లాస్టిక్ కవర్లలో వేసి పార్శిల్ చేసి పంపుతున్నారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలు వేసి పార్శిల్ చేయడం వల్ల పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులంటున్నారు. అయినా ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. హోటళ్లలో చివరికి ఇడ్లీలు తయారు చేసే పాత్రలో కూడా ప్లాస్టిక్ కవర్లు వేసి ఇడ్లీలు తయారు చేస్తుండడంతో ప్లాస్టిక్‌లో ఉన్న ఆరోగ్యానికి కీడు చేసే కెమికల్, ఇతరత్రా పదార్థాలు నేరుగా ఇడ్లీలోకి వెళుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

పార్శిళ్లకు ప్లాస్టిక్ కవర్లే దిక్కు

భగభగమండే వేడిలో ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి ఇడ్లీ తయారు చేయడంతో మరింత అనారోగ్య సమస్య ఏర్పడుతుందని తెలిసినా కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రిస్తామని సంబంధిత అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. హోటళ్లతో పాటు బేకరీల్లో కూడా ఇష్టారాజ్యంగా ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. చిన్న చిన్న బేకరీల నుంచి పేరొందిన బేకరీల వరకు వేడి వేడి బ్రెడ్‌లు, సమోసాలు, ఆలూ బన్లు తదితర బేకరీల్లో తయారు చేసిన వేడివేడి ఆహార పదార్థాలు అన్ని కూడా ముందుగానే ప్లాస్టిక్ కవర్లలో పార్శిళ్ల రూపంలో సిద్ధంగా ఉంచి అమ్ముతున్నారు. ఈనేపథ్యంలో హోటళ్లు, బేకరీల్లో ప్లాస్టిక్ వాడకంపై తక్షణం అధికారులు ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


హోటళ్లలో వేడివేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ముందుగానే సిద్ధం చేసిన దృశ్యం

దొంగ అరెస్ట్..12 బైక్‌ల సీజ్

బళ్లారిఅర్బన్: బళ్లారి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మోటార్ బైక్‌ల దొంగను పట్టుకుని అతని నుంచి 12 బైక్‌లను స్వాధీనపరచుకున్నట్లు జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అమీర్ లాలూసాబ్ అనే వ్యక్తి తన బైక్ పోయిందని గత 31న పోలీసు స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ కేసులో బళ్లారి రూరల్ సీఐ సతీష్, ఎస్‌ఐలు సంతోష్, త్యాగరాజన్ తమ సిబ్బందితో కలిసి గాలించి నిందితుడు అస్లాంను అదుపులోకి తీసుకొని అతని నుంచి సుమారు రూ.6 లక్షల విలువ చేసే బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

వాహనం ఢీ..యువకుడు మృతి

రాయచూరు రూరల్: జిల్లాలోని సింధనూరులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. మానసిక అస్వస్థతకు గురైన రాఘవేంద్ర కులకర్ణి(27) రాత్రి 10 గంటలప్పుడు ఎంకే గోపాలనగర్‌లోని ఇంటి నుంచి నడుచుకుంటూ బయటికెళ్లాడు. గురువారం ఉదయం ప్రశాంతనగర్ వద్ద మృతదేహం లభించినట్లు ఎస్పీ నిఖిల్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాలూకా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

చింతకుంట వద్ద కారు బోల్తా.. ఇద్దరి మృతి

• మృతులిద్దరూ బళ్లారి తాలూకావాసులు
• క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమం
• ఆస్పత్రిలో మరో ఐదుగురికి చికిత్స


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బళ్లారి వాసులు వీరే, (ఇన్‌సెట్‌లో మారుతీ, రమేష్)


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న పోలీసు అధికారి

సాక్షి,బళ్లారి/ఆలూరురూరల్: కారు బోల్తా పడిన ఘటనలో బళ్లారి తాలూకాకు చెందిన ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హాలహర్వి ఎస్‌ఐ నాగేంద్ర తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లాకు చెందిన ఏడుగురు స్నేహితులు మంత్రాలయానికి వెళ్తుండగా గురువారం తెల్లవారు జామున 3 గంటలకు కర్నూలు జిల్లా ఆలూరు తాలూకా హాలహర్వి మండలం చింతకుంట గ్రామ సమీపంలోని కక్రవంక వద్ద కారు బోల్తా పడింది. ఈ ఘటనలో బళ్లారిలోని పార్వతీ నగర్‌కు చెందిన మారుతీ(25), సింధగేరికి చెందిన రమేష్(28) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించగా వీరేష్, విశ్వనాథ్, నాగరాజు, మంజులకు తీవ్ర గాయాలు కావడంతో బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. యువరాజ్(30) అనే యువకుడు తీవ్రంగా గాయపడి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని, అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై హాలహర్వి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మారుతి, రమేష్ మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ఇసుకాసురుల దాడిలో మాజీ జవానుకు గాయాలు


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ ఇసుక రవాణా దందాను అడ్డుకోబోయిన మాజీ సైనికుడిపై ఇసుకాసురులు దాడి చేసి గాయపరిచిన ఘటన జిల్లాలోని మాన్వి తాలూకా చీకలపర్వి, మసలాపురల్లో జరిగింది. బుధవారం రాత్రి మాన్వి తాలూకాలోని అక్రమ ఇసుక డంప్ కేంద్రాల వద్దకు వెళ్లిన నీలప్ప లింగసూగూరు అనే మాజీ సైనికుడిపై ఇసుక దందారాయుళ్లు మారణాయుధాలతో దాడి జరిపి గాయపరిచారు. గాయపడిన మాజీ సైనికుడిని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనలో ఆరుగురిపై మాన్వి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

పాత్రికేయులతో సమాజంలో మార్పు సాధ్యం


కార్యక్రమంలో అధికారులను, ప్రముఖులను సత్కరిస్తున్న దృశ్యం

కంప్లి: పాత్రికేయులు అన్యాయానికి ఎదురొడ్డి నిలిచి ధైర్యంగా కలాన్ని చేపడితే సమాజంలో మార్పు సాధ్యమని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. గురువారం కురుగోడులోని రైతు సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన పత్రికాదినాచరణను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎవరు తప్పు చేసినా నిష్పక్షపాతంగా ప్రచురించి సత్యాన్ని సమాజం ముందు బహిరంగపరచడం పత్రికల బాధ్యత అన్నారు. కంప్లి, కురుగోడు ప్రాంత పాత్రికేయులకు మున్ముందు ఇళ్లస్థలాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వేదికపై తహసీల్దార్ కే.రాఘవేంద్రరావు, డాక్టర్ మంజునాథ్, బసవపుర పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వరప్ప, కురుగోడు కసాప అధ్యక్షులు నాగరాజ్ మసూతి, కురుగోడు కానిస్టేబుల్ శివరాయప్ప, సాహితీవేత్త హంలిగేష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో రైతు ప్రముఖులు వీఎస్ శివశంకర్, కురుగోడు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎస్.బసవరాజ్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శివకుమార్ సాగర్ నవిలె, ఉపాధ్యక్షులు హలగి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎం.ప్రకాష్, హూవినహడగలి అధ్యక్షులు సిద్దరామప్ప, సిరిగేరి జిల్లాధ్యక్షులు కే.వీరభద్రగౌడ, జిల్లా ఉపాధ్యక్షులు హడగలి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కే.బసవరాజ్, కంప్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు హెచ్.మరియప్ప తదితరులు పాల్గొన్నారు.

బోనస్, కమీషన్ పెంచాలి


గంగావతి: ఎల్‌ఐసీ ఏజెంట్లకు బోనస్ కమీషన్ పెంచాలనే డిమాండ్‌తో లికాయి సంస్థ ఆధ్వర్యంలో ఎల్‌ఐసీ కార్యాలయం ముందు గురువారం ధర్నా చేశారు. లికాయి మాజీ అధ్యక్షులు నిరుపాది మాట్లాడుతూ ఎల్‌ఐసీకి పునాది లాంటి ఏజెంట్లు కష్టపడి పాలసీలను చేయించి సంస్థను అత్యున్నత స్థాయికి చేరేలా చేశారన్నారు. ఏజెంట్ల శ్రమకు తగినట్లుగా కమీషన్, బోనస్‌ను పెంచాలన్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటినందున ఎల్‌ఐసీ యాజమాన్యం ఏజెంట్లకు సౌకర్యాలను కల్పించాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పదాధికారులు వలీ మొహినుద్దీన్, భీమా చౌహాన్, బాష, బసవరాజ్ సజ్జన్ పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకారం


రాహుల్ పాండేను అభినందిస్తున్న సుఖదేవ్ పాండే

రాయచూరు రూరల్: జెడ్పీ సీఈఓగా రాహుల్ తుకారాం పాండే గురువారం తన కార్యాలయంలో అధికార బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనను దేవదుర్గ తాలూకా విద్యాశాఖాధికారి(బీఈఓ) సుఖదేవ్ పాండే అభినందించారు.

కిష్కింధ జిల్లాతోనే తాలూకా వాసులకు మేలు


మాట్లాడుతున్న సంఘం ప్రముఖులు

కంప్లి: కిష్కింధ జిల్లాను ప్రకటిస్తేనే తాలూకా ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యాలు దొరుకుతాయని సమితి ప్రముఖులు పేర్కొన్నారు. ఎస్ఎన్‌పేటలో కిష్కింధ పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిష్కింధ జిల్లా గురించి అభిప్రాయాల సేకరణ సమావేశంలో వారు మాట్లాడారు. కంప్లి, గంగావతి పట్టణాలు నిత్య ఉద్యోగ, వాణిజ్య అవసరాల కోసం ఒకదానిపై మరొకటి ఆధారపడ్డాయన్నారు. విజయనగర జిల్లా కోసం చేసిన పోరాటాల్లో పాల్గొని ఆ జిల్లా ఏర్పాటుకు కారకులయ్యామన్నారు. అయితే విజయనగర ప్రధాన ద్వారమైన కంప్లిని మినహాయించి విజయనగర జిల్లాగా ఉండటం తాలూకా ప్రజలకు బాధ కల్గించిందన్నారు. కంప్లి ప్రజలు ఏదైనా పని మీద బళ్లారి జిల్లాకు వెళ్లాలంటే చాలా దూరమన్నారు. ఇంకా సరైన బస్సు సౌకర్యం కూడా లేదన్నారు. అందువల్ల కంప్లి తాలూకా ప్రజలు కిష్కింధ జిల్లా కావాలంటున్నారన్నారు. దీని కోసం తాలూకా ప్రజలు కూడా ముక్తకంఠంతో గళమెత్తారన్నారు. ఈసందర్భంగా సమితి ప్రముఖులు సంతోష్ కెలోజి, మంజు కట్టిమని, వకీల్ మంజునాథ్, ఏజే శ్రీనివాస్, యోగేష్ మెహత, దీపక్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో వికటించిన ఆహారం

• 30 మందికి పైగా విద్యార్థినులకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు


ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్, అధికారులు

హొసపేటె: కలుషిత ఆహారం తిని 30 మందికి పైగా హాస్టల్ విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన నగరంలో గురువారం చోటు చేసుకుంది. నగరంలోని ప్రభుత్వ ఎస్సీ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహంలో 148 మంది విద్యార్థినుల్లో 30 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినులను నగరంలోని సబ్ డివిజన్ స్థాయి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మరి కొందరికి వైద్యులు హాస్టల్‌లోనే మాత్రలు, ఇంజెక్షన్లు ఇచ్చి నయం చేశారు. బుధవారం రాత్రి హాస్టల్‌లో చికెన్ వడ్డించారు. మొత్తం 148 మంది విద్యార్థినుల్లో 17 మంది శాఖాహారం, మిగిలిన వారం మాంసాహారం తిన్నారు. చికెన్ తిన్న వారికి తెల్లవారు జామున 3 గంటల సమయంలో కడుపునొప్పి వచ్చింది. ఈ తర్వాత వాంతులు, విరేచనాలు కనిపించడంతో విద్యార్థినులను వెంటనే నగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్, జిల్లా కలెక్టర్ దివాకర్, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, ఏసీ నాంగ్‌జోయ్ అక్రమ్ అలీ షా ఆస్పత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు.

యశ్వంతపురకు వందే భారత్‌ను నడపాలి


వినతిపత్రం సమర్పిస్తున్న బాబూరావు

రాయచూరు రూరల్: కలబుర్గి నుంచి బెంగళూరులోని యశ్వంతపుర వరకు వందే భారత్ రైలును నడపాలని దక్షిణ మధ్య రైల్వే బోర్డు సలహా దారుడు బాబూరావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో ఆయన మాట్లాడారు. కలబుర్గి నుంచి రాయచూరు, ఆదోని, గుంతకల్లు మీదుగా యశ్వంతపుర వరకు ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లను నడపాలని కోరుతూ జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు.

వరినాట్లకు సన్నాహాలు


కాలువ నుంచి పొలంలోకి సాగునీరు మళ్లిస్తున్న దృశ్యం

కంప్లి: తుంగభద్ర ఆయకట్టు కాలువలకు సాగునీటిని వదలడంతో రైతులు తమ పొలాలను దుక్కి దున్ని పదును చేసి వరినాట్లకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. వరినాట్లకు మడుల్లో నీరు నిలిపి దమ్ము చేసి నారు కట్టలు వేసి వరినాట్లు వేస్తున్నారు. కాలువలకు నీరు వదలడంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. ఇక రైతన్నలు కాలువ నీటిని వంతుల వారీగా తమ పొలాలకు పారించుకొని జోరుగా వరినాట్లు వేసుకుంటున్నారు.

21న రైతు నేత రాకేష్ టికాయత్ రాక

బళ్లారి టౌన్: దీర్ఘకాలంగా బకాయి ఉన్న తమ పంట రుణాలను 50 శాతం వరకు మాఫీ చేసి రుణాల నుంచి విముక్తి చేయాలని కర్ణాటక గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం వద్ద చేపడుతున్న పోరాటంలో పాల్గొనడానికి భారతీయ కిసాన్ సమాఖ్య నేత రాకేష్ టికాయత్ ఈనెల 21న బళ్లారికి రానున్నట్లు రైతు పోరాటానికి మద్దతు తెలిపిన ఎమ్మెల్యే బీఆర్.పాటిల్ తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో రైతు సంఘం నేతలు ఆర్.మాధవరెడ్డి, చాగనూరు మల్లికార్జున రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. గత 230 రోజులుగా నిరంతరంగా బ్యాంక్ వద్ద ఆందోళన చేపట్టామని, అయితే ఇంత వరకు బ్యాంక్ పాలక మండలి స్పందించలేదన్నారు. దీంతో తమ పోరాటానికి మద్దతు తెలిపేందుకు ఆయన వస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 22 జిల్లాల్లో దాదాపు రూ.40 లక్షల వరకు రుణాలు పొందారని గుర్తు చేశారు. ఈ పోరాటానికి రైతు సంఘం జాతీయ నేతలు ఎస్.జాన్సీ, డాక్టర్ సునాలేమ్ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నబసవన్న, ఆలీ బాబా, విరుపాక్ష తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

డీఎస్పీ చొరవతో మార్కుల జాబితా వితరణ


విద్యార్థిని సోనియాకు మార్కుల జాబితాను అందిస్తున్న డీఎస్పీ రమేష్

కోలారు: తాలూకాలోని ఐతరాసనహళ్లికి చెందిన దళిత విద్యార్థిని ఎ.సోనియా 2020-21వ విద్యా సంవత్సరంలో నగరంలోని ఎంఎస్‌జీ ఇంటర్ కళాశాలలో చదివింది. అయితే సోనియా తండ్రి అంజినప్ప తమ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 17 మంది విద్యార్థులను కళాశాలలో చేర్పించినందుకు గాను సోనియాకు ఫీజు లేకుండా ఉచితంగా చదవడానికి అవకాశం కల్పిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది. అయితే పరీక్షలు ముగిసిన అనంతరం ఇంటర్, టెస్ట్ మార్కుల జాబితా ఇవ్వాలని అడగగా ఫీజుల తాలూకా రూ.లక్ష బకాయి చెల్లిస్తే ఇస్తామని తెలిపారు. గతంలో తనకు ఇచ్చిన మాటను తండ్రి మంజునాథ్ గుర్తు చేసినా ఫలితం లేదు. ఫీజు కట్టాల్సిందేనడంతో చివరికి దశల వారీగా ఎలాగో రూ.33 వేలను చెల్లించి ఇంతకంటే చెల్లించలేనని తెలిపినా పట్టించుకోలేదు. దిక్కుతోచని స్థితిలో సోనియా తండ్రి అంజినప్ప, గ్రామానికి చెందిన మంజునాథ్‌తో కలిసి పౌర నిర్దేశనాలయ డీఎస్పీ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన డీఎస్పీ రమేష్ కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌ను, పాలక మండలికి చెందిన సందేష్‌ను పిలిపించి వారిని ఒప్పించి మార్కుల జాబితాను ఇప్పించారు. దీంతో సోనియా తల్లిదండ్రులు డీఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

బిడ్డలతో సహా బావిలోకి దూకి తల్లి ఆత్మహత్య


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయచూరు రూరల్: కుటుంబ కలహాలతో గొడవ పడి ఇద్దరు పసిబిడ్డలను నడుముకు కట్టుకొని బావిలోకి దూకిన ఘటన ముదుగల్‌లో జరిగింది. గురువారం మధ్యాహ్నం జిల్లాలోని లింగసూగూరు తాలూకా ముదగల్‌లోని మేగళపేటెలో నివాసముంటున్న చౌడమ్మ(25) అనే మహిళ తన పిల్లలు ప్రీతం (4), రాము(2) లను నడుముకు కట్టుకొని ముదగల్‌లోని బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది బావిలో పడిన తల్లి, పిల్లలను పైకి తీశారు. అయితే అప్పటికే వారు మరణించినట్లు పోలీసులు ధృవీకరించారు. ముదగల్ సీఐ వెంకటేష్, ఎస్‌ఐ వెంకటప్ప నాయక్ ఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాలను లింగసూగూరు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మాస్తేనహళ్లి జీపీ జేడీఎస్ కైవసం

శ్రీనివాసపురం: మాస్తేనహళ్లి జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానానికి గురువారం నిర్వహించిన ఎన్నికల్లో జేడీఎస్ మద్దతు అభ్యర్థులు అధ్యక్షురాలిగా మమత నారాయణస్వామి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మి కెపి నాగేష్ ఎన్నికయ్యారు. 16 మంది సభ్యులు కలిగిన పంచాయతీలో మమత 8 ఓట్లతో గెలుపొందగా, లక్ష్మి కెపి నాగేష్ 10 ఓట్లతో విజయం సాధించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కోలారు: నగరంలోని విశ్వేశ్వరయ్య స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ పదాధికారులు గురువారం పరిశీలించారు. క్రీడా మైదానంలో సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి జిల్లా యంత్రాంగం టెండర్ ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించింది. పనులను పరిశీలించిన పదాధికారులు పనులు నత్తనడకన సాగుతుండడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. పనుల ఆలస్యంతో స్టేడియంలో క్రీడా పోటీల నిర్వహణ సాధ్యం కావడం లేదన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి క్రీడాకారులకు అనుకూలం కల్పించాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మునియప్ప, ప్రధాన కార్యదర్శి కె ఆర్ రాఘవేంద్ర, సీనియర్ క్రీడాకారుడు హెచ్ జగన్నాథన్, గౌస్ ఖాన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ

• వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు

హొసపేటె: విజయనగర జిల్లాలోని కూడ్లిగి తాలూకాలోని మైనార్టీ సంక్షేమ శాఖ ప్రీ మెట్రిక్ విద్యార్థి హాస్టల్‌ను గురువారం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్‌ఖాన్ అధికారులతో కలిసి ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆ సమయంలో హాస్టల్‌లో విద్యార్థులు మంచాలపై నిద్రించకుండా నేలపై పడుకొని ఉండడాన్ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. కూడ్లిగి పట్టణంలోని బండెబసాపుర రోడ్డులో ఉన్న ఈ హాస్టల్‌లో విద్యార్థులకు సరిగా మౌలిక సౌకర్యాలు కల్పించక పోవడంతో బాధ్యుడైన హాస్టల్ వార్డెన్ గురురాజ్‌ను సస్పెండ్ చేయాలని అధికారులను మంత్రి అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాధికారి దివాకర్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ యూనిట్‌ను సరిచేయరూ


ఆస్పత్రి సర్జన్‌కు గోడు వినిపిస్తున్న దృశ్యం

కోలారు: కోలారులోని ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రిలో తాగునీటి సమస్యతో పాటు డయాలసిస్ యూనిట్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు గురువారం నగరంలోని ఎస్ఎన్ఆర్ ఆస్పత్రి ముందు ధర్నా చేసి జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ విజయకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్ మూతపడడంతో పేద కిడ్నీ రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని పునః ప్రారంభించాలని కోరారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, వక్కలేరి హనుమయ్య, మూరాండహళ్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.